ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2015 Q3 జులై - సెప్టెంబరు ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక

**ఫిల్మ్ యిన్‌స్టిట్యూట్‌లో సమ్మె**
**సీరియల్ కిల్లింగ్స్**
**ఫడ్నవీస్ తలనొప్పులు**
**సినీ స్నిప్పెట్స్ 06 - జయలలిత కొంటెతనం**
**సిబిఐ చేతికి వ్యాపమ్**
**సినీ స్నిప్పెట్స్ 07- సావిత్రి - జెమినీ గణేశన్ దాంపత్యం**
**లలిత్ మోదీ గాథ**
**సినీ స్నిప్పెట్స్ 08- పింగళి ఆఖరి రోజులు**
**ప్రచార ఆర్భాట ఫలం - పుష్కర విషాదం**
**బాహుబలి మార్కెటింగ్ విజయమే**
**బాహుబలి వ్యాసంపై విమర్శ**
**యాకూబ్ మెమన్ ఉరి**
**ప్రత్యేక హెూదాకై ఆత్మహత్య**
**ర్యాగింగ్ అరికట్టేందుకు సినీయాక్టర్ల ప్రచారమా?**
**ఇప్పుడిక ఇస్తాంబుల్**
**కళ్లు మూసుకుంటే ఎలా?**
**మెగా స్టార్ - మెగా యాక్టర్**
**ఇంద్రాణీ ముఖర్జీ ఇంద్రజాలం**
**ఇంద్రాణీ గురించి మరికొంత..**

జులై 06 వీక్లీకై ఎమ్బీయస్ : ఫిల్మ్ యిన్‌స్టిట్యూట్‌లో సమ్మె

పుణెలోని ప్రతిష్ఠాత్మకమైన ఫిల్మ్ అండ్ టెలివిజన్ యిన్‌స్టిట్యూట్‌లో జూన్ 12 నుంచి సాగుతున్న సమ్మె తగ్గుముఖం పట్టే సూచనలు కనబడటం లేదు. జులై 6న నటీమణి పల్లవి జోషి ఇన్‌స్టిట్యూట్ గవర్నింగ్ కౌన్సిల్‌లో తన సభ్యత్వాన్ని వదులుకుని 'తను నమ్మిన సిద్ధాంతాల కారణంగా రాజీనామా చేస్తున్నా'నని ఇన్ఫర్మేషన్ శాఖకు తెలియపరిచింది. ఆమె కంటె ముందు ప్రసిద్ధ దర్శకనిర్మాత జహ్నూ బరువా, ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్ సంతోష్ శివన్ కూడా యిదే కారణాలు చెప్పి తప్పుకున్నారు. గజేంద్ర సింగ్ చౌహాన్‌ను ఆ సంస్థ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఛైర్మన్‌గా నియమించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. బిజెపి ప్రభుత్వం అనేక ప్రభుత్వ సంస్థల్లోనే కాక, కళారంగానికి సంబంధించిన సంస్థల్లో సైతం కాషాయవాదులను అధిపతులుగా నియమిస్తోందని, ఆ రకంగా భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. మోదీ ప్రచార చిత్రాలను తయారు చేసిన పహ్లాజ్ నిహ్లానీని సెన్సారు బోర్డు ఛైర్మన్‌గా నియమిస్తే ఆయన 20 పదాలు సినిమాల్లో వాడకూడదని (వాటిల్లో బొంబాయి ఒకటిట) నిషేధించారు. మోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముకేశ్ ఖన్నా (''మహాభారత్'' టీవీ సీరియల్‌లో భీష్మపాత్రధారి, ''శక్తిమాన్'' వంటి టీవీ సీరియల్స్‌లో నాయకుడు, కొన్ని సినిమాల్లో వేశారు)ను చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీకి ఛైర్మన్‌గా వేశారు. ఈ ఇద్దరూ ఆశారాం బాపు అనుచరులు. ఇప్పుడు ఫిల్మ్ యిన్‌స్టిట్యూట్ ఛైర్మన్‌గా వచ్చిన గజేంద్ర చౌహాన్ ''మహాభారత్'' టీవీ సీరియల్‌లో ధర్మరాజు పాత్రధారి. కొన్ని సినిమాల్లో నటించినా పెద్ద పేరు తెచ్చుకోలేదు. అయితే అతను బిజెపి సమర్థకుడు. 2014 ఎన్నికలలో బిజెపి అభ్యర్థులకై ప్రచారం చేశాడు.

ఇతనే కాదు, ఇన్‌స్టిట్యూట్ కౌన్సిల్‌లో నియమించిన మరొక నలుగురికి కూడా కాషాయ బంధాలున్నాయి. అనఘా ఘాసియాస్ ఆరెస్సెస్ సభ్యుడు, మోదీని సమర్థిస్తూ డాక్యుమెంటరీ చిత్రాలు తీశాడు. నరేంద్ర పాఠక్ ఎబివిపి, మహారాష్ట్ర శాఖకు నాలుగేళ్లపాటు

అధ్యక్షుడు. ప్రాంజల్ సైకియా ఆరెస్సెస్ అనుబంధ సంస్థ అయిన సంస్కార భారతిలో పదవి నిర్వహిస్తాడు. రాహుల్ సోలాపూర్‌కర్ బిజెపి టిక్కెట్టుకై ప్రయత్నించాడు. ఇవన్నీ చూసి విద్యార్థులు తిరగబడ్డారు. "గజేంద్ర చౌహాన్ పెద్ద నటుడు కాదు, నిర్మాత, దర్శకుడు కాదు, సృజనాత్మక ఏమీ లేదు. ఇంతకు ముందు చైర్మన్‌గా వున్న సయీద్ మీర్జా క్రియేటివిటీతో పోలిస్తే యితను ఎందుకూ చాలడు. సయీద్ వెళ్లిపోయిన ఆర్నెల్లు ఖాళీగా వుంచి, సినిమా విషయంలో దేశంలోనే గొప్ప సంస్థ అయిన దీనికి యితన్ని వేయడమేమిటి? ఇతను యీ యిన్‌స్టిట్యూట్‌లో ఎప్పుడూ చదవలేదు, పాఠాలు చెప్పలేదు, దీనితో ఏ సంబంధమూ లేదు. ఇతను యీ పదవికి తగడు. ఇతన్ని తీసివేయాల్సిందే." అని ఆందోళన మొదలుపెట్టారు. ఇన్‌స్టిట్యూట్‌కు ఏటా రూ. 40 కోట్లు నిధులిచ్చే ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖను నిర్వహించే మంత్రి అరుణ్ జైట్లే యీ సమ్మెను పట్టించుకోలేదు. చివరకు జూన్ 17న కొందరు ప్రతినిథులను పంపి విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటామన్నారు. ఇన్‌స్టిట్యూట్ తరఫున 10 మంది ప్రతినిథుల సమితికి దర్శకుడు గిరీశ్ కాసరవల్లి నాయకత్వం వహించారు. విద్యార్థులు ఎంత గొంతు చించుకున్నా తాను దిగేది లేదని గజేంద్ర స్పష్టం చేయడంతో చర్చలు విఫలమయ్యాయి. స్థాపించిన 55 ఏళ్లలో ఇన్‌స్టిట్యూట్‌లో యిప్పటివరకు 40 సమ్మెలు జరిగాయి. దానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగించాలని అందరూ అంటూ వుంటారు. కానీ దాని కాళ్ల మీద అది నిలబడాలంటే ఫీజులు భారీగా వసూలు చేయాలి. దానికి విద్యార్థులు ఒప్పుకోరు. ప్రభుత్వంపై నిధులకోసం ఆధారపడినప్పుడు వారు తమకు యిష్టులైన వారిని నియమిస్తూ వుంటారు. వారికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమిస్తూ వుంటారు. ప్రసిద్ధులైన వారిని నియమిస్తే ప్రభుత్వం తనను తాను సమర్థించుకునే వీలుండేది. అనామకుడైన గజేంద్ర చౌహాన్‌ను నియమించడంతో యీ చిక్కు వచ్చి పడింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

**జులై 07 వీక్లీకై** **ఎమ్బీయస్ : సీరియల్ కిల్లింగ్స్**

కాప్షన్ చూడగానే యిదేదో వ్యాపమ్ గురించి వ్యాసం అనుకుంటారు కాబోలు, యిది ఆశారామ్ బాపు కేసులో ప్రాసిక్యూషన్ సాక్షుల గురించి కథనం. ఈ కథనాలే ఆశారాం బాపుకి, అతని కొడుక్కి 2013 సెప్టెంబరు నుండి బెయిలు రాకుండా చేస్తున్నాయి. రామ్ జెఠ్మలానీ, సుబ్రహ్మణ్యంస్వామి వంటి లాయర్లను పెట్టుకున్నా కోర్టు బెయిలు యివ్వటం లేదు. ఆరోసారి పెట్టుకున్న బెయిలు పిటిషన్‌ను జూన్ 20 న తిరస్కరించడం జరిగింది. ఆశారామ్ జైల్లో వున్నా అతని అనుచరులు బయటే వున్నారు. అతని మీద పెట్టిన కేసులో వ్యతిరేక సాక్ష్యాలు తుడిపివేసే, సాక్షులను చంపివేసే, భయపెట్టే చర్యలు చేపట్టారు. దానికి అనేక ఉపాయాలు పన్నుతున్నారు. ఉదాహరణకి – కర్ణాటకలోని బిజాపూర్‌కు చెందిన బసవరాజ్ బాసు అనే భక్తుడు, అతని భార్య సెజాల్ యిప్పటికీ ఆశారాం భక్తులు. అయితే ఆశారాం వ్యతిరేకులుగా నాటకం మొదలుపెట్టారు. తాము కూడా ఆశారాం బాధితులమని, ఆశ్రమంలో అవమానాలకు గురయ్యామని, వాటిని టీవీ యింటర్వ్యూలలో బయటపెట్టడం చేత ఆశారాం ఆశ్రమవాసులు తమపై పగబట్టారని చెప్పుకోసాగారు. అలా చెప్పుకుని, ప్రాసిక్యూషన్ తరఫున సాక్షులుగా మారిన ఆశారం మాజీ అనుచరుల నమ్మకాన్ని చూరగొన్నారు. వాళ్లతో స్నేహం సంపాదించి, వాళ్ల ఆనుపానులు తెలుసుకుని, వాళ్లను ఎలా ఎప్పుడు చంపాలో ప్లాను వేసుకున్నారు. గుజరాత్‌లోని 6గురు సాక్షులను మట్టుపెట్టడానికి కిశోర్ బోడ్కే అనే హంతకుణ్ని నియోగించారు. అతను ఆశారామ్ మోటేరా ఆశ్రమంలో పనివాడిగా పనిచేశాడు. అతనికి తోడుగా బసవరాజు తన సోదరుడు చంద్రశేఖర్‌ను పంపాడు.

వాళ్లిద్దరూ కలిసి 2014 మార్చి 16న దినేష్ భాగ్‌చందాని అనే ఒక ముఖ్యమైన ప్రాసిక్యూషన్ సాక్షి మొహం మీద యాసిడ్ పోశారు. అతను కేకలు పెట్టడంతో జనం పోగడి కిశోర్‌ను పట్టుకోగా, చంద్రశేఖర్ పారిపోయాడు. పోలీసులకు కిశోర్ జేబులో వాళు చంపవలసిన ఆరుగురి జాబితా దొరికింది. ఇప్పటికి ముగ్గురి పైనే దాడి చేయగలిగాం అని కిశోర్ చెప్పాడు. దాడి జరిగినవారిలో విమలేశ్ ఠక్కర్ ఒకడు. అతని భార్య జహంగీర్‌పురా ఆశ్రమంలో ఆశారాం తనను బలాత్కరించాడని కేసు పెట్టింది. ఇతను సాక్షి. అందువలన ఠక్కర్‌పై 2014 ఫిబ్రవరిలో కత్తులతో దాడి జరిగింది. ఆశారాం వద్ద వీడియో గ్రాఫర్‌గా పనిచేసిన రాహుల్ పటేల్ మూడో అతను. దినేష్ ద్వారా బసవరాజు ప్లాన్ల గురించి పోలీసులకు తెలిసినా మరో రెండు నెలలకు రాజకోటలో అమృత్ ప్రజాపతి తుపాకీ కాల్పులకు గురయ్యాడు. అతను ఆశారాంకు 2005 వరకు వ్యక్తిగత ఆయుర్వేద వైద్యుడిగా పనిచేసి అతనికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాడు. తుపాకీ గాయాలతో 17 రోజుల తర్వాత అమృత్ చచ్చిపోయాడు. నాపై దాడి చేసినవారు ఫలానా అని అతను నలుగురి పేర్లు చెప్పినా, వారు గట్టి ఎలిబయ్‌లు (వేరే చోట వున్నామనే సాక్ష్యాలు) చూపడం వలన వదిలేశారు. అమృత్ భార్య సరోజ్ ఆశారామే నా భర్తను చంపించాడు అని ప్రకటించి అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. మోటేరా ఆశ్రమంలో తాంత్రిక విధుల గురించి, అక్కడ 2008లో అనుమానాస్పద పరిస్థితుల్లో చనిపోయిన యిద్దరు పిల్లల గురించి డికె త్రివేది కమిషన్ ముందు సాక్ష్యం చెప్పిన రాజూ చండక్ అనే ఆశ్రమ మేనేజర్‌పై 2009లో హత్యాప్రయత్నం జరిగింది. అతను ఆశారామ్ పై మోపిన రేప్ కేస్‌లో సాక్షి. అతని పేరు, నార్సింగ్ వట్వానీ అనే అతని పేరు చంపవలసిన వాళ్ల లిస్టులో వున్నాయి. వారు భయపడుతున్నారు.

ఈ దాడులు గుజరాత్‌కే పరిమితం కాలేదు. ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో అఖిల్ గుప్తా అనే అతన్ని 2015 జనవరిలో ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిలుపై వచ్చి పాయింటు బ్లాంక్ రేంజిలో తుపాకీతో కాల్చి చంపారు. అతను ఆశారాం వద్ద వంటవాడిగా పనిచేసేవాడు. అక్కడ పని మానేసి స్వగ్రామం వచ్చి పాలవ్యాపారం చేస్తున్నాడు. ఆశారాం పై మోపిన రేప్ కేసులో అతను ప్రత్యక్షసాక్షి.

లఖనవ్ వాసి రాహుల్ సచాన్ జోధ్‌పూర్ ఆశ్రమం రేప్ కేసులో సాక్షి. సాక్ష్యం చెప్పడానికి ఫిబ్రవరి 13 నాటి హియరింగ్‌కై జోధ్‌పూర్ కోర్టుకి వెళితే అక్కడ కోర్టు ఆవరణలోనే సత్యనారాయణ్ గ్వాలా అనే అతను కత్తితో పలుమార్లు పొడిచాడు. రాహుల్ బతికాడు కానీ అనారోగ్యం పాలయ్యాడు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం అతనికి ఒకే ఒక్క సెక్యూరిటీ గార్డును, అదీ రోజులో 8 గంటల పాటు యిచ్చింది. ఎవరైనా దాడి చేస్తే ఆ 8 గంటల్లోనే చేస్తారని ఎలా వూహించారో!? దాడి చేసిన సత్యనారాయణ్ ఆశారాం భక్తుడని తెలిసినా రాజస్థాన్ పోలీసులు దీని వెనక్కాల కుట్ర ఏమీ లేదని అంటున్నారు.

ఆశారాం కొడుకు నారాయణ సాయి వద్ద 2005 జులై వరకు సహాయకుడిగా పని చేసి, మూడు కేసుల్లో సాక్షి అయిన మహేందర్ చావ్లాకు యివన్నీ విని భయం పట్టుకుంది. అతను హరియాణాలోని పానిపట్‌లో వుంటాడు. వెళ్లి రక్షణ కల్పించమని మొత్తుకున్నా హరియాణా పోలీసు వినలేదు. కానీ సూరత్, అహ్మదాబాద్‌లలో జరుగుతున్న దాడుల క్రమాన్ని గమనించిన గుజరాత్ పోలీసువారు హెచ్చరించాక ఒక పోలీసుని కాపలాగా పెట్టారు. మే 13న మహేందర్‌పై హత్యాయత్నం జరిగినప్పుడు ఆ కానిస్టేబుల్ మాయం. ఉదయం 9 గంటలకు ఎవరో తలుపు తడితే మహేందర్ తీశాడు. ఇద్దరు యువకులు తుపాకీతో ప్రత్యక్షమయ్యారు. "నారాయణ సాయికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్తావురా?" అంటూ కాల్చబోయాడు తుపాకీ పట్టుకున్నవాడు. మహేందర్ తుపాకీ గొట్టం పట్టుకుని గోడవైపు తిప్పేశాడు. అది గురి తప్పగానే యింటి గోడమీద నుంచి బయటకు గెంతాడు. ఇంతలోనే తేరుకున్న ఆగంతకుడు మళ్లీ కాల్చాడు. గుండు యితని భుజంలోంచి దూసుకుపోయి, రక్తం కారి, స్పృహ తప్పాడు. అతను చచ్చిపోయాడనుకుని వాళ్లు వెళ్లిపోయారు. ప్రాణం దక్కింది కానీ చెయ్యి చచ్చుపడిపోయింది. దాడి చేసిన వారు దొరకలేదు. ఇప్పుడు హరియాణా ప్రభుత్వం అతని యింటి దగ్గర ముగ్గురు పోలీసులను పెట్టింది కానీ అనుమానితులు ఫలానా అని మహేందర్ చెప్పినా దర్యాప్తు చేయడం లేదు.

ఇన్ని రాష్ట్రాలలో దాడులు జరుగుతున్నాయి కాబట్టి జాతీయ స్థాయిలో పనిచేసే సిబిఐ మాత్రమే సాక్షులను కాపాడే బాధ్యత స్వీకరించాలని, హత్యలను లోతుగా పరిశోధించాలని అఖిల్ గుప్తా తండ్రి కోరుతున్నాడు. ఆయన మోదీకి, రాజ్‌నాథ్ సింగ్‌కు, గుజరాత్ ముఖ్యమంత్రి, యుపి ముఖ్యమంత్రికి పిటిషన్లు పంపుకున్నా ఎక్కణ్నుంచి ఎలాటి స్పందనా రాలేదుట. పత్రికల వాళ్లు నిజాలు వెలికి తీసి కుట్ర కోణం బయటపెడదామన్నా సాక్షులు సహకరించటం లేదు. "మీ పత్రికలో కథనం కోసం మా ప్రాణాలను పణంగా పెట్టాలా? మేం నోరు విప్పం." అంటున్నారు. అసలు చాలామంది ఎవరికీ దొరక్కుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆశారాం జైల్లో వుంటేనే పరిస్థితి యింత ఘోరంగా వుంటే, బయటకు వదిలితే యింకెన్ని ఘోరాలు జరుగుతాయోనని జడ్జి భావించినట్టున్నారు. అందుకే ఆరోసారి బెయిల్ తిరస్కరించారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

**జులై 08 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఫడ్నవీస్ తలనొప్పులు**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంత్రివర్గ సహచరుల వలన యిబ్బందులు పడుతున్నారు. మంత్రుల విద్యార్హతల గురించి చాలా రాష్ట్రాలలో వివాదం చెలరేగుతోంది. దొంగ డిగ్రీ కేసులో ఢిల్లీ మంత్రిని కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో వుండే పోలీసులు అరెస్టు చేశారు కూడా. ఫడ్నవీస్ కాబినెట్‌లో వాటర్ సప్లయి మినిస్టర్ బాబన్‌రావ్ లోనికర్ ఎంతవరకు చదివారన్నదానిపై యిప్పుడు చర్చ జరుగుతోంది. 2004 ఎన్నికల సమయంలో యిచ్చిన అఫిడవిట్‌లో తను బిఏ (ఫస్ట్ ఇయర్) అని రాసుకున్నాడు. 2014 వచ్చేసరికి తను అయిదో క్లాసు వరకే చదివానని రాసుకున్నాడు. ఇదెలా సాధ్యం అని ఆశ్చర్యపడుతూండగానే యింకో విషయాన్ని కాంగ్రెసు అధికార ప్రతినిధి సచిన్ సావంత్ బయటపెట్టారు. తన వెబ్‌సైట్‌లో బియ్యే చదివానని రాసుకున్నాడని! కాంగ్రెసు నిలదీసేటప్పటికి లోనికర్ "నేను ఐదవ క్లాసు వరకే చదివాను. కానీ 2004లో యశ్వంతరావు చవాన్ ఓపెన్ యూనివర్శిటీలో బిఏకు పేరు నమోదు చేసుకున్నాను. అందుకని అప్పుడలా రాశాను. బియ్యే పరీక్ష ఫెయిలయ్యాను కాబట్టి 2014 నాటికి 5 వ క్లాసే రాసుకున్నాను. తప్పేముంది?" అని జవాబిచ్చారు. ఐదో క్లాసు వాళ్లు కూడా డిగ్రీ పరీక్షకు కూర్చోనిచ్చే యూనివర్శిటీలున్నాయేమో తెలియదు. విద్యామంత్రి వినోద్ తావ్‌డేకు వున్న బిఇ (ఎలక్ట్రానిక్స్) కూడా యిలాటిదే అని ఒక మరాఠీ టీవీ ఛానెల్ బయటపెట్టాక ఆయన సమాధానం – "1980లో నేను ధ్యానేశ్వర్ విద్యాపీఠ్‌లో నాలుగేళ్ల యింజనీరింగు కోర్సులో చేరినప్పుడు రెండేళ్లపాటు థియరీ చెప్తామని, యింకో రెండేళ్లు ప్రాక్టికల్ ట్రైనింగ్ వుంటుందని, తమ యూనివర్శిటీకి గుర్తింపు లేదని చెప్పారు. నాకు అభ్యంతరం లేదు కాబట్టి అలాగే చదివి డిగ్రీ తెచ్చుకున్నాను." గుర్తింపు లేని యూనివర్శిటీ యిచ్చిన డిగ్రీని విద్యార్హతగా ఎలా చూపుకుంటారో విద్యామంత్రి కాబట్టి ఆయనే చెప్పాలి.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిణి పంకజా ముండేపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఆహారంగా యివ్వడానికి చికి (వేరుశెనగ, బెల్లం అచ్చు), పుస్తకాలు, పరుపులు, వాటర్ ఫిల్టర్లు కొనడానికి ఈ-టెండర్లు పిలవకుండానే, బిడ్డింగ్ పద్ధతి అవలంబించకుండా రూ. 206 కోట్లు శాంక్షన్ చేసిందని ఆమెపై అభియోగం. ఫిబ్రవరి 13 న 24 ప్రభుత్వ తీర్మానాలు జారీ చేసి, మూడు రోజుల్లో తనకు కావలసివారికి రేటు కాంట్రాక్టులు కట్టబెట్టేసిందామె. అదేమిటంటే, "కేంద్ర నిధులు మార్చి 31 లోగా మురిగిపోతాయి. అవి వృథాగా పోకుండా త్వరగా చేసేశా" అంది. కాంట్రాక్టులు దక్కించుకున్నవారిలో

2013లో బ్లాక్ లిస్టు కాబడిన ఎన్‌జిఓకూడా వుందని కాంగ్రెసు అంటోంది. ఇదంతా బయట పెట్టినది పంకజ కజిన్, ఎన్‌సిపి నాయకుడు ధనంజయ్ ముండే. అతను ముఖ్యమంత్రికి లేఖ రాసి చర్య తీసుకోమని కోరాడు. పంకజను సమర్థిస్తూ బిజెపి అధికార ప్రతినిధి మాధవ్ భండారి 'రేటు కాంట్రాక్టులు మానేసి ఈ టెండరింగ్ పద్ధతి ప్రవేశపెట్టాలని రాష్ట్రప్రభుత్వం ఏప్రిల్ 17 న తీర్మానించింది. దానికి రెండు నెలల క్రితమే పంకజ యీ నిర్ణయం తీసుకుంది కాబట్టి ఆమె తప్పు చేయలేదు." అన్నారు. కానీ పంకజపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న పృథ్వీరాజ్ చౌహాన్ "నేను అధికారంలోకి వచ్చేముందు రూ.50 లక్షలకు మించిన టెండర్లన్నింటికి ఈ బిడ్డింగ్ జరగాలనే నియమం వుండేది. నేను దాని పరిమితిని రూ. 10 లక్షలకు తగ్గించాను. బిజెపి ఇంకా తగ్గించి రూ. 3 లక్షలు చేసింది." అంటున్నారు. ఆయన వాదన ప్రకారం పంకజ రూ. 206 కోట్ల ఆర్డరు యిచ్చేనాటికి రూ. 10 లక్షలకు మించిన కొనుగోళ్లను ఈ – టెండరు ద్వారా పిలవాలన్న రూలు వుండివుండాలి. కానీ పంకజ – 'నేను కొత్తగా టెండర్లను పిలవలేదు. అమలులో వున్న టెండర్లకు కొనసాగింపుగానే యివి యిచ్చాను. ఆ కాంట్రాక్టర్లు కూడా కాంగ్రెసు–ఎన్‌సిపి హయాంలో రూ.114 కోట్ల కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్లే' అని వాదిస్తోంది. పాత హయామంతా అవినీతిమయమని ఎన్నికలలో ప్రచారం చేసిన బిజెపి నాయకులే యిప్పుడిలా మాట్లాడుతున్నారు. దీనిపై కాంగ్రెసు పార్టీ జూన్ 24న ఎసిబి వద్దకు ఫిర్యాదు చేసింది కాబట్టి వారు విచారణ చేస్తే వాస్తవమేమిటో తెలుతుంది.

వీరందరి కంటె ఎక్కువ తలనొప్పి కలిగిస్తున్నది ఏకనాథ్ ఖాడ్సే. ముఖ్యమంత్రి పదవికి పోటీ పడి ఆపై నిరాశపడిన వారిలో అతను ప్రథముడు. రెవెన్యూ, అగ్రికల్చర్ వంటి అనేక ముఖ్యమైన శాఖలు అతని చేతిలో వున్నాయి. అతను తన రెవెన్యూ శాఖలో వందలాది అధికారులకు బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తే ఫడ్నవీస్‌కు నచ్చలేదు. ఈ బదిలీలన్నీ తనకు చెప్పి చేయాలని ఆదేశం జారీ చేస్తూ, అతని శాఖలో కొంతమంది అధికారులను అతనికి చెప్పకుండా బదిలీ చేశాడు. దాంతో చిర్రెత్తిన ఖాడ్సే తన గది బయట "బదిలీలకు సంబంధించిన పని మీదైతే నా వద్దకు రాకండి" అని బోర్డు పెట్టించాడు. అంతేకాదు, ఈ మధ్య మాల్వానీలో నకిలీ మద్యం తాగి కొంతమంది చనిపోతే ముఖ్యమంత్రి చూస్తున్న హోం శాఖదే బాధ్యత అని ప్రకటన చేశాడు. ముఖ్యమంత్రి పదవి అంటే ముళ్ల కిరీటమని ఫడ్నవీస్‌కు అర్థమవుతూ వుంటుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

**జులై 09 ఎమ్బీయస్ : సినీ స్నిప్పెట్స్ 06 – జయలలిత కొంటెతనం**

"ప్రేమలు పెళ్లిళ్లు" సినిమాలో హీరో పొగరుబోతు భార్యతో వేగలేక, ఆమెతో విడిపోయి మత్తుమందుకు బానిసవుతాడు. హీరో పాత్ర అక్కినేని వేయగా మోడర్న్ డ్రెస్సులతో, హెయిర్ స్టయిల్‌తో తిరిగే హీరోయిన్ పాత్ర జయలలిత వేశారు. డైరక్టరు వి మధుసూదనరావు. అసిస్టెంటు డైరక్టర్లుగా కోదండరామిరెడ్డి, తర్వాతి రోజుల్లో నిర్మాతగా మారిన కె.మురారి పని చేశారు. హీరోయిన్‌కు డైలాగులు చెప్పడం రెడ్డి పని కాగా, డ్రెస్ కంటిన్యుటీ చెప్పడం మురారి పని. హైదరాబాదులో షూటింగుకి వచ్చిన జయలలిత రిట్జ్ హోటల్లో వుండేవారు. అప్పట్లో ప్రొహిబిషన్ వున్నా అది స్టార్ హోటల్ కాబట్టి బియరు దొరుకుతుందనే ఆశతో మురారి డ్రెస్‌ల గురించి హీరోయిన్‌తో డిస్కస్ చేయాలి అంటూ ప్రొడక్షన్ కారులో హోటల్‌కి వెళ్లి ఆమెతో కాస్సేపు ఇంగ్లీషులో, తెలుగులో బాతాఖానీ కొట్టి, ఆ తర్వాత నిర్మాత ఖర్చుతో నాన్‌వెజ్ వెరైటీలు, బియరు కొట్టి వచ్చేవారు.

జయలలిత పుస్తకాలు బాగా చదివేవారు. ఓ సారి మురారిని – "త్యాగయ్య, అన్నమయ్య తెలుగువాళ్లా, తమిళులా?" అని అడిగారు. "తెలుగువాళ్లే" "వాళ్ల ప్రత్యేకత ఏమిటి?" (ఇదేమిట్రా యీవిడ టీచర్లా ప్రశ్నలేస్తోంది, సినిమా నటి యిన్ని ప్రశ్నలడగడమంటే అహంకారప్రదర్శనే అని మురారి అప్పుడు అనుకున్నా "గోరింటాకు" షూటింగు వాళ్లింట్లో చేసిన సందర్భంలో జయలలిత లైబ్రరీ చూశాక ప్రపంచం చాలా చిన్నదనిపించిందట) మురారి మాట్లాడలేదు. "త్యాగరాజు తెలుగువాడైనా తమిళనాడులో పుట్టి పెరిగి కీర్తనలన్నీ తెలుగులో రాశారు., అదిసరే భారతియార్ తెలుగు గురించి రాసింది తెలుసా?" అని జయలలిత అడిగారు. "తెలియదు." "భారతియార్ తమిళకవి అయినా తెలుగు భాషను పొగిడారు. తెలుగు మ్యూజికల్ లాంగ్వేజి అంటారు. అజంత భాష కాబట్టి కాబోలు. ఆయన 'సుందర తెలుంగినిల్ పాట్టు యిసైప్పోమ్..' అన్నారు. ఇది ఒక పాటలో మధ్యలో వస్తుంది. ఆ పాట ఏదో తెలుసుకుని నాకు చెప్పండి. ఛానెల్–5 సెంటు బాటిల్ బహుమతిగా యిస్తా." అని అంటూనే 'సరే ముందే యిచ్చేస్తున్నా, ఆన్సర్ మాత్రం రేపు చెప్పండి" అందామె. ఆవిడ కోసం మురారి ఇంగ్లీషులోకి తర్జుమా చేసిన భారతియార్ గీతాలు చదివి జవాబు తెలుసుకున్నారు.

ఓ సారి జయలలిత మురారిని "ఇంగ్లీషులో మీకు యిష్టమైన రచయితలు ఎవరు?" అని అడిగితే మురారి "పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే", "ఆఫ్ హ్యూమన్ బ్యాండేజ్", "రెబెకా" నవలల పేర్లు చెప్పి రెబెకాలో ఒక భార్య తన భర్తను ఎలా వేధించిందో వివరించి, యీ సినిమాలో మీ పాత్రకు, ఆ పాత్రకు పోలిక వుంది అన్నారు. "..ఇంకా?"

"ఆఫ్ హ్యూమన్ బ్యాండేజ్"లో హీరో ఫిలిప్ ప్రేమించాననుకున్న మిల్డ్రెడ్ పాత్రకు కూడా మీ పాత్రకు పోలిక వుంది. అయితే ఆమెను పాశవికంగా, వేశ్యగా రచయిత మలిచాడు. మీ విషయంలో అంత చేటుగా చేయలేదు.."

జయలలిత కాస్సేపు వూరుకుని "నా పాత్రను మిల్డ్రెడ్ పాత్రలా ఎందుకు మలచలేదు?" అని అడిగారు.

"అలాటి పాత్రల్లో స్త్రీలను భరించే శక్తి యీ నాటి సగటు మనిషికి వుందని అనుకోను. ముఖ్యంగా స్త్రీలకు నచ్చని సినిమా ఆడదు" అన్నారు మురారి. జయలలిత సాలోచనగా తల వూపారు.

ఇంత పాండిత్యం వున్నా ఆమెలో ఆకతాయితనం కూడా వుండేది. మురారి హెూటల్లో తన రూముకి రాగానే "సీన్ ఏమిటి?" అని అడిగేది. డ్రెస్ కంటిన్యుటీ దగ్గర చర్చలు మొదలుపెట్టేది. ఈయన్ని తికమక పెట్టేది. ఒకరోజు 'లొకేషన్ మారింది కదండీ, హెయిర్ స్టయిల్, డ్రస్సు ఎందుకు మారకూడదు?" అని అడిగింది కావాలని. ఇతను 'అవును, మారవచ్చు' అన్నాడు. అంతే, మర్నాడు జయలలిత చింపిరి జుత్తుతో నడుముకి కాస్త క్రిందగా వుండే మోడర్న్ డ్రెస్‌తో సెట్‌లోకి వచ్చింది. చూడగానే మురారికి భయం వేసింది. రెడ్డి పరిగెత్తుకుని వచ్చి "ఇదేమిటి? డ్రెస్ కంటిన్యుటీ వుంది కదా, యిలాంటి బట్టలు వేసుకుని వచ్చిందేమిటి? డైరక్టరు గారికి అసలే ముక్కు మీద కోపం." అన్నారు. మురారి "ఏదో డ్రస్సు కాస్త మార్చుకుంటానంటే సరే అన్నా, యిలా వేసుకువస్తుందని నాకేం తెలుసు?"అని చెప్పి "అయినా యింతకు ముందు సీను నైట్‌లో కదా, యిప్పుడు యీ సీను పగలు కదా, రాత్రి వేసుకున్న డ్రెస్సే పగలు ఎందుకు వేసుకుంటారు? మార్చుకుంటారుగా" అని వాదించారు. నిజానికి యీ సీను కూడా నైట్ ఎఫెక్ట్ లోనే. కానీ తన చర్మం కాపాడుకోవడానికి మురారి అర్జంటుగా అబద్ధం ఆడేశారు. నీ చావు నువ్వు చావు అని రెడ్డి విసుక్కుని వెళ్లిపోయారు.

డైరక్టరు వచ్చి సీన్ కాగితం చదువుకుంటున్నారు. లైటింగు ఏర్పాట్లు జరుగుతూంటే జయలలిత మేకప్ రూం నుంచి వయ్యారంగా ఫ్లోర్‌లోకి నడుచుకుంటూ వచ్చారు. షాట్ రెడీ అయిన తర్వాత వెళ్లి పిలిస్తే కానీ ఏ రోజూ బయటకు రాని ఆమె, యివాళ తనంతట తనే బయటకు వచ్చిందంటే మురారిని ఆటపట్టించడానికే అని రెడ్డికి, మురారికి అర్థమైంది. మురారి అటు చూడకుండా క్లాప్ బోర్డు రెడీ చేసుకుంటున్నట్టు నటించేస్తున్నారు. డైరక్టరు ఆమెను చూసి తెల్లబోయి "ఇదేం డ్రెస్?" అని అడిగారు.

ఆమె చాలా వినయంగా "మురారిగారు చెప్పారు" అంది, తన తప్పేమీ లేనట్లు. డైరక్టరు మురారి కేసి ఉగ్రంగా చూడగానే మురారి "కంటిన్యుటీ లేదుగా. పైగా చిన్న సీను. అందులోనూ పొగరుబోతు. చూడగానే యిలాంటి పెళ్లాం పగవాడికి కూడా వద్దురా అన్న భావం రావాలి. ఈ విగ్ యింతవరకూ వేసుకోలేదని ఆవిడ అంటే సరే అన్నా" అని దబాయింపు మొదలెట్టారు.

"ఈ సీన్ కంటిన్యుటీ కాదని నీకెవరు చెప్పారు?" అని డైరక్టరు అరిచారు.

"ఇంతకు ముందు సీన్ నైట్ ఎఫెక్టు. ఇది పగలు కదా, కంటిన్యుటీ ఎలా అవుతుంది?" అని అడ్డంగా వాదించారు మురారి.

"ఒరిజినల్ సీను తీసుకురా.."

"సీను లేదు. ఆత్రేయగారు రాత్రి ఫోన్‌లో డైలాగు చెప్పారు." అని అబద్ధం ఆడేశారు మురారి, ఆత్రేయ అలవాటును అలా వుపయోగించుకుని.

డైరక్టరుకి అర్థమైంది మురారి తెలివిగా సమర్థించుకుంటున్నాడని. ఇదంతా చూసి జయలలితకు నవ్వాగలేదు.

ఆమె నవ్వితే అంతా వింతగా చూశారు. ఆమె అక్కినేనికి, డైరక్టరుకి మెల్లిగా నవ్వుతూ అసలు విషయం చెప్పింది. వాళ్లూ నవ్వారు. మురారి కేసి చూసి మళ్లీ నవ్వారు. మురారిని ఆటపట్టించడం అయిపోయాక జయలలిత సరైన డ్రస్సు వేసుకోవడానికి మేకప్ రూంకి వెళ్లినపుడు అక్కినేని మురారిని పిలిచి "డ్రెస్ కంటిన్యుటీ చెప్పడానికి రిట్జ్ హెూటల్ దాకా వెళుతున్నావా పాపం?" అని వెక్కిరించేసరికి మురారి దొంగనవ్వు నవ్వి దణ్ణం పెట్టారు. ఆ సాయంత్రం షూటింగు జరిగిపోయాక ఆ వుదంతానికి గుర్తుగా మురారి, రెడ్డి జయలలిత విగ్గులు పెట్టుకుని ఫోటోలు దిగుదామనుకున్నారు. వెళ్లి అడిగితే జయలలిత ఎందుకు అని అడిగి, వీళ్లు చెప్పిన కారణం విని నవ్వుకుని తన అసిస్టెంటుకి చెప్పి విగ్గు యిమ్మనమంది. ఈ విషయాలన్నీ మురారి తన ఆత్మకథ "నవ్వి పోదురుగాక.."లో రాశారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

జులై 15 ఎమ్బీయస్ : సిబిఐ చేతికి వ్యాపమ్

ఇవాళ్టి నుంచి సిబిఐ వ్యాపమ్‌పై విచారణ ప్రారంభించింది. సాధారణంగా సిబిఐకు అప్పగించినా పనులు త్వరగా సాగవు. సిబ్బంది కొరత వుందంటారు. కానీ దీనికి మాత్రం 40 మందిని కేటాయించారట. జాయింటు డైరక్టరు పర్యవేక్షిస్తారట. ఇది ఓ పట్టాన అర్థమయ్యే కథ కాదు. చాలాకాలంగా ఎన్నో స్కాండల్స్ గురించి చదివాను, కానీ వాటన్నిటి కంటె యిది భిన్నమైనది – హత్యల కారణంగా! ఇందిర హయాంలో నగర్‌వాలా కేసులో వరుస హత్యల గురించి విని ఉలిక్కిపడ్డాను. (ఎమ్బీయస్ క్రైమ్ రచనలలో దాని గురించి రాస్తాను) కానీ వ్యాపమ్ ముందు అదెందుకూ పనికి రాదు. హత్యలొక్కటే కాదు, రాష్ట్రప్రభుత్వం దాన్ని హేండిల్ చేస్తున్న తీరు కూడా ఆశ్చర్యకరంగా వుంది. రాష్ట్రం హెూం మంత్రి ఏ మాత్రం చలించకుండా పుట్టినవారు గిట్టక మానరు అని వేదాంతోక్తులు వల్లిస్తున్నాడు. 2008 డిసెంబరు నుండి 2012 మార్చి వరకు మెడికల్ ఎడ్యుకేషన్ పోర్టు ఫోలియో ముఖ్యమంత్రి చౌహాన్ వద్దే వుంది. అనేక సందర్భాల్లో కొందరిపై అనుమానాలు వెలిబుచ్చి ఆన్సర్ షీట్లు, ర్యాంకుల షీట్లు యిమ్మనమని కొందరు ఆర్‌టిఐ కింద అడిగినపుడు ప్రభుత్వం యివ్వలేదు. గతంలో ఆన్సర్ షీట్లు పదేళ్ల పాటు భద్రపరచాలన్న రూలుండేది. ఆ రూలును 2011– 2013 మధ్య 6 సార్లు మార్చారు. ఇప్పుడు మూడు నెలల కంటె ఎక్కువ వుంచటం లేదు. ఇవన్నీ సాక్ష్యాలు లేకుండా చేసే ప్రయత్నాలు కాదా? ఈ మిస్టరీ ఎప్పటికి తేలుతుందో ఏమో. అసలు యీ స్కాము స్వరూపస్వభావాల గురించి, హత్యల వెనుక

వున్నవారి గురించి కనిపెట్టి మనకు అర్థమయ్యేట్లు చెప్పాలంటే ఏ మలయాళీ సినిమా స్క్రిప్టు రైటరో దిగి రావాలి.

గతంలోనే వ్యాపమ్ గురించి, మార్కు షీట్లు ఎలా మార్చేస్తున్నారో దాని గురించి రాశాను. వ్యాపమ్ (వ్యావసాయిక్ పరీక్షా మండల్)ను మధ్య ప్రదేశ్‌లో వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశ పరీక్షల కోసం 1982లో పెట్టారు. ఇంజనీరింగు, మెడిసిన్ ఎడ్మిషన్లు చూసేది. మొదట్లో బాగానే నడిచిందట. తర్వాత డెంటల్, పాలిటెక్నిక్, ఆర్కిటెక్చర్, పీజీ ఎంట్రన్స్, మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్.. యిలా అన్నీ దానికే కట్టబెట్టారు. ఇక ఆరోపణలు రావడం మొదలుపెట్టాయి. వ్యాపమ్ లేని కాలంలో సిఫార్సులతో సీట్లు, ఉద్యోగాలు దొరికాయని, తాము వచ్చి వ్యవస్థీకరించామని బిజెపి వారంటారు. కానీ 2003లో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచే అక్రమ వ్యవహారాలు పెద్ద ఎత్తున జరిగాయన్నది నిజం. 2008 నుంచి సర్వీసు కమిషన్ పరిధిలోకి రాని పోలీసు కానిస్టేబుళ్లు, ఫారెస్టు గార్డులు, జైలు గార్డులు, కాంట్రాక్టు టీచర్లు, ఫుడ్ యిన్‌స్పెక్టర్లు, ఆయుర్వేద డాక్టర్లు వగైరా ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌ను కూడా దీనికే అప్పగించి అక్రమాల స్కేలు పెంచారు. చివరకు యిది ఉద్యోగ నియామకాల, కాలేజీ ప్రవేశాల కుంభకోణంగా మారింది. విద్యార్థులు, ఉద్యోగార్థులు వేర్వేరు వర్గాలు. ఇద్దరికీ కలిపి ఒకే సంస్థ పరీక్షలు నిర్వహించడమేమిటి? అవినీతికి అవకాశం వుండే నియామకాలన్నిటిని ఒక చోటకు చేర్చినట్లున్నారు. ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామికీ కరణ తక్కువగా వున్న మధ్య ప్రదేశ్‌లో ప్రభుత్వోద్యోగం గురించి వెంపర్లాడడంలో, దానికై అడ్డదోవలు తొక్కడంలో ఆశ్చర్యం లేదు. ''భారతీయుడు''లో చెప్పినట్లు ఆ తోవలో ఉద్యోగం సంపాదించినవారు అడ్డగోలుగా అవినీతికి పాల్పడతారని కూడా వూహించవచ్చు. అంటే భవిష్యత్తును కూడా భ్రష్టు పట్టిస్తున్నారన్నమాట.

వ్యాపమ్ ఇప్పటిదాకా 68 పరీక్షలు నిర్వహించింది. సుమారు 77 లక్షల మంది అభ్యర్థులు దానిలో పాల్గొన్నారు. 2009లో ఫిర్యాదు చేసినపుడు 300 మంది అనర్హులకు సీట్లు వచ్చాయన్నారు. ఐదేళ్లలో 1087 మంది ఎడ్మిషన్లు కాన్సిల్ చేశారు. ఉద్యోగాలకు వస్తే 1.40 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయి. వేలాది మంది అడ్డదారుల్లో సంపాదించుకున్నారని సింపుల్‌గా అనేశారు కానీ కరక్టుగా ఎంతమందో యింకా తేలలేదు. 140 ఎఫ్ఐఆర్‌లు దాఖలు అయ్యాయి. 3800 మందిని ముద్దాయిలుగా పేర్కొన్నారు. వీరిలో అభ్యర్థులు, వారి తలిదండ్రులు, దళారులు అందరూ కలిపి అయి వుంటుంది. ఇన్ని లక్షల ఉద్యోగాల్లో, యిన్ని లక్షల అభ్యర్థుల్లో అవకతవకలు జరిగిన సంఘటనలు 1-2%కు మించి లేవు కదా అంటాడు ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్! నిజమే కదా! ఆ పాటి ఏ రాష్ట్రంలోనైనా మరో పేరు మీదైనా జరుగుతాయి. మొత్తం రూ.6300 కోట్ల (ఈ అంకె కూడా నమ్మాలని లేదు. స్కాముల్లో ఉన్నదానికి ఎన్నో రెట్లు పెంచి చెప్తూ వుంటారు) స్కాము అంటున్నారు. కాండిడేటుకు రూ. 15-50 లక్షలు లంచం పుచ్చుకున్నారని ఒక అంచనా. మెడికల్ కాలేజీ సీటుకి, ఫారెస్టు గార్డు ఉద్యోగానికి ఒకే రేటు వుండదు కదా. సగటున ఏ రూ. 30 లక్షలో వుందనుకుంటే మొత్తం రూ.6300 కోట్లను 21 వేల మంది అభ్యర్థుల నుండి వసూలు చేసి వుండాలి. మధ్యేమార్గంగా ఏ పదివేల మందో అక్రమంగా, అన్యాయంగా ఉద్యోగాలు, సీట్లు సంపాదించారని అనుకోవచ్చు.

నేను స్కామును తగ్గించి చూపే ప్రయత్నం చూపటం లేదు. పదివేల మంది కాదు, పదిమంది అక్రమంగా సంపాదించినా తప్పే. కానీ స్కేల్ ఆఫ్ స్కామ్ గురించి చర్చిస్తున్నాను. ఈ పాటి దానికి యిన్ని హత్యలా? ఎవరు చేయిస్తున్నారు? గవర్నరు నిందితుడు. కానీ నిందితుడైన అతని కుమారుడు కూడా చచ్చిపోయాడు. అదీ సొంత యింట్లో. అతన్నీ చంపగలిగారా? నమ్మశక్యంగా లేదు. చావులకు, కేసులకు సంబంధం లేదని తీర్మానించేద్దామా? పాలకపక్షం వారు అలా నచ్చచెప్పుకున్నా నిందితులు మాత్రం అలా అనుకోవటం లేదు. వారిలో 1800 మంది అరెస్టయ్యారు. 600 మంది పరారీలో వున్నారు. అరెస్టయి బెయిలుపై బయటకు వచ్చినవారిలో 200 మంది తమ ప్రాణాలకు ముప్పు ఏర్పడిందంటూ పిటిషన్‌లు దాఖలు చేశారు. కొంతమందికి బెయిలు వచ్చినా బయటకు వెళ్లటం లేదు, ప్రాణాలు పోతాయన్న భయంట! ఇటీవలి రోజుల్లో ఒక్క వారంలో అయిదుగుర్ని లేపేశారు. వారిలో ఆజ్‌తక్ రిపోర్టరు అక్షయ్ కుమార్ ఒకడు. అమ్మాయి మెడికల్ కాలేజీలో అక్రమంగా సీటు పొందిన నమ్రతా దామర్ 2012 జనవరిలో రైలు పట్టాలపై శవంగా కనబడింది. అది హత్యా, ఆత్మహత్యా పరిశోధిద్దామని అక్షయ్ సింగ్ పోస్ట్ వెళ్లి కుటుంబసభ్యుల్ని కలిశాడు, మాట్లాడాడు. వాళ్లు ఆత్మహత్య కాదన్నారు. వాళ్లింటి నుంచి వచ్చిన కొద్ది సేపటికే నురగలు కక్కుకుని చచ్చిపోయాడు. నమ్రత తలిదండ్రులు అతనికి విషం కలిపిన పానీయం యిచ్చారా? ఎందుకిస్తారు? కూతురి పట్ల సానుభూతితో వచ్చిన జర్నలిస్టు పట్ల ద్వేషం ఏమిటి? ఇవ్వకపోతే చంపేస్తామని వాళ్ల నెవరైనా బెదిరించారా? చావు ఎలా సంభవించిందో యిప్పటిదాకా తెలియదు. అతని పోస్ట్ మార్టమ్ గుజరాత్‌లోని దహోద్‌లో జరిగింది. దాని రిపోర్టును రిజర్వ్‌లో వుంచారు. అంతర్గత అవయవాలను ఎయిమ్స్‌లో పరీక్షిస్తారట. ఇండియా టుడే యీ కేసును సీరియస్‌గా తీసుకుని దుమ్ము రేపింది. నమ్రత పోస్టు మార్టమ్ రిపోర్టు సంపాదించి చూస్తే ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసి చంపారని తేలింది. ఆమె చావు కేసు మూసేశామని, మళ్లీ తెరిచామని, మళ్లీ మూసేశామని పోలీసులు రకరకాల స్టేటుమెంట్లు యివ్వడాన్ని ఇండియా టుడే ఎత్తి చూపింది.

ఇంత స్కాము జరుగుతూంటే, యిన్ని హత్యలు జరుగుతూంటే ముఖ్యమంత్రి ఏదో ఒకటి చేయాలి. 'అక్రమాలు జరిగాయని నా దృష్టికి రాగానే నేను విచారణకు ఆదేశించాను. ఇంతకంటె నా నిజాయితీకి వేరే రుజువేం కావాలి?' అని ఆయన అడుగుతున్నాడు. ఆయన చేసినదేమిటో ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుందాం. నియామకాల్లో అక్రమాల గురించి 2009 జులైలో బయటకు వచ్చింది. ఆనంద్ రాయ్ దీనిపై న్యాయవిచారణ జరపాలని మధ్య ప్రదేశ్ హై కోర్టును ఆశ్రయించారు. 2009 నవంబరులో 9 మంది బోగస్

అభ్యర్థులను గుర్తించి వారిపై కేసులు పెట్టారు. డిసెంబరులో ముఖ్యమంత్రి స్కాము గురించి విచారణ జరపడానికి ఒక ప్యానెల్ నియమించారు. 2011 మార్చి 31 న అసెంబ్లీలో మాట్లాడుతూ బోగస్ అభ్యర్థులెవరూ లేరని ప్రకటించారు. అయినా ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాసేస్తున్నారని, దొంగ ఫోటోలు, దొంగ సంతకాలతో పరీక్షలు పాసవుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. సంతకాలు, ఫోటోగ్రాఫులు నిజమైనవో కావో తేల్చడానికి రాష్ట్రంలో వున్న ఫోరెన్సిక్ లాబ్స్‌లో పరీక్షించి సెకండ్ ఒపీనియన్‌కై హైదరాబాదులోని, చండీగఢ్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లాబ్స్‌కు పంపామని 2012 ఫిబ్రవరి 23న అసెంబ్లీలో చౌహాన్ ప్రకటన చేశారు. అది నిజమా కాదా అని ఆశీస్ చతుర్వేది అనే అతను సమాచార హక్కు కింద హైదరాబాదు, చండీగఢ్ లాబ్స్‌నుండి సమాచారం కోరాడు. వాళ్లు తమకేమీ అందలేదని చెప్పేశారు. అంటే చౌహాన్ అసెంబ్లీని తప్పుదోవ పట్టించినట్లే తేలుతోంది. ఈ విషయాన్ని యిప్పుడు కాంగ్రెస్ ప్రస్తావిస్తే బిజెపి అధికార ప్రతినిథి జివిఎల్ నరసింహారావు "ఇవన్నీ అసెంబ్లీలో లేవనెత్తవలసిన అంశాలు" అని తప్పించుకున్నారు.

2013 నుంచి దీనిపై విజిల్ బ్లోయర్స్ (తెలుగులో కొన్ని పత్రికలు ప్రజావేగులు అంటున్నాయి కానీ పారాహుషారీలు అనవచ్చేమో, వేగులు సమాచారం సేకరిస్తారు, పాలకులకు నివేదిస్తారు, కానీ వీళ్లు జరగబోయే దాని గురించి హెచ్చరిస్తున్నారు) చురుగ్గా పనిచేశారు. ఆధారాలు సంపాదించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు, హై కోర్టుకి వెళ్లారు. 2013 జులైలో పోలీసులు మారు పేర్లతో పరీక్ష రాస్తున్న 20 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారం తిరక్కుండా కుంభకోణానికి సూత్రధారి ఐన జగదీశ్ సాగర్‌ను అరెస్టు చేశారు. అతనికి చెందిన 14 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ యిటీవల ఎటాచ్ చేసింది. అతను విద్యార్థులు, ఉద్యోగార్థుల నుండి డబ్బు వసూలు చేసి బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ల రూపంలో వేసి, వాటిని గ్యారంటీగా చూపి ఆస్తులు కొనడానికి లోన్లు తీసుకున్నాడట. అతని ద్వారా దీనిలో పాలు పంచుకున్న వారి పేర్లు కొన్ని తెలిశాయి. ముగ్గురు ఐయేయస్‌లు, ఇద్దరు ఐపియస్‌లు, మెడికల్ కాలేజీ నిర్వాహకులతో బాటు యిద్దరు మంత్రులు కూడా వున్నారు. 24 మంది ప్రముఖులు నిందితులు. మాజీ ఎక్జామ్స్ కంట్రోలర్, డైరక్టర్ వ్యాపమ్ పంకజ్ త్రివేది, మాజీ ప్రిన్సిపల్ సిస్టమ్ ఎనలిస్ట్ నితిన్ మహీంద్రా రికార్డులను మార్చివేశారు.

నాలుగు నెలల్లో అంటే నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి కాబట్టి ఇక తప్పనిసరి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి స్పెషల్ టాస్క్ ఫోర్సు (ఎస్‌టిఎఫ్)ను ఏర్పాటు చేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. స్కాం మాట వచ్చినప్పుడల్లా నేనే దాని గురించి దర్యాప్తు ఆదేశించాను, గమనించండి అని చెప్పుకుంటున్నారు. 2013 ఆగస్టు నుండి ఎస్‌టిఎఫ్ విచారణ ప్రారంభించింది. 45 కాలేజీ ఎడ్మిషన్లు 10 రిక్రూట్‌మెంట్లు గురించి 55 కేసులు పెట్టింది. 2013 అక్టోబరులో 345 మంది పరీక్షలు కాన్సిల్ చేసారు. డిసెంబరులో మాజీ ఉన్నత విద్యామంత్రి లక్ష్మీకాంత్ శర్మను జైల్లో పెట్టారు. ఎస్‌టిఎఫ్ విచారణ సరిగ్గా నడపటం లేదని ఆరోపిస్తూ 2014 ఏప్రిల్‌లో జబల్‌పూర్‌లో హై కోర్టు 14 పిటిషన్లు వేశారు. అప్పుడు హై కోర్టు తను పర్యవేక్షిస్తానంది. రాష్ట్రంలో 20 చోట్ల స్పెషల్ కోర్టులు పెట్టింది. 2014 నవంబరులో ఎస్‌ఎఫ్‌టి దర్యాప్తు ఎలా సాగుతోందో పర్యవేక్షించడానికి హై కోర్టు ఒక రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేసింది. మాజీ ఐపియస్ అధికారి, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ కూడా సభ్యులుగా వున్నారు.

పరిశోధన గట్టిగా సాగిస్తే సంబంధిత వ్యక్తులు చచ్చిపోతున్నారు. అది కూడా రకరకాలుగా! ఉదాహరణకి ఎస్సయి ట్రైనింగ్ పొందుతున్న అనామిక సికర్వార్ (25) చెరువులో శవంగా తేలింది. డీన్‌గా పనిచేసే డికె సకాలే అక్రమంగా సీట్లు పొందిన వారిని తొలగించారు. తర్వాత కాలిన గాయాలతో కాలేజీ కాంపస్‌లో 2014 జులైలో శవంగా కనబడ్డారు. అక్రమంగా సీట్లు సంపాదించిన వారి జాబితా తయారు చేసి ఎస్‌టిఎఫ్‌కు యిచ్చిన జబల్‌పూర్ మెడికల్ కాలేజీ డీన్ అరుణ్ శర్మ హోటల్లో పోయారు. శవాన్ని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వైద్యనిపుణులు పోస్టు మార్టం చేశారు. గొంతు నులిమిన ఆనవాళ్లున్నాయట. ఫుడ్ యిన్‌స్పెక్టర్ నియామకాల్లో నిందితుడు విజయ్ పటేల్ ఏప్రిల్ 29 న తన లాయరును కలవాలి. దానికి ముందు రోజే బస్తర్‌లో ఒక హోటల్లో శవంగా మారాడు. చనిపోయినవారిలో చాలామంది 25 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసు మధ్యలో వున్నవారే. వారిలో కొంతమంది మరణకారణాల గురించి ఒక్కసారి పరికిస్తే ఒక ప్యాటర్న్ ఏమైనా మీకే తట్టవచ్చు. 1) రోడ్డు యాక్సిడెంటులో పోయినవారు – 2010 జూన్ 14న అనూజ్ ఉల్కే, అనుషూల్ సచన్, శ్యామ్‌వీర్ యాదవ్, 2012 నవంబరులో అరవింద్ శాక్యా, 2013 సెప్టెంబరులో తరుణ్ మచార్, 2013 అక్టోబరులో ఆనంద్ సింగ్ యాదవ్, 2013 డిసెంబరులో దేవేంద్ర నాగర్, 2) ఓవర్‌డోస్‌లో మద్యం సేవించి చనిపోయిన వారు – 2009 నవంబరులో వికాస్ సింగ్, 2010 అక్టోబరులో గ్యాన్ సింగ్, 2013 ఆగస్టులో అశుతోష్ తివారి 3) విషప్రయోగంతో మరణించినవారు – 2014 జూన్‌లో రవీంద్ర ప్రకాశ్ సింగ్ 4) నది పక్కన లేదా చెరువులో శవంగా కనిపించినవారు – 2015 జనవరిలో లలిత్ కుమార్ గోలరీయా, 2015 ఫిబ్రవరిలో అమిత్ సాగర్ 5) ఉరి వేసుకుని చచ్చిపోయిన వారు – 2012 అక్టోబరులో ఆదిత్య చౌదరి, 2013 ఏప్రిల్‌లో ప్రమోద్ శర్మ, 2014 ఫిబ్రవరిలో దినేశ్ జాతవ్, 2015 జనవరిలో రమేంద్ర సింగ్ భాడోరియా 6) బ్రెయిన్ హెమరేజితో పోయిన వారు – 2014 ఏప్రిల్‌లో వికాస్ పాండే, 2015 మార్చిలో గవర్నరు కొడుకు శైలేశ్ యాదవ్ 7) జైల్లో గుండె వ్యాధితో పోయినవారు – నరేంద్ర తోమార్ (వయసు 29) 8) అంతుపట్టని వ్యాధితో ఆసుపత్రిలో పోయినవారు – 2015 జూన్‌లో రాజేంద్ర ఆర్యా,9) కారణం చెప్పలేని చావులు – 2014 ఏప్రిల్‌లో నరేంద్ర రాజ్‌పుత్, 2015 ఏప్రిల్‌లో విజయ్ సింగ్ పటేల్.

ఇవన్నీ చూసి కాబోలు ఎస్‌టిఎఫ్ చీఫ్ కూడా విచారణ చేయడానికి భయంగా వుంది అనేశాడు. అక్షయ సింగ్ మృతి తర్వాత జర్నలిస్టులందరికీ భయం పట్టుకుంది. సిట్ చీఫ్‌గా వున్న జస్టిస్ చంద్రేశ్ భూషణ్ – అవి అనుమానస్పద మరణాలు కావు కానీ అసహజ మరణాలే అని ఒప్పుకున్నారు. దీనికి సంబంధించి మొత్తం ఎంతమంది పోయారన్నదానిపై ఎవరి అంకె వారిదైనా కనీసం 30 మంది అని మనం అనుకోవచ్చు. బతికున్నవాళ్లకు కూడా ఎప్పుడు పోతామేమోనన్న భయం పట్టుకుంది. ఫ్రీలాన్స్ డిజిటల్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్, ఎథికల్ హ్యాకర్ అయిన ప్రశాంత్ పాండేకు వ్యాపమ్‌కు సంబంధించిన 40 జిబి డేటా దొరికింది. కాంగ్రెసు వాళ్లు అడిగినా యివ్వలేదు. దాన్ని ఎస్‌టిఎఫ్‌కు యిస్తే వాళ్లు ఉపయోగించుకోలేదు. పైగా పోలీసులకు చెప్పినట్లున్నారు, వాళ్లు అతని కుటుంబంపై ఇండోర్ నుంచి 40 కిమీ ల దూరంలో ఒక ట్రక్కు చేత దాడి చేయించారు. స్కాములో పాలు పంచుకున్న మెడికల్ స్టూడెంట్ల చేత యితన్ని కొట్టించారు. అఫీషియల్ సెక్యూరిటీ అడిగాడు, ఇచ్చారు. ఇచ్చాక కూడా ఆరుసార్లు దాడి జరిగింది. సైకిల్ మీద తిరిగే (స్కూటరుకు డబ్బుల్లేవు) విజిల్ బ్లోయర్ చతుర్వేదికి సెక్యూరిటీ గార్డులుగా వుండమంటే వుండడానికి నిరాకరించిన గార్డుల సంఖ్య 23! అంటే అందరికీ భయంగానే వుందన్నమాట. విజిల్ బ్లోయర్స్ ప్రొటక్షన్ యాక్ట్ అసమగ్రంగా వుంది. దాన్ని సవరించ వలసిన అవసరం వుంది.

పరిస్థితి భయానకంగా మారడంతో సిబిఐకు అప్పగించాలని పదేపదే హైకోర్టుకి వెళ్లిన దిగ్విజయ్ సింగ్ సుప్రీం కోర్టుకి వెళ్లడంతో, అతని అప్పీలును జులై 9 న వింటానని వాళ్లు అనడంతో, అప్పటిదాకా సిబిఐ విచారణ అక్కరలేదంటున్న సిఎం సిబిఐకు ఒప్పుకున్నాడు. అంతకు ముందు రోజే రాజ్‌నాథ్ సింగ్ అక్కరలేదు పొమ్మన్నాడు. సడన్‌గా నిర్ణయం మారింది. ఇదే కాదు, మధ్యప్రదేశ్‌లోని ప్రయివేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో 50% సీట్లు భర్తీ చేయడానికి అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ డెంటల్ అండ్ మెడికల్ కాలేజెస్ నిర్వహించే డిమాట్ (డెంటల్ అండ్ మెడికల్ ఎడ్మిషన్ టెస్ట్)లో స్కాము జరిగిందని ఆనంద్ రాయ్ ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలోని న్యాయమూర్తులనేకమంది తమ పిల్లల అడ్మిషన్లకై లంచాలు చెల్లించి డిమాట్‌ను భ్రష్టు పట్టించారని అన్నారు. దాంతో హై కోర్టు ఆన్సర్ షీట్లను ఆప్టికల్ మార్క్‌కై పరీక్ష సెంటర్ల వద్దే స్కానింగ్ చేయించి భద్రపరచమని ఆదేశించింది. ఎందుకంటే వ్యాపమ్ స్కాములో సూత్రధారులు, తమ కాండిడేట్లకు ఆన్సర్ షీట్లను ఖాళీగా యిమ్మనమని చెప్పేవారు. వాటిని తర్వాత సరైన ఆన్సర్లతో నింపేవారు. రీఎగ్జామ్ చేయించినా మోసం బయటపడదు. అంతేకాదు, ఒక గతంలో పరీక్ష రాసి పాసయిన తెలివైన కుర్రవాడికి దగ్గరగా తమ కాండిడేట్‌కు సీటు పడేట్లు మానిప్యులేట్ చేసేవారు. ఇద్దరూ పాసయ్యేవారు. తెలివైన కుర్రాడికి మెడికల్ కాలేజీలో సీటు వచ్చాక అతను దాన్ని ఒదులుకునేలా ఒప్పందం. వదులుకున్నాక ఆ సీటును మేనేజ్‌మెంట్ రూ. 25–30 లక్షలకు అమ్ముకునేది.

ఆర్థిక నేరాలకు భారత ప్రజలు అలవాటు పడిపోయారు కానీ వరుస హత్యలకు అలవాటు పడలేదు. తమ నేరం బయటపడుతుందన్న భయంతో వాళ్లే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అనుకోవడానికి లేదు. అంత సెన్సిటివ్ వ్యక్తులైతే అలాటి పనులు చేసి వుండేవారే కాదు. జీవితేచ్ఛ నశించిందనడానికి వాళ్లు యింకా యౌవనంలోనే వున్నారు, డబ్బులు పడేసి ఉద్యోగాలు, సీట్లు తెచ్చుకున్నారు. నిరాశ దేనికి? ఎవరూ నోరెత్తకుండా, రహస్యాలు భయపెట్టే ధైర్యం చేయకుండా  కావాలనే అందర్నీ చంపి పారేస్తున్నారు. విచారణ గట్టిగా ప్రారంభించకుండానే యింత మంది చచ్చిపోయారు, లోతుగా తవ్వడం మొదలెడితే ఎంతమందికి ముప్పు వుందో తెలియదు. విచారణ కంటె ముందు చచ్చిపోయిన వారి సంగతేమిటి అన్న సందేహం సహజంగా వస్తే నమ్రత కేసులో ఆమె తండ్రి చెప్పినది మనకు కాస్త క్లూ యిస్తుంది – మెడికల్ సీటు వచ్చాక డబ్బు దగ్గర పేచీ వచ్చిందట. అందువలన చంపేశారట. పేచీ ఎందుకు వచ్చిందో తెలియదు. ఇస్తానన్న దాని కంటె తక్కువ యిచ్చారో, లేక ఒప్పుకున్న దానికంటె వాళ్లు ఎక్కువ యిమ్మన్నారో. ఏది ఏమైనా తేడా వస్తే చంపేయడానికి వాళ్లు వెనకాడటం లేదు. హంతకుల సామర్థ్యం తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఒక వూరు కాదు, ఒక సమయం కాదు, హత్య చేయాలంటే అవకాశం చిక్కాలి. ఒంటరిగా దొరకాలి. అలాటిది యిన్ని హత్యలు టపటపా చేయిస్తున్నారంటే ఎంత గుండెలు తీసిన బంటులై వుండాలి! వాళ్లకు ప్రభుత్వ మద్దతు తప్పకుండా వుండి వుంటుంది. ఒకవేళ చౌహాన్‌కి వాళ్ల గురించి ఏమీ తెలియదు అంటే అతను చచ్చు దద్దమ్మ అయివుండాలి. లేదా వరుస చావులకు చలించని కిరాతకుడు అనుకోవాలి. తన రాష్ట్రంలో యింతటి భయానక వాతావరణం ఏర్పడితే అతనిలో చలనమే లేదు. అతనికే కాదు, బిజెపి ఉన్నత స్థాయిలో కూడా లేదు.

చౌహాన్‌కు పోటీగా ఎదుగుతున్న కైలాస్ విజయవర్గీయలో కూడా కాఠిన్యమే కనబడింది. ఇప్పటిదాకా అప్రతిహతంగా సాగుతున్న చౌహాన్‌ను కట్టడి చేయడానికి బిజెపి కేంద్ర నాయకత్వం అతని కాబినెట్‌లో మంత్రిగా వున్న కైలాస్‌ను ఢిల్లీ రప్పించి పార్టీకి జాతీయ స్థాయిలో జనరల్ సెక్రటరీ చేసేసింది. చౌహాన్‌తో ఒక్క ముక్క కూడా చెప్పలేదు. కైలాస్ అమిత్ షాకు చాలా ఆత్మీయుడు. కైలాస్ స్వస్థలం ఇందోరు, గుజరాత్ సరిహద్దుల్లో వుంది. అమిత్ షాను గుజరాత్ నుండి బహిష్కరించినపుడు కైలాస్ అతనికి ఇందోరులో ఆశ్రయం యిచ్చాడు. గుజరాత్ నాయకులు అమిత్ ను అక్కడకి వచ్చి కలిసేవారు. 2004లో ఉమా భారతిని పార్టీలోంచి తీసేసినప్పుడు తనకు ఛాన్సు వస్తుందని కైలాస్ అనుకున్నాడు. కానీ అలా జరగలేదు. ఇప్పుడు మోదీ–అమిత్ వచ్చాక అతనికి అచ్ఛే దిన్ వచ్చాయి. నీతి ఆయోగ్‌లో ముఖ్యమంత్రుల కమిటీకి చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఇప్పుడు యీ స్కాము వచ్చింది కాబట్టి చౌహాన్‌ను తప్పించి కైలాస్‌కు ఛాన్సిస్తారా అనుకుంటూండగానే అతను చాలా తెలివితక్కువగా ప్రవర్తించాడు. రాష్ట్రంలో యింతమంది రాలి పోతూ వుంటే రాజధానిలో పెద్ద విజయోత్సవ ర్యాలీ తలపెట్టాడు – తనకి జాతీయ కార్యదర్శి పదవి దక్కినందుకట. అప్పుడే జర్నలిస్టు అక్షయకుమార్ మరణించడంతో జర్నలిస్టులు అతని గురించి అడిగారు. కైలాస్ తేలికగా కొట్టిపారేస్తూ – 'ఛోడో యార్, హమ్‌సే బఢ్‌కర్ హై క్యా,

ప[త్రకార్?' అని తీసిపారేశాడు. జర్నలిస్టు అయినంత మాత్రాన మా కంటె మొనగాడా అనే మాట అంత అనాలోచితంగా అనడం కొంప ముంచింది. తర్వాత అతను క్షమాపణ చెప్పుకోవలసి వచ్చింది.

చౌహాన్‌కు యిప్పటిదాకా సమర్థుడైన ముఖ్యమంత్రి అనే పేరు వుంది. కానీ యిటీవల మైనింగ్ స్కాముల్లో అతని పేరు, ఫ్యామిలీ పేరు బయటకు వచ్చింది. ఇప్పుడు ఆయన భార్య మీదే నింద పడింది. ఆమె నిందితులకు పంపిన ఎస్సెమ్మెస్‌ల రికార్డును కాంగ్రెసు పార్టీ 2015 ఫిబ్రవరిలో విడుదల చేసింది. సిఎం ప్రయివేటు సెక్రటరీగా పనిచేసిన ప్రేమ్ చంద్ ప్రసాద్ కూతురు 2012లో మెడికల్ సీటు అక్రమంగా సంపాదించింది. ఇద్దరి మీదా కేసులు పెట్టి వూరుకున్నారు. విచారణ లేదు. చివరకు 2014 జూన్‌లో యాంటిసిపేటరీ బెయిలు సంపాదించారు. దాన్ని సవాలు చేయలేదు. చౌహాన్ సోదరుడి కూతురు రీతూ చౌహాన్ పేరు పబ్లిక్ సర్వీసు కమిషన్ స్కాములో నిందితురాలిగా పేరు బయటకు వచ్చింది. 2008లో ఆమె డిప్యూటీ కలక్టరుగా సెలక్టయింది. 2011లో కాంగ్రెసు నాయకుడు కెకె మిశ్రా దానిపై రచ్చ చేయబోతే "ఫ్యామిలీట మాటర్లను రాజకీయాల్లోకి లాగవద్దు" అంటూ చౌహాన్ అతనికి కబురు పంపించాడు. ఆయనపై యిప్పటిదాకా బిజెపి అధిష్టానం ఏ చర్యా తీసుకోలేదు. పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నమూ చేయలేదు. తన పేరు స్కాములో వినబడడంతో ఎలర్టయిన ఉమా భారతి కేసు సిబిఐకు అప్పగించాలని డిమాండ్ చేసింది. ఆమె చౌహాన్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి ఫెయిలయింది. అధిష్టానం పార్టీ నుంచి పంపించివేసింది. ఆరేళ్ల తర్వాత వెనక్కి తీసుకునేటప్పుడు మధ్యప్రదేశ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోనని ఆమె నుండి మాట తీసుకుని అప్పుడు రానిచ్చారు. ఇప్పుడు ఆమె భోపాల్‌కు వచ్చినా తన యింట్లో వుంటుంది తప్ప పార్టీ హెడ్‌క్వార్టర్సుకి వెళ్లదు.

ముఖ్యమంత్రి మాట సరే, గవర్నరు మాటేమిటి? ఎస్‌టిఎఫ్ గవర్నరుకు వ్యతిరేకంగా 2015 ఫిబ్రవరి 24 న ఎఫ్‌ఐఆర్ ఫైల్ చేసింది, కానీ గవర్నరు పదవిలో వున్నాడు కాబట్టి ఏమీ చేయలేకపోయారు. మోదీ సర్కారు ఆయన్ని ఆ పదవి నుంచి తప్పించి రక్షణ లేకుండా చేయవచ్చు కదా. ఎందుకు చేయటం లేదు? అధికారం చేతికి రాగానే ఎంతోమంది గవర్నర్లను యింటికి పంపిన మోదీ యీయన విషయంలో మెతక వైఖరి ఎందుకు అవలంబిస్తున్నారు? ఆయన అసలు దొంగల గురించి రహస్యాలు బయట పెడతాడనా?

సిబిఐ రంగంలోకి దిగిన మూడు రోజుల్లోనే ఎస్‌టిఎఫ్‌ను పరుగులెత్తిస్తోంది. తాము ప్రారంభించి పెండింగులో పెట్టిన 185 కేసులను సిబిఐకు అప్పగించేద్దామని చూసిన ఎస్‌టిఎఫ్‌ను మీరు యిన్వెస్టిగేషన్ పూర్తి చేసిన కేసుల్లో వెంటనే చార్జి షీట్లు వేసేయండి అని చెప్పి ఆ మేరకు సుప్రీం కోర్టుకు విన్నవించింది. 'కేసుల బదిలీ చాలాకాలం పడుతుంది, నిందితులను కస్టడీలోకి తీసుకున్న 90 రోజుల్లోపున చార్జి షీటు ఫైల్ చేయకపోతే బెయిల్ తీసుకుని బయటకు వెళ్లిపోయే అవకాశం వారికి కల్పించినట్లవుతుంది' అని సిబిఐ లాయరు వాదించారు. సుప్రీం కోర్టు జులై 20 సోమవారం నాడు తీర్పుచెపుతానంది. అంతేకాదు, నమ్రతా దామోర్, విజయ్ పటేల్, రాజేంద్ర ఆర్య, అక్షయ్ సింగ్, దీపక్ వర్మల వంటి 9 మంది మరణాల గురించిన రికార్డులు తమకు యివ్వమని ఆ యా జిల్లాలకు సంబంధించిన పోలీసు అధికారులను అడిగి తీసుకుని కేసులు నమోదు చేసింది. అన్నిటి కన్నా ముఖ్యంగా గులాబ్ సింగ్ కిరార్, అతని కొడుకుతో సహా 150 మంది పై అవినీతి, మోసం, ఫ్రాడ్, నేరపూరితమైన కుట్ర వంటి 5 రకాల కేసులు పెట్టింది. ఇతను ముఖ్యమంత్రి చౌహాన్‌కు బంధువు, మైనారిటీ వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సభ్యుడు. తన కొడుకుకు 2011లో ప్రి పిజి (మెడికల్)లో ఫస్ట్ ర్యాంక్ వచ్చేందుకు మోసం చేశాడని అభియోగం. అతనూ అతని కొడుకు శక్తి కనబడకుండా పోయారని (అబ్‌స్కాండింగ్) అని పోలీసులు చెపుతున్నారు. వాళ్లను అరెస్టు చేసేందుకు ఉపయోగపడే సమాచారం యిస్తే బహుమతి యిస్తామని కూడా ప్రకటించారు. కానీ కిరార్ ఎక్కడికీ పోలేదు, చౌహాన్‌తో కలిసి బహిరంగ వేదికల మీద కనబడుతూనే వున్నాడు. ఎస్‌టిఎఫ్ దీని గురించి యిన్నాళ్లూ ఏమీ చేయలేదు.

సిటిఎఫ్ పనితీరులో లోపాల గురించి, అవి అలా వుండడానికి గల కారణాల గురించి చర్చ తీవ్రంగా జరుగుతోంది. మధ్యప్రదేశ్‌లో బలంగా వున్న ఆరెస్సెస్‌కు సంబంధించిన కొందరు నాయకులకు యీ స్కాములో భాగస్వామ్యం వుందన్న ప్రచారమూ సాగుతోంది. ఈ స్కామును బయటపెట్టిన ఇండోర్ వాసి, నేత్రవైద్యుడు ఆనంద్ రాయ్ తన అనుభవాలను పత్రికలకు యిచ్చిన యింటర్వ్యూల్లో వివరించసాగాడు. అతను ఆరెస్సెస్ సిద్ధాంతాలను అభిమానిస్తాడు. 2005 నుంచి వాళ్ల శాఖల్లో, వర్క్‌షాపుల్లో పాల్గొంటాడు. వాళ్లకు సంబంధించిన మెడికల్ వింగ్ ఆరోగ్య భారతిలో వైస్ ప్రెసిడెంటు కూడా. సమాజసేవకై యిచ్చే నానాజీ దేశ్‌ముఖ్ ఎవార్డును 2012-13 సంవత్సరానికై యితనికి యిద్దామని ఆరెస్సెస్ అనుకుంది కూడా. అయితే 2013లో యితను వ్యాపమ్ స్కామ్‌ను బయటపెట్టడంతో కథంతా మారిపోయింది. ఆరెస్సెస్ యితన్ని దూరంగా పెట్టసాగింది. తన కార్యక్రమాలకు పిలవడం మానేసింది. అవార్డు యివ్వకూడదని నిశ్చయించింది. స్కామును బయటపెట్టేందుకు ఎలాటి సహకారమూ అందించలేదు. 2005లో ఎండి పరీక్షకు రాయడానికి భోపాల్ వెళ్లినపుడు యితనికి మొదటిసారి పరీక్షల గురించి అనుమానం కలిగింది. తనతో బాటు హాస్టల్లో వున్న పలుకుబడి వున్న కొందరు కుర్రవాళ్లకు చదువు పెద్దగా లేకపోయినా పరీక్ష పాసవడం యితనికి ఆశ్చర్యం కలిగించింది. అక్కణ్నుంచి పరిశోధన ప్రారంభించాడు. 2009 జులైలో యింకొకరి పేరుమీద పరీక్ష రాయడానికి ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన ఇండోర్ హోటల్‌లో బస చేసిన వారి గురించి తెలిసి, క్రైమ్ బ్రాంచ్‌కు తెలియపరిచాడు. అతను ఫిర్యాదుపై విచారణ జరిగి, కొందరు అలా రాశారని తేలినా చర్యలు ఏమీ తీసుకోలేదు. ఇతను పట్టు వదలకుండా మారుపేర్లతో పరీక్షలు రాసేవారి పేర్లు సేకరించి అసెంబ్లీలో సక్లేచా అనే ఎమ్మెల్యే ద్వారా బయటపెడుతూనే వచ్చాడు. 2012 వరకు 295 మంది అలా రాశారని

ఒప్పుకోవడం, అరెస్టులు చేయడం జరిగాయి.

ఇక్కడ ఉత్తర ప్రదేశ్ కనక్షన్ గురించి తెలుసుకోవాలి. కాన్పూరులోని కాకాదేవ్ ప్రాంతంలో మెడికల్ ఎగ్జామ్స్ కోచింగ్ సెంటర్లు చాలా వున్నాయి. అక్కడే మంచి కాలేజీలు కూడా వున్నాయి. వ్యాపమ్ సూత్రధారులు అక్కడకు వచ్చి బాగా చదివే విద్యార్థులను తీసుకెళుతూ వుంటారు. అక్కణ్నుంచే కాదు, యితర ప్రాంతాల నుంచి కూడా తీసుకెళ్లి డబ్బులిచ్చి మారు పేర్లతో పరీక్షలు రాయిస్తూ వుంటారు. 2013లో ఇండోర్ పోలీసు 20 మందిని అరెస్టు చేస్తే 17 మంది ఉత్తర ప్రదేశ్ వారే. ఎస్‌టిఎఫ్ దృష్టికి 150 మంది అలాటి విద్యార్థులు వచ్చారు. వారిలో 52 మంది కాన్పూరుకు చెందినవారు, 40 మంది లఖనవ్‌కు చెందినవారు కాగా తక్కినవారు ఝాన్సీ, గోరఖ్‌పూర్, అలహాబాదులకు చెందినవారు. వీరిలో 36 మంది విద్యార్థులు దొరికారు. సిట్ 34 మంది మెడికల్ స్టూడెంట్స్ పరారీలో వున్నట్టు ప్రకటించి, వారి సమాచారం చెప్పినవారికి రూ.2 వేలు యిస్తామని ప్రకటించింది. విజిల్ బ్లోయర్‌గా ఆనంద్ రాయ్ పేరు బయటకు రావడంతో ప్రభుత్వం కక్ష కట్టింది. ఇతని భార్య గైనికాలజిస్టు. పిల్లాడు పుడితే వాణ్ని చూసుకోవాలంటూ సెలవు పెట్టింది. ఆమెను సస్పెండ్ చేసేసింది ప్రభుత్వం. మళ్లీ వేడుకోగా ఉద్యోగం యిచ్చింది కానీ ఉజ్జయినికి బదిలీ చేసింది. అదే చేత్తో తనను ధార్ అనే గిరిజన ప్రాంతానికి బదిలీ చేయబోతోందని యితనికి తెలిసింది. ''మాకు రెండున్నరేళ్ల పిల్లాడున్నాడు. కావాలని మా భార్యాభర్తలను చెరో మూలకు వేయడం వలన ప్రభుత్వం చెప్పదలచుకున్నదేమిటి, అవినీతిని బయటపెడితే దొరికే బహుమతి యిదే అనా?'' అని అతను అడుగుతున్నాడు. అతనికి అన్యాయం జరగకుండా చూసే ఉద్దేశం ఆరెస్సెస్ నాయకులకు ఎవరికీ లేదు. ''అవినీతి సహించమని చెప్పే ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ వ్యాపమ్ గురించి ఒక్కసారైనా నోరెత్తారా?'' అని అడుగుతున్నాడు ఆనంద్.

నమ్రతా దామోర్ మరణం విషయంలో కూడా అతి కీలకమైన సాక్ష్యాన్ని సంపాదించినవాడు ఆనందే. 19 ఏళ్ల వయసున్న ఆమె ఇండోర్‌లో ఎంజిఎమ్ కాలేజీలో మెడిసిన్ రెండవ సంవత్సరం చదువుతోంది. 2012 జనవరి 7 నుంచి కనబడడం మానేసింది. ఆమె సోదరుడు ఆ విషయమై జనవరి 12 న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే రోజు ఉజ్జయినిలో రైలు పట్టాల వద్ద ఆమె శవం కనబడింది. ఆమె ఎవరో తెలియదని చెప్పి పోలీసులు హత్యకేసుగా నమోదు చేసి ఖననం చేశారు. నాలుగు రోజుల తర్వాత నమ్రత సోదరుడు శవాన్ని గుర్తుపట్టాడు. ఉజ్జయిని జిల్లా ఆసుపత్రిలోని డా॥ పురోహిత్ పోస్ట్ మార్టమ్ నిర్వహించి ఊపిరాడకుండా ఆమెను అదిమిపెట్టడం వలన మరణించిందని రాశాడు. అయితే కేసును సమీక్షించిన భోపాల్‌లోని ఎంపి మెడికో లీగల్ ఇన్‌స్టిట్యూట్ వారు అది ఆత్మహత్య అని నిర్ధారించడంతో పోలీసులు కేసు మూసేశారు. నమ్రత తండ్రి దీనితో తృప్తి పడక హై కోర్టుకి వెళ్లాడు. కానీ పోలీసుల ఒత్తిడికి లొంగి కేసు విత్‌డ్రా చేసుకున్నాడు. ఆనంద్ రాయ్ తన విచారణ కొనసాగిస్తూండగా ఆమె గురించి యిద్దరు మధ్యవరుల మధ్య జరిగిన సంభాషణ ఆడియో రికార్డింగ్ దొరికింది. సీటు సంపాదించి పెట్టినందుకు ఆమె యివ్వాల్సిన డబ్బు యివ్వలేదని, తర్వాత రాబట్టుకున్నామని వాళ్లు అనుకుంటున్నారు. దీని ఆధారంగా పోలీసుల వద్దకు మళ్లీ వెళితే 'ఆమె జబ్బల్‌పూర్‌కు రైలెక్కుతూ కింద పడిపోయి చచ్చిపోయింది' అని చెప్పేసి కేసు మూసేశారు. అనుమానితులుగా వున్న నలుగురు యువకులు – దేవ్ శిశోదియా, యశ్ దేశ్‌వాలా, విశాల్ వర్మ, అలేక్ – లను వదిలేశారు కూడా. ఈ విశాల్ వర్మ నమ్రత ప్రియుడని, తనకు మెడికల్ కాలేజీ సీటు యిప్పించడమే కాక, గ్వాలియర్ మెడికల్ కాలేజీ నుంచి ఇండోర్ మెడికల్ కాలేజీకి బదిలీ అయ్యేందుకు సహకరించాడని వినికిడి. ఇవన్నీ కూపీ తీయబోయిన జర్నలిస్టు అక్షయ్ సింగ్ కూడా చనిపోయాడు.

ఇంత దారుణాలు జరుగుతున్నా ఆరెస్సెస్ ఖండించకపోవడమేమిటి అనే ప్రశ్న ఉదయిస్తోంది. వ్యాపమ్ స్కామ్ మాట ఎలా వున్నా సమర్థుడైన చౌహాన్‌కు వ్యతిరేకంగా ఏమైనా మాట్లాడితే దాన్ని బిజెపి–ఆరెస్సెస్ ఘర్షణగా చూస్తారనే శంకతో ఆరెస్సెస్ మౌనంగా వుందని కొందరు అంటారు. అబ్బే, అదేం కాదు, ఆరెస్సెస్ మూలాలనుంచి వచ్చిన అనేకులు దీనిలో నిందితులు కాబట్టి.. అని కొందరంటారు. అలా వచ్చినవారిలో ఒకరు సుధీర్ శర్మ. అతను 1990లో ఆరెస్సెస్ కు చెందిన సరస్వతీ శిశు మందిర్‌లో టీచరు. అతని తండ్రి డెయిరీ కార్పోరేషన్‌లో గుమాస్తాగా పనిచేస్తూ సాయంత్రాల్లో పాలు అమ్మేవాడు. ఈ రోజు సుధీర్ మైనింగ్, విద్య, మీడియాకు విస్తరించిన రూ.20 వేల కోట్ల సామ్రాజ్యానికి అధిపతి. ఇదంతా పుష్కరకాలంలో సంపాదించినదే. 2003లో టెక్నాలజీ యూనివర్శిటీలో ఉద్యోగం మానేసి తన స్నేహితుడు, గనుల, ఉన్నత విద్య శాఖల మంత్రి అయిన లక్ష్మీకాంత్ శర్మ వద్ద ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా చేరిన దగ్గర్నుంచి కోట్లకు పడగెత్తాడు. వ్యాపమ్ స్కాముతో బాటు మైనింగ్ స్కాములో కూడా యిరుక్కున్న అతను యిప్పుడు జైల్లో వున్నాడు. అతని రికార్డులు పరిశీలిస్తే అతను తన ఒకప్పటి బాస్‌లకు ఎంతెంత యిచ్చాడో లెక్క తెలుస్తోంది. ఆరెస్సెస్ సీనియర్ లీడర్లు సురేశ్ సోనీ, ప్రభాత్ ఝా, బిజెపి ఎంపీ అనిల్ దవే లకు ప్రయాణ ఖర్చులు, వసతి ఖర్చులు కింద లక్షలు లక్షలు ఖర్చయ్యాయి.

ఇప్పుడు జైల్లో వున్న లక్ష్మీకాంత్ కూడా సోనీ శిష్యుడే. సోనీ, ఆరెస్సెస్ అధినేత దివంగత కెయస్ సుదర్శన్‌లు కొంతమంది అభ్యర్థులను సిఫార్సు చేశారని లక్ష్మీకాంత్ వద్ద ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా పనిచేసిన ఒ.పి.శుక్లా ఎస్‌టిఎఫ్‌కు చెప్పాడు. మిహిర్ కుమార్ అనే అభ్యర్థి తన ఒప్పుదలలో ''నేను సుదర్శన్‌జీ వద్ద స్టీవార్డ్‌గా పనిచేసేవాణ్ని. ఆయన చేత లక్ష్మీకాంత్‌కు ఫోన్ చేయించాను. తర్వాత సుదర్శన్‌గారు నన్ను పరీక్షలో వేటికైతే ఆన్సర్లు కచ్చితంగా తెలుసో అవి మాత్రమే రాయమని, తక్కినవి వదిలేయమని చెప్పారు. నేను అలాగే చేశాను. నేను ఖాళీగా వదిలేసినవి తర్వాత నినిపించారు.'' అన్నాడు. ఇవి పత్రికల్లో రాగానే యిదంతా

రాజకీయ కుట్ర అని సోనీ నాగపూరు నుంచి ఒక ప్రకటన చేశారు. అవును, ఆరెస్సెస్ వాళ్లకు దీనితో సంబంధం లేదు అంటూ చౌహాన్ మరో ప్రకటన చేశారు. మధ్య ప్రదేశ్ పోలీసుల చేత కూడా యిప్పించారు. మిహిర్ కుమార్ బెయిలు కోసం దరఖాస్తు చేసుకున్నపుడు ఎస్‌టిఎఫ్ అభ్యంతర పెట్టలేదు. సోనీని ప్రశ్నించడానికి కూడా పిలవలేదు.

జగదీశ్ దేవ్‌డా రవాణా మంత్రిగా వుండగా అనేకమంది లంచాలిచ్చి ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుళ్లగా ఉద్యోగాలు పొందారని, వారిలో కొందరు ముఖ్యమంత్రి భార్య సాధనకు లంచాలిచ్చారని కాంగ్రెస్ నాయకుడు కెకె మిశ్రా ఒక న్యూస్ కాన్ఫరెన్సులో ఆరోపించాడు. ఆమె మహారాష్ట్రకు చెందిన గోండియా జిల్లాకు చెందినవారు. ఆ అభ్యర్థులు ఆ ప్రాంతానికి చెందినవారట. వారి కోసమే ఏమో కానీ అస్మదీయులను చేర్చుకోవడానికి వ్యాపమ్ అనేక నిబంధనలను నీరు కార్చింది. మధ్యప్రదేశ్ డొమిసిల్ సర్టిఫికెట్టు అక్కరలేదని, పోలీసు వుద్యోగాల్లో కూడా ఎత్తు, బరువు వంటివి పట్టించుకోనక్కరలేదని రూల్సు మార్చేసింది. 2012లో 198 మందిని రిక్రూట్ చేసుకుంటామని నోటిఫికేషన్ యిచ్చినా ఫైనల్‌గా 332 మందిని చేర్చుకుంది. ఆ 17 మంది అభ్యర్థుల పేర్లు యిస్తూ ఆమె సుధీర్ శర్మకు పంపిన ఎస్సెమ్మెస్‌ను శర్మ బయట పెట్టారు. ముఖ్యమంత్రి సిబ్బంది కాల్ రికార్డును కూడా చూపించాడు. ఆ విషయంపై ప్రతిపక్షాలు నిలదీసినపుడు ఎగ్జామినేషన్ కంట్రోలర్ పంకజ్ త్రివేది యిద్దరు ఆరెస్సెస్ సీనియర్ నాయకుల పేర్లు బయట చెప్పాడట. చౌహాన్ మిశ్రాపై పరువునష్టం దావా వేశారు. ఆ కేసులో పోలీసులు 50 మందిని అరెస్టు చేశారు. దేవ్‌డా పర్సనల్ అసిస్టెంటైన రాజేంద్ర గుర్జార్ తనే పోలీసులకు లొంగిపోయాడు. అయినా ఎస్‌టిఎఫ్ మంత్రి జోలికి వెళ్లలేదు, ముఖ్యమంత్రి భార్య జోలికి అసలే వెళ్లలేదు.

వ్యాపమ్‌కు 2006 నుండి 2011 వరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్‌గా పనిచేసిన సుధీర్ సింగ్ భడోరియా కూడా పరారీలో వున్నట్టు ఎస్‌టిఎఫ్ చెప్తోంది. ఆయన కేంద్రమంత్రి నరేంద్ర సింగ్ తోమార్‌కు ఆప్తుడు. అతనే కాదు, వ్యాపమ్ అధికారులుగా పనిచేసిన నలుగురు ఐయేయస్ అధికారులను కూడా ఎస్‌టిఎఫ్ ప్రశ్నించలేదు. పంకజా త్రివేది తను రంజనా చౌధరి అనే ఐయేయస్ అధికారిణికి రూ.42 లక్షలు లంచం యిచ్చానని చెపితే ఎస్‌టిఎఫ్ ఆమెను 48 గంటల పాటు ప్రశ్నించి చివరకు అప్రూవర్‌గా మార్చుకుంది. ఉమా భారతి కూడా అనేకమంది అభ్యర్థుల పేర్లను లక్ష్మీకాంత్‌కు, శుక్లాకు సిఫారసు చేశారట. ఎక్సెల్ షీట్లలో ఆమె పేరు 17 చోట్ల కనబడిందని పేపర్లు రాశాయి. 2013 డిసెంబరులో పేపర్లలో యిది బయటకు వచ్చాక ఉమా భారతి భోపాల్ వచ్చి చౌహాన్‌ను కలిశారు. తర్వాత పోలీసు డిజి నందన్ పాండే ఆవిడ యింటికి వెళ్లి ఏమీ ప్రమాదం లేదని హామీ యిచ్చారట. ఆ తర్వాత ఆమె పేర్లను వాటిలోంచి తీసేశారని, చాలా డేటాను తొలగించారని ఎస్‌టిఎఫ్ కనుగొంది. ఉమా భారతి యిదంతా కుట్ర అనేస్తున్నారు. ఇవన్నీ యిప్పుడు సిబిఐ బయటకు లాగాలి.

దీనిలో చిన్న ఉపకథ ఏమిటంటే – వ్యాపం అంటేనే మిస్టరీ చావుల కథ అయిపోయింది. ఆ కథకు సరైన సెట్టింగు వుండాలంటే దెయ్యం పట్టిన కొంపలోనే విచారణ సాగాలని ఎంపీ ప్రభుత్వం అనుకున్నట్టుంది. 40 మంది సభ్యులున్న సిబిఐ తన ఆఫీసు నడపడానికి భోపాల్‌లో ప్రొఫెసర్ కాలనీలో భూత్ బంగ్లాగా పేరు బడిన ఒక బంగళాను వారికి కేటాయించింది. 1949లో కట్టిన ఆ యింట్లో మొదట్లో ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీరు, నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్‌లో పని చేసిన జడ్జి సుఖంగానే జీవించారు. కానీ పోనుపోను దాని మీద దయ్యాల కొంప ముద్ర పడింది. శివరాజ్ చౌహాన్ కాబినెట్‌లో మంత్రిగా చేసిన లక్ష్మణ్ సింగ్ గౌడ్ 2009 ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అప్పుడు దాన్ని జిల్లా పంచాయితీ శాఖకు కేటాయించారు. అయితే దాని సిఇఓ జ్ఞానేశ్వర్ పాటిల్ ఒక అసహ్యకరమైన ఆరోపణలో యిరుక్కున్నాడు. ఆఫీసు బాత్‌రూమ్‌లో పాటిల్ తనను బలాత్కరించాడని అతని వద్ద పనిచేసే మగ సెక్రటరీ ఆరోపించాడు. దానితో కలకలం చెలరేగి చివరకు ఆ శాఖ ఉద్యోగులు అక్కడ పనిచేయమని మొండికేయడంతో మొత్తం శాఖను వేరే చోటకి మార్చేసి అనురాధా శంకర్ అనే సీనియర్ ఐపియస్ అధికారికి యిచ్చారు. ఆమె కూడా రెండు నెలల తర్వాత కారణాలు ఏమీ చెప్పకుండా యిల్లు మారిపోయింది. ఎవరూ వద్దంటున్నారని ఇంటిలిజెన్సు బ్యూరో స్థానిక ఆఫీసుకి యిచ్చారు. అయితే వాళ్లు 'ఖాళీ స్థలంలో గడ్డి పెరిగింది, బాగు చేయించాలి' అంటూ నెలన్నరగా తాత్సారం చేస్తున్నారు. ఇప్పుడు సిబిఐకు యిచ్చేశారు. వాళ్లు వాస్తు సిద్ధాంతులను పిలుచుకుని వచ్చి చూపించుకుని చేరతారట. సిబిఐకు ఏరికోరి యిలాటి భవంతి యివ్వడమేమిటి? కేసు సరిగ్గా హ్యేండిల్ చేయలేదేమని రేపు కోర్టు వాళ్లు అడిగినపుడు సిబిఐ వారు 'ఫైళ్లు మాయమయ్యాయి, దెయ్యాలు ఎత్తుకుపోయాయి. సాక్షులను పిలిచాం, కానీ వాళ్లు చచ్చి దెయ్యాలైన వారు చుట్టూ తిరగాడుతున్నారనే సాకు చెప్పి నోరు విప్పలేదు.' అని చెప్పుకోవచ్చు. ఇప్పటిదాకా సాక్షులను, నిందితులను లేపేస్తున్న ప్రచ్ఛన్న హస్తం, రేపు సిబిఐ మనుష్యుల్ని చంపేసి, ఆ పాపాన్ని దెయ్యాల మీదకు తోసేయవచ్చు.

ముక్తాయింపుగా – కొందరు జర్నలిస్టులు జైల్లో వున్న లక్ష్మీకాంత్‌ను కలిసినపుడు అతను "ఒక వ్యక్తి తన క్లీన్ యిమేజిని కాపాడుకోవడానికి మా అందర్నీ బలి యిస్తున్నాడని మోదీ గారికి చెప్పండి" అని ప్రాధేయపడ్డాడు. ఆ వ్యక్తి చౌహాన్ అనుకోవచ్చా? సిబిఐ విచారణ సవ్యంగా సాగి, చౌహాన్ దోషిగా తిరుగులేని సాక్ష్యాలతో నిరూపించగలిగితే అది మోదీకి రాజకీయంగా లాభం. గుజరాత్‌లో మూడుసార్లు వరుసగా గెలిచిన ఘనత మోదీదైతే మధ్య ప్రదేశ్‌లో అదే అలాటి ఘనతను సాధించినది చౌహాన్. చౌహాన్ మధ్య ప్రదేశ్‌ను ప్రగతి బాట పట్టించిన ముఖ్యమంత్రి అని అందరూ ఒప్పుకుంటారు. 2004–05, 2011–12 ల మధ్య దేశంలో జిడిపి వృద్ధి 8.4% కాగా స్టేట్ జిడిపిలో వృద్ధి 8.7% ! తలసరి ఆదాయం 2005–06లో రూ.15466 వుండగా 2014–15కు

అది రూ.59770 చేరుతుందని అంచనా. గ్రామీణ పేదరికం 2004-05లో 53.6% వుండగా 2011-12 నాటికి అది 36% అయింది. శిశుమరణాలు 2005-06లో 7% కాగా 2011-12 నాటికి అది 5.6% అయింది. 2007 అక్టోబరులో రాష్ట్రంలో విద్యుదుత్పాదన 9458 మెగా వాట్లు కాగా2013-14లో 19869 అయింది. వ్యవసాయాభివృద్ధి 2011-12లో 19%, 2012-13లో 20%, 2013-14లో 25%. ఇవాళ కాకపోయినా ఎప్పుడో ఒకప్పుడు మోదీకి ప్రత్యామ్నాయంగా ఎదిగే స్కోపు వున్నవాడు. ఈ స్కాముతో  అతని మంచి పేరు తుడిచిపెట్టుకుపోయి హరియాణాలో చౌటాలా లాగ జైలుకి వెళితే బిజెపిలో మోదీ మరింత బలపడతాడు. **- (సమాప్తం) - ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

జులై 38 ఎమ్బీయస్ : సినీ స్నిప్పెట్స్ 07 - సావిత్రి - జెమినీ గణేశన్ దాంపత్యం

సావిత్రి తెలుగువారికి అభిమాన నటీమణి. ఆమె అంత్యదశ చాలా దారుణంగా గడిచిందని అందరికీ తెలుసు. దానికి కారణం ఆమె భర్త జెమినీ గణేశనే అని చాలామంది గాఢంగా నమ్ముతారు. సావిత్రి జీవితచరిత్రలు రాసినవారు కూడా ఆమెను అన్ని విధాలా దోచుకున్న విలన్‌గా అతన్ని  చిత్రీకరిస్తారు. అయితే సావిత్రి పిల్లలు తమ తండ్రిని అలా చూడరు.  వాళ్ల కాపురం అలా కావడానికి కారణం ఎవరు? ఎవరి పొరపాటు ఎంత వుంది? ఇది తెలుసుకోవాలనే ఆసక్తి మనలో చాలామందికి వుంది. సాంసారికమైన విషయాలు పబ్లిగ్గా చర్చించడం సబబు కాదు. కానీ సావిత్రి సెలబ్రిటీ కాబట్టి అది చర్చకు వస్తోంది. వీరిద్దరి విషయాలూ క్షుణ్ణంగా తెలిసినవారు మాత్రమే బాలన్స్‌డ్ వ్యూ యివ్వగలరు. అలాటి ఎనాలిసిస్ ఎక్కడైనా దొరుకుతుందా అని వెతుకుతున్న నాకు పసుపులేటి రామారావుగారు రాసిన "వెండితెర విషాద రాగాలు" పుస్తకంలో కొంత సమాచారం లభించింది. దాని గురించి చెప్పేముందు అందరికీ తెలిసున్న విషయాలు ముందర చెప్పేస్తాను.

సావిత్రి భర్త జెమినీ గణేశన్. సావిత్రి పేదరికం నుంచి, విద్యాగంధం లేని నేపథ్యం నుంచి వస్తే యీయన నేపథ్యం దానికి పూర్తి వ్యతిరేకం. పేరు గణేశన్. ఊరు పుదుక్కోటై. జెమినీలో పనిచేశాడు కాబట్టి జెమినీ గణేశన్ అయ్యాడు. సైన్సు గ్రాడ్యుయేట్.  మద్రాసులో లెక్చరర్‌గా పనిచేశాడు. స్పోర్ట్స్‌మన్. అందగాడు. మంచి నటుడు. అనేక హిట్ సినిమాల్లో హీరోగా, తర్వాతి రోజుల్లో కారెక్టర్ యాక్టర్‌గా నటించాడు. తమిళ, తెలుగు, హిందీ సినిమాల్లో కూడా నటించాడు. జంటిల్‌మన్‌గా పేరు. సహ నటీనటులతో, సాంకేతిక నిపుణులతో ఎవరితో ఎలాటి వివాదాలు లేవు. సరదా మనిషి. మాటకారి. సంగీతప్రియుడు. కర్ణాటక, హిందూస్తానీ సంగీతం బాగా పాడేవాట్ట. తనకు యిష్టమైన  కీర్తన 'ఎన్నగాను రామభజన..' అని సావిత్రి ఒకసారి చెప్పారు. మంచి లక్షణాలు ఎన్ని వున్నా కానీ ఉమనైజర్‌గా. తమిళ రంగంలో అతనికి 'కాదల్ మన్నన్' అని బిరుదు. అంటే 'ప్రేమకు రారాజు' అన్నమాట. నాలుగు పెళ్లిళ్లు చేసుకున్నాడు. జీవిత చరమాంకంలో 79 వ యేట సెక్రటరీని పెళ్లాడితే ఆమె అతన్ని హింసించి వదిలిపెట్టింది. మొదటిభార్య సంప్రదాయబద్ధంగా పెళ్లాడినావిడ బాబ్జీ. ఆమెతో ఐదుగురు కూతుళ్లు. రెండో భార్య (ఈమెను పెళ్లి చేసుకున్నాడో లేదో స్పష్టత లేదు) నటీమణి పుష్పవల్లి. రేఖ తల్లి. మూడో భార్య సావిత్రి.

జెమినీ గణేశన్ 1948 ప్రాంతాల్లో జెమినీ స్టూడియోలో కాస్టింగ్ డిపార్టుమెంటులో పనిచేసేవాడు. సావిత్రి వేషాలకోసం వెతుకుతూ జెమినీ స్టూడియోకి వచ్చింది. 'మూణ్రు పిళ్లయిగళ్' అనే తమిళ సినిమాలో వేషం యిద్దామనుకున్నారు. కానీ వయసు, పొడుగు చాలదని ఫెయిలయింది. ఫైనల్‌గా జానకిని బుక్ చేశారు. జెమినీ స్టూడియోలోనే గణేశ్ సావిత్రిని చూడడం జరిగింది. తర్వాత కొన్నాళ్లకి అతను వేషాలిప్పించే వుద్యోగం మానేసి సినిమాల్లో వేషాలు వేయడం మొదలెట్టాడు. పి.పుల్లయ్య గారు తీసిన 'మనం పోల్ మాంగల్యం' అనే 1952 సినిమాలో ఇద్దరూ కలిసి వేశారు. అక్కడ మనసులు కలిసాయి. మాంగల్యం వైపు ఊహలు పోయాయి. అప్పటికే గణేశ్ వివాహితుడు, పిల్లల తండ్రి. అయినా గుట్టు చప్పుడు కాకుండా గుళ్లో పెళ్లి చేసేసుకున్నారు. అది 1952. 'మిస్సమ్మ' ప్లాను చేసినపుడు తమిళ వెర్షన్‌లో జెమినీగణేశ్ హీరో. హీరోయిన్ భానుమతి. భానుమతిని తీసేసి సావిత్రిని ప్రమోట్ చేయడంతో జెమినీకి పక్కన వేయడానికి, ఎక్కువ సమయం గడపడానికి సావిత్రికి అవకాశం చిక్కింది. మిస్సమ్మలో పాట వుంది చూడండి 'ఏమిటో ఈ మాయా' అని, పాత్రే కాదు, పాత్రధారిణి కూడా ఆ మాయలో పడిపోయింది. మాడరన్ థియేటర్స్ వాళ్లు సేలంలో సినిమా తీస్తూ వీళ్లను తీసుకెళ్లారు. అక్కడ మరింత సన్నిహితం అయ్యారు.

నటీమణులు పెళ్లి చేసుకుంటానన్నపుడు యింట్లో వాళ్లు అభ్యంతర పెడుతూంటారు. సినిమా తారల విషయంలో వాళ్ల డబ్బు ఒక మెయిన్ ఫ్యాక్టర్. కామధేనువు విడిచి వెళ్లిపోతుంటే ఎవరు ఊరుకుంటారు? సావిత్రికీ అదే అనుభవం. అందునా బినామీ ఆస్తులూ అవీ వుంటాయి కదా! అవన్నీ సార్ట్ అవుట్ చేసుకుని ఫైనల్‌గా 1956లో పెళ్లి ఎనౌన్స్ చేసేసి, కలిసి జీవించడం మొదలెట్టారు. జెమినీ పూర్వ భార్యలను వదిలిపెట్టలేదు. వీళ్లిద్దరికీ విజయ చాముండేశ్వరి అనే అమ్మాయి, సతీష్ అనే అబ్బాయి పుట్టారు. కానీ ఈ బంధం జెమినీని కట్టిపడేయ లేకపోయింది. సావిత్రికి దూరమయిపోయాడు. 200 సినిమాలు వేసి బోల్డంత సంపాదించిన సావిత్రి అన్నీ కోల్పోయింది. అప్పట్లోనే మద్రాసులో ఆవిడకు నాలుగిళ్లు. ఊటీలో ఓ బంగళా. హైదరాబాదులో, విజయవాడలో ఆస్తులు. అన్నీ పోయాయి. ఇన్‌కమ్‌టాక్స్ రెయిడ్స్ జరిగి, కొన్ని కోర్టులో ఇరుక్కుపోయాయి. ఈవిడ అద్దె యింట్లో వుండాల్సి వచ్చింది. కష్టకాలానికని డైమండ్ నెక్లెసు, నగలు ఆప్తుల వద్ద దాచుకుంటే, వాళ్లు అది దిగమింగేసి, నువ్వెక్కడిచ్చావ్ అన్నారు. భరించలేని

నిరాశ. జెమినీ అలవాటు చేసిన తాగుడికి క్రమంగా సావిత్రి బానిస అయింది. మత్తు సరిపోకపోతే కాంపోజ్ మాత్రలు కలుపునేది. ఆరోగ్యం నాశనమైంది. చివరి దశలో సినిమాల్లో వేషాలు వేసింది. అంతటి మహానటికి యింతటి దుస్థితి వస్తే భర్త ఏం చేశాడన్న సందేహం వస్తుంది?

ఇప్పుడు పైన ఉదహరించిన పుస్తకంలోని సంగతి రాస్తాను. పసుపులేటి రామారావుగారు, ఆయన కంటె సీనియరైన జివిజి అనే జర్నలిస్టు (సినిమారంగం మాసపత్రికకు యిన్‌చార్జి) మద్రాసులో పని చేసే రోజుల్లో దీనావస్థలో సావిత్రి అణ్నా నగర్ యింటిలో వుండగా వెళ్లారు. జివిజి సావిత్రిపై పుస్తకం రాస్తున్నారు. ఏమైనా మేటరు చెప్తే రాసుకుని పుస్తకం పూర్తి చేస్తా అని జివిజి అంటే 'మీకు తెలిసింది మీ వెర్షన్‌లో రాసుకోండి. నా స్టేటుమెంటుగా ఏమీ యివ్వను. నా గురించి నేను చెప్పి బావుకునేదేమిటి? అంతా అయిపోయాక ఎవరి మీద కసి తీర్చుకోను?" అన్నారు సావిత్రి. ఇంతలో బయట కారు ఆగింది. జెమినీ గణేశన్ లోపలకి వచ్చి వీళ్లను పలకరించి కుర్చీలో కూర్చున్నాడు. సావిత్రి అతన్ని చూసి లేవలేదు. 'షూటింగు లేదా?' అని అడిగాడు జెమినీ. 'షూటింగు వుంటే ఏమిటి, లేకపోతే ఏమిటి? అసలు నేను బ్రతికున్నానా లేదా అనేది కూడా మీకు అవసరం లేదు కదా, అది సరే, యిప్పుడు ఎందుకు వచ్చినట్లు?' అంది సావిత్రి. 'రోజూ రావటం ఎక్కడ కుదుర్తుంది? పనులుంటాయి కదా' – 'అవును, రాత్రింబవళ్లు షూటింగులు చేస్తున్నారు కదూ, అమ్మాయిలతో... నాకు తెలీదనుకుంటున్నారా? వెధవ్వేషాలు..నన్నింకా మోసం చేద్దామనేనా? నేను చచ్చిపోయే స్థితికి వచ్చినా నన్నింకా మోసం చేయాలనుకుంటున్నారా? నేను మీ నుండి దూరంగా వచ్చేసినా యింకా ఎందుకు యిక్కడకు రావడం?' అంటూ సావిత్రి ఎమోషనల్ అయిపోతూ వుంటే జెమినీ ఆమె చేయి పట్టుకుని లోపలికి తీసుకెళ్లాడు.

బయటకు వచ్చాక రామారావు, జివిజిని వారిద్దరి మధ్య బంధం గురించి అడిగితే జివిజి చెప్పినది యిది – "జెమినీ దుర్మార్గుడు చెడ్డవాడు కాదు, అమ్మాయిల బలహీనత. తాగుడు బలహీనత. రెండిటికి అతను దాసుడు. సావిత్రి అంటే యిప్పుడు అతనికి యిష్టం లేదు, అయిష్టమూ లేదు. మెకానికల్ తయారయ్యాడు. ఎప్పుడైనా గాలి మళ్లినపుడు అలా వచ్చి యిలా వెళ్లిపోతూంటాడు. వాళ్లిద్దరూ హృదయపూర్వకంగా ప్రేమించుకున్న మాట నిజమే. పెళ్లికి ముందు సావిత్రికి అప్పట్లో యింటా బయటా సమస్యలు. తనకు సరైన గైడెన్స్ లేకపోవడం, నేనున్నాననే మనిషి లేకపోవడంతో మగదిక్కుకోసం జెమినీని తొందరపెట్టి పెళ్లి చేసేసుకుంది. పెళ్లయిన చాలా రోజుల వరకు సంతోషంగానే వున్నారు. జెమినీ సరదాకి తాగుడు అలవాటు చేస్తే సావిత్రి రోజూ మందు తీసుకుని యింటికొచ్చిన జెమినితో కోపతాపాలకు దిగేది, అరిచేది, దెబ్బలాడేది. దానికి కారణాలు అనేకం. 1970 తర్వాత ఆమెకు హీరోయిన్ వేషాలు తగ్గి సైడ్ కారెక్టర్స్ రావడంతో నిర్మాత, దర్శకురాలిగా మారింది. అది జెమినీకి యిష్టం లేదు. అయినా ఆమె ఖాతరు చేయలేదు. ఆమె తీసిన సినిమాలన్నీ ఫ్లాప్ కావడంతో అప్పులపాలై అవి తీర్చడానికి ఆస్తులు అమ్ముతూండడంతో, యీ అప్పులు తనకు చుట్టుకుంటాయన్న భయంతో యీవిడకు ఎంత దూరంగా వుంటే అంత మంచిదనుకున్నాడు.

"సావిత్రి కంటె ముందే జెమిని హీరోగా ఫేడవుట్ అయ్యాడు. అందువలన అతనికి సావిత్రే స్వయంగా డబ్బు యిచ్చేది. అతను పట్టుకెళ్లేవాడు. ఇప్పుడు సావిత్రి సినీనిర్మాణంలో డబ్బు పోగొట్టుతూండడంతో అతను రావడం తగ్గించాడు. అతను అనేకమంది స్త్రీలతో సంబంధాలు పెట్టుకోవడం వలన అతని పట్ల ద్వేషం పెంచుకుంది. నిజానికి యిద్దరూ బాగున్నపుడు కూడా అతని ప్రవర్తన అలాగే వుండేది. అన్ని విషయాలూ ఎవరో ఒకరు సావిత్రికి చెప్పేవారు. కొన్నాళ్లు సర్దుకుపోయినా, చాలామంది యివే విషయాలు చెప్తూండడంతో ఆమె తట్టుకోలేకపోయేది. అతను యింటి కొచ్చాక గొడవ పెట్టుకునేది. దాంతో రావడం కొద్దికొద్దిగా తగ్గించాడు. తను కష్టాలలో వున్నపుడు ఆదుకోవడానికి, సమస్యలు పరిష్కరించడానికి, కనీసం ఓదార్చడానికి అతను రావడం లేదన్న బాధతో సావిత్రి యింకా కోపం తెచ్చుకునేది. జెమినీ గురించి బాగా తెలిసుండి అతన్ని పెళ్లాడి ఆమె తప్పు చేసింది. ఇలా వివాహితుణ్ని పెళ్లి చేసుకున్నవారెవరూ నాకు తెలిసి సుఖంగా లేరు." అన్నారాయన. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

**జులై 18** **ఎమ్బీయస్ : లలిత్ మోదీ గాథ**

లలిత్ మోదీ గురించి వచ్చి పడుతున్న బోల్డంత సమాచారం చూస్తే గతంలో రాసిన ఒక ఆర్టికల్‌తో సరిపుచ్చడం న్యాయం కాదనిపించి, యిది రాస్తున్నాను. అతనికి సామర్థ్యమూ వుంది, తెగింపూ వుంది, అక్రమాలు చేయడానికి జంకని లక్షణమూ వుంది. రాజకీయ నాయకులతో అతను నెరపిన స్నేహబాంధవ్యాలు, అతని దూరదృష్టి, దుస్సాహసాలు, వ్యక్తిగత జీవితం అన్నీ రసవత్తరమే.

లలిత్ మోదీది పారిశ్రామిక వేత్తల కుటుంబం. అతని తాత రాయ్ బహదూర్ గుజర్ మల్ మోదీ, మోదీ నగర్ పేర ఒక పారిశ్రామిక నగరమే నిర్మించారు. తండ్రి కృష్ణకుమార్ మోదీకి (కెకె మోదీ అంటారు) గాడ్‌ఫ్రే ఫిలిప్స్ కంపెనీ వుంది. ఇది రెడ్ అండ్ వైట్ సిగరెట్లు ఉత్పత్తి చేస్తుంది. భారతదేశంలోని పొగాకు కంపెనీల్లో ద్వితీయ స్థానంలో వుంది. కెకె యిద్దరు కొడుకుల్లో లలిత్ పెద్దవాడు. నైనిటాల్‌లోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో చదివేటప్పుడు తరచు క్లాసులు ఎగ్గొట్టేవాడట. చివరకు చెప్పా పెట్టకుండా సినిమాకు చెక్కేసినందుకు కాలేజీ నుంచి సస్పెండ్ చేశారు. అప్పుడు 1983లో అంటే అతనికి 20 ఏళ్లుండగా అమెరికాకు పంపారు. న్యూ యార్క్‌లోని పేస్ యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రెండేళ్లు చదివి ఉత్తర కరోలినాలోని డ్యూక్ యూనివర్శిటీలో బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్ కోర్సులో చేరాడు. ఏ కోర్సూ పూర్తి చేయలేదు కానీ కొకైన్ కొనబోతూ గొడవల్లో యిరుక్కున్నాడు. దానికి ప్రేరేపించిన

కుర్రాణ్ని కొట్టి కిడ్నాప్ చేయడం పోలీసుల దృష్టికి వెళ్లింది. కోర్టులో కేసయింది. నేరాలు ఒప్పుకోవడంతో 1985 ఫిబ్రవరిలో రెండేళ్ల జైలు శిక్ష పడింది. తండ్రి రాజీవ్ గాంధీ ద్వారా పైరవీ చేశాడు. ఆయనకి ఆత్మీయులైన అమెరికన్ వ్యాపారులు మధ్యవర్తిత్వం చేశారు. అంతా కలిసి లలిత్‌కు అనారోగ్యమని, స్వదేశానికి పంపేయాలని కోర్టును అడిగారు. ఇండియాలో 200 గంటల సమాజసేవ చేయాలన్న షరతుపై కోర్టు అతన్ని వదిలింది. మళ్లీ అమెరికాలో అడుగు పెట్టకూడదనే షరతు కూడా పెట్టారట. ఇక్కడ అతను చేసిన సమాజసేవ ఏమిటో తెలియలేదు.

1986లో ఢిల్లీకి తిరిగి వచ్చి ఫ్యామిలీ బిజినెస్‌లో పాలు పంచుకున్నాడు. ఇంటర్నేషనల్ టుబాకో కంపెనీనికి 1987 నుంచి 1991 వరకు ప్రెసిడెంటుగా వున్నాడు. గాడ్‌ఫ్రే ఫిలిప్స్‌లో కూడా నాన్-ఎగ్జిక్యూటివ్, నాన్-ఇండిపెండెంట్ డైరక్టరుగా నియమించారు. అంటే పెద్దగా అధికారాలు ఏమీ వుండవన్నమాట. అతని తల్లి బీనాకు మినాల్ అనే స్నేహితురాలు వుండేది. వ్యాపారరీత్యా నైజీరియాలో స్థిరపడిన పెస్సు అశ్వానీ అనే సింధీ పెద్దమనిషి కూతురు ఆమె సౌదీ అరేబియాలో స్థిర పడిన జాక్ సగ్రానీ అనే ప్రొఫెషనల్‌ను పెళ్లాడి కరిమా అనే ఒక ఆడపిల్లను కంది. అయితే గల్ఫ్‌లో జరిగిన ఒక స్కాములో జాక్ యిరుక్కోవడంతో యిద్దరూ విడిపోయారు. ఆమె ఢిల్లీ వచ్చేసింది. లలిత్ తల్లిని కలవడానికి వచ్చేది. తన కంటె తొమ్మిదేళ్లు పెద్దదైన మినాల్ అంటే లలిత్ యిష్టపడ్డాడు. ఇద్దరూ కలిసి తిరిగారు. 1991 అక్టోబరులో ఆమెను పెళ్లి చేసుకుంటామని చెప్పినపుడు తలిదండ్రులకు యిష్టం లేకపోయినా సరే ననాల్సి వచ్చింది. అతనికి ఒక హోదా కల్పించాలని గాడ్‌ఫ్రే ఫిలిప్స్‌లో 1992లో ఎగ్జిక్యూటివ్ డైరక్టరు చేశారు. వీళ్ల పెళ్లిని ఢిల్లీ సోషల్ సర్కిల్స్ ఆమోదించకపోవడంతో బొంబాయికి మారిపోయారు. వాళ్లకు రుచిర్ అనే కొడుకు, ఆలియా అనే కూతురు కలిగారు.

బొంబాయి వచ్చాక లలిత్ వినోద రంగానికి చెందిన వ్యాపారంలోకి దిగాడు. ఫ్యామిలీ ట్రస్టుకి సంబంధించిన డబ్బు పెట్టుబడిగా పెట్టి మోదీ ఎంటర్‌టైన్‌మెంట్ అని పెట్టి బాంద్రాలో ఖరీదైన ఆఫీసు తెరిచాడు. వాల్ట్ డిస్నీ వాళ్లతో పదేళ్ల కాంట్రాక్టు రాసుకుని 1992లో అలాదీన్ సీరియల్‌ను హిందీ డబ్బింగ్‌తో ఇండియన్ టీవీకి పరిచయం చేశాడు. ఇఎస్‌పిఎన్ టీవీ ఛానెల్‌తో పదేళ్లకు దాదాపు వెయ్యి మిలియన్ల డాలర్లకు కాంట్రాక్టు పెట్టుకుని అది ప్రసారం చేసే కేబుల్ టీవీ ఆపరేటర్ల వద్ద డబ్బు వసూలు చేసి యివ్వడం అతని పని. కానీ అతను వచ్చిన ఆదాయాన్ని తక్కువ చేసి చూపిస్తున్నాడని ఇఎస్‌పిఎన్‌కు అనుమానం వచ్చి కాంట్రాక్టు రెన్యూ చేయలేదు. ఫ్యాషన్ టీవీతో చేసుకున్న ఒప్పందం కూడా బెడిసి కొట్టింది. 2002లో కేరళలో "సిక్సో" అనే పేర ఆన్‌లైన్ లాటరీ నడిపాడు. స్పోర్ట్స్ పే ఛానెల్ పెట్టబోయాడు. ఇవన్నీ కొత్తరకమైన వెంచర్లే కానీ అతనికి లాభాలు తెచ్చిపెట్టలేదు.

అమెరికాలో వుండగా స్పోర్టస్ లీగ్ వాళ్లు డబ్బు గడించే విధానం చూసి ముగ్ధుడైన లలిత్ మన దేశంలో క్రికెట్ అంటే మోజు వుంది కాబట్టి, దానికి టీవీకి ముడిపెడితే బాగుంటుందని తోచి ఒక ఐడియా వేశాడు. అతను, యాడ్ గురు అనదగిన పీయూష్ పాండే కలిసి 1993లో ఇండియన్ క్రికెట్ బోర్డుకు ఒక ప్రతిపాదన చేశారు. పేరున్న క్రికెట్ ఆటగాళ్లకు భారీ పారితోషికాలు యిచ్చి వారితో లీగ్ ఏర్పరచి 50 ఓవర్లతో ఒక రోజు ఆట ఆడించాలి. డబ్బు ఎక్కణ్నుంచి వస్తుంది అంటే దాని ప్రసారపు హక్కులను టీవీలకు అమ్మితే సరి అన్నాడు. కానీ అతనికున్నంత ముందు చూపు లోపించిన బోర్డుకి నమ్మకం చిక్కలేదు. టీవీలు అంత డబ్బెందుకు యిస్తాయి? అన్నారు. క్రికెట్ బోర్డుల్లోకి చొరబడితే తప్ప తన మాట వినరని అతనికి అనిపించింది. 1999లో హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్‌కు ఎన్నికయ్యాడు. కానీ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దీన్ని ఆమోదించకపోవడం వలన వైదొలగవలసి వచ్చింది. 2004లో పంజాబ్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంటు ఐయస్ భింద్రా అతన్ని ఆ అసోసియేషన్‌కు వైస్ ప్రెసిడెంటు చేశాడు. ఆ అనుభవంతో రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ (ఆర్‌సిఏ)పై కన్నేశాడు. అప్పటికి ఏడాది క్రితమే 2003లో వసుంధరా రాజె రాజస్థాన్ ముఖ్యమంత్రి అయింది.

వసుంధరా రాజే స్కూలు ఫ్రెండ్ బీనా కీలాచంద్ ద్వారా అతను ఆవిడ స్నేహం సంపాదించాడు. లలిత్ భార్య, వసుంధర సమవయస్కులు. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. 1990లో లలిత్‌ను వెంటబెట్టుకుని వసుంధర చంద్రశేఖర్ ప్రభుత్వంలోని ఒక మంత్రి వద్దకు తీసుకెళ్లి గ్వాలియర్ వద్ద ఒక ఫ్యాక్టరీ పెట్టడానికి అనుమతి యిప్పించడానికి ప్రయత్నించింది. అప్పటివరకు 30 ఏళ్లగా కాంగ్రెసు సమర్థకులైన రుంగ్టా కుటుంబం ఆర్‌సిని ఏలుతోంది. ఎలాగైనా వాళ్లను తప్పించాలని చూసిన వసుంధరకు లలిత్ ఉపయోగపడ్డాడు. అతని గెలుపు కోసం ఆమె రూల్సు మార్చేసింది. అప్పటి దాకా 33 జిల్లాలతో బాటు 66 మంది అసోసియేట్ సభ్యులకు (వీళ్లంతా రుంగటా మనుషులే) అధ్యక్షుణ్ని ఎన్నుకునే హక్కు వుండేది. కొత్తగా స్పోర్ట్స్ చట్టం అని పెట్టి ఆ 66 మంది సభ్యులకు ఓటింగు హక్కు తీసేస్తూ స్పోర్టస్ చట్టం పాస్ చేయించాడు. ముఖ్యమంత్రి అధికారం, లలిత్ చతురత తోడై ఆర్‌సిఏ లలిత్ వశం అయింది. అతి కష్టం మీద జిల్లాలలో మెజారిటీ సంపాదించి ఒక్క ఓటు తేడాతో కిశోర్ రుంగ్టాను ఓడించి అధ్యక్షుడయ్యాడు. అది 2005. అప్పణ్నుంచి అతను రాజస్థాన్‌కు క్రీడారంగంలో గ్లామర్ తెచ్చి పెట్టాడు. ఆర్‌సిఏ ఆఫీసును జయపూర్‌లోని రాంబాగ్ పేలస్ హోటల్ నుండి నడపసాగాడు. ఒక ప్రయివేటు జెట్‌లో తిరిగేవాడు. జయపూర్‌లోని సవాయి మాన్‌సింగ్ స్టేడియంపై కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టించి, దాన్ని దేశంలోనే ఉత్తమమైన స్టేడియంలలో ఒకటిగా తీర్చిదిద్దాడు. తన నిర్వహణా సామర్థ్యంతో 7 కోట్లతో క్రికెట్ ఎకాడమీ ఏర్పరచాడు. అది రంజీ ట్రోఫీ కూడా గెలిచింది. ఆటలు నిర్వహించి యాడ్స్ ద్వారా, ఉచిత ప్యాసులు రద్దు చేసి టిక్కెట్లు హెచ్చు ధరలకు అమ్మడం ద్వారా ఆదాయం తెచ్చిపెట్టాడు.

దీనితో బాటు అతను వసుంధర తరఫున రాజకీయ దళారిగా పని చేస్తూ ఆమెతో తన సాన్నిహిత్యాన్ని చాటుకునేవాడు. తన

సెల్‌లో ఆమె 'వసూ ఆంటీ' పేర పెట్టుకున్న పర్శనల్ నెంబరు చూపించేవాడు. అందరూ అతన్ని సూపర్ చీఫ్ మినిస్టర్ అనేవారు. ఉన్నత ప్రభుత్వోద్యోగులు అతని హోటల్‌కి వచ్చి ఫైళ్లు క్లియర్ చేయించుకునేవారు. ఈ పరిచయాన్ని రియల్ ఎస్టేటు వ్యాపారం కూడా చేయడానికి ఉపయోగించుకున్నాడు. బొంబాయి నుంచి పెద్ద పెద్ద బిల్డర్లను తెచ్చి రాజస్థాన్‌లో స్థలాలు కట్టబెట్టించేవాడు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర ఉపయోగానికి మార్చడానికి రాజే చేత రూల్సును సులభతరం చేయించాడు. దీనివలన బొంబాయి బిల్డర్లు విపరీతంగా లాభపడ్డారు. వాళ్లు ఆకాశ హర్మ్యాలు కడతామంటూ రేట్లు పెంచేసి, స్థానికంగా వున్న రియల్టర్ల పొట్ట కొట్టారు. దీనితో బాటు లిక్కర్ పాలసీ మార్పించి, మద్యం షాపులను పెంచేట్లు చేశాడు. రాజస్థాన్‌లోని పెద్ద పెద్ద రాజమహళ్లను సొంతం చేసుకునేట్లా చట్టాలు మార్పించాడు. లలిత్ భార్య డైరక్టరుగా వున్న అమేర్ హెరిటేజ్ సిటీ కనస్ట్రక్షన్స్ లి.కు అమేర్ కోట పక్కన వున్న రెండు హవేలీలను ఆర్కియాలజీ శాఖ నియమాలకు వ్యతిరేకంగా ఎలాట్ చేయించుకున్నాడు. దానిపై ఒక మహంత్ కోర్టుకి వెళ్లాడు. వేయేల, వసుంధర అవినీతికి సింగిల్ విండో లలిత్ అంటారు పరిశీలకులు. అతను క్రికెట్ స్టేడియంను సొంత ఆస్తిగా భావించి అనేకమంది పెద్దలను అవమానించాడు. ఇష్టం లేనివాళ్లు టిక్కెట్లు కొనుక్కుని వచ్చినా చింపి పారేసి, బయటకు పంపేసేవాడు. ఓ సారి ఒక కానిస్టేబుల్‌ను ఉత్తిపుణ్యాన చెంప మీద కొట్టాడు. ఇవన్నీ రాజెకు యిబ్బంది తెచ్చిపెట్టాయి. 2008 అసెంబ్లీ ఎన్నికలలో యిది వసుంధరకు వ్యతిరేకాంశంగా మారి ఆమె ఓటమికి ఒక కారణమైంది. 2009 లో ఆర్‌సిఏ ఎన్నికలలో అతని వర్గం ఓడిపోయింది.

వసుంధరతో కుటుంబస్నేహమే కాక వ్యాపారబంధం కూడా ఏర్పరచుకున్నాడు. వసుంధర పెళ్లయిన ఏడాదికే భర్త హేమంత్ సింగ్ నుంచి విడాకులు తీసుకుంది. వారికి పుట్టిన కుమారుడు దుష్యంత్ సింగ్. అతని వ్యాపారంలో లలిత్ పెట్టిన పెట్టుబడుల గురించి యిప్పుడు వసుంధర సంజాయిషీ చెప్పుకోవలసి వస్తోంది. 2005లో దుష్యంత్ అతని భార్య కలిసి తలా రూ.50 వేలు పెట్టి నియంత్ హెరిటేజ్ హోటల్స్ లి. పెట్టి షేరు విలువ రూ.10లతో తలా 5 వేల షేర్లు తీసుకున్నారు. 2008 ఏప్రిల్‌లో లలిత్ మోదీ ఆనందా హెరిటేజ్ హోటల్స్ ఆ కంపెనీలోని 395 షేర్లను రూ.3.80 కోట్లకు కొంది. అంటే 10 రూ.ల షేరుకు రూ.96 వేల ప్రీమియం అన్నమాట. అదే కాకుండా ఆ కంపెనీకి గ్యారంటీ లేకుండా రూ.3.80 కోట్ల ఋణం యిచ్చాడు. 2009 సెప్టెంబరులో మరో 420 షేర్లను 7.80 కోట్లు పెట్టి కొన్నాడు. అంటే షేరు విలువ రూ. 1.85 లక్షలన్నమాట! ఈ కంపెనీ వసుంధరకు ఉత్తి పుణ్యాన 3280 షేర్లు యిచ్చింది. కంపెనీలో పెట్టుబడులు పెట్టడానికి లలిత్‌కు 2007 మార్చిలో మారిషస్ కంపెనీ ద్వారా రూ. 21 కోట్లు వచ్చిపడ్డాయి. ఈ వలయం చూసి వసుంధర-లలిత్‌ల అక్రమార్జనే యీ కంపెనీగా రూపెత్తిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ యీ కేసులో యింకా ఎఫ్‌ఐఆర్ దాఖలు చేయలేదు.

వసుంధర 2013 ఎన్నికల అఫిడవిట్ ప్రకారం నియత్ హెరిటేజ్ హోటల్ లి. కంపెనీలో రాజెకు 3280 షేర్లు, దుష్యంత్‌కు 3225, కోడలికి 3225 లలిత్‌కు చెందిన ఆనంద హెరిటేజ్ హోటల్స్ లి.కు 815 షేర్లు వున్నారు. రాజస్థాన్ ప్రభుత్వానికి చెందిన ధోల్‌పూర్ రాజసౌధాన్ని లలిత్-దుష్యంత్‌ల కంపెనీకి అప్పగించారని జయరాం రమేశ్ ఆరోపించారు. 1954-2010 నాటి పత్రాలు అవి రాష్ట్రప్రభుత్వం ఆస్తి అని చూపుతున్నాయట. హేమంత్ సింగ్ కూడా ఆ మేరకు కోర్టులో అంగీకరించారుట. దీన్ని ఖండిస్తూ బిజెపి ప్రతినిధి 2007లో భరత్‌పూర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ధోల్‌పూర్ ప్యాలెస్‌ను దుష్యంత్‌కు దఖలు పరిచిందని, ఆ మేరకు హేమంత్ సింగ్‌కు డిక్రీ యిచ్చిందని అన్నారు. అది రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కలేదు. దాన్ని ఆసరాగా తీసుకుని జైరాం రమేశ్ యిలాటి దబాయింపుకి దిగారట. ఏది ఏమైనా నియత్ కంపెనీ రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టి దాన్ని లగ్జరీ హోటల్‌గా మార్చింది. ఇది 2009లో రాజస్థాన్‌లో కాంగ్రెసు ప్రభుత్వం వున్నపుడు జరిగింది.

రాజస్థాన్ క్రికెట్ క్లబ్బుకు బిసిసిఐలో సభ్యత్వం వుంది కాబట్టి లలిత్ ఆ దారిలో బిసిసిఐలో చేరాడు. 2005లో అతను బిసిసిఐకు వైస్ ప్రెసిడెంట్ అయ్యాడు. 2006 ఎన్నికలలో జగ్‌మోహన్ దాల్మియాను ప్యానెల్‌ను ఓడించడానికి శరద్ పవార్‌కు సాయపడ్డాడు. బిసిసిఐకు సెక్రటరీగా వుండి తర్వాత అధ్యక్షుడిగా అయిన శ్రీనివాసన్ దురుసుతనాన్ని యిష్టపడని వారందరూ లలిత్‌ను ప్రోత్సహించారు. బిసిసిఐ ఆదాయం పెంచడానికి కొత్త ఐడియాలు చెప్పే అతని చాకచక్యం చూసి బిసిసిఐ వాణిజ్యపరమైన డీల్సన్నీ యితన్నే డీల్ చేయమన్నారు. ఆ ఏడాది దాని ఆదాయం బిలియన్ డాలర్లు వచ్చేట్లు చేశాడు. తన 1993 ఐడియాకు ట్వంటీట్వంటీ వెర్షన్ తయారుచేసి ఐపియల్ ఐడియా చెపితే బిసిసిఐ వాళ్లు జరగదు పొమ్మన్నారు. కానీ రకరకాల హంగులు, సినీగ్లామర్ కలిపి అతను ఐపియల్ సృష్టించి హిట్ చేశాడు. 2008లో మొదటి ఐపియల్ జరిగింది. 8 ఫ్రాంచైజీలు 720 మిలియన్ డాలర్లు సంపాదించాయి. 2008లో వసుంధర ముఖ్యమంత్రిగా వుండగా రాజస్థాన్ చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్‌కు ఐపియల్ తరఫున రూ.6 కోట్లు విరాళం యిచ్చాడు. రెండవ ఐపియల్ 2009లో జరపాలి. ఎన్నికల సందర్భంగా ఏర్పాట్లు చేయలేమని అప్పటి హోం మంత్రి చిదంబరం అంటే ఐపియల్‌ను అతి తక్కువ వ్యవధిలో సౌత్ ఆఫ్రికాకు తీసుకెళ్లిపోయి నిర్వహించి దాన్ని 4 బిలియన్ డాలర్ల స్థాయికి తెచ్చి విజయవంతం చేశాడు. ప్రపంచవ్యాప్తంగా ఐపియల్‌కు పేరు వచ్చింది. ఐపియల్ ద్వారా చేసిన అక్రమాలే మెడకు చుట్టుకున్నాయి. బంధుప్రీతి విషయానికి వస్తే - ఐపియల్ ద్వారా తోడల్లుడు సురేశ్ చెల్లారామ్‌కు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజ్‌లో మెజారిటీ వాటా కల్పించాడు. సవతి కూతురు మొగుడు గౌరవ్ బర్మన్‌కు వాటాలున్న గ్లోబల్ క్రికెట్ వెంచర్స్‌కు ఐపియల్ యొక్క డిజిటల్, మొబైల్, యింటర్నెట్ హక్కులు కట్టబెట్టాడు. గౌరవ్ సోదరుడు మోహిత్ కింగ్స్ పంజాబ్ ఎలెవెన్‌లో భాగస్వామి. కలకత్తా నైట్ రైడర్స్ భాగస్వాముల్లో ఒకడైన జయ్ మెహతా లలిత్ బాల్యస్నేహితుడు. పంజాబ్ ఎలెవెన్, కలకత్తా నైట్ రైడర్స్‌కు లలిత్ లోపాయికారీగా

రేట్ల గురించి సమాచారం అందించి తక్కువ ధరలకే వాళ్లకు హక్కులు లభించేట్లు చేశాడని అనుమానం.

బిసిసిఐను అప్రతిహతంగా ఏలుతున్న శ్రీనివాసన్‌కు, లలిత్‌కు పేచీ వచ్చింది. బిసిసిఐ ఎన్నడూ చూడనంత ఆదాయం సమకూరుస్తున్నానన్న అహంకారంతో లలిత్ అందరినీ అవమానించడంతో, ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్‌తో కూడా పొగరుగా వుండడంతో బిసిసిఐ కమిటీ సభ్యులకు ఒళ్లు మండింది. అతని దోషాల కోసం వెతికారు. ఐపియల్ బిసిసిఐకు అనుబంధంగానే పనిచేస్తున్నా, దాన్ని అడక్కుండా లలిత్ ఐపియల్ రూల్సు మార్చివేయసాగాడు. 100 మిలియన్ డాలర్ల గ్యారంటీ యివ్వగలిగిన వారే టెండర్లు వేయాలని రూలు పెట్టి, యితరులందరినీ తరిమివేసి అదానీ గ్రూపుకు, వీడియోకాన్ గ్రూపుకు టెండర్లు దక్కాక ఆ రూలు మార్చేసి 10 మిలియన్ డాలర్ల గ్యారంటీ యిస్తే చాలన్నాడు. కేరళలోని కోచి టస్కర్స్ ఫ్రాంచైజ్‌ను ఐపియల్‌లో చేర్చడానికి శశి థరూర్ ప్రయత్నించాడు. తనకు అందులో పెట్టుబడులు లేవని లలిత్‌కు చెప్పాడు. 2010 ఏప్రిల్‌లో బిసిసిఐ-కోచి ఫ్రాంచైజ్ ఒప్పందం జరిగాక స్వెట్ యీక్విటీ హోల్డర్ ఎవరిదని లలిత్ అడిగితే వాళ్లు నసిగారు. అప్పుడు థరూర్ ఫోన్ చేసి దాని గురించి మరీ గట్టిగా అడగవద్దని కోరాడు. దాంతో లలిత్‌కు అనుమానం వచ్చి విచారిస్తే శశికి అప్పటి ప్రియురాలైన సునంద పుష్కరే హోల్డర్ అని తెలిసింది. దాన్ని ట్వీట్ చేసి లోకానికి చెప్పేశాడు. అంటే ఫ్రాంచైజ్ భాగస్వాములు తమకు ఒప్పందం కుదిర్చిపెట్టినందుకు శశికి చెల్లించుకున్న ముడుపును అలా సునందకు వాటాలుగా చూపించారన్నమాట. ఇది బయటకు రావడంతో శశి రాజీనామా చేయవలసి వచ్చింది. కోచీ ఫ్రాంచైజ్ వారు లలిత్‌కు వ్యతిరేకంగా బిసిసిఐకు ఫిర్యాదు చేశారు.

అతనికి ముకుతాడు ఎలా వేయాలా అని చూస్తున్న బిసిసిఐకు యిది అక్కరకు వచ్చింది. 22 అభియోగాలు చేసి అతన్ని సస్పెండ్ చేశారు. 2010లో మూడో ఐపియల్ ఏప్రిల్ 24 న ముగిసింది. ఏప్రిల్ 21, 22 న ఇడి-ఇన్‌కమ్ టాక్స్ వాళ్లు ప్రశ్నించడం మొదలుపెట్టారు. మే 12 న దేశం విడిచి పారిపోయాడు. ఎంత పిలిచినా రాలేదు. 10 నెలల తర్వాత 2011 మార్చి 3 న అతని పాస్‌పోర్టును రద్దు చేశారు. 2013 మేలో చిదంబరం మోదీని తిప్పి పంపమని బ్రిటిషు ఛాన్సలర్‌కు రాసినా వాళ్లు పట్టించుకోలేదు. 2013 సెప్టెంబరులో బిజెపికి చెందిన అరుణ్ జైట్లే, కాంగ్రెసు నాయకుడు జ్యోతిరాదిత్య సింధియా నేత ృత్వంలోని బిసిసిఐ క్రమశిక్షణా సంఘం 8 కేసుల్లో మోదీని తప్పుపట్టింది.

ఇడి లలిత్‌పై నాలుగు కేసులు మోపింది. 1) 2009లో ఐపియల్‌ను సౌత్ ఆఫ్రికాలో నిర్వహించినపుడు రూ.1350 కోట్లు విదేశాలకు బదిలీ చేసినపుడు రిజర్వ్ బ్యాంకు అనుమతి తీసుకోలేదు. అక్కడ టిక్కెట్ల అమ్మకం ద్వారా సంపాదించిన ఫారిన్ ఎక్స్‌ఛేంజిని ఏడాది లోపుగా వెనక్కి దేశంలోకి తేలేదు. అనుమతి తీసుకోమని లలిత్‌కు చెప్పామని బిసిసిఐ అంటోంది. అతను అదేమి పట్టించుకోకుండా సౌత్ ఆఫ్రికా క్రికెట్ అసోసియేషన్‌కు బదిలీ చేశాడు. 2) ఐపియల్ టెలికాస్ట్ హక్కులను సోనీ అనుబంధ సంస్థ అయిన మల్టీ స్క్రీన్ మీడియాకు యిచ్చి వున్నారు. కానీ ఐపియల్ కమిషనర్ హోదాలో లలిత్ ఆ ఒప్పందాన్ని ఏకపక్షంగా రద్దు చేసి 2009 మార్చి 15 న మారిషస్‌కు చెందిన వరల్డ్ స్పోర్ట్స్ గ్రూపుకు యిచ్చేశాడు. కానీ ఆ గ్రూపు సబ్ కాంట్రాక్టులను తెచ్చుకోలేక పోయింది. రూ.335 కోట్ల బ్యాంకు గ్యారంటీ కూడా యివ్వలేకపోయింది. అప్పుడు లలిత్ సోనీతో మాట్లాడి, వారం రోజుల్లో వాళ్లిద్దరి మధ్య ఒప్పందం కుదిర్చాడు. సోనీయే టెలికాస్ట్ చేస్తుంది కానీ స్పోర్ట్స్ గ్రూపుకు రూ.425 కోట్లు 'ఫెసిలిటేషన్ ఫీ'గా యిస్తానంది. ఇదంతా గోల్‌మాల్ వ్యవహారంలా తోచింది ఇడికి. 3) 2008 ఐపియల్ గేమ్స్‌లో ఆటగాళ్లకై సమకూర్చవలసిన గ్యారంటీగా రూ.160 కోట్ల చెల్లింపుకై రిజర్వ్ బ్యాంకు అనుమతులు తీసుకోకపోవడం. 4) విదేశాలలో టెండరింగ్, సెక్యూరిటీ, మీడియా కాంపెయిన్‌కై విదేశీ కన్సల్టెంట్లకు యిచ్చిన రూ.88.5 కోట్ల చెల్లింపు విషయాల్లో రిజర్వ్ బ్యాంకు అనుమతులు తీసుకోకపోవడం. మొత్తం రూ.1975 కోట్లకు సంబంధించిన కేసులు. ఇడి 2013-2015 మధ్య 15 షోకాజ్ నోటీసులు పంపింది. లలిత్ ఒక్కదానికీ సమాధానం యివ్వలేదు. ఇది కాకుండా రూ.1206 కోట్ల మనీ లాండరింగ్ చేశాడని శ్రీనివాసన్ అతనిపై ఫిర్యాదు చేశాడు.

లండన్ పారిపోయిన లలిత్ అక్కడ ఐదంతస్తుల, 7000 చ.అ., 8 బెడ్‌రూముల భవంతిలో వుంటున్నాడు. 2010-14 మధ్య మోదీ తన భార్య పిల్లలతో బ్రిటన్‌లోనే వుండిపోయాడు. క్రికెట్ మ్యాచ్‌లో చూడడం మానేశాడు కానీ యితర ఆటలు చూడడానికి వెళ్లేవాడు. 2013 అసెంబ్లీ ఎన్నికల నాటికి లలిత్ వసుంధరకు వ్యతిరేకంగా ట్వీట్లు రాయసాగాడు. వసుంధర, అరుణ్ జైట్లే, జైట్లే అనుచరుడు, మోదీకి, ఆరెస్సెస్‌కు మధ్య వారధిగా పని చేసే భూపేంద్ర యాదవ్‌లో టిక్కెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించాడు. 2013 డిసెంబరులో రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. లలిత్ లండన్ నుంచే పోటీ చేశాడు. కిశోర్ రుంగ్‌టా, బిసిసిఐ సుప్రీం కోర్టుకి వెళ్లడంతో ఫలితాలు 6 సార్లు వాయిదా పడ్డాయి. చివరకు 2014 మే 6 న లలిత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. బిసిసిఐ ఆర్‌సిఏను బహిష్కరించి ఒక తాత్కాలిక కమిటీని నియమించింది. లలిత్ కోర్టుకి వెళ్లి మళ్లీ అధ్యక్షుడయ్యాడు. 2015 మార్చిలో అమీన్ పఠాన్ అతనిపై అవిశ్వాస తీర్మానం పెట్టి 16 ఓట్ల తేడాతో నెగ్గాడు. మోదీ సమర్థకుల్లో 12 మందిని ఆలస్యంగా వచ్చారంటూ యీ సమావేశానికి రానీయలేదు. (దారిలో వాళ్ల వాహనాలు ఆపేసి, వాళ్లను చావగొట్టారు) ఓట్లేసిన వారిలో అతనికి అనుకూలంగా పడిన 5 ఓట్లు పరిగణించలేదు. ఈ వ్యవహారంలో వసుంధర తనకు సాయం చేయలేదని లలిత్ ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఆమె తనకు సహాయం చేసిందంటూ ట్వీట్లు పెట్టి యిరకాటంలో పెట్టాడు.

బ్రిటన్‌లో పెద్దవాళ్లందరితో స్నేహం నెరపిన లలిత్, తను అక్కడ వుండడానికి 2014 మార్చిలో అనుమతులు తెచ్చుకున్నాడు. లలిత్ తన భార్య కాన్సర్ చికిత్స కోసం పోర్చుగల్‌కు వెళతాననడం మనకు వింతగా తోస్తుంది. అత్యాధునికమైన వైద్యం అంటే

అమెరికాయో, బ్రిటనో అనాలి కానీ పోర్చుగల్ ఏమిటి? ఇందులో ఏమైనా మతలబు వుందానిపిస్తుంది. కానీ ప్రపంచం మొత్తంలో కాన్సర్ చికిత్సలో కటింగ్-ఎడ్జ్ టెక్నాలజీగా చెప్పబడే ట్రాన్సలేషనల్ మెడిసిన్ లభ్యమయ్యే ఐదు సెంటర్లలో పోర్చుగల్‌లోని చంపాలిమాడ్ కాన్సర్ సెంటర్ ఒకటి. కాన్సర్ చికిత్సలో స్పెషలైజ్ చేసిన వేరియన్ మెడికల్ సిస్టమ్స్ అభివృద్ధి పరచిన ఎడ్జ్ రేడియో సర్జరీ ఉపయోగించి శరీరం బయట నుంచే ట్యూమర్లను తీసివేయగలుగుతున్నారు. మామూలు రేడియో సర్జరీకి 30-40 సెషన్స్ కావాలంటే దీనికి కేవలం 10-15 నిఎంలు చాలు. ఊపిరితిత్తులు, కాలేజయం, ప్రొస్టేట్, మెదడు కాన్సర్‌లకు అది అద్భుతంగా పనిచేస్తోంది. చికిత్స తర్వాత 15 నిఎంల తర్వాత పేషంటు తన పనులు మామూలుగా చేసుకోవచ్చు. మినాల్ కాన్సర్‌తో 17 ఏళ్లగా బాధపడుతోంది. ఛాతీకి సోకిన కాన్సర్ యిప్పుడు కాలేయానికి కూడా పాకింది. ఇప్పుడీ చికిత్స జరిగిన మూడు రోజుల తర్వాత ఆమె హాయిగా ఎప్పటిలాగా పార్టీలో పాల్గొనగలుగుతోంది.

లలిత్ జూన్ నుంచి భారతీయ సంతతికి చెందిన లేబర్ పార్టీ ఎంపీ కీత్ వాజ్ ద్వారా ట్రావెల్ పేపర్ల కోసం ప్రయత్నాలు చేశాడు. జులై 21 న ప్రిన్స్ ఆండ్రూస్‌ను తన యింటికి పిలిచాడు. ఆగస్టు 4 న లలిత్ భార్యకు కాన్సర్ ఆపరేషన్ కాబట్టి జులై 31 న కీత్ మళ్లీ గట్టి ప్రయత్నం చేసి బ్రిటిష్ హెూం ఆఫీసుకి రాసి, ఆగస్టు 1 కల్లా లలిత్‌కు పేపర్లు వచ్చేట్లు చేశాడు. తన ట్రావెల్ డాక్యుమెంట్లు రాగానే ఆగస్టు 3 న పోర్చుగల్ వెళ్లాడు. మూడు తర్వాత నుంచి ప్రపంచ పర్యటన మొదలుపెట్టాడు. 10 నెలల్లో 32 దేశాలు చుట్టబెట్టాడు. అంటే ప్రతీ పది రోజులకు ఒక దేశం అన్నమాట. అక్కడకు వెళ్లి చేసినది టాప్ మోడల్స్‌తో షికారులు, భారతీయ పారిశ్రామికవేత్తల యిళ్లల్లో పెళ్లిళ్లకు వెళ్లడాలు. లలిత్‌మోదీ డాట్‌కామ్ ద్వారా ఆ ఫోటోలు అవి ప్రచారంలో పెట్టి తన ఘనతను చాటుకుంటున్నాడు. ఇంగ్లండులో వుండగానే ఇంకో కేసులో యిరుక్కున్నాడు. ప్రపంచంలోని 28 చోట్ల లగ్జరీ హెూటళ్లు నడిపే అమన్ రిసార్ట్స్ యాజమాన్యం విషయంలో రష్యన్ బిలియనీరుకు, అమెరికన్ బిజినెస్‌మన్‌కు, స్వీడిష్ పారిశ్రామికవేత్తకు గొడవ జరిగి యుకె హై కోర్టులో కేసు నడుస్తోంది. నిందితుల్లో లలిత్ కూడా వున్నాడు. ఇప్పుడు అతను ఐపియల్ తరహాలో చైనాలో, థాయ్‌లాండ్‌లో, క్యూబాలో ఫుట్‌బాల్ లీగ్ పెడదామని ప్రయత్నిస్తున్నాడు. ఆ యా దేశాల్లో పెద్ద తలకాయలతోనే వ్యూహాలు రచిస్తున్నాడు.

లలిత్ విషయంలో సుష్మా, వసుంధరలు యిబ్బందుల్లో ఎలా పడ్డారో చూస్తున్నాం. భార్య ఆపరేషన్ సమయంలో పక్కన వుండడానికి మానవతా దృక్పథంతో యిప్పించాను అని సుష్మ అన్నారు. అతను భార్య ఆపరేషన్ జరిగిన తర్వాత 31 దేశాలు చుట్టబెట్టాడు. వెళ్లిన చోటల్లా ఫోటోలు తీసుకుని ట్విట్టర్‌లో పెట్టాడు – భారత ప్రభుత్వం నన్ను ఏమీ చేయలేకపోయింది చూడండి అని వెక్కిరించినట్లు! దాన్ని ఏ దృక్పథంతో చూడాలి? అతనలా చేస్తాడని సుష్మ వూహించలేదు కదా అనవచ్చు. అప్పుడు తన అభ్యర్థనను క్వాలిఫై చేయాలి. లలిత్ ధోరణి తెలిసిన మనిషిగా అతన్ని ఒక వారం మాత్రమే ప్రయాణం చేయాలనో, పోర్చుగల్‌కు మాత్రమే వెళ్ల నివ్వాలనో అడిగి వుండాల్సింది. ఏం చేసినా ప్రభుత్వశాఖలా ద్వారా చేసి వుండాల్సింది కానీ వ్యక్తిగత హెూదాలో చేసి వుండకూడదు. ఆమె శాఖలో కార్యదర్శిగా చేసిన సుజాతా సింగ్ సుష్మ యీ విషయమై తన కేమీ చెప్పలేదని స్పష్టం చేసింది.

వసుంధరకు ఆర్థిక బంధాలు వేరే సంగతి, దానిలో తప్పులుంటే కేసులు పెట్టవచ్చు కానీ లలిత్‌కు సాయం చేసినది ప్రతిపక్ష నాయకురాలి హెూదాలో మాత్రమే, సుష్మ అధికార హెూదాలో వుండి చేశారు. అందుచేత ఆమెది పెద్ద తప్పిదం. సుష్మ పైరవీ చేసేనాటికి అతని పాస్‌పోర్టు యింకా పునరుద్ధరింప బడలేదు. 2014కు ఆగస్టు 1కి ట్రావెల్ డాక్యుమెంట్లు వస్తే ఆగస్టు 27న పాస్‌పోర్టు పునరుద్ధరించారు. దాన్ని పై కోర్టులో ఛాలెంజ్ చేయవలసిన బాధ్యత విదేశాంగ శాఖదే అని అరుణ్ జైట్లే అంటున్నారు. దానిపై చిదంబరం ఆర్‌టిఐ కింద ప్రశ్నలడిగితే విదేశాంగ శాఖ సమాధానం యివ్వడానికి నిరాకరించిందట. లలిత్ మోదీని వెనక్కి పంపేయమని బ్రిటిషు ప్రభుత్వానికి ఇడి (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్) విదేశాంగ శాఖ ద్వారా కోరాలి. అలాటి అభ్యర్థన ఇడి నుండి తమకు రాలేదంటోంది విదేశాంగ శాఖ! అందుకే ఏమీ చేయటం లేదట.

'భారత ప్రభుత్వానికి, ముఖ్యంగా విదేశాంగ శాఖకు తెలియకుండా సుష్మ ఒక ఆర్థిక నేరగాడికి సహాయపడింది. గతంలో ఢిల్లీలో రాజకీయ నాయకుడిగా అడావుడి చేసిన రమేశ్ శర్మకు యిలాగే తోడ్పడింది. అతను నేరగాడని తెలిసింది. ప్రస్తుతం తీహార్ జైల్లో వున్నాడు. గాలి సోదరుల సంగతి ఎలాగూ తెలుసు. సుష్మ, ఆమె భర్త బ్యాక్‌గ్రౌండ్ పరికిస్తే సుష్మ తండ్రి ఆయుర్వేద వైద్యుడు. భర్త తండ్రి పంజాబ్ యూనివర్శిటీలో చిరుద్యోగి. సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన సుష్మ, ఆమె భర్త విద్యార్థి దశలో సోషలిస్టులుగా పనిచేశారు. న్యాయవాద వృత్తిలో కపిల్ సిబ్బల్, అరుణ్ జైట్లేలలా రాణించలేదు. ఆర్థికంగా పైకి ఎదగాలని తహతహ లాడిన వారికి లలిత్ ఆశాకిరణంగా కనబడ్డాడు. అందుకే యిలా చేశారు.' అని కాలమిస్టులు తప్పు పడుతున్నారు.

లలిత్‌పై బిజెపి అభిప్రాయం ఏమిటో అధికారికంగా తేలాలి. అధికార ప్రతినిధి జివిఎల్ నరసింహారావు అతన్ని బాధితుడుగా పేర్కొంటున్నారు. హెూం సెక్రటరీగా పనిచేసి బిహార్ ఎంపిగా మారిన ఆర్‌కె సింగ్ అతన్ని "భగోడా" (పరారైనవాడు) అంటున్నారు. జూన్ 14 న సుష్మ చేసిన సహాయాన్ని బయట పెట్టిన పత్రిక ఆమె వెర్షన్ తెలుసుకుందామని వారం రోజుల ముందే ప్రశ్నావళి పంపిందట. తను చేసిన పని బయటకు వస్తోందని గ్రహించిన సుష్మ బిజెపిలో సీనియర్ లీడరును ఒకరిని కలిసి రిజైన్ చేయనా అని అడిగిందట. తొందరపడి ఏమీ చేయవద్దు అని ఆయన సలహా యిచ్చాడట. నల్ల డబ్బుపై అంత హంగామా చేస్తున్న మోదీ ప్రభుత్వం మనీ లాండరింగ్‌లో యిరుక్కున్న యితనిపై బ్లూ కార్నర్ నోటీసును రెడ్ కార్నర్ నోటీసుగా ఎందుకు మార్చలేదు? అసలు యుపిఏ ఏం చేసిందో తరచి చూడాలి. ఇంటర్‌పోల్ చీఫ్‌గా పని చేసినతను బ్లూ కార్నర్ నోటీసు కూడా యివ్వలేదంటున్నాడు. అరుణ్ జైట్లీ

రెవెన్యూ యింటెలిజెన్సు డైరక్టరేట్ "లైట్ బ్లూ కార్నర్ నోటీసు" యిచ్చిందంటున్నాడు. నిజానిజాలు నిదానంగానైనా బయటపడతాయని ఆశిద్దాం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

జులై 12 ఎమ్బీయస్ : సినీ స్నిప్పెట్స్ 08– పింగళి ఆఖరి రోజులు

పింగళి నాగేంద్రరావు గారిది బందరు. "రారాజు", "వింధ్యరాణి" అనే నాటకాలు రాసి చాలా పాప్యులర్ అయ్యారు. "తారుమారు" (1942) అనే సినిమాకు పింగళి మాటలు, పాటలు రాశారు. "వింధ్యరాణి" (1948)కి కూడా రాస్తే అది ఫెయిలయింది. అపజయంతో యింటికి తిరిగి వెళ్లాలని సంశయిస్తూ వుంటే బందరు వారే అయిన కమలాకర కామేశ్వరరావు ఆయన్ని కెవి రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. కెవికి ఎప్పుడూ ఎక్స్‌క్లూజివ్ రైటరు కావాలి. "భక్త పోతన" "యోగి వేమన"లకు సముద్రాలే రైటరు. తర్వాత ఆయనకు మంచి పారితోషికాలతో బయట నుంచి ఆఫర్లు వస్తూ వుంటే "ఫ్రీ లాన్సర్‌గా ఏ సినిమాల కయినా రాసుకో" అని పంపించి వేశారు. తను తీయబోయే జానపద చిత్రానికి తన కోసమే పనిచేసే రైటర్ ఎవరైనా వున్నారా అని వెతుకుతూంటే పింగళి పరిచయమ్యారు. ఆయనతో "గుణసుందరి కథ" రాయించుకున్నారు. అది హిట్. ఆ తర్వాత "పాతాళభైరవి". అదీ హిట్. ఇక కెవికి ఆయన పర్మనెంటు రైటరు అయిపోయారు. ఆయన సొంత సినిమాలు "శ్రీక ృష్ణార్జున యుద్ధం", "పెళ్లినాటి ప్రమాణాలు", "భాగ్యచక్రం"కు కూడా ఆయనే రాశారు.

ఇన్ని సినిమాలకు రాసినా బిఎన్ రెడ్డికి పింగళి నచ్చలేదు. ఆయన "మల్లీశ్వరి" సినిమాకు రైటరు గురించి చూస్తూ వుంటే కెవి "నా "గుణసుందరి కథ"కు పింగళి బాగా రాశారు కదా, ఆయన చేత రాయించుకో బ్రదర్" అన్నారు. "ఆయనది ఎరుకల యానాది భాష! 'గిడిగిడి', 'మామగోరు' లాటివి (గుణసుందరి కథలో శివరావు డైలాగులు) నాకు నచ్చవు" అన్నారు. అలాగే కెవి "పెద్దమనుషులు"కు రైటరు గురించి చూస్తూ వుంటే బియన్ "మా క ృష్ణశాస్త్రి చేత రాయించుకుని, రాజేశ్వరరావును మ్యూజిక్ డైరక్టరుగా పెట్టుకో" అన్నారు. "నాకీ మహావులు, జీనియస్సులు వద్దు బ్రదర్ అన్నారు" కెవి. ఆయన భయానికి తగ్గట్టే విశ్వనాథ సత్యనారాయణ గారితో ఆయన సిటింగ్స్ బెడిసి కొట్టాయి.

గౌరీనాథ శాస్త్రి అనే గొప్ప నటుడు వుండేవారు. వాహినీవారి "భక్త పోతన"లో శ్రీనాథుడు, "పెద్దమనుషులు" సినిమాలో మెయిన్ విలన్ వేషాలు ఆయనే వేశారు. "పెద్దమనుషులు" తీసేనాటికే ఆయన "గీతాంజలి" అనే సినిమా తీసి ఆస్తి అంతా పోగొట్టుకున్నాడు. ఫ్లాపయిన తన సినిమాకు మార్పులు ఏవైనా చేసి మళ్లీ షూట్ చేసి విడుదల చేయాలని అనుకుని డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళితే "మీరు కెవి రెడ్డి గారి సినిమాలో పని చేస్తున్నారు కదా, ఆ మార్పులేవో ఆయన చేసి మళ్లీ షూటింగు చేస్తే మేం పెట్టుబడి పెడతాం" అన్నారు. ఇక ఆయన కెవి రెడ్డిని మొహమాట పెట్టసాగాడు. కెవికి తన సినిమాతో సతమతమవుతూ కూడా శాస్త్రిగారి వేధింపు భరించలేక పగలు షూటింగయ్యాక, రాత్రి భోజనానంతరం యింట్లో "గీతాంజలి" సినిమా మార్పులు, చేర్పులపై చర్చ మొదలుపెట్టారు. శాస్త్రిగారు తన స్నేహితులు విశ్వనాథ సత్యనారాయణగారిని తీసుకుని వచ్చారు. లింగమూర్తి అనే సాహిత్యవాసనలున్న నటుడు కెవికి సన్నిహితుడు. ఆయన్నీ కూర్చోబెట్టారు. హీరో హీరోయిన్ల మధ్య ఒక శ ృంగార ఘట్టం. డైలాగులు రాసి రేపు తెస్తాను అన్నారు విశ్వనాథ. తెచ్చాక చదవనారంభించారు – "మాధవీ! నేను చచ్చిన వెనుక నా ఆత్మ నీ చుట్టునే తిరుగుచుండును" అని హీరో అంటాడు. కెవి నిర్ఘాంతపోయారు. శుభమా అని శ ృంగారం రాయమంటే యీయన తొలి వాక్యమే చావుతో మొదలు పెడతాడేమిటని. ఆయన గొప్ప రచయిత కానీ సినిమాలకు పనికి రాడు అని లోపల అనుకున్నా ఆ ముక్క ఆయనకు చెప్పడం ఎలా? ఇలా కొన్ని రాత్రులు చర్చలతో గడిచాక విశ్వనాథ వారే పరిస్థితి గ్రహించి "నా వల్ల కాదయ్యా! మీ ఏడుపు ఏదో మీరే ఏడవండి" అని వెళ్లిపోయారు.

"ఉమా చండీ గౌరీ శంకరుల కథ" ఫెయిల్ కావడంతో నాగిరెడ్డి, చక్రపాణి కెవి యూనిట్‌ను (పింగళితో సహా) మూసేసి నెలజీతాలు ఆపేశారు. 1950 నుంచి 17, 18 సంవత్సరాలు నికరాదాయంతో స్థిమితంగా కాలం గడిపిన పింగళికి జీవితంలో అభద్రత తోచింది. తన యింటిని ఘంటసాలగారికి చాలా చౌకగా అమ్మేసి మేడమీద పోర్షన్‌లో అద్దెకుండేవారు. కింద పోర్షన్‌ను ఘంటసాల వేరేవారికి అద్దెకిచ్చారు. 1970 ప్రాంతంలో ఆయనకు గొంతు కాన్సర్ వచ్చింది. ఎన్టీయార్ తనకు తెలిసిన డాక్టరుకు ఫోన్ చేసి వెల్లూరు హాస్పటల్‌కు పంపారు. పింగళి ఎన్టీయార్ సొంత సంస్థకై "శ్రీక ృష్ణ సత్య", "చాణక్య చంద్రగుప్త" స్క్రిప్టులు రాసి యిచ్చేశారు. వెల్లూరులో కాస్త తగ్గి, మద్రాసు వచ్చాక మళ్లీ హెచ్చి, చివరకు ఇంట్లోనే వుంటూ కోబాల్ట్ చికిత్స తీసుకునేవారు. ఓ రోజు డివి నరసరాజుగారు ఆయన యింటికి వెళితే "నాకు కోబాల్టు చికిత్స నెలరోజుల్లో అయిపోతుంది. అయ్యాక మా స్వస్థలం బందరు వెళ్లిపోతాను. ఇంట్లో వున్న వస్తువులన్నీ అమ్మేస్తున్నాను. వెండి సామాను, సినిమా శతదినోత్సవాలకు యిచ్చిన వెండి కప్పులు అమ్మేశాను. ఇక లైబ్రరీ వుంది. అమ్మి పెట్టమని ఆరుద్రకు చెపితే అనంతపురంలో ఎవరో వున్నారన్నారు కానీ యిప్పట్లో జరిగేట్టు లేదు. మీకైతే ఆ లైబ్రరీ వుపయోగపడుతుంది. తీసుకుంటారా?" అన్నారు. నరసరాజు "లైబ్రరీ అమ్మవద్దు. డబ్బు కావాలంటే చెప్పండి యిస్తాను" అన్నారు. "ఎంతో అక్కరలేదు, వెయ్యి రూపాయలుంటే చాలు" అన్నారు పింగళి. మర్నాడు డబ్బు యిచ్చినపుడు పింగళి గట్టిగా కావలించుకుని "మీకు క ృతజ్ఞత ఎలా చెప్పాలో తెలియటం లేదు. నా దగ్గరున్న డబ్బును బందరు దగ్గర దూరపు బంధువులకు అప్పు యిచ్చాను. ఇవిగో ప్రామిసరీ నోట్లు. కానీ వాళ్లు ధాన్యం అమ్మితేగానీ యివ్వలేమంటున్నారు." అని కన్నీళ్లు

పెట్టుకున్నారు. నరసరాజుగారు వారించినా తను పోయిన తర్వాత కొన్ని పుస్తకాలు తన జ్ఞాపకార్థం అంటూ ఆయనకు పంపించే ఏర్పాటు చేశారు పింగళి.

ఆయన బ్రహ్మచారి. తల్లితో వుండేవారు. వంటమనిషి వంట చేసి పెట్టేది. తల్లి పోయాక వంటమనిషి కొడుకు రామమూర్తిని యింట్లో పెట్టుకుని వయొలిన్ నేర్పించారు. అతని కూతురికి కాలేజీ చదువు చెప్పించారు. వాళ్లు కూడా సొంత బంధువుల్లాగానే యీయన్ని చూసుకున్నారు. తనకు రావలసిన డబ్బు గురించి ఎన్టీయార్ వద్దకు, సాయం చేస్తారేమో కనుక్కోమని నాగిరెడ్డి గారి వద్దకు రామమూర్తిని పంపిస్తే ఇంటర్‌వ్యూలే దక్కలేదుట. ఇది జరిగిన కొన్ని రోజులకు పింగళి పోతే ఆ యింటర్‌వ్యూల విషయం నరసరాజు ఆరా తీశారు. ఎన్టీయార్ సినిమాల విషయంలో రెమ్యూనరేషన్ సంగతి ఎలా మాట్లాడుకున్నారో కానీ రామారావుగారు అనుకున్న పైకం మొత్తం యిచ్చేశాననే ఉద్దేశంలో వున్నారు. పింగళి తనకు యింకా రావాలనే అభిప్రాయంలో వున్నారు. ఇక నాగిరెడ్డిగారితో నరసరాజుగారు పింగళి ఆఖరి రోజుల పరిస్థితి చెపితే ఆయన బాధపడుతూ ''నా కెవ్వరూ చెప్పలేదండి. ఆయన మన కంపెనీకి 15 ఏళ్లకు పైగా పనిచేశారు. మంచి సినిమాలకు రాశారు. ఆయన పరిస్థితి తెలిస్తే నేను వూరికే వుండేవాణ్నా? ఎంతమందికి సహాయం చెయ్యలేదు?'' అన్నారట. ఇదంతా ''అదృష్టవంతుని ఆత్మకథ''లో రాసిన డివి నరసరాజుగారు దీనికి ముక్తాయింపుగా ''ఈ పెద్దపెద్దవాళ్లతో యింటర్‌వ్యూల విషయంలో సామాన్యంగా జరిగేదేమిటంటే – వాళ్లకి పర్సనల్ సెక్రటరీలనో, లేక గేటులో బంట్రోతులనో వుంటారు. యజమానికి, వచ్చిన మనిషికి గల సంబంధం వాళ్లకి తెలియక 'ఇంట్లో లేరు' అనో 'బిజీగా వున్నారు, యిప్పుడు వీలుపడదు' అనో చెప్పి పంపించి వేస్తారు. పింగళి విషయంలో అలాటిదేదో జరిగి వుంటుంది' అని రాశారు. **(సశేషం) ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

## జులై 19 వీక్లీకై ఎమ్బీయస్ : ప్రచార ఆర్భాట ఫలం – పుష్కర విషాదం

మన రాష్ట్రాలలో గోదావరి పుష్కరాలలో నాకు తెలిసి పిల్లలు తప్పిపోవడాలే తప్ప చావులెప్పుడూ సంభవించలేదు. 2004 కృష్ణా పుష్కరాలలో పోయిన వారు కూడా పుష్కర సమయానికి ముందే, సిబ్బంది రాకుండానే ముందుగానే స్నానం చేయాలన్న అత్యుత్సాహంతో మారుమూల ఘాట్‌లకు వెళ్లి అసువులు బాసిన వారే. అంతకంటె ఆరు రెట్ల మంది యిప్పుడు, కమ్యూనికేషన్ వ్యవస్థ ఎంతో విస్తరించిన యీ రోజుల్లో, పుష్కరాలు ప్రారంభమై బందోబస్తు అంతా వుండగా, సిబ్బంది కళ్లెదురుగా చనిపోయారంటే ఎంత ఘోరం! దీనికి కారణం అధికారుల నిర్లక్ష్యం, యంత్రాంగ వైఫల్యం అని రొటీన్‌గా చెప్పేసి వూరుకోవడం సరి కాదు. దీని నుంచి గుణపాఠాలు నేర్చుకుని వచ్చే ఏడాది కృష్ణా పుష్కరాలైనా సరిగా నిర్వహించుకోవాలి. ముందుగా నేర్చుకోవలసినది ప్రచారం అదుపు తప్పకూడదని. బంగారు పళ్లెరానికైనా గోడ చేర్పు కావాలి అన్నట్టు మంచి పనికి కూడా పబ్లిసిటీ అనేది కావాలి. కానీ యిప్పుడు అసలుది వదిలేసి, పబ్లిసిటీ మీదే యావత్తు ధ్యాస పెడుతున్నారు. సరుకు తక్కువ, అరుపు ఎక్కువ అన్నట్టు అయింది. పుష్కరాల పబ్లిసిటీ గురించి ముందుగా ఆలోచిద్దాం.

2003లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నపుడు గోదావరి పుష్కరాలు వచ్చాయి. అసలు అప్పట్లో ఆయన పబ్లిసిటీ మీదే బోల్డు ఖర్చు పెట్టేవారు. జన్మభూమి, యింకుడు గుంతలు, నీరు-మీరు, రైతు బజారు.. కాదు ఏ స్కీమూ పబ్లిసిటీకి అనర్హం అన్నట్టు ప్రతీ దానికీ ఊరంతా హోర్డింగులు, వాటిపై యీయన ఫోటోలు. ప్రాజెక్టు మీద పెట్టిన ఖర్చు కంటె ప్రచారానికి పెట్టినది ఎక్కువ వుండేది. పుష్కరాలను కూడా వదిలిపెట్టలేదు. పుష్కరాలను కూడా యీ విధంగా మార్కెటింగ్ చేసుకోవచ్చని అప్పుడే అందరికీ తట్టింది. అప్పటిదాకా అది ఒక మతపరమైన కార్యక్రమం. వచ్చినవాళ్లను అదుపు చేయడానికి ప్రభుత్వోద్యోగులు శ్రమించవలసిన యీవెంట్. గోదావరి పుష్కరాలు అనగానే రాజమండ్రి పరిసర ప్రాంతాలకే వెళతారు కాబట్టి ఆ వూరికి కొందరు వ్యాపారస్తులు వచ్చి కుస్తీ పోటీ వంటి యీవెంట్స్ పెట్టడం, విమానం తెచ్చి తిప్పడం, ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు జరపడం చేసి డబ్బులు గడించేవారు. గోదావరిలో మునగడం కాస్సేపే కాబట్టి యాత్రికులు తక్కిన సమయంలో వినోదం కోసం యిలాటివాటిని ఆదరించేవారు. వీటిలో ప్రభుత్వానికి పాత్ర ఏమీ వుండేది కాదు. ఎంతమంది వచ్చారు, ఎంతమంది వెళ్లారు, ఎక్కువమంది వస్తే మంచిది అనే ధ్యాస ప్రభుత్వానికి ఎందుకు? తిరుపతి దేవుడి దగ్గరకు వెళ్లండి, మంచి జరుగుతుంది అని ప్రభుత్వం ఎప్పుడైనా ప్రోత్సహిస్తుందా? అది మతప్రచారం కాదా? తమంతట తాము అక్కడకు వెళ్లిన వారికి సౌకర్యాలు సమకూరుస్తుందంతే. పుష్కరాల సమయంలో బస్సులు, రైళ్లు ఏర్పాటు చేయడం తప్ప, అంతకు ముందు ప్రభుత్వాలు పుష్కర స్నానం చేయండి అంటూ ఊదర గొట్టలేదు. కానీ 2003లో బాబు ప్రభుత్వం అదే చేసింది.

రాజమండ్రి ఒక్క చోటే కాకుండా తెలంగాణలో కూడా పుష్కరతీర్థాలను డెవలప్ చేసి, అక్కడకు కూడా వెళ్లండి అని ప్రభుత్వ ఖర్చుతో పబ్లిసిటీ యిచ్చింది. ప్రభుత్వం పూనుకుని ప్రచారం చేస్తే జనం స్పందించకుండా వుంటారా? పుష్కర స్నానం చేయకపోతే మహాపాపంట అనుకుంటూ బస్సులు వేసుకుని బయలు దేరారు. ఇంత మంది జనం వస్తున్నారు ఏర్పాట్లు చేయాలి అంటూ రోడ్లు, వంతెనలు, ఘాట్‌ల నిర్మాణం అంటూ టెండర్లు, కాంట్రాక్టులు, అస్మదీయులకు పనులు. వీటిలో పావు వంతైనా నదిని రక్షించడానికి, చెఱువులు కబ్జా కాకుండా, జలవనరులను పరాధీనం కాకుండా కాపాడడానికి, మురికి కాకుండా సీవేజ్ ప్లాంట్లు పెట్టడానికి

వినియోగిస్తే బాగుండేది. కనీసం రాజమండ్రి మునిసిపాలిటీ, పేపరుమిల్లు మురికినీరు గోదావరిలో వదలకుండా నిరోధించినా బాగుండేది. అవేమీ జరగలేదు. నది కలుషితం అవుతూనే వుంది. ఈ పబ్లిసిటీ వలన ప్రభుత్వానికి ఖర్చు బాగానే అయి వుంటుంది. దానివలన గోదావరీతీరాల్లో యిన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుపడిందా అన్నది సందేహమే. ఎందుకంటే సమయం దగ్గర పడుతోంది, పనులు త్వరగా ముగించాలి అనే తొందరలో క్వాలిటీ గురించి పట్టించుకోకుండా రోడ్లు అవీ వేస్తారు. పుష్కరాలైన ఆర్నెల్లకు చూస్తే వాటిలో ఎన్ని వుంటాయో, ఎన్ని పోతాయో.

2015 వచ్చేసరికి బాబుకి ప్రచారప్రీతి మరింత పెరిగింది. అప్పట్లో హైదరాబాదుకి విదేశీ కంపెనీలను రప్పించి అంతర్జాతీయ ఖ్యాతి గడిస్తానని చెప్పేవారు. ఇప్పుడు రాజధాని నిర్మాణాన్ని విదేశీ కంపెనీలకు అప్పగించి అంతర్జాతీయ స్థాయి నగరాన్ని అమరావతిలో కడతానని చెప్పుకుంటున్నారు. విభజన తర్వాత నిరాశలో మునిగిపోయిన ఆంధ్ర ప్రజల ఆత్మస్థయిర్యాన్ని హుదూద్ చావుదెబ్బ కొట్టింది. బంగరు భవిష్యత్తు ముందుంది అనే ఆశల వూయలలో వాళ్లను ఊపి, జోకొట్టడం పాలకులకు ఒక అవసరం అయిపోయింది. రేవంత్ వ్యవహారం తర్వాత మసకబారిన ప్రతిష్ఠను మళ్లీ తెచ్చుకుని, సమర్థపాలకుడిగా అనిపించుకోవడానికి గోదావరి పుష్కరాలు ఒక అవకాశాన్ని అందించాయి. అవి పెద్ద స్థాయిలో జరగాలంటే జనాలు బాగా రావాలి. విభజన తర్వాత ఎంతమంది తెలుగువాళు ్ల వస్తారో అన్న సందేహం వచ్చింది. 2003లో అయితే హైదరాబాదులో చాలామంది తెలంగాణలో కొత్తగా ప్రాచుర్యంలోకి వచ్చిన ధర్మపురి, కాళేశ్వరం తీర్థాలకు వెళ్లినా, తృప్తిపడక రాజమండ్రికి కూడా వెళ్లారు. ఎందుకంటే గోదావరి పుష్కరాలు అనగానే అఖండ గౌతమి వున్న రాజమండ్రియే గుర్తుకు వస్తుంది కాబట్టి. ఇప్పుడు విభజన తర్వాత 'తన' ఫీలింగు వచ్చాక ఆ గోదావరి యిక్కణ్నుంచి వెళ్లిందే కదా, ఇక్కడ స్నానం చేస్తే చాలదా అనే భావంతో తెలంగాణ నుంచి వచ్చే జనాభా తగ్గిపోవచ్చనే భయంతో కాబోలు ప్రచార ఉధృతి మరింత పెంచారు. ప్రమాదం జరిగిన తర్వాత సాగిన చర్చల్లో రాజమండ్రి తప్ప యితర చోట్ల జనాలు లేరనీ, రాజమండ్రిలో కూడా పుష్కర ఘాట్‌లో తప్ప యితర ఘాట్లన్నీ ఖాళీగానే వున్నాయనీ చెప్పారు. ఆ పాటి జనానికి యింత ప్రచారం, యింత ఖర్చు అవసరమా? భారీగా ఖర్చు పెట్టదలచుకున్నారు కాబట్టి దాన్ని జస్టిఫై చేసుకోవడానికి జనాలను రప్పించాలి. రప్పించాలంటే దండోరా గట్టిగా వేయాలి.

దానిలో భాగంగా యిది మహాపుష్కరం అనే ప్రచారం మొదలుపెట్టారు. 144 ఏళ్లకు ఒకసారి వస్తుందట. ఈ లెక్క ఎవరు వేశారు? ఎప్పణ్నుంచి 144 ఏళ్ల వరుస ప్రారంభమైంది? పుష్కరాలు ప్రారంభమైన దగ్గర్నుంచా? నది పుట్టిన దగ్గర్నుంచా? సృష్ట్యాది నుంచా? కలిప్రవేశం నుంచా? దేనికైనా కచ్చితమైన లెక్కలున్నాయా? కలియుగం ప్రారంభమై 5 వేల చిల్లర సంవత్సరాలైందని దాన్ని 144 చేత భాగిస్తే శేషం వస్తోందని అందువలన 2015ను మహాపుష్కరం (దాని అర్థం ఏమిటైనా) అనకూడదని ఒక పండితుడు చెప్పారు. 144 ఏళ్ల క్రితం మహాపుష్కరం జరిపారో లేదో మనకు తెలియదు. మన దగ్గర దేనికీ రికార్డు వుండదు కాబట్టి అవుననీ, కాదనీ ఎవరూ నిరూపించలేరు. వచ్చే ఏడాది కృష్ణా పుష్కరాలు కూడా మహాపుష్కరాలా? లేక కృష్ణ, గోదావరి కంటె వయసులో చిన్నదా? ఈ ప్రచారకర్తలే చెప్పాలి. 144 ఏళ్లకు ఒకసారి వస్తోంది కాబట్టి యీ సారి మునిగితీరాలని, లేకపోతే మన పాపాలన్నీ అలాగే వుండిపోతాయనీ ప్రచారం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యిస్తున్న టివి యాడ్స్‌లో 'జన్మకు ఒకసారి వచ్చే అవకాశం - యీ పుష్కరస్నానం' అంటూ వస్తోంది. అంటే ఏమిటి? మన ఆయుర్దాయం పన్నెండేళ్లేనా? లేకపోతే 2027 లోపున ప్రళయం వస్తుందా? వచ్చే ఏడాది మరో నదీపుష్కరం ఎలాగూ వుంది. గోదావరే పుణ్యనది అని కృష్ణ కాదనీ వీళ్లు చెప్పగలరా? చూస్తూండండి, వచ్చే ఏడాది యిదే పబ్లిసిటీ మెటీరియల్‌ను గోదావరి తీసేసి కృష్ణ అని పెట్టి వాడుకుంటారు.

వీటిల్లో గోదావరి హారతి ఒకటి. ఒక ట్రస్టువారు ప్రతీ పౌర్ణమికి గోదావరి యిచ్చే ఆచారం మొదలుపెట్టారు. ఏదో అదో వేడుక. పౌర్ణమి నాడు గోదావరి తీరానికి వెళితే కన్నుల పండుగగా వుంటుంది అనుకోవచ్చు. ఇప్పుడు బాబుగారి ప్రభుత్వం దాన్ని హైజాక్ చేసి నిత్యహారతి చేసేశారు. ట్రస్టు వారు ఎండోమెంట్స్ వాళ్లు ఖర్చులు కలిసి భరిస్తారట. రోజూ హారతి యివ్వాలా? ఎంత నూనె లేదా ఆవునెయ్యి వేస్తు? వేడుక వేడుకలా వుండాలి. రోజూ యిస్తూ వుంటే రాజమండ్రి లాటి వూళ్లో చూడడానికి ఎంతమంది వస్తారు? నది పక్కనే వుంటుంది కాబట్టి ఆ వూరివాళ్లకు దానిపై గ్లామర్ వుండదు. గత పుష్కరాల టైములోనే నిత్యహారతి అని ఎండోమెంట్స్ శాఖ ద్వారా మొదలుపెట్టి రెస్పాన్సు లేకపోవడం చేత కొన్నాళ్లు పోయాక మానేశారు. ఇప్పుడు మొదలుపెట్టినది ఎంతకాలం సాగుతుందో చూడాలి.

ప్రభుత్వం టీవీలో, పత్రికల్లో యాడ్స్ యిచ్చి ప్రోత్సహిస్తోంది కాబట్టి యిక వాళ్లు కూడా తమ వంతు తాము యాడ్ కాంపెయిన్ పెట్టేశారు. పుష్కర స్పెషల్ పేర ప్రత్యేకానుబంధం వేసి పావు పేజీల్లో గోదావరి ఆర్టికల్స్, ముప్పావు పేజీల్లో పుష్కరయాత్రికులు అభినందనల యాడ్స్ వేసి డబ్బు చేసుకున్నారు. టీవీలు పుష్కరజ్వరాన్ని మేన్‌టేన్ చేయడానికి స్వామీజీలచే, ప్రవాచకుల చేత కార్యక్రమాలు పెట్టించేశారు. దశాబ్దాలుగా, తరతరాలుగా అందరికీ తెలిసిన విషయాలే చెపితే గొప్పగా వుండదని వాళ్లు యింతకింత చేసి ఏవేవో చెప్పారు. ఇటీవలి కాలంలో కర్మకాండమీద జనాల్లో పిచ్చి పట్టింది. కష్టాలనేవి భూమి పుట్టిన నుంచి వస్తూనే వున్నాయి. ఇదివరకు యివి ప్రకృతి సహజం అనుకునేవారు, భారతీయులైతే కర్మ అని సరిపెట్టుకుని ముందుకు సాగేవారు. ఇటీవలి కాలంలో నీకు జనఘోష వుంది, యితరులంతా నీ ప్రగతి చూసి అసూయ పడుతున్నారు. దాని వలన జరిగే నష్టాన్ని నివారించడానికి యిది చేయండి, అది చేయండి అంటూ ప్రతీవాడికీ పొరుగువాడిపై ద్వేషం పెంచారు. గ్రహశాంతులు చేయిస్తే, రాహుకేతు పూజ చేయిస్తే,

రాళ్లు, రుద్రాక్షలు, ధరిస్తే, కారు నెంబరు, ఫోన్ నెంబరు అదృష్ట సంఖ్య అయితే, పేరులో స్పెల్లింగు మారిస్తే కష్టాలు తొలగిపోతాయని జనాలు భావించేట్లు మార్కెటింగు జరుగుతోంది. మార్కెటింగు బాగా సాగాలంటే జనాల్లో పాపభీతి పెరగాలి. పాపభీతి పెరిగితే చెడు పనులు తగ్గిపోవాలి. కానీ తగ్గటం లేదు.

జరుగుతున్నదేమిటంటే పాపాలు ఎలా కడుక్కోవాలో చెప్పడానికి కర్మకాండ మీద పడ్డారు. ఇప్పటిదాకా వినని పద్ధతులన్నీ చెప్పడం మొదలుపెట్టారు. కొబ్బరికాయ తిరగేసి కొట్టాలని, పాదాలకు నమస్కరించేప్పుడు కుడిచేత్తో అవతలివాళ్ల కుడిపాదం పట్టుకోవాలని.. యిలా వింతవింత విషయాలు, యిప్పటిదాకా విననివి 'ధర్మసూక్ష్మం', 'దేవరహస్యం' పేర చెప్పనారంభించారు. వీటికి ఆధారాలేమిటో ఎవరికీ తెలియవు. 'ధర్మసందేహాలు' అని కార్యక్రమాలు పెట్టేసరికి ప్రతీవాళ్లూ చిన్న చిన్న విషయాల దగ్గర్నుంచి – గుడి లోపలికి వెళ్లినపుడు చెప్పులు కుడివైపు విడవాలా, ఎడం వైపు విడవాలా లాటి విషయాలు కూడా అడగసాగారు. అడిగేవాడికి చెప్పేవాడు లోకువ అంటారు. ఇక్కడ చెప్పేవాడు కూడా అడిగేవాణ్ని లోకువ చేసి తమకు తోచినది చెప్పసాగారు. నిజానికి యీ బాహ్య ఆచారాలు, ఆడంబరాలు ముఖ్యం కాదు, అంతశ్శుద్ధి ముఖ్యం అని పురాణాల్లోనే ఎన్నో చోట్ల చెప్పడం జరిగింది. ఇప్పుడు అది పోయింది. జనాల్లో పెరిగిన ఆధ్యాత్మిక.. నిజానికి యిది ఆధ్యాత్మిక కాదు, ఆచారాల – స్పృహ పెరిగినకొద్దీ ప్రవాచకులు, వారిలో కొందరు ప్రవాచాలకులు – పెరిగారు. జనాల్లో చాదస్తాలు పెంచారు.

ఈసారి పుష్కరాల సమయంలో కర్మకాండ మరింత పెరిగింది. గతంలో ఎప్పుడూ వినని చాదస్తాలు, పూజావిధానాలు యీసారి విన్నాను. పుష్కర సమయంలో ప్రతీ రోజు దానాలు యివ్వాలట. వాటిల్లో మేక దానం కూడా వుంది! మట్టి వేయడమట. లేకపోతే స్నానం చేసిన పుణ్యం రాక్షసి తినేస్తుందట. మనం చేసే పుణ్యాలు అంత చవకగా వున్నాయన్నమాట. పాపాలు తినే రాక్షసి వుందని తెలిస్తే మరింత జోరుగా పాపాలు చేద్దుం. ఆవునెయ్యి అక్షతలట. స్తోత్రాలట. పసుపు, కుంకుమలట. ఆడవాళ్లు నదికి పసుపు, కుంకుమలు సమర్పించడం చూశాను తప్ప ఆడామగా అందరూ యివ్వడం నాకు తెలియదు. మట్టి, మశానం, యివన్నీ పట్టుకొచ్చిన ప్లాస్టిక్ సంచీలతో నది నిండిపోతే పర్యావరణానికి ఎంత నష్టమో ఎవరైనా ఆలోచించారా? పుష్కరాలకు ముహూర్తమేమిటి? ఆ ముహూర్తంలోనే పీఠాధిపతులు, ముఖ్యమంత్రుల నుంచి మునగడ మేమిటి? గతంలో యిది లేదు. 12 రోజుల్లో ఎప్పుడో ఒకప్పుడు స్నానం చేసేవారు. పది నిమిషాలో, పావుగంటో కార్యక్రమం ఏదో చేసేవారు. ఇప్పుడు చంద్రబాబుగారు ఏకంగా గంటసేపు పూజా కార్యక్రమం చేశారు. ఆయనలాగే నదిలో మునిగిన ప్రతీవాడూ గంటసేపు పూజ చేస్తే స్నానాలు ఎప్పటికి తెమిలేను? ఆయనకు ఓటు–నోటు కష్టాలున్నాయి కాబట్టి గంట సేపు చేశారనుకుంటే, మనకూ మరో రకం కష్టాలు వున్నాయి.

ప్రమాదం జరిగిన తర్వాత అప్పుడు స్క్రోలింగ్స్ ద్వారా ప్రచారం చేయసాగారు – గోదావరిలో ఎక్కడైనా స్నానం చేయవచ్చు, ఎప్పుడైనా చేయవచ్చు అంటూ. రాజుగారు అది ఆచరించి చూపితే అప్పుడు జనాలు నమ్మేవారు. మొత్తం ఫోకస్ రాజమండ్రిపై పెట్టడం ఘోరతప్పిదం. ఒక్క వూరు యింత రష్‌ను తట్టుకోలేదన్న సంగతి గ్రహించాలి. తట్టుకునేట్లా అది సన్నిద్ధమైందో చెక్ చేసుకోవాలి. రాజమండ్రిలో కూడా  ఫలానా చోట ఆయన ముహూర్తం టైముకే మునుగుతారట అనగానే జనాలందరూ అక్కడేదో ప్రాముఖ్యత వుందనుకుని సరిగ్గా ముహూర్తం టైముకే చేయాలనుకుని అక్కడికి రెండు గంటల ముందే చేరుకున్నారు. తర్వాత వచ్చినవాళ్లు కూడా అక్కడే పోగడ్డారు. ఇక్కడ వెయిట్ చేయడం కంటె వేరే చోటికి వెళదామనుకుని వాళ్లకు అనిపించలేదు. ఇక్కడే ఏదో పుణ్యాలగని వుంది అనుకున్నారు. ముఖ్యమంత్రిగారికి వేరే విఐపి ఘాట్ వున్నా యిక్కడికే వచ్చేరంటే ఏదో క్షేత్రమహిమ వుండి వుంటుంది అని సాధారణ ప్రజలు తలచడంలో వింతేముంది?

సిఎం ఒకరేనా, ఎండోమెంట్స్ మంత్రితో సహా ఐదుగురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పీఠాధిపతి.. యింతమంది యిక్కడే మునుగుతున్నారంటే మనమూ యిక్కడే మునుగుదామని ఆరాటపడ్డారు పాపం. ముఖ్యమంత్రి గారికి విఐపి ఘాట్ వుందని తెలియదా? ఆయన ఎక్కడకి వస్తే అక్కడ హంగూఆర్భాటం వుంటుందని తెలియదా? అంత అమాయకుడా? అధికారం యివాళ వచ్చిందా? సిఎం 6 గంటలకు వస్తున్నారని తెలియడంతో గంట ముందు నుంచి అక్కడున్న యాత్రికులను బయటకు పంపారు. చుట్టూ మీడియా, బయట రోడ్డు మీద కాన్వాయ్, అధికారుల వాహనాలు, 108 వాహనం పెట్టడానికి కానీ, ప్రమాదం జరిగిన అరగంట తర్వాత రావడానికి కానీ వీలు లేకపోయింది. శవాలను, క్షతగాత్రులను చాలా దూరంలో ఆగిపోయిన వాహనాల వద్దకు మోసుకెళ్లాల్సి వచ్చింది. పురాణపరంగా  కోటిలింగాల రేవుకి వున్న ప్రాముఖ్యత పుష్కర ఘాట్‌కు లేదు. అయితే విగ్రహాలు అవీ పెట్టడం చేత, బ్రిజ్ పక్కన వుండడంతో ప్రచారచిత్రం తీసుకోవడానికి అనువుగా వుంటుంది. వెనక్కాల వేలాది జనాలు ఎలాగూ వున్నారు. ఇదో పెద్ద యీవెంట్ అని బిల్డప్ యివ్వడానికి అనువైన చోటు. విఐపి ఘాట్‌లో చడీచప్పుడు కాకుండా చేస్తే యింత హంగు వుండదు. ఆ ప్రచారప్రీతే కొంప ముంచడం కాదు, కొంతమంది ప్రాణాలు బలిగొంది.

అసలు విఐపిలు యిలాటి వాటికి వెళ్లాలా వద్దా? 1954లో కుంభమేళాలో దాదాపు 800 మంది చచ్చిపోయినపుడు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ యిచ్చిన సలహా గుర్తుంచుకోవాలి. గంగానది సడన్‌గా తన ప్రవాహదిశను మార్చుకోవడం వలన మేళాకు కేటాయించిన స్థలం తగ్గిపోయిందన్న మాట నిజమే అయినా, అనేకమంది మంత్రులు, రాజకీయనాయకులు రావడం వలన తొక్కిసలాట జరిగి వందలాది మంది చచ్చిపోయారు. అప్పుడు నెహ్రూ యిటువంటి మేళాలకు రాజకీయ నాయకులు, విఐపిలు దూరంగా వుండాలని సూచించారు. వారి వలన ఘోరం జరిగిందని అందరికీ తెలిసినా విచారణలో వారిని ముద్దాయిలుగా పేర్కొనరు.

ఆ ఘటనపై వేసిన జస్టిస్ కమలకాంత్ వర్మ కమిషన్ కుంభ మేళాను ఎలా నిర్వహించాలో చాలా సూచనలు చేసింది. వాటిని చక్కగా అమలు చేయడం వలన మళ్లీ ఎలాటి దుర్ఘటన అక్కడ జరగలేదు. నెహ్రూగారు అలా చెప్పినా 1992 ఫిబ్రవరిలో కుంభకోణంలో జరిగిన మహామహం ఉత్సవానికి జయలలిత హాజరయ్యారు. అప్పట్లో కూడా జయేంద్ర సరస్వతే వాటిని ప్రారంభించారు. ముహూర్త సమయంలోనే జయలలిత, తన స్నేహితురాలు శశికళతో కలిసి గుడి చెరువులో కాస్సేపు స్నానాలు చేశారు. ఆమె పాప్యులారిటీ వున్న నాయకురాలు, పైగా సినీనటి. చూడడానికి జనం విరగబడ్డారు. చెరువులో కొంతభాగం జయలలితకు కేటాయించి తక్కినది జనాలకు వదిలారు. చెరువుకు దక్షిణ, పడమర దిక్కుల సెక్యూరిటీ కారణాలు చెప్పి మూసేశారు. తూర్పు, ఉత్తర దిక్కుల నుంచే వేలాదిమంది భక్తుల రాకపోకలు సాగాలి. ఇంకేముంది, తొక్కిసలాట జరిగింది. 50 మంది చనిపోయారు, 74 మంది గాయపడ్డారు. జయలలిత మళ్లీ అలాటి ఉత్సవంలో పాల్గొనలేదు.

చరిత్ర యిన్ని ఉదాహరణలు యిస్తున్నా మన నాయకులు పట్టించుకోవటం లేదు. ఎక్కడ జనం మూగితే అక్కడ ప్రత్యక్షమై పబ్లిసిటీ తెచ్చుకుందామని చూస్తున్నారు. కెసియార్ తెలంగాణలో మునిగితే, బాబు ఆంధ్రలో మునిగారు. ఆచారాలు, నమ్మకాలు గాఢంగా చాటుకునే కెసియార్ అరగంటలో పూజ ముగిస్తే బాబు గంటన్నరసేపు వున్నారు. కెసియార్ శాస్త్రోక్తంగా పంచె, ఉత్తరీయంతో గోదావరిలో దిగారు కానీ ప్యాంటు, చొక్కాతోనే మునిగారు. ఛాతీ చూపించడానికి సిగ్గుపడేవారు ధోవతి, లాల్చీతో స్నానం చేసినా బాగుండేది. ప్యాంటు, చొక్కాతో పిండప్రదానాలంటే కాస్త ఎబ్బెట్టుగా వుంది. అసలు ముఖ్యమంత్రి పుష్కరాలకు రావాలా? వచ్చినా నీటిలో మునగాలా? ఇక్కడ మాజీ కర్ణాటక ముఖ్యమంత్రి గుండూరావు కథ గుర్తుకు వస్తోంది. ఓ స్విమ్మింగ్ పూల్ ఆవిష్కరణకు ఆయన్ని పిలిచారు. రిబ్బన్ కత్తిరించాక ఆయన స్విమ్మింగ్ డ్రెస్ వేసుకుని కొలనులోకి దూకి, కాస్సేపు యీది ఆవిష్కరించినట్లు ప్రకటించాడు. అప్పుడు చాలా విమర్శలు వచ్చాయి. మెటర్నటీ హోమ్ ఆవిష్కరణకు పిలిస్తే వెళ్లి పురుడు పోసుకుని వస్తాడా? అని అడిగారు. పుష్కరం ప్రారంభమైంది అని ప్రకటించి శంఖం వూది వచ్చేస్తే సరిపోయేది. స్నానం చేయడం దేనికి?

ఒకవేళ చేసినా సరిగ్గా ముహూర్త సమయానికి స్నానం చేయాలా? నేదురుమల్లి జనార్దనరెడ్డిగారు 1991లో 4 రోజుల తర్వాత వెళ్లారు. 2003లో బాబు సిఎంగా వుండగా స్థానిక కలక్టరు జవాహర్ రెడ్డి చేత నాయకులందరూ నియమాల ప్రకారం నడుచుకునేట్లు చేశారు. అప్పుడు వెంకయ్యనాయుడు సాధారణ భక్తుల ఘాట్‌లో స్నానం చేస్తామంటే కుదరదని, విఐపి ఘాట్‌లోనే చేయాలని జవాహర్ రెడ్డి ధైర్యంగా చెప్పగలిగారు. ఆయనకు ఆ ధైర్యం కలిగించినది బాబే. అదే బాబు యీరోజు తనే నియమాలు ఉల్లంఘించారు. డాక్యుమెంటరీ కోసం సినిమా వాళ్లు చెప్పినట్టల్లా 'ఆడారు'. ముందురోజు నిత్యహారతి షాటు బోయపాటి శ్రీను డైరక్షన్‌లో జరిగిందని, షూటింగుకి పుష్కర ఘాట్ అనువుగా వుంటుందని వాళ్లు అనడం చేత కొన్ని గంటల్లో పుష్కరం ప్రారంభమవుతుందనగా, ఆఖరి నిమిషంలో వెన్యూ మార్చేశారు. (ఈ డాక్యుమెంటరీ నిర్మాణ వార్తలను టిడిపికానీ ప్రభుత్వంకానీ ఎవరూ ఖండించలేదు. అందువలన దాన్ని నమ్మవలసి వస్తోంది). అలా చేస్తే కుదరదని గట్టిగా చెప్పగల అధికారి లేకుండా చేసుకున్నారు బాబు. అది రాజుకి వుండవలసిన లక్షణం కాదు.

నాకు అర్థమైనంత వరకు జరిగింది క్లుప్తంగా చెప్పాలంటే – ముహూర్తం కంటె ముందే నాలుగు గంటల నుంచి కొందరు వచ్చి కూర్చున్నారు. ఆ ఘాట్ మూడు విభాగాలుగా వుంది. సిఎం వస్తున్నారని విన్నాక 5 గంటల నుంచి మధ్య దాన్నుంచి జనాలను వెనక్కి పంపేశారు. 5.30కు జయేంద్ర సరస్వతి, 6.00 గంటలకు చంద్రబాబు వచ్చారు. 6.30 నుంచి 7.30 వరకు బాబు పూజలు చేశారు. ఆ తర్వాత వ్యాన్‌లోకి వెళ్లి బట్టలు మార్చుకుని వెనక్కి వెళ్లటానికి కొంత టైము పట్టింది. ఆయన వెళ్లాక 8.10కి జనాల్ని లోపలకి అనుమతించారు. అప్పటిదాకా లోపల వున్న జనాలను బయటకు, బయటి జనాలను లోపలకి ఒకేసారి వదిలారు. ఇన్, ఔట్ గేట్లు పక్కపక్కనే వున్నాయి. బయట 5 గం.ఎల నుంచి కొందరు జనం వెయిట్ చేస్తున్నారు. ప్రతీ రైలును గోదావరి స్టేషన్ వద్ద ఆపడం చేత, గోకవరం బస్టాండ్ దగ్గరలో వుండడం చేత బస్సు, రైలు దిగిన ప్రయాణీకులందరూ అక్కడికే వచ్చి చేరారు. స్థానికుల మాట సరేసరి. ఇంకో రేవు దగ్గర్లోనే వుంది, వెళ్లండి అని చెప్పడానికి మనుష్యులూ లేరు, యిండికేటర్సు లేవు. ఎక్కువమంది ఎటు నడిస్తే తక్కినవాళ్లూ అటే నడిచారు. డాక్యుమెంటరీలో వెనక్కాల ఎక్కువమంది జనం కనబడితే బాగుంటుందనే వూహతో వాళ్లను కావాలనే వేరే ఎక్కడికీ పంపలేదన్న వాదనా వుంది. ఏమైతేనేం, వేలాది మంది అక్కడే వుండిపోయారు. దాహం. తాగడానికి నీళ్ల సప్లయి లేదు. వాళ్లను అదుపు చేయడానికి వున్న పోలీసులు 5గురు కానిస్టేబుళ్లు, ఒక యిన్‌స్పెక్టరు. సిఎం రెండు గంటల పాటు వుండి వెళ్లడంతో అధికారులు ఒక్కసారిగా రిలాక్సయ్యారు. ఒక్కసారిగా వదలడంతో అందరూ తోసుకుంటూ ముందుకు వెళ్లారు. ఇది 25 ని.ఎలు సాగింది. బారికేడ్లు అడ్డుపడుతున్నాయని ఒక అధికారి బారికేడ్లు తీసేయమని ఆజ్ఞాపించారట. తోపుడులో కొందరు కింద పడ్డారు. జనం తొక్కేయడంతో చచ్చిపోయారు. సహజంగా పోయినవారిలో స్త్రీలు ఎక్కువ, 23 మంది. ఈ ఘాట్‌కు ఎదురుగా యిల్లు వున్నాయన మొన్న టీవీలో మాట్లాడారు. అయిదున్నరకు రోడ్లన్నీ ఖాళీగానే వున్నాయట. ఆ తర్వాత ఎంతమంది జనం వచ్చిపడ్డారంటే వాళ్ల యింటి తలుపు కూడా తీయలేకపోయారు. సంఘటన తర్వాత చావు వార్త బయటకు పొక్కకుండా చూడాలనో ఏమో 11.20 వరకు టీవీ ప్రసారం ఆపేశారట. ఇలాటి చర్యల వలన పుకార్లు మరింత బలంగా వ్యాపిస్తాయి. ఇప్పటికే పోయినవారు 27 కాదు, 40 కంటె ఎక్కువే అంటున్నారు కొందరు!

అన్నిటికన్నా ట్రాజెడీ ఏమిటంటే చుట్టూ టీవీ ఛానెళ్ల ఓబి వాన్లు తప్ప 108 వ్యానులు లేవు. కింద పడినవాళ్లకు వెంటనే

మంచినీళ్లు యిచ్చి వుంటే కొంతమందైనా బతికేవారట. అవి కూడా అందుబాటులో లేవు. మరణాల తర్వాత 108 కోసం ఎనౌన్సు చేసినా ఎక్కడా స్పందన లేదు. 10.20కు వచ్చినా ఎక్కడో ఆగాయి. అదృష్టవశాత్తూ సిఎంకు ఏ ప్రమాదమూ జరగలేదు కానీ ఏదైనా జరిగి వుంటే పరిస్థితి ఎలా వుండేదో వూహించండి. ఇంకో రెండు రోజులు పోయాక ఒక రేవులో రివాల్వర్ కనబడింది. ఎవరి నుండి ముప్పు వచ్చినా పెను అనర్థమే జరిగేది. గాయపడినవారిని 12.30 వరకు ఆసుపత్రికి తరలిస్తూనే వున్నారు. అక్కడ సౌకర్యాలు లేవట. వారికి పుష్కర సందర్భంగా యిచ్చిన అదనపు నిధులు లేవట.

1650 కోట్లు యిచ్చామన్నారు ఏమయ్యాయి అని అందరూ అడుగుతున్నారు. దానిలో ప్రచారానికి ఎంత పోయిందో తెలియదు. ఎన్టీయార్ విగ్రహానికి ఎంత కేటాయించారో ఏమో! జరిగినదేమిటంటే అనేక చిన్న రేవుల్లో ఘాట్‌లు కట్టేశారు, అక్కడ తాగునీటి సౌకర్యం అవీ కల్పించారు. కానీ జనం లేరు. డిమాండ్ లేని రూట్లో ఆర్టీసీ బస్సే వేయరు కదా, అన్ని ఘాట్లు కట్టడం దేనికి? ఆంధ్ర మొత్తానికి 30 ఘాట్లు కట్టి వాటికే అన్ని సౌకర్యాలు కల్పిస్తే సరిపోయేది. కానీ తక్కిన వూళ్లలో ఎమ్మెల్యేలు, కాంట్రాక్టర్లూ వూరుకుంటారా? వాళ్ల కోసం కట్టారన్నమాట. అది కూడా టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిన అస్మదీయులకు యిచ్చేశారు. తెలంగాణలో అయితే మరీ ఘోరం. నీళ్లు లేని చోట, జనం రాని చోట కూడా ఘాట్లు కట్టేశారు. జనాలంతా భద్రాచలం, ధర్మపురి, కాళేశ్వరంకే వెళ్లారు. దాంతో ట్రాఫిక్ జామ్‌లు. ఆ మూడిటికి విశాలమైన రోడ్లు వేయడమో, బైపాస్ రోడ్లు వేయడమో చేసి వుంటే యీ అవస్థ తప్పేది. ఆంధ్రలో ఫోకసంతా రాజమండ్రి మీద పెట్టారు కానీ ఊళ్లో పనులు సరిగ్గా జరగటం లేదని రాజమండ్రి మిత్రుల ద్వారా నా బోటివాడికే తెలుసు. పనులు మొదలుపెట్టి రెండు నెలలే అయిందని, ఏదీ సవ్యంగా సాగటం లేదని, మెయిన్ డ్రైనేజీ కాలువకు సిమెంటు కవర్లు రెండు రోజుల ముందే వేశారనీ చెప్తూనే వున్నారు. టీవీలు కూడా చూపించాయి. రోడ్లన్నీ తవ్వేయడం జరిగింది కానీ వేయలేదన్నారు. ఇవన్నీ ప్రభుత్వాన్ని నడిపేవాళ్లకు తెలియకుండా వుంటుందా? ఆర్గనైజ్ చేయడానికి కమిటీ వేసి దాన్ని జపాన్ తీసుకెళ్లారు! బాబు వెళ్లి పోయిన తర్వాత జరిగిన ఘటనకు ఆయన్ని బాధ్యుణ్ని చేస్తే ఎలా, అయినా పాపం అన్నీ ఆయన ఒక్కరే చూసుకుంటున్నారు అని కొందరు జాలిపడుతున్నారు. ఒక్కరే చూసుకోవడానికి యిదేమైనా ఆయన యింటి వ్యవహారమా? ప్రభుత్వం వుంది, జీతాలు యిటీవలే భారీగా పెరిగిన ఉద్యోగులున్నారు, వారు సరిగ్గా చేస్తున్నారో లేదో గమనించడానికి ప్రజాప్రతినిధులున్నారు. ఈయన ఎండోమెంట్స్ మినిస్టర్‌తో సహా ఎవరికీ బాధ్యత అప్పగించలేదు. ఘటనకు బాబు బాధ్యత గురించి జగన్ విమర్శిస్తే 'పుష్కరాలకు ముందు జగన్ సలహాలెందుకు యివ్వలేదు?' అని టిడిపి నాయకులు అడగసాగారు. ప్రతిపక్ష నాయకుడితో సంప్రదింపులు వదిలేయండి. మిత్రపక్షానికి చెందిన ఎండోమెంట్స్ మినిస్టర్, స్థానిక ఎమ్మెల్యేను కూడా సంప్రదించలేదు. అఖిలపక్షసమావేశం అనేది డిక్షనరీలోనే లేదు. కేదార్‌నాథ్‌లో విపత్తు జరగలేదా అని కొందరి వాదన. ఆనాడు అక్కడ బీభత్సం సృష్టించినది ప్రకృతి. కొన్నేళ్లగా జరిగిన మానవ తప్పిదాల వలన అది భీకరస్థాయికి చేరింది. ఇక్కడ పూర్తిగా మానవకృతం. పబ్లిసిటీ యావ!

నా దృష్టికి వచ్చిన కొన్ని లోపాలు – రాజమండ్రిలో ఎక్కడ ఏ రేవు వుందో ఎక్కడా డిస్‌ప్లే లేదు. ఫలానా రేవు 300 మీటర్ల దూరంలో వుంది, అక్కడ రద్దీ తక్కువ వుంది లాటి విషయాలతో ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే వుంటే జనాలు డిస్ట్రిబ్యూట్ అయ్యేవారు. అలాటిది లేదు. రాజమండ్రి మ్యాప్ డిస్‌ప్లే ఎక్కడా లేదు. వచ్చిన యాత్రికులకే కాదు, అక్కడ టెంపరరీగా పోస్టింగు యిచ్చిన పోలీసులకూ ఊరు తెలియదు. ప్రమాద స్థలం వద్ద వున్న వాళ్లు తమిళ పోలీసులట. బాధితుల ఘోష వాళ్లకు అర్థం కాలేదు. ఏ రేవుకైనా సరే కనీసం 2,3 కి.మీ. దూరం నడవాల్సిందే. బస్సులు అవసరానికి మించి వేయడంతో వాటి వలన ట్రాఫిక్ ఆగిపోతోంది. వన్ వే ట్రాఫిక్ అంటూ అప్పటికప్పుడు పెట్టి తప్పు చేసిన ఆటోలను రోడ్ల మీద నుంచి రోజుల తరబడి విత్‌డ్రా చేశారట. దానితో ఆటోల కొరత. అసలు వూరు చేరే మార్గాలే బాగా లేవు. స్కూలు పిల్లలను తీసుకెళ్లే ఔటాఫ్ ఆర్డర్ బస్సులను పుష్కరాలకు కేటాయించారట. అవి దారి మధ్యలో ఆగిపోయి, తక్కిన వాహనాలు ఎటూ కదలకుండా అయిపోయిందట. ట్రాఫిక్ ఆర్గనైజేషన్ ఏమీ బాగా లేదట. దారి మధ్యలో మంచినీళ్లు అందించే కేంద్రాలు, టాయిలెట్లు కూడా లేవు. గంటకు 10 కి.మీ.ల చొప్పున వాహనాలు నడుస్తూ వుంటే ప్రయాణీకులకు అనేక అవసరాలు పడతాయి. అనేక వాహనాలను వూరికి దూరంగా ఆపేశారు. అన్నదానం చేయడానికి తెచ్చిన పాకెట్లున్న వాహనాలను కూడా విడిగా పంపే ఏర్పాటు లేదు. 108 వాహనాలు వెళ్లడానికీ విడిమార్గం లేదు. పేదలు వుండడానికి షెడ్డులు అవీ కట్టలేదు. కట్టిన వాటి గురించి ప్రచారం లేదు. దాంతో అవి ఖాళీగా వున్నాయి. ఇక్కడ పేదలు పడుక్కోవడం కాదు, కూర్చోడానికి కూడా చోటు లేక అవస్థ పడుతున్నారు. హోటళ్లు రోజు అద్దె తీసుకుని 12 గంటల్లోనే ఖాళీ చేయాలంటున్నారు. ప్రభుత్వం తరఫున క్యాంపులు లేవు.. యిలా చాలా విన్నాను. ఏర్పాట్లు సరిగ్గా చూసుకోకుండా రాజమండ్రిపైన యింత భారం వేయడం చాలా తప్పు. అసలు కుంభమేళా టైపులో రాజమండ్రిలో పుష్కరాలు పెట్టకుండా రాజమండ్రి, ధవళేశ్వరం మధ్యలో ఖాళీ స్థలం ఏదైనా చూసి ఓ టౌన్‌షిప్ నిర్మించి అక్కడ ఆర్గనైజ్ చేసి వుంటే బాగుండేది. రాజమండ్రిలో యిరుకిరుకు సందుల్లో వాహనాలు ఎలా తిరుగుతాయి?

ఇప్పుడు యాత్రికులు చచ్చిపోయారు కాబట్టి చంద్రబాబు కన్నీళ్లతో 'నా తప్పు వుంటే క్షమించండి' అంటున్నారు. ఉంటే అని క్వాలిఫై చేయడం దేనికి? తప్పు తనది కాదు, అధికారులదే అంటే హుదూద్ రిలీఫ్ కార్యక్రమాల ఘనత కూడా వారికే కట్టబెట్టాలి. కలక్టరుగారి నివేదిక ఏదో వుందంటున్నారు. ఆయనేం చెప్తారో చూదాం. ఇప్పుడీ దుర్ఘటన తర్వాత జనం రారేమోనన్న భయం బాబుగారికి పట్టుకుంది. తక్కిన 11 రోజులూ అక్కడే వుంటానంటున్నారు. అదే పొరపాటు. సిఎం అక్కడ వుంటే నాయకులు,

అధికారులందరూ ఆయన కళ్లల్లో పడాలన్న యావతో జనాలను మానేసి ఆయన్ను సేవిస్తూ కూర్చుంటారు. ఆయన హైదరాబాదులోనే కూర్చుని రిపోర్టులు తెప్పించుకుంటే చాలు. అన్నీ దగ్గరుండి చూసుకోవడం, డెలిగేట్ చేయకపోవడం మంచి మేనేజ్‌మెంట్ కాదు. ఆయనకు వచ్చినది మీడియా మేనేజ్‌మెంట్. ఆసుపత్రిలో పడిన యాత్రికుల కథనాలు టీవీ ఛానెల్స్‌లో రావటం లేదు. 27 మంది పోయారని, ఇద్దరి పరిస్థితి విషమంగా వుందని మొదటి రోజు వచ్చింది. ఆ తర్వాత 27 దగ్గర ఆగిపోయింది. సాక్షి మాత్రం యివాళ 29 అంది. తక్కిన వారి పరిస్థితి ఏమిటో ఒక్క పేపరుగాని, టీవీ గాని చెప్పటం లేదు. మామూలుగా అయితే వాళ్లు ఫిర్యాదులు చేస్తున్న టెలికాస్టులు వచ్చేవి. వాటిని ఆపేసి వుంటారు. బాబు ఎడ్మినిస్ట్రేషన్ అద్భుతంగా వుంది, ఆయన పదికాలాల పాటు వర్ధిల్లాలి అని జనాల చేత చెప్పించి, రిపోర్టర్ల చేత కథనాలు ప్రసారాలు చేస్తున్నారు. పుష్కరాలకు ఎంతమంది జనం వచ్చారన్న సంఖ్య కూడా గందరగోళంగా వుంది. తొలి 6 రోజుల్లో ఆంధ్రలో 2 కోట్లు, తెలంగాణలో 1 కోటి గోదావరి స్నానాలు చేశారని ఒక పేపరు రాస్తే, అబ్బే ఆంధ్రలో 3, తెలంగాణలో 2 అంటున్నారు. ఇలాటి అతిశయోక్తుల ప్రచారమే యిక్కడిదాకా తీసుకువచ్చింది. ఇప్పటికైనా దానికి కళ్లాలు వేస్తే మేలు. **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

జులై 30-31 వీక్లీకై ఎమ్బీయస్ : బాహుబలి మార్కెటింగ్ విజయమే

నిన్ననే బాహుబలి చూశాను. పుష్కరాలకు వెళ్లకపోతే హిందువు కావని అంటారన్న బెదురు, బాహుబలి చూడకపోతే తెలుగువాడివి కావని అంటారన్న భయం పుట్టించారీ మధ్య! ఒక తెలుగువాడు అంతర్జాతీయ స్థాయి సినిమా తీస్తే ప్రోత్సహించడానికి బదులు టిక్కెట్టు బ్లాకులో 500, వైట్‌లో 150 అని తటపటాయిస్తే జాతిద్రోహిని అయిపోతానన్న సెంటిమెంటు తోడైంది. చూసిన ప్రతీవాళ్లూ 'ఓసారి చూడవచ్చు, పాపం కష్టపడి తీశాడు కదా' అంటున్నారు. సినిమాను నిర్వచించమని మల్లాది రామకృష్ణశాస్త్రిగారిని అడిగితే – 'తీసేవాళ్లకు పరిశ్రమ, చూసేవాళ్లకు శ్రమ' అని చమత్కరించారట. దర్శకుడు తీసేటప్పుడు కష్టపడ్డాడు కదాని చూసేటప్పుడు మనమూ కష్టపడాలనడం ఏం భావ్యం? అయినా నిర్మాతదర్శకులపై జాలి పడితే అదేం గొప్ప సినిమా? "ఐ" సినిమాలో శంకర్, విక్రమ్ ఏళ్లపాటు కష్టపడ్డారు. చూశామా? సినిమాలో ఆకర్షణ వుండాలి, చూడకపోతే కొంప మునిగిపోతుంది అన్నట్టు వుండాలి తప్ప జాలి కలిగిస్తే ఎలా? వాళ్ల మీదే కాదు, ప్రేక్షకుడు తనపై తను కూడా జాలి పడ్డాడు – 'ఫుల్ టిక్కెట్టు యిచ్చి సగం సినిమా చూశాను' అని. ముగింపు చూసి, యిది రెండో యింటర్వెల్లేమో అని సందేహం వచ్చింది అందరికీ. సినిమా, నవల, కథ, ఆఖరికి నాలుగు వాక్యాల జోక్‌కైనా క్లయిమాక్స్ వుండాలి, అది బాగుండాలి. ఈ సినిమాకు క్లయిమాక్సే లేదు. క్లయిమాక్స్ రెండో భాగం చివర వస్తుంది అంటున్నారు. మరి దీనికి కూడా ఏదో ఒకటి అఘోరించాలిగా. పంచతంత్రం కథలు, అరేబియన్ నైట్స్ కథలు, కాశీ మజిలీ కథలు ఒక దానిలోంచి మరో దానిలోకి వెళ్లిపోతూనే వుంటాయి. కథ ఓ పట్టాన ముగియదు. కానీ ఏ ఉపకథకు ఆ ఉపకథ ముగింపు వుంటుంది. దానికీ, తర్వాతి కథకు లింకు వుండి ఉత్సుకత పోకుండా చూస్తుంది. గతంలో డిటెక్టివ్ పుస్తకాలు వచ్చేవి. కొన్ని రచనలు ఇరవయ్యేసి భాగాలు సాగేవి. వాటిలో ఏ భాగం చదివినా తృప్తిగానే వుండేది. ఇంకో భాగం కోసం ఎదురు చూసేట్లు వుండేవి. ఈ బాహుబలి అర్ధాకలితో వున్నవాణ్ని విస్తరి నుంచి వెళ్లగొట్టినట్లు వుంది.

ఇది సినిమా సమీక్ష కాదు. నటనాకౌశలాలు, సినిమాటోగ్రఫీ, రీరికార్డింగు, గ్రాఫ్ లేవడాలు, పడిపోవడాలు, రేటింగులు – వీటి గురించి మాట్లాడడాలేవీ వుండవు. స్టోరీ టెల్లర్‌గా రాజమౌళి వైఫల్యం గురించి ఆవేదన మాత్రమే. రాజమౌళి సినిమాల్లో కథ బాగుంటుందనే గ్యారంటీ వుంటుంది. ఈగ లాటి అల్పజీవితో ఫుల్ లెంగ్త్ సినిమా తీసిన ఘనుడతను. దాని గురించి హీరోయిన్‌ను మీనియేచర్ ఆర్టిస్టుగా ముందు నుంచి ఎస్టాబ్లిష్ చేసి, కథ ఎంత పకడ్బందీగా చూసుకున్నాడు! సగం జానపదంతో మగధీర అంత బాగా తీస్తే యిక ఫుల్ లెంగ్త్ జానపదంలో అదరగొట్టేస్తాడని అనుకున్నాను. జానపదం అనగానే మాయలు, మంత్రాలే అనుకుంటారు చాలామంది. అది తప్పు. నేను జానపదాల గురించి విస్తారంగా రాసిన సీరీస్ చూడండి. శక్తి ప్రధానం ("పాతాళభైరవి" వంటివి), యుక్తి ప్రధానం ("మంగమ్మ శపథం" వంటివి), భక్తి ప్రధానం ("సువర్ణసుందరి" వంటివి), రాజనీతి ప్రధానం ("రాజమకుటం" వంటివి) అంటూ విడగొట్టి జానపదాలు ఆబాలగోపాలాన్ని ఎలా అలరించాయో చూపాను. జానపదాలకు కూడా కథ అవసరమే. స్టంట్లు, జంతువులు, ట్రిక్కు షాట్లు, పైట లేని హీరోయిన్లు వుంటే ఆడేస్తాయని అనుకోకూడదు. జానపదాల్లో విషాదాంతాలుండవు. శాపగ్రస్తురాలై బండరాయిగా పడి వున్న హీరో తల్లి కూడా సినిమా చివర్లో లేచి వస్తుందని, చక్రవర్తి ఐనా విలన్ ఆఖర్లో దిక్కుమాలిన చావు ఛస్తాడనీ అందరికీ తెలుసు. అయినా ఉత్కంఠకు లోటు లేకుండా సినిమా తీసేవారు. ముగింపు ముందే తెలిసిపోయిన కథలో సైతం ప్రేక్షకుడు హీరో చెలికాడి చేష్టలకు నవ్వేవాడు, హీరోయిన్‌ను మాంత్రికుడు ముసలిదానిగా మార్చేస్తే, హీరో తండ్రిని చెఱపాలు చేస్తే ఏడ్చేవాడు. అప్పటి దాకా స్నేహితుడుగా వున్న మంత్రి కుమారుడు అసూయతో యువరాజుకి ద్రోహం తలపెడితే కోపంతో మండిపడేవాడు. ఇంత లావు "బాహుబలి"లో ప్రేక్షకుడు యిలాటి ఎమోషన్స్ పాలపడకుండా కథ రూపొందించిన రాజమౌళి ధైర్యాన్ని మెచ్చుకోవాలి. పదేళ్ల తర్వాత తిరిగి చూసుకున్నపుడు స్టోరీ టెల్లర్‌గా ఆయన యీ సినిమా గురించి గర్వపడడని నా ఊహ.

తను తీసిన ఒక సినిమా ప్రమోషన్‌కై రాజ్ కపూర్ ఒకసారి మద్రాసు వచ్చాడు. ప్రివ్యూ తర్వాత జర్నలిస్టులు యథాప్రకారం ఆయన మొహం మీదే మెచ్చుకున్నారు. ఒక జర్నలిస్టు మరీ రెచ్చిపోయి 'దిసీజ్ సూపర్ హిట్. డెఫినెట్ సిల్వర్ జూబ్లీ' అని ఆవేశపడుతూ

వుంటే రాజ్ కపూర్ – 'ఫర్‌గెట్ ఎబౌట్ సిల్వర్ జూబిలీ ఆర్ గోల్డెన్ జూబిలీ, డిడ్ యిట్ టచ్ యువర్ హార్ట్?' అని ఛాతీమీద తట్టి అడిగాడట. ద గ్రేటెస్ట్ షో మ్యాన్‌గా పేరు పొందిన రాజ్ కపూర్ పెట్టుకున్న లిట్మస్ టెస్ట్ ఒక్కటే ! కథ హృదయానికి తాకాలి. "బాహుబలి" సినిమా చూసి కళ్లకు విందు భోజనం అన్నవాడే తప్ప కళ్లలో తడి వూరింది అన్నవాడు ఎవడూ లేడు. దృశ్యాలతో గుండెను ఝల్లుమనిపించారు తప్ప సన్నివేశాలతో గుండెను స్పందింపచేయలేదు. పాత్రధారులు వాళ్ల పాటికి వాళ్లు నటిస్తూ పోతున్నారు. మనం కళ్లప్పగించి చూస్తూ పోయాం. ఈగ విలన్‌ను ముప్పుతిప్పలు పెడుతూ వుంటే కలిగిన గిలిగింతలు యిక్కడ ఎక్కడా కలగలేదు. మనకు "రాజమకుటం", "కంచుకోట" వంటి కాంప్లికేటెడ్ జానపదాలు 50 ఏళ్ల క్రితమే వచ్చాయి. ఆ వారసత్వలాభం వలన యింకా ఎక్కువ చిక్కుముళ్లు వేసి కథను తయారుచేసుకునే అవకాశం మన తరానికి వుంది. కాటమరాజు కథలు, దేశింగరాజు కథలు, మదనకామరాజు కథలు వంటి జానపదసాహిత్యం ఎంతో వుంది. అందరికీ తెలిసిన కారణంగా ప్రిడిక్టబుల్ అయిపోయే ప్రమాదం వున్న పౌరాణిక పాత్రల పోలికలతో కథ అరకొరగా తయారుచేయవలసిన అవసరం ఏమాత్రం లేదు.

ఏ కథలోనైనా కథానాయకుడికి ఆటంకాలు వుంటాయి. ఉంటేనే అతని హీరోయిజం బయటపడుతుంది. ఏడుగురు రాకుమారులు తెచ్చిన ఏడు చేపలూ ఎండిపోతే కథ ఏడిసినట్టుంటుంది. ఇక్కడ శివుడికి ఒక్క ఆటంకమూ లేదు. జలపాతం వున్న కొండ ఎక్కడం తప్ప. విప్లవసంఘం తరఫున పనిచేస్తాననప్పుడు అక్కడ నుంచి ప్రతిఘటన లేదు. తను ప్రేమించిన అమ్మాయికి పూర్వప్రియుడు లేడు. వాడు అసూయతో శత్రువుతో చేతులు కలపడం లేదు. ఇక మాహిష్మతీ రాజ్యం సెట్టింగు దిట్టంగానే కట్టారు కానీ సెక్యూరిటీ లాప్సెస్ పుష్కలంగా వున్నాయి. ఇతగాడు ఎవడో పనివాణ్ని పట్టుకుని గూనివాడిగానో వృద్ధుడిగానో కోటలోపలకి దూరే సమస్య లేదు. రైట్ రాయల్ ఎంట్రీ. మొదట్లో జానపదాలు శ్రద్ధగా తీసినా పోనుపోను 4 వారాలు ఆడితే చాలన్నట్లు కొన్ని సినిమాలు తీశారు. దానిలో హీరో కోటలోకి వెళ్లాలి అంటే గాల్లో వేళ్లాడే ఊడ పట్టుకుని కాస్త వూగేవాడు. అంతే కోటబురుజు లోపల పడేవాడు. మధ్యలో కందకం ఏమయ్యేదో తెలియదు. అలాటి సినిమాల్లో కూడా ఖైదీలను పాతాళగృహంలో పెట్టినట్లు చూపించి, దానికి ఓ స్థూలకాయుడైన కాపలాదారును పెట్టేవారు. వాడితో హీరో కత్తియుద్ధమో, లేక సెకండ్ హీరోయిన్ శృంగారమో వుండేది. ఈ సినిమాలో అనూష్కను పెద్ద ఎరీనాలో విగ్రహం నిలబెట్టినట్లు నిలబెట్టారు – 'రెడీ ఫర్ పికప్' అన్న బోర్డు పెట్టుకుని. రావణాసురుడు సీతమ్మవారిని యిలా పెట్టి వుంటే ఆంజనేయుడికి లంకలో అంతసేపు వెతకాల్సిన పని వుండేది కాదు.

సాధారణంగా ఖైదీలను పగలు బయటకు వదిలి, రాత్రి బోనులో పెడతారు. మాహిష్మతీ రాజ్యంలో పగలు బోనులో పెట్టి, రాత్రి ఆరుబయట వదిలేస్తారు కాబోలు. ఎందుకా అని ఆలోచించాను. ఆ రాజమహల్లో ఆడవాళ్లెవరూ లేరు కదా పాపం. మసిగొట్టుకుపోయినా అనూష్కను చూసి సైనికులు ఉత్సాహపడతారని ఆ వెసులుబాటు కల్పించారు కాబోలు. 'రాజకీయ బేతాళ పంచవింశతిక' ప్రారంభంలో కన్నుగీటే అందమైన అమ్మాయి బొమ్మ వేసి రాస్తారు – 'ఈ కథల్లో రాజకీయాలే తప్ప ప్రేమ, అమ్మాయిలు వగైరాలు వుండవు. ఎదరంతా ఎడారి కాబట్టి, ఆ రాజకీయాలు బోరు కొట్టినపుడు యిక్కడకు వచ్చి యీ పేజీ చూసి కాస్సేపు ఆనందించి మళ్లీ కథలు చదువుకోండి' అని. అలా కళ్లు చెదిరే మాహిష్మతీ రాజప్రాసాదంలో కంటికింపుగా రమ్యకృష్ణ (ఆవిడ పేరు శివకామిని అనకుండా శివగామి ఎందుకన్నారో ఎవరైనా చెప్తారా? శివకామిని అనేది పార్వతి పేరు. ('జననీ, శివకామినీ' పాట గుర్తుందా?) ఈ గామి ఎవరు? గమించడం అంటే రమించడం. తమిళవాళ్లు 'క' పలకలేక 'గ' అంటారు. – దీని సంగీతదర్శకుడు కీరవాణిగారి పేరు సరిగ్గా పలుకుతారో లేదో తెలియదు – కానీ రమ్యకృష్ణ పాత్రకు దాక్షిణాత్య కనక్షన్ వున్నట్టు చెప్పలేదు) ఆవిడ వెనక్కాల ఎవరో అమ్మాయి, మాసిపోయిన అనూష్క తప్ప మరో ఆడపురుగు కనబడలేదు. రానా దుష్టుడే కానీ స్త్రీలోలత్వం లేనివాడేమో, భార్య లేకపోయినా ఎవరితోనూ కులుకుతున్నట్టు చూపలేదు. అందువలన సైనికుల కనువిందు కోసం అనూష్క పాపం అలా రాత్రంతా నిలబడే వుంటోంది. దానికి బదులుగా సైనికులు ఎక్కణ్నుంచో ఎండుపుల్లలు పట్టుకుని వచ్చి ఆవిడ ముందు పడేసి ఓ కాలక్షేపం కలిగిస్తున్నారు. ఖైదీల దగ్గర పదునైన వస్తువులు కూడా వుండనివ్వరు. ఇలా చితి పేర్చుకుని ఆత్మాహుతి చేసుకుంటుందేమోనన్న శంక విలన్‌లకు రాలేదు. అనూష్క అలా నిలువుకాళ్ల జీతంపై వుండగానే శివుడు వచ్చి తీసుకుపోయాడు. నిప్పులుమిసే బండరాళ్ల మీద నుంచి రథం పోనివ్వడం తప్ప మరే ఘనకార్యమూ చేయనక్కర లేకపోయింది. సిజి కోట కావడం బట్టేమో అది డొల్లగా వుంది. పాతికేళ్లగా దాచిన ఖైదీ దాన్లోంచి అతి చులాగ్గా బయటపడింది. అది ముందునుంచీ యిదే సరుకై వుంటుంది కాబట్టే కాలకేయులు వచ్చినపుడు దాన్ని నమ్ముకోకుండా ఆరుబయట డాళ్లతో 'వి' ఆకారంలో రక్షణవలయం ఏర్పరచుకున్నారు. పదిమంది కాలకేయులు ఒక్క దుంగతో కొడితే చెల్లాచెదరయ్యారు. మామూలు సినిమాల్లో ఏనుగుల చేత కోటగుమ్మం పగలకొట్టిస్తూంటారు.

అది డొల్ల కోట అని హీరోయిన్‌కు కూడా తెలుసనుకుంటాను. అందుకే గాఢంగా ప్రేమించిన ప్రియుణ్ని తెలియని చోటికి నిశ్చింతగా వెళ్లనిచ్చింది. అసలామె కారెక్టరే నాకు అర్థం కాలేదు. శివుడికి మాస్కు దొరికింది. విప్లవసంఘంలో మగా, ఆడా అందరికీ అదే మాస్కు. కానీ పైకి ఎక్కడానికి ఏదో ఒక మోటివేషన్ వుండాలి కాబట్టి యితను దాన్ని చూసి దేవకన్యను వూహించేసుకున్నాడు. అమ్మాయినే ఎందుకు ఊహించుకోవాలన్న ప్రశ్నకు అర్థం లేదు. ఎవరినైనా ఊహించుకోవచ్చు. సినిమాల్లో హోమో దృశ్యాలు పెరుగుతున్నాయి కాబట్టి రాబోయే సినిమాల్లో మగాడు మగాణ్ని/తృతీయా ప్రకృతిని వూహించుకున్నట్లు చూపినా చూపవచ్చు. హీరో పైకి వచ్చి చూస్తే హీరోయిన్ అపరదుర్గలా వుంది. సరసరా పీకలు కోసేస్తోంది. అంత కమిటెడ్ అమ్మాయి, 'నీ లక్ష్యమే నా లక్ష్యం' అని శివుడు అనగానే ఐసరబజ్జా అనుకుని ఆ పని అతనికి అప్పగించేసి, రిలాక్సయి పోయింది.

పాతకాలం జానపదం సినిమాల్లో అయితే అతని మాట కాదనలేక సరే అన్నా వుండబట్టలేక మారువేషంలో అతన్ని అనుసరించి వెళ్లి, పొరపాటున శత్రువులకు పట్టుబడి, యితనికి సంకటం క్రియేట్ చేసి వుండేది. దీనిలో హీరో హర్డిల్‌లెస్ కాబట్టి సరే నువ్వెళ్లు, నేను యింట్లో రెస్టు తీసుకుంటా అంది.

ఆ విప్లవనాయకుడు కూడా ఏ రకమో తెలియలేదు. పచ్చబొట్టు చూసి 'శరీరం మీద తీపి వున్నవాళ్లు సాహసానికి పనికిరారు' అనుకున్నవాడు హీరోయిన్ 'నా బదులు నా ప్రియుణ్ని పంపిస్తా' అంటే రైటో ఎలా అన్నాడు? శరీరాలంకరణ కంటె మనసిచ్చేయడం బలహీనతకు మరింత చిహ్నం కదా! 'నీకు ఛాన్సివ్వడమే ఎక్కువనుకుంటే నీ బదులు నీ ప్రాక్సీని పంపుతానంటున్నావు. ఎవడికైనా పని అప్పగించేముందు రావు గోపాలరావు చెప్పినట్లు దాన్నిగదరగ, వాడి పొడుగెంత, ఛాతీ వెడల్పెంత, లోతెంత అని చూసుకోవద్దా? వాణ్నోసారి నా దగ్గరకు రమ్మనమను. శరీరదారుఢ్యం, చిత్తశుద్ధి పరీక్షిస్తా' అని అనాలా వద్దా? అలా రప్పిస్తే శివుడు బాహుబలిలా వున్నాడని అతనికి తెలిసిపోతుందని కథకుడికి భయం వేస్తే, కనీసం ఆ చెక్క మాస్కు పెట్టుకునేనా పరీక్షలు ఎదుర్కున్నట్లు చూపించాల్సింది. ఆ మాస్కు శివుణ్ని పైకి రప్పించడానికి, అతనలా వచ్చాడని హీరోయిన్ నమ్మడానికి తప్ప మరెందుకు పనికి వచ్చిందో నాకైతే అర్థం కాలేదు. విప్లవసంఘం వాళ్లు ఒక్కసారి ప్రతిజ్ఞ చేసి తీసి పారేసినట్టున్నారు. కట్టప్ప ఫ్లాష్‌బ్యాక్ చెప్పే టైములో కూడా ఒక్కడికీ మాస్కు లేదు.

అసలు అదేమి విప్లవసేనో ఏమో ఎవడో పరదేశస్తుడు వచ్చి మీ పని నేను చేస్తా అంటే నమ్మేసి కూర్చున్నారు. అతనికి అండగానో, అతనిపై నిఘాగానో వెంట కొంతమందైనా వెళ్లలేదు. రథంలో దేవసేనను తీసుకుని వచ్చేసేటప్పుడు దారిలో సాయపడలేదు. అతను ఆమెను వేరే చోటికి తీసుకుపోతాడేమోనన్న భయంతో అతన్ని కొట్టిపడేసి దేవసేనను తమ వద్దకు తెచ్చుకోలేదు. బంగారు విగ్రహం నిలబెట్టే పనిలో బానిసల్లాగానో, పనివాళ్లలాగానో వారిలో కలిసిపోయి అదను చూసి భల్లాల దేవుడిపై కత్తి విసురుదామని అనుకోలేదు. విగ్రహం నిలబెట్టే టైములో 'బాహుబలి' 'బాహుబలి' అనే మాట బయటకు వచ్చినపుడు పాతికేళ్లగా వినబడని మాట ఎలా వచ్చింది? అతని పోలికల్లో ఎవరైనా అక్కడ వున్నారా? అనే సంగతి ఆలోచిద్దామని వాళ్లకు తోచనైనా తోచలేదు. రాత్రి కట్టప్ప కథ చెప్పేటప్పుడు కట్ట ఎక్కి కూర్చుని అన్నీ ఒకేసారి తెలుసుకుందామని కాళ్లు జాపుకుని కూర్చున్నారు. ఇలాటి సోంబేరి విప్లవసేన వుంటే యిక విప్లవం వచ్చినట్లే!

భీష్ముడి మోడల్లో కట్టప్ప కారెక్టరు తయారుచేశారు. ధర్మమో, అధర్మమో సింహాసనానికి కట్టుబానిస అయినవాడు నిన్ను తప్పిస్తానని దేవసేనకు ఎలా ఆఫర్ చేశాడు? శివుడు యువరాజు తల నరికితే అతనిపై కత్తి దూసేబదులు, అతని పాదాలు నెత్తిమీద పెట్టుకుంటాడా? అదేం రాజభక్తి? ఆ కారెక్టరూ చెడింది. చివర్లో అతను బాహుబలిని కత్తితో పొడవడం రెండు భాగాలకు మధ్య పెద్ద యింటర్వెల్ బ్యాంగ్ అనుకోవాలి. "సింహాద్రి"లో హీరో, హీరోయిన్ తండ్రిని కాల్చి చంపేస్తాడని గుర్తు. ఎందుకురా అంటే ఆయన చేతిలోని సూటుకేసులో ఆయనకు తెలియకుండా పెట్టిన బాంబుతో రైలెక్కితే రైల్లో చాలామంది ప్రాణాలు పోతాయి కనక అని చెప్పినట్టున్నారు. రైలెక్కకుండా చేయడానికి, లేదా సూటుకేసు కిందపడేట్లు చేయడానికి ఏ కాలిమీదో, చేతిమీదో కాలిస్తే సరిపోయేది కదా! హీరో మంచి షూటరు కూడా. కాలిమీద కాలుస్తూంటే వాయుదేవుడు మాయ చేసి వీపులో బుల్లెట్టు దిగేట్టు చేశాడా? ఏమో గుర్తులేదు. ఇప్పుడు కన్నప్ప విషయంలో కూడా యిలాటి ట్రిక్కు ఏదో పెట్టి వుండవచ్చు. ఇంటర్వెల్ ముందు విగ్రహ ప్రతిష్ఠాపన, బాహుబలి నామోచ్చరణ, క్లయిమాక్సుకు ముందు యుద్ధం పెట్టి ఆకట్టుకున్నట్లు బ్యాంగ్‌గా వెన్నుపోటు పెట్టుకున్నారు.

ఇక బాహుబలి, భల్లాల దేవుడు నైజం, వీరత్వం చూపడానికి గట్టి ఉదంతమే లేదు. ఒక గూఢచారి గురించి వెతకడానికి యిద్దరు యువరాజులు బయలుదేరడం చాలా ఫ్లిమ్జీగా వుంది. వాళ్ల వెనక్కాల తోకలా కన్నప్ప వెళ్లడం దేనికి? తనొక్కడే వెళ్లవచ్చుగా? ఐటమ్ సాంగ్ చేయడం రాదనా? అక్కడ తాడు సన్నివేశం లక్ష్యం భల్లాల దేవుని క్రౌర్యంతో బాటు బాహుబలి అమాయకత్వం (విచక్షణారాహిత్యం అందామా) కూడా చూపడమా? విదేశీయులు ఎందుకైనా దండయాత్ర చేయవచ్చు, కానీ యీ రాజ్యంలో జరిగిన కొన్ని కుట్రల లేదా ఘటనల పర్యవసానంగా... అని కల్పించి వుంటే అందంగా వుండేది. లేకపోతే ఆ యుద్ధం సినిమాలో ఎక్కడైనా పెట్టవచ్చు. క్లయిమాక్సుకే వాడవలసిన అవసరం లేదు. అలాగే శివలింగం ఎత్తడం పోస్టరు చూస్తే దానికి కథలో ఏదో ప్రాముఖ్యత వుందనే భ్రమ కలిగింది. తెరపై చూస్తే ఏమీ లేదు. పోనీ అలా కదిలించడం వలన అనర్థం జరిగిందని అందరూ అనుకునేట్లా సంఘటనలు పేర్చుకున్నా బాగుండేది. సర్కస్ ఫీటు చేసినట్లు హీరో ఓసారి లింగాన్ని పెకిలించి, మోసేశాడు.

బాహుబలి టెక్నికల్‌గా ఎంత గొప్పగా వున్నా సరే, కథ బాగా లేదు. ఆట్టే మాట్లాడితే కథే లేదు. పదేళ్ల కుర్రవాడు యింత కన్న ఎక్కువ ట్విస్టులు పెట్టగలడు. కానీ బాహుబలి వీరాభిమానులు చాలామంది వున్నారు. వారంతా ఏ సందేహం లేవనెత్తినా 'రెండో భాగంలో వస్తుంది' అని జవాబిస్తున్నారు, అక్కడికి రాజమౌళి వచ్చి వీళ్లకేదో చెవిలో చెప్పినట్లు! కథ ఏమిటో సినిమావాళ్లు బయటకు పొక్కనివ్వరు. పూర్తి కథేమిటో చాలామంది నటీనటులకే తెలియదు. అయినా మొదటి భాగంలో యింతే కథ అని యీ అభిమానులు ముందుగా మనకు చెప్పారా? భాగాలుగా వున్న హాలీవుడ్ సినిమాలు ఏ సినిమాకు ఆ సినిమా చూసేట్లు వుంటాయి. ఉదాహరణలు కోకొల్లలు. హిందీ సినిమా "మేరా నామ్ జోకర్" సినిమాను రెండు భాగాలుగా తీద్దామనుకున్నారు. కథానాయకుడికి మొత్తం ఏడుగురు స్త్రీలతో కలిగిన అనుభవాల సమాహారం అది. మొదటి భాగంలో 30-35 ఏళ్ల వయసు వరకు ముగ్గురు స్త్రీలతో కలిగిన అనుభవాలు చూపారు. రెండో భాగంలో తక్కిన నలుగురు రావాలి, వారిలో ఒకరు భానుమతి అని ప్రకటన కూడా వచ్చింది. మొదటి

భాగంలో 35 ఏళ్ల వయసులో పద్మిని ఎపిసోడ్ తర్వాత ఫ్లాష్ ఫార్వార్డ్ చేసి 70 ఏళ్ల వయసులో ముసలాణ్ని చూపించి చివర్లో 'పాజిబ్లీ నాట్ – ద ఎండ్' లాటిదేదో చూపారు. కానీ మొదటి భాగం ఫెయిలు కావడంతో రెండో భాగం తయారీ ఇంపాజిబుల్ అయిపోయింది. మొదటిభాగం మాత్రమే చూసినా, సినిమా అసమగ్రం అనే ఫీలింగు రాదు. నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు, కానీ ఏదో చెప్పకుండా వదిలేశాడు అనే భావం కలగదు. బాహుబలి కూడా అలా తీసి వుండాలి. కథ పూర్తిగా చెప్పేస్తే రెండో భాగానికి రారు అనే అపనమ్మకం దేనికి? బాగా తీస్తే రాక ఛస్తామా? కథ లేకుండా సినిమా తీయగలనని పూరీ జగన్నాథ్ ఆ మధ్య స్టేటుమెంటు యిచ్చారు. దాన్ని రాజమౌళి అమలులో పెడదామని చూస్తే మాత్రం నాబోటి వాళ్లు రెండో భాగం చూడడానికి ఆత్రపడం. తెలుగువాణ్ని ఒకసారి ప్రోత్సహించాం చాల్లే అని మమ్మల్ని మేం సముదాయించుకుంటాం. అంతమాత్రాన అది ఆడదని కాదు. దీనిలాగే దాన్నీ కథతో కాకుండా మార్కెటింగ్‌తో విజయవంతం చేయగల సమర్థులు దీని నిర్మాతలు, పెట్టుబడిదారులు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

**జులై 32** **ఎమ్బీయస్ : బాహుబలి వ్యాసంపై విమర్శ**

బాహుబలిలో కథ చాల్లేదని నేను రాసిన దానిపై కొందరు ప్రేక్షకులు విరుచుకుపడ్డారు. వ్యాసం నచ్చినవారికి నమోవాకాలు చెపుతూ, ఆ విమర్శలకు నా సమాధానం యిస్తున్నాను. ముందుగా కొన్ని సందేహాలను నివృత్తి చేస్తున్నాను. ఆంధ్రలో కొన్ని ప్రాంతాల్లో నిషేధించబడుతూన్న ఎన్‌టివి వారు నా వ్యాసంలోని భావాన్ని ఉపయోగించుకుంటూ ఆదివారం సాయంత్రం ఒక కార్యక్రమం చేశారనీ, దీనిలో ఏదో గూడుపుఠాణీ వుందని కొందరు అభిప్రాయపడ్డారు. ఎన్‌టివితో నాకు ఏ సంబంధమూ లేదు. సమాచారం నచ్చితే ఎవరైనా వాడుకుంటారు. కొన్ని పదబంధాలు కూడా. ఆ మధ్య 'ఆపసోపాంధ్ర' అని కాప్షన్ పెడితే అది కూడా వాళ్లు వాడుకున్నారు. 'ఎన్టీయార్‌కు నైతిక విలువలు లేవు' అంటూ చంద్రబాబు ఇండియా టుడేకు యిచ్చిన యింటర్వ్యూను నేను స్కాన్ చేసి నా కాలమ్‌లో పెడితే, యిటీవలి కాలంలో బాబు ఎన్టీయార్ పేరు చెప్పుకుని ఓట్లడగడాన్ని విమర్శిస్తూ వైసిపి నాయకులు ఆ సమాచారాన్ని వాడుకున్నారు. నేను కూడా నాకు ఉపయోగపడే సమాచారాన్ని వేరే చోట నుండి తీసుకుంటాను కదా. అంతమాత్రం చేత దీనిలో కుట్ర కోణం వుందనకూడదు. గ్రేట్ ఆంధ్రలో సినిమా సమీక్షలకు, నాకు ముడిపెట్టి కొందరు రాశారు. వాటికి, నాకు ఏ సంబంధమూ లేదు. ఒకాయన నేను రివ్యూ ద్వారా 20% విషమూ, యీ వ్యాసం ద్వారా 80% విషమూ కక్కానని రాశారు. రివ్యూ చేసినది గణేశ్ రావూరి అనే ఆయన. పాఠకుడు గమనించాలి. తమిళుల ఉచ్చారణ గురించి ఒకాయన అడిగారు. పదం మొదట్లో వచ్చిన పరుషం (క,చ,ట,త,ప) అలాగే వుంటుంది. ఉదాహరణ – కరుణానిధి. మధ్యలో వచ్చిన పరుషం సరళంగా (గ,జ,డ,ద,బ) పలికేస్తారు. ఉదాహరణ – మరకదమణి. దీనికి వ్యాకరణసూత్రం ఏమీ లేదు. తెలుగులో అలా మారడానికి ముందు పదం ద్రుతం (న్‌తో అంతమయ్యే పదం) అయి వుండాలి.

నేను పైరేటెడ్ సిడి చూసి రాసి వుంటానని ఒకాయన వూహించేశారు. నేను పైరేటెడ్ సిడిలు చూడను. అది అధర్మం అని నా భావన. కొన్ని సినిమాలు హాల్లో చూద్దామనుకుంటూండగానే వెళ్లిపోతాయి. వాటి విషయంలో కూడా అఫీషియల్‌గా సిడిలు వచ్చేవరకూ వెయిట్ చేస్తాను తప్ప పైరేటెడ్ చూడను. అది సినిమా పరిశ్రమను దెబ్బ తీయడమే అని నేను నమ్ముతాను. ఈ సినిమా విషయంలో ప్రభుత్వం రెండు వారాల వరకు పైరెటెడ్ సిడీ మార్కెట్లోకి రాకుండా కాపు కాసిందని విన్నాను. అన్ని సినిమాలకూ అదే చేసి, ప్రభుత్వాదాయాన్ని పెంచాలని నా ఆశ. పైరసీని అరికడుతూనే టిక్కెట్ల బ్లాక్‌మార్కెటింగును ఉపేక్షించిందని విన్నాను. అది నిజమైతే ప్రజలకు ద్రోహం చేసినట్లే. ఎందుకంటే ప్రేక్షకుడు యిచ్చిన డబ్బుపై ప్రభుత్వానికి పన్ను వస్తుంది. అది వదులుకోవడం, బ్లాక్ మనీని ప్రోత్సహించడం నేరం. ఏ సినిమా ఐనా సాధ్యమైనంతవరకు థియేటర్లో చూడాలనే నా కోరిక. ఎందుకంటే సినిమా తీసినతను పెద్ద స్క్రీన్‌మీద చూసేందుకు అనువుగానే ప్లాన్ చేసి తీస్తాడు. టీవీ సీరియల్ తీసినతను టీవీ స్క్రీన్‌పై చూడాలని కోరుకుంటాడు. అలా చూస్తేనే అందం. మొబైల్‌లో సినిమా చూసేసి, చూసేశా అనుకోవడం సినీస్రష్టను అవమానించినట్లే. అలాగే సినిమా పాటలు ముందుగా రిలీజైనా వినను. వాటిని దృశ్యంతో కలిపి చూడమనే దర్శకుడి భావం. మొదటిసారి అలాగే చూడాలి. విడిగా వినేసి, దృశ్యాన్ని మనం ఏదేదో వూహించేసుకుని, తెరమీద అలా కనబడకపోతే నిరాశపడి... ఎందుకొచ్చిన రొష్టు! నాకు సినిమాలు చూడడం రాదని కొందరు తీర్మానించారు. వేలాది సినిమాలు చూసినా, యిప్పటికీ చూస్తున్నా, సినిమాల గురించి రాసినా, నందీ ఎవార్డు తెచ్చుకునే స్థాయిలో వాటిపై పరిశోధనాత్మక ఫీచర్ చేసినా యింకా చూడడం రాకపోవడం జాలిపడాల్సిన విషయమే. కానీ ప్రేక్షకుల్లో నాలాటి వర్గం కూడా ఒకటి వుంటుందని దర్శకులు గమనించి సినిమాలు తీస్తే మంచిది. 'నా బోటి నిశానీ గాళ్లకోసం సినిమా తీస్తున్నా' అని కెవి రెడ్డిగారు చెప్పుకునే వారట. అలాగ కథకోసం వెతికే నా బోటి సన్నాసులు యింకా వున్నారని సినీజనాలు గుర్తించాలి.

నా బోటి సన్నాసులు సినిమా పుట్టినప్పటినుంచీ వున్నారు. మొదట్లో కదిలే బొమ్మలు చూపిస్తే చాలనుకున్నారు నిర్మాతలు. రైలు స్టేషన్‌లోకి రావడం, సముద్రం పొంగడం యిలాటి దృశ్యాలు హ్రస్వచిత్రాలుగా తీసి చూపేవారు. కొత్త మోజు కొద్దిరోజుల్లోనే తీరిపోయింది జనాలకు. కథేదీ? అని అడగసాగారు. ఇదొకటా అనుకుని అప్పుడు కథలు అల్లసాగారు – చిన్నదో, పెద్దదో ఏదో

ఒకటి. చాప్లిన్ తీసిన మూకీ హ్రస్వచిత్రాలు చూడండి. పార్కుకి రావడం, అక్కడేదో సంఘటన జరగడం యిలాటివి చూపించేవారు. తర్వాత తర్వాత పూర్తికథతో పెద్దనిడివి సినిమాలు తీశారు. నిజానికి తోలుబొమ్మలాటలో కూడా కథ వుంటుంది. బొమ్మలు మాట్లాడలేవు కాబట్టి, వెనక్కాల నుంచి కథ చెప్తారు. ఆ బొమ్మ వేసుకున్న రంగురంగు దుస్తులు చూసి, తాళ్లు కనబడకుండా మాయ చేసిన టెక్నాలజీ చూసి సరిపెట్టుకో అనలేదు. అమ్మాయి బాగుంది అనాలంటే మొహం, ఫీచర్స్ బాగుండాలి. ఆమె వేలి వుంగరం బాగుంది, కాళ్ల గజ్జెలు బాగున్నాయి అన్నారంటే మొహం నామొహంలా వుందన్నమాట! ''రాజేశ్వరీ కాఫీవిలాస్ క్లబ్'' షూటింగప్పుడు అసిస్టెంటు డైరక్టరు మురారి మెట్ల మీద తిరగబడిన ఒక మువ్వను సరిచేయబోతే చక్రపాణి అన్నారట – ''ప్రేక్షకుడు మెట్లు దిగి వస్తూన్న హీరోను కాకుండా ఆ మువ్వను పట్టించుకున్నాడంటే యిక సినిమా ఆడినట్లే..'' అని. ప్రేక్షకుడు కథలో లీనం అయినప్పుడు మెట్లమీద ఏ రంగు కార్పెట్ వేశారు, ఎలాటి మువ్వలు పెట్టారు అని చూడడు. లీనం కాలేనప్పుడే యివన్నీ నోటీసులోకి వస్తాయి. బాహుబలిలో వాటర్ ఫాల్స్ బాగున్నాయి, యుద్ధం సీన్లు బాగున్నాయి అని చెప్పుకోవడంలోనే సినిమా అసమగ్రత బయటపడుతోంది. సినిమా ఎలా వుంది అని అడిగితే బ్రహ్మాండంగా వుంది అనకుండా విజువల్స్ బాగున్నాయి అని క్వాలిఫై చేస్తున్నారు. అక్కడే లోపం తెలుస్తోంది.

తక్కిన హంగులపై దృష్టి ఎక్కువ పెట్టి కథను నిర్లక్ష్యం చేయడంపై రమణగారు ''గిరీశం లెక్చర్లు''లో వెటకరించారు. – ''వాటీజినే సినిమాస్టోరీ! కథంటూవుంటే అడ్డమైనవాడూ దాన్ని దుయ్యబెడతాడు. అంచేత మనకొద్దు.... జనం పాటలూ, డాన్సులూ అంటే చెవికోసుకుంటారు. పద్యాలు కూడా తోసేసి రెండు చెవులూ కోసుకోమనండి. ఇన్ని ఉన్నాక ఇంక కథా కాకరకాయ కూడా పెడితే మొహం మొత్తిపోతుంది.'' అని. రాజమౌళి ''బాహుబలి'' విషయంలో యిలాగే ఫీలై వుంటారు. విజువల్స్, సెట్టింగులు పెట్టాక కథ కూడా పెడితే మొహం మొత్తిపోతుందని! కథ, విజువల్ రెండిటికీ తూకం కుదరాలి. ''అనగనగా ఒక ధీరుడు'' సినిమా వాల్ట్ డిస్నీ వాళ్లు తీశారు. కన్నుల పండుగగా వుంది. కానీ కథ చాలక ఆడలేదు. ''కర్ణ'' సినిమా వుంది. ''సీతారామ కళ్యాణం'', ''శ్రీక ృష్ణ పాండవీయం'' వంటి ఎన్టీయార్ సొంత సినిమాలతో పోలిస్తే టెక్నిక్కు చాలా నాసిగా వుంది. అయినా స్నేహం సెంటిమెంటు, కులవివక్షత కారణంగా ప్రతిభావంతుడు నష్టపోవడం సెంటిమెంటు పండాయి. డైలాగులు పేలాయి. 25 వారాలు ఆడించారు. దారాలు కనబడ్డాయని చూడడం మానేయలేదు. ఇదంతా 'నీ బోటి పాతకాలం మనుష్యుల గాథ. నేటి ప్రేక్షకులకు కథ అక్కరలేదు, టెక్నాలజీ చాలు' అనేవాళ్లు ''ఐ'', ''కొచ్చాడియన్'' ఎందుకు ఆడలేదో చెప్పాలి. రమణగారి ఫోటో యీ సినిమా మొదట్లో చూపించారు కదా, ఆయన్ని ఓసారి అడిగాను – ''మీ సినిమాలు కొన్ని ఫెయిలయ్యాయి కదా, రిలీజుకు ముందే ఆత్మీయులకు చూపించి తప్పులు దిద్దుకుంటే బాగుండేది కదా'' అని. ''చూపించినా లాభం లేదండీ, కథ ఎలా వుంది, దాన్ని తెరపై ఎలా చెప్పాం అది చూడు చాలు అంటే అది చూడరు. మూడో రీల్లో లైటు గ్లేరు కొట్టిందని, ఎనిమిదో రీలులో సెట్టింగు 'గాడీ'గా వుందని యిలాటి కామెంట్స్ చేస్తారు. అందుకే అడగడం మానేశాం'' అన్నారు. ఆయనా కథ, కథనం నచ్చిందా లేదా అనే వర్రీ అయ్యేవారు.

రమణగారు పాతతరం మనిషని తీసిపారేసేవాళ్లు విజయేంద్ర ప్రసాద్‌గారు ఆంధ్రజ్యోతికి యిచ్చిన యింటర్వ్యూ చూడాలి. ''భజరంగీ భాయిజాన్'' సినిమా చూసి సల్మాన్ ఖాన్ తండ్రి, సుప్రసిద్ధ రచయిత సలీం 'మా వాడి రెమ్యూనరేషన్ కంటె కథకుడిగా మీరు ఒక రూపాయి ఎక్కువ పుచ్చుకోవాలి' అన్నారట. అదీ కథకు, కథకుడికి వున్న వేల్యూ. ఆ కథ గురించి రచయితగా విజయేంద్ర ప్రసాద్ చాలా గొప్పగా చెప్పుకున్నారు. బాహుబలి గురించి కూడా అలా చెప్పుకోగలగాలి అని అనుకోవడం అత్యాశా? కథంతా రెండో పార్టులో వుంటుందని బాహుబలి అభిమానులు నొక్కి చెపుతున్నారు. అదే యింటర్వ్యూలో విజయేంద్ర ప్రసాద్ 'బాహుబలి పార్ట్ 2 భారమంతా నెత్తిమీద వున్నట్టుంది' అన్నారు. మొత్తం కథ లాక్ చేయకుండానే బాహుబలి నిర్మాణానికి దిగారా? లాక్ చేసేసిన తర్వాత ఎలా ఎగ్జిక్యూట్ చేయాలాని దర్శకుడికి నెత్తిమీద భారం వుంటుంది తప్ప, రచయితకు ఏముంటుంది? కాస్త కన్‌ఫ్యూజింగ్ వుంది. 'పాత' అంటే గుర్తుకు వచ్చింది. నేను నా వ్యాసాల్లో పాతాళభైరవి గురించి ప్రస్తావిస్తే యిప్పుడు దాన్ని ఎవరు చూస్తారండి అంటూ కొందరు రాశారు. అది తీసేనాటికే అలాదీన్ అద్భుతదీపం కథ అతి పాతది. దాన్ని ముందు పెట్టుకుని దీన్ని తీశారు. ఆడింది. రాజమకుటంలో విప్లవం ట్రాక్‌ను ఎన్టీయార్ తన 'వేములవాడ భీమకవి'లో వాడుకున్నారు. అయినా నేను ప్రస్తావించిన సినిమాల తర్వాత కూడా చాలా జానపద సినిమాలు వచ్చాయి. సింహాసనం, సింహగర్జన, సింహబలుడు, భైరవద్వీపం.. యిలా బోల్డు. ఆదిత్య 369లో కూడా కొంతభాగం జానపదమే కదా. మగధీరలో చెప్పనే అక్కరలేదు. హాలీవుడ్‌లో యీ మధ్య తీస్తున్న సినిమాలు జానపదం కావా? వాటిలో కథ లేదా? ఇది చారిత్రాత్మకం కాదు, జానపదం, కథను యిష్టం వచ్చినట్లు మార్చుకోవచ్చు. పాత కథలు చూడరనేది తప్పు. రామాయణం, భారతం వేల సంవత్సరాల పాతవైనా చూశారు, చూస్తారు. ఎమోషన్స్ క్యారీ అవ్వాలంతే. హాలీవుడ్‌లో టెన్ కమాండ్‌మెంట్స్ కథ ఎంత పాతది? ట్రాయ్ కథ..? కథ నచ్చి కనక్ట్ అయితే ప్రేక్షకుడు ఏదైనా చూస్తాడు. పాత కథే తిప్పితిప్పి మళ్లీ అదే చెప్పినా ఓకే అంటాడు. అసలు కథే అక్కరలేదంటేనే వస్తుంది చిక్కు.

కథ లేకపోయినా టెక్నాలజీ విషయంలో హాలీవుడ్‌తో పోటీ పడి తీశారు కాబట్టి చూసి తీరాలి అనే వాదన నాకు రుచించదు. అసలు పోలిక లెందుకు? మన సత్తా, మార్కెట్ మనవి. వాళ్ల సత్తా, మార్కెట్ వాళ్లవి. ''రోబో'' సినిమా చూసి ''టెర్మినేటర్''లో యింతకంటె బాగుంది అనే వ్యాఖ్యలు వింటే ఒళ్లు మండుతుంది. పక్కింటివాళ్ల పిల్లాడు అందంగా వున్నాడని మనం పిల్లల్ని తక్కువ చేస్తామా? ''రోబో'' మన ప్రోడక్ట్. కథ, ఎమోషన్స్ అవీ బాగా కుదిరాయి. బీ హ్యాపీ. హాలీవుడ్‌తో పోటీ పడడం అంటే నాకు నవ్వొచ్చేస్తుంది. బికె ఆదర్శ్ అనే ఓ దర్శకనిర్మాత, అతని భార్య జయమాల కలిసి ''హరిశ్చంద్ర తారామతి'' అని 1970లో ఓ సినిమా

తీశారు. అంతా బి గ్రేడ్ వ్యవహారం. ఆ పై ఏడాది వాళ్లు ''మర్డర్ యిన్ సర్కస్'' అని జయమాలతోనే తీశారు. అయితే యీ సినిమాకు వాళ్లు యిచ్చిన యాడ్స్‌లో 'ఇండియాస్ ఆన్సర్ టు టెన్ కమాండ్‌మెంట్స్' అని యిచ్చారు. పడిపడి నవ్వుకునేవాళ్లం. కథ విషయంలో హరిశ్చంద్రుడి కథ, మోజెస్ కథతో సరితూగవచ్చు. కానీ సినిమా..? ఇలాటి కబుర్లు చూశాక యీ నాడు 'హాలీవుడ్‌తో తులతూగే..' అని ఎవరన్నా ఎందుకొచ్చిన రొష్టు అనిపిస్తుంది. అయినా ''గ్రేవిటీ'' సినిమా ఎంత ఖర్చు పెట్టినా తీసినా నాకు నచ్చలేదు. హాలీవుడ్డే మనకు కొలబద్ద కాదు. మన వాతావరణంలో మనకు తగిన సినిమా తీస్తే చాలు అనుకుంటే చాలు.

నా విమర్శను ఖండిస్తూ కొందరు కొన్ని అంశాలు లేవనెత్తారు. మొదటి భాగం చివర ఓపాటి ముగింపైనా అక్కరలేదని వాదిస్తూ ఒక కథకు రెండు క్లయిమాక్సులు వుంటాయా? అని ఒకాయన అడిగారు. మాయాబజారు సినిమాకు క్లయిమాక్సు వుందా లేదా? పాండవ వనవాసంకు వుందా లేదా? నర్తనశాలకు...? పాండవుల స్వర్గారోహణ క్లయిమాక్సు అనుకుంటే యివన్నీ ఉప క్లయిమాక్సులనుకోవచ్చు. రాజమౌళి మహాభారతం తీస్తారట. ఆయన మొదటి భాగాన్ని బాహుబలి స్టయిల్లో తీస్తే ఎక్కడ ఆపుతాడో వూహించండి. పాండవులు అరణ్యవాసం చేస్తున్నారు. శిష్యులతో సహా భోజనానికి వస్తానని చెప్పి దుర్వాసుడు నదీస్నానానికి వెళ్లాడు. ఇంట్లో అన్నం ఏమీ లేదు. ద్రౌపది గిన్నెలు వెతుకుతోంది – ఎక్కడైనా అన్నం మెతుకు కనబడుతుందా అని. అంతలో 'ముగింపు వచ్చే ఏడాది' అని తెరపై కనబడుతుంది. రాజమౌళి కథ ముందుగా చెప్పేస్తారు అని ప్రతీతి. బాహుబలి, ద బిగినింగ్‌లో 'కథ లేదు టెక్నాలజీయే' అని ముందే చెప్పేస్తే ఆ మేరకు నా బోటివాళ్లం ప్రిపేరు అవుతాం కదా. ఇక అనుష్క వద్ద కట్టెలు ఎక్కణ్నుంచి వచ్చాయన్న దానికి సమాధానంగా ఒకాయన భల్లాల దేవుడి కొడుకు అనుష్కను పొడవడానికి తెచ్చుకుంటూంటాడు అని చెప్పాడు. అంటే అనుష్కను చూడాలి అనుకున్నప్పుడల్లా ఓ ఎండుకొమ్మ సంపాదించి బయలుదేరతాడా? ఊహించుకుంటేనే నవ్వొస్తోంది. ఎవడైనా యువరాజు పక్కనున్న భటుడి చేతిలోని బరిసె లాక్కుని పొడుస్తాడు తప్ప యింటి దగ్గర్నుంచి ఎండు కొమ్మలు చేతపట్టుకుని రాడు. ఇదివరకైతే సెట్టింగు వేసేవారు. సెట్ ప్రాపర్టీస్ చూసుకునేవారు. బ్లూ మాట్ టెక్నాలజీ కాబట్టి బాక్‌గ్రౌండ్‌లో చెట్టు పెడదాం అనుకుని షూట్ చేసేసి వుంటారని నా అనుమానం. తర్వాత చెట్టు మర్చిపోయారేమో! తెలియదు. ఇక హీరోయిన్ తన పని హీరోకి అప్పగించడాన్ని సమర్థిస్తూ కొండ ఎక్కి వచ్చాడు కాబట్టి శక్తిమంతుడని నమ్మింది అన్నారు ఒకాయన. శక్తి వుండగానే చాలదు, యుక్తి కూడా వుండాలి, ముఖ్యంగా మోటివేషన్ వుండాలి. భల్లాల దేవుడిపై కసి, దేవసేనపై జాలి వుండాలి. పరదేశికి అవన్నీ వుంటాయన్న నమ్మకం ఏమిటి? గూఢచారియేమో! పైగా అతను నీటికొండ ఎక్కి వచ్చాడన్న నమ్మకం ఏమిటి? సొరంగంలోంచి వచ్చి వుండవచ్చుగా. ఆ సొరంగం కింద నుంచి మూసి వుంది కానీ పై నుంచి తెరిచే వుందిగా. ఆ ప్రాంతపుదే కాబట్టి తెరిచివున్న సంగతి ఆమెకు తెలిసే వుంటుంది. కింద బండరాయి తీయించుకుని సొరంగంలోంచి వచ్చాడేమో అని సందేహించవచ్చు. సినిమాలో లాజిక్ గురించి పెద్దగా వర్రీ కానక్కరలేదు కానీ పాత్ర ఔచిత్యం దెబ్బ తినకూడదు.

విమర్శను ఎదుర్కోవడానికి దాదాపుగా అందరూ ఉపయోగించినది –తెలుగు సెంటిమెంటు. తెలుగువాళ్లు తీశారు కాబట్టి చూడాలిట. తమిళవాళ్లయితే అలా చూస్తారట. మనకు జాతి అభిమానం లేదట. ఇస్లాందేశాల్లో మతమౌఢ్యం వుంది కాబట్టి మనమూ మూఢంగా వుండాలని వాదించినట్లుగా వుంది – తమిళులకున్న షావనిజం మనకూ వుండాలని వాదించడం. కానీ నిజం చెప్పాలంటే తమిళు లకు సినిమాల విషయంలో అలాటిది లేదు. తమిళవాళ్లు తీశారు కదాని కొచ్చాడియన్, ఐ, లింగ చూశారా? లేదే! వాళ్ల హిస్టరీ గురించి అయితే చూస్తారు అని కూడా అనుకోవద్దు. ''రాజరాజచోళన్'' అనుకున్నట్టుగా ఆడలేదు. ''కప్పలోట్టియ తమిళన్'' ఆడలేదు. ఎమ్జీయార్ ఆఖరి సినిమా అయిన ''మదురై మీట్టియ సుందరపాండ్యన్'' ఫ్లాపయింది. తెలుగువాళ్లమూ అంతే. కృష్ణదేవరాయలుపై ఎంతో అభిమానం వున్నా కన్నడ కృష్ణదేవరాయలును తెలుగులోకి డబ్ చేస్తే ఆడలేదు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా నడిచేటప్పుడు కూడా కొమురం భీమ్ ఆడలేదు. తెలుగువాళ్లు తీశారు కాబట్టి చూడాలి అనే సెంటిమెంటు యీ సినిమాతోనే ప్రారంభమైందా? తెలుగు పరిశ్రమలో తెలుగువాళ్లే సినిమాలు తీస్తున్నారు లేదా పంపిణీ చేస్తున్నారు. అయినా రిలీజైన సినిమాల్లో 90% సినిమాలను ఫ్లాప్ చేయిస్తున్నాం. టీవీల్లో తెలుగు సీరియల్స్‌ను పట్టించుకోకుండా తమిళ, హిందీ డబ్బింగు సీరియళ్లు చూస్తున్నాం. డబ్బింగులు చూడం, తెలుగులో తీస్తేనే చూస్తాం అని అనటం లేదేం? ఎక్కడికి పోయింది మన తెలుగు అభిమానం? ఈ సినిమాతో పుట్టి యీ సినిమాతోనే అంతమై పోతోందా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (జులై 2015)**

**ఆగస్టు 02** **ఎమ్బీయస్ : యాకూబ్ మెమన్ ఉరి**

యాకూబ్ మెమన్‌కు ఉరి వేసేదాకా నా ప్రాణం బిక్కుబిక్కుమంటూనే వుంది, ఏదో ఒకటి జరిగి ఉరి ఆగిపోతుందేమోనని! ఉరి గురించి చర్చలు, ప్రకటనలు జోరుగా సాగాయి మరి. నాగరికత యింత పెరిగిన తర్వాత కూడా యింకా ఉరి వేయడమేమిటి? వేసినా మానినా టైగర్ మెమన్‌కు వెయ్యాలి తప్ప యితని కేమిటి? ఇలా వేస్తే భారత దేశాన్ని, న్యాయవ్యవస్థను, పోలీసు వ్యవస్థను యింకెవరైనా నమ్ముతారా? అతను ముస్లిం కాబట్టి వేస్తున్నారు కానీ హిందువైతే వేసి వుండేవారా? హిందువే అయినా అగ్రకులస్తుడైతే వేసేవారా? పోలీసు విచారణలో సహకరించాడు కదా, అలాటివాణ్ని ఉరి వేయడం సబబా? విద్యావంతుడు, జైల్లో యితరులకు చదువు చెప్పాడు, యిలాటివాణ్ని ఉరేసి మనం ప్రపంచానికి ఏం సందేశం పంపుతున్నా? వేసి వుంటే ఎప్పుడో వేయాలి కానీ యింత

ఆలస్యమా? ఇన్నాళ్లూ బతకనిచ్చి, అతనిలో ఆశ రగిలించి యిప్పుడు చంపేయడం అమానుషం – ఇలా రకరకాల వ్యాఖ్యలు చేసినవారిలో మేధావులు, ఉదారవాదులు, రాజకీయనాయకులు, పని కట్టుకుని భిన్నంగా ఆలోచించడంలో అనురక్తి కలిగినవారు అందరూ వున్నారు. వీళ్లందరి కృషి ఫలితంగా, గగ్గోలు ఫలితంగా ఆఖరి నిమిషంలో క్షమాభిక్ష పెట్టేస్తారేమో అనుకున్నాను. ఎందుకంటే స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నుంచి ఉరిశిక్ష పడిన వారిలో 1% మందిని మాత్రమే ఉరి తీశారట.

ఇలాటి విషయాల్లో ఎవరి అభిప్రాయాలు వారివి. నా మటుకు నేను ఉరిశిక్ష రద్దు చేయాలని వాదించను. 'ప్రాణం పోసే భగవంతుడికి మాత్రమే ప్రాణం తీసుకునే హక్కు వుంది, మానవమాత్రుడికి లేదు' అనేది సినిమా డైలాగుగా బాగుంటుంది. మరి సాటి మనిషి ప్రాణాలు హరించే మనిషి దగ్గర యీ డైలాగు పేలుతుందా? వాడు ఎడాపెడా చంపేస్తూన్నా, మనం మాత్రం వాణ్ని నిలవరించకూడదా? వాడికి వేసే ఉరిని కొందరు సమాజం చేస్తున్న హత్యగా వర్ణించడం ఏం సబబు? వాడిలా సమాజం వ్యక్తిగత కక్షతో, ప్రతీకారేచ్ఛతో చంపటం లేదు, చాటుమాటుగా చంపటం లేదు, చంపేసి పారిపోవడం లేదు. ఈ తీర్పు ద్వారా మళ్లీ యిలాటి నేరం చేయబోయేవాడికి హెచ్చరిక యిచ్చి, తన పౌరులను రేపటి దాడుల నుంచి రక్షించుకుంటోంది. తీర్పు యిచ్చే న్యాయాధీశుడికి ముద్దాయితో ఏ మాత్రం పరిచయం వున్నా అతను కేసు నుంచి తప్పుకుంటాడు. ఇరువైపుల వాదోపవాదాలు విని, సాక్ష్యాలు పరిశీలించి, పరీక్షించి, నిగ్గు తేల్చి చివరకు నిర్మోహంగా, రాగద్వేషాలకు అతీతంగా వున్న మనసుతో తీర్పు యిస్తాడు. చాలా సందర్భాల్లో ఆ తీర్పు వెలువడడానికి ఏళ్లూ, పూళ్లూ పడుతుంది. అప్పటివరకు ఖైదీకి ఆ ఆయుర్దాయం బోనస్‌గా లభించినట్లే. అప్పుడు మళ్లీ కొందరు 'ఖైదీ వృద్ధుడు, శిక్ష అనుభవించలేడు' అని అప్పీలుకి వెళతారు.

నిజానికి తీర్పు యిచ్చేటప్పుడు న్యాయమూర్తులు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ముఖ్యంగా ఆవేశంలో నేరం చేశాడా, పథకం వేసి చేశాడా అనేది అతి ముఖ్యమైన పాయింటు. ఆత్మరక్షణకో, ఆత్మీయుల రక్షణకో, లేక ఆత్మీయుల చెడునడత కారణంగానో ఆవేశానికి లోనై (క్రైమ్స్ ఆఫ్ పేషన్) అప్పటికప్పుడు చేతికి ఏది అంది వస్తే దానితో ఎదుటి వ్యక్తిని చంపేస్తే దానికి శిక్ష ఒకలా వుంటుంది. ఎందుకంటే ఆవేశం అనేది మానవదౌర్బల్యం. అలా కాకుండా మనోబలంతో కుట్ర పన్ని, పథకం వేసి చంపాడంటే దాని అర్థం అతనికి సాటి మానవుల పట్ల జాలి, దయ లేవని. దానికి శిక్ష వేరేలా వుంటుంది. బొంబాయి పేలుళ్ల వంటివి ప్లాను చేయడానికి ఎన్నో రోజులు పడుతుంది. మనుష్యులు కావలసి వస్తారు, డబ్బు కావలసి వస్తుంది. ఇవన్నీ సమకూర్చుకునే టైములో మానవసహజమైన ఆవేశం వుంటే చల్లారిపోతుంది. చల్లారలేదంటే అతనిలో రాక్షసత్వం వున్నట్లే! ఇలాటి రాక్షసులను చంపితే చచ్చినవాళ్లు బతికి వస్తారా, దానికి బదులు వాళ్లను జైలులోనే వుంచి సంస్కరిస్తే మంచిది అని హితోక్తులు పలుకుతారు కొందరు. జైళ్లలో దుర్భరమైన పరిస్థితులున్నాయని, సంస్కరించ వలసిన అవసరం వుందని అందరికీ తెలుసు. ప్రతిపక్షంలో వుండగా వాటిని ఎత్తిచూపిన నాయకులు అధికారంలోకి రాగానే మర్చిపోతారు. మేమన్‌ను ఉరి వేసినా, వేయకపోయినా ఆ సంస్కరణలు అమలు చేయవచ్చు. నేరారోపణ ఏదీ లేకుండా జైల్లో మగ్గుతున్న వారిని విడిచిపెట్టవచ్చు. జైళ్లలో సకలభోగాలు అనుభవిస్తున్న సంఘవిద్రోహులను అణచవచ్చు. అవేమీ చేయటం లేదు. జైళ్లు నరకకూపాలుగా, మెత్తటి స్వభావం గల ఖైదీలు కూడా కరడుగట్టిన నేరస్తులుగా మారే ప్రమాదస్థలాలుగా వున్నాయని ఒప్పుకుంటూనే ఉరి తీయదగిన వ్యక్తులను అక్కడే వుంచి సంస్కరించాలనడం ఎలా పొసుగుతుంది? జైళ్లను చక్కదిద్దాక అప్పుడు వీళ్లను చక్కదిద్దడం గురించి మాట్లాడండి.

'వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదు కానీ ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదు' అనే కొటేషన్ కూడా వినడానికి బాగానే వుంటుంది. కానీ కాస్త ఆగి ఆలోచించండి – వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదా? తప్పించుకుని వాళ్లు ఏం చేస్తారు? శెనక్కాయలు అమ్ముతారా? వెయ్యిమంది కొత్త దోషులను తయారుచేస్తారు, పదివేలమంది నిర్దోషులను చంపుతారు. అది ఓకేనా? ఉరి తీయాల్సిన ఉగ్రవాదులను జైల్లో పెట్టి ప్రజలకు చెందవలసిన డబ్బుతో మేపుతున్నారు. ఎన్నాళ్లు? జైల్లో వుంచడం ఎంత ఖర్చుతో, మ్యాన్‌పవర్ వినియోగంతో, ఎంత రిస్కుతో కూడుకున్నది! అతను తమను మరీ అదలిస్తూ వుంటే అతని కాపలాదారులే కసి కొద్దీ విషం పెట్టి చంపేయవచ్చు. అతన్ని కోర్టుకి తీసుకెళుతూంటే, లేదా వేరే వూళ్లోని జైలుకి మారుస్తూ వుంటే అతని అనుచరులు తప్పించాలని ప్లానులు వేసి, రక్షణగా వున్న సెక్యూరిటీని చంపేయవచ్చు. అది కుదరకపోతే అమాయకులను కిడ్నాప్ చేసి, యితన్ని విడుదల చేయమని బేరాలు పెట్టవచ్చు. ఇతను బయటకు వచ్చి ఇంకొంతమందిని చంపుతాడు. ఉరి పడాల్సినంత ఘోరం చేసిన ఉగ్రవాదులను ఎంతకాలం సజీవంగా వుంచితే అంతకాలమూ రిస్కే. అయితే అతను నికార్సయిన ఉగ్రవాదా కాదా అని తేల్చే ప్రక్రియ మాత్రం నిర్దుష్టంగా వుండాలి.

నిర్దోషికి శిక్ష పడాలని అన్నం తినేవాడు ఎవడూ అనడు. కానీ అలా శిక్ష పడే అవకాశమైతే వుంది. క్లాసులో అల్లరి చేసినవాడు ఎవడో తేలకపోతే టీచరు క్లాసు మొత్తానికి శిక్ష విధిస్తాడు. ఒక్కోప్పుడు వూరు మొత్తానికి జరిమానా విధిస్తారు. సమూహంలో వుంటున్నప్పుడు ఒనగూడే లాభాలతో బాటు యిలాటి నష్టాలూ వుంటాయి. చట్టాల్లో లొసుగులు వుంటాయి, అధికారాన్ని దుర్వినియోగం చేసేవారుంటారు. న్యాయమూర్తులు పక్షపాతంతో వ్యవహరించిన సందర్భాలూ వుంటాయి. నీటిలోని మాలిన్యాలను తొలగించడానికి రకరకాలుగా వడపోసినట్లే, కేసులోని అసత్యాలను తొలగించడానికి భారతీయ న్యాయవ్యవస్థ ఎన్నో వడపోతలను, అంచెలంచెలుగా పొరలను ఏర్పాటు చేసింది.

చాలా సందర్భాల్లో దీర్ఘ న్యాయప్రక్రియ విసుగు కలిగిస్తుంది. న్యాయవివాదంలో యిరుక్కున్న వారిని ఎవరైనా అడిగితే చెపుతారు. కంటికి కనబడేదాన్ని కూడా కోర్టు పరీక్షకు గురి చేస్తుంది. సాక్ష్యాలు కోరుతుంది. అవతలివాడు అన్యాయం చేస్తున్నాడని స్పష్టంగా గోచరిస్తున్నా కూడా వాడికి ఎన్నో అవకాశాలు యిస్తారు. అప్పటిదాకా గుండ్రాయిలా వున్నవాడు పోలీసులు వచ్చి అరెస్టు చేయగానే అనారోగ్యం, జైలుకి తీసుకెళ్లడానికి వీల్లేదు అంటూ ఆసుపత్రిలో చేరతాడు. ప్రాబ్లెం ఏమిటంటే బిపి, సుగరు అంటాడు. అదేదో సినిమాలో చెప్పినట్లు ప్రతి మనిషికి శంఖుచక్రాల్లా అవి ఎలాగూ వుంటాయి, ఆ భాగ్యానికి యింత హంగామా ఎందుకు అని కోర్టు అనదు. ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్టు వచ్చాకనే కస్టడీకి తరలించండి అంటుంది. అవతలి లాయరు తన క్లయింటుకు ఉపవాసమని, అతని భార్యకు భుక్తాయాసమని, తల్లికి ఆయాసమని.. యిలా ఏదో కారణం చెపుతూ వాయిదాలు అడుగుతూనే వుంటాడు. కోర్టు యిస్తూనే వుంటుంది. ఇన్ని అవకాశాలు యిచ్చియిచ్చి చివరకు తీర్పు వస్తే మళ్లీ దాన్ని ఛాలెంజ్ చేస్తూ పైకోర్టుకి వెళ్లే అవకాశం కూడా యిస్తారు. ఫైనల్‌గా తీర్పు మీ పక్షాన వచ్చినా డిక్రీ ఓ పట్టాన రాదు, వచ్చినా అమలు కావడానికి ఎంతో టైము పడుతుంది. న్యాయవ్యవస్థ లోపరహితమని అనలేము. కానీ మన దేశంలో ఉరి శిక్ష వేయడానికి ఎంతో సంకోచిస్తారు. రెండు దశాబ్దాలపాటు అనేక తర్జనభర్జనలు జరిగాక, చివరకు శిక్ష వేస్తే మళ్లీ దాన్ని తిరగతోడాలనడం అర్థం లేనిది.

యాకూబ్ మెమన్ శిక్ష గురించి నా ఉద్దేశాలు వ్యక్తం చేయడానికి ముందు ఉరికి అభ్యంతరం చెపుతూ యితరులు చేసిన వాదనల్లో కొన్నిటిపై నా అభిప్రాయం చెప్తాను. మజ్లిస్ నేత చెప్పినదానిలో కొన్ని వాస్తవాలున్నాయి. రాజకీయంగా పలుకుబడి వున్నవాళ్లు ఉరి తప్పించుకుంటున్నారు. కుట్ర పన్ని రాజీవ్‌ను చంపిన హంతకులను ఉరి తీయకుండా జైల్లో వుంచడమే పొరబాటనుకుంటే వాళ్లని వదిలేయాలని తమిళ నాయకులు అనడం యింకా దుర్మార్గం. ఇందిర హంతకుల శిక్ష విషయంలో అకాలీ దళ్ ప్రమేయమూ తప్పే. 1984 శిఖ్కు అల్లర్లకు కారకులైన వాళ్లకూ శిక్షలు పడాల్సిందే. బాబ్రీ మసీదు కూల్చినవాళ్ల కేసు ఎప్పటికీ తేల్చకుండా, నిందితులు మంత్రులుగా విరాజిల్లుతూ వుంటే పోలీసు రికార్డుల్లో 'కనబడటం లేదు' అని చూపిస్తూ నాటకం ఆడడమూ అన్యాయమే. హిందు ఉగ్రవాదులుగా ముద్ర కొట్టి మాలెగావ్ పేలుళ్లలో నిందితులు అంటూ జైల్లో కూర్చోబెట్టిన వారిపై విచారణ త్వరగా ముగించి వారు అమాయకులో, మాయకులో తేల్చి విడిచిపెట్టడమో, ఉరి తీయడమో చేయాలి తప్ప రాజకీయాలకు వాడుకోకూడదు. ఇతర కేసుల్లో కూడా ఉరి వేయవలసిన వాళ్లను త్వరగా వేసేస్తే అలాటి నేరాలకు పాల్పడేవారికి హెచ్చరికగా వుంటుంది.

ఉరిశిక్ష పడ్డాక కూడా బీదవాడని, దళితుడని, మైనారిటీ అనే విచక్షణ అనవసరం. అతను కరడుగట్టిన నేరస్తుడని రుజువైంది. అంతవరకే చూడాలి. పేదవాళ్లయితే హత్య చేసినా శిక్ష పడకూడదు, యిమ్యూనిటీ కల్పించాలి అంటే పేదవాళ్లందరినీ హంతకులుగా మారమని ప్రేరేపించినట్లే. ధనికులు, అగ్రవర్ణస్తులు, రాజకీయంగా పలుకుబడి కలవారు కాబట్టి 8 మంది దళితులను వేటాడి చంపిన చుండూరు ముద్దాయిలకు ఉరిశిక్ష పడకుండా యావజ్జీవం పడింది, అది కూడా ఏడేళ్ల తర్వాత హుష్‌కాకీ అని ఎగిరిపోయి అందరూ విడుదలై పోయారు అంటే అది ఒక విషాదమే. వాళ్లకు శిక్ష పడేవరకూ ఉగ్రవాదులకు కూడా ఉరి వేయకూడదు అనే వాదన అర్థరహితం. ఒక్కోప్పుడు కొడుకునో, కూతుర్నో పోగొట్టుకున్న అతి సామాన్యులు కూడా న్యాయదేవత తలుపు తట్టితట్టి చివరకు నిందితులకు శిక్ష పడేట్లా చేసిన ఉదంతాలు చదువుతూ వుంటాం. చుండూరు బాధితుల పక్షాన నిలబడినవారు చుండూరు ముద్దాయిల కేసు విషయంలో అప్రమత్తంగా వుంటూ న్యాయపోరాటాన్ని కొనసాగించాలి, ఆ క్రమంలో వేరే కేసుల్లో ఉరి పడిన వారినందరినీ వదిలేయాలని వాదించకూడదు. మెమన్‌కు రాజకీయ మద్దతు లేదని ఒవైసీ వాపోయారు. రాజకీయ మద్దతు మాట ఎలా వున్నా ధనమైతే పుష్కలంగా వుంది. దాని పవర్ తక్కువేమీ కాదు. ఐయస్ఐ, దావూద్‌లకు ఇండియాలో వున్న కనక్షన్లు ద ృఢమైనవే. కొందరు సాక్షులు తమ వ్మాలాలు మార్చుకునేట్లా చేశారు కూడా. అయినా మెమన్‌కు శిక్ష పడిందంటే దాని అర్థం – అతనికి వ్యతిరేకంగా కేసు అంత బలంగా వుందని!

1993 మార్చిలో వరుస పేలుళ్లు జరిగాయి. 257 మంది పోయారు. 713 మంది గాయపడ్డారు. నవంబరులో ఎఫ్ఐఆర్ నమోదైంది. టాడా కోర్టులో కేసు విచారణ 1995లో ప్రారంభమైంది. సాక్షులు 684 మంది వున్నారు కాబట్టి వారి విచారణకు ఐదేళ్లకు పైగా పట్టింది. ఆ తర్వాత వాదోపవాదాలు మరో మూడేళ్లు. ఆ తర్వాత మూడేళ్లకు తీర్పు. అంటే 2006 సెప్టెంబరుకి తీర్పు వచ్చింది. 23 మందిని నిర్దోషులుగా వదిలేసి 100 మంది నేరం చేశారంది. 2007 జులైలో యాకూబ్‌తో సహా 12 మందికి ఉ రిశిక్షలు, 20 మందికి యావజ్జీవ శిక్ష. టాడా కోర్టు వేసిన శిక్షలపై సుప్రీం కోర్టులో అప్పీలుకి వెళ్లారు. 2013 మార్చికి సుప్రీం కోర్టు యాకూబ్‌కు ఉరిని ఖరారు చేసింది. పదిమంది విషయంలో యావజ్జీవశిక్షగా మార్చారు. (యాకూబ్ ముస్లిం కాబట్టి ఉరి వేస్తున్నారని అనేవాళ్లు ఉరి వేయని యీ పదిమంది ఏ మతస్తులో కనుక్కుంటే మంచిది) ఇక అక్కణ్నుంచి క్షమాభిక్షల ప్రయత్నాలు. చివరి గంట వరకు కూడా సస్పెన్స్ గురించి వేరే రాయనక్కరలేదు.

మనం అనేక తీర్పుల విషయాల్లో సందేహాలు వ్యక్తం చేస్తూంటాం. న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదిస్తూ వుంటాం. పోలీసులు సాక్ష్యాలు తారుమారు చేశారేమో, లేనివి పుట్టించారేమో అనుకుంటూ వుంటాం. అనేక స్టేజీల్లో చెక్స్, బాలన్స్‌లు దాటుకుని ఫైనల్‌గా తీర్పు వచ్చిందంటే కోర్టుకి 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' యిచ్చి వాళ్లు కరక్టేమో అనుకుని వూరుకోవడం మంచిది. ఎందుకంటే పదిమంది విషయంలో ఉదారంగా వున్న సుప్రీం కోర్టు యితని విషయంలోనే కఠినంగా ఎందుకు వుంది? ఆ పదిమందీ కూడా తమను టైగర్ మెమన్ రిక్రూట్ చేసుకున్నాక, యాకూబ్‌కు అప్పగించాడనే చెప్పారు. మొత్తం 19 మందిని రిక్రూట్ చేసుకుని

వాళ్లందరినీ దుబాయి, పాకిస్తాన్‌లకు పంపి మారణాయుధాల్లో ట్రెనింగ్ యిప్పించడం, అక్కడి బస, తిండి, ప్రయాణం ఏర్పాట్లు చూడడం, బాంబులు పేల్చి సాధ్యమైనంత ఎక్కువ మందిని చంపడానికై బొంబాయిలో స్టాక్ ఎక్స్‌ఛేంజ్, ఫైవ్ స్టార్ హోటళ్లు, సినిమా హాలు, బజారు వంటి జనసమ్మర్దం వున్న ప్రాంతాలను నిర్ధారించడం, పేలుడు పదార్థాలు నింపిన బ్యాగులను అవసరమైన చోటికి చేర్చడం, ఈ ఆపరేషన్‌కై హవాలా ద్వారా చేరిన నిధులు ఖర్చు చేయడం – యివన్నీ యాకూబ్ చూసుకున్నాడని వాళ్లు చెప్పారు. అంటే తక్కినవాళ్లు పాత్రధారులు కాగా, టైగర్, యాకూబ్ సుత్రధారులని కోర్టుకి నమ్మకం చిక్కింది. 1993లో జనవరిలో దుబాయిలో జరిగిన ధ్వంసరచన సమావేశంలో అతను పాలుపంచుకున్నాడని కోర్టు నమ్మింది.

సూత్రధారులు బాంబులు పెట్టడానికి ఎంచుకున్న వాళ్లందరూ చదువురాని, బీద ముస్లిములే. పదివేల రూపాయలకు ఆశపడి వాళ్లు యీ ఘాతుకానికి ఒప్పుకున్నారు. యాకూబ్ తన పక్షాన వాదించడానికి లాయర్లను పెట్టుకోగలిగాడు కానీ వీళ్లకా స్తోమత లేదు. (యాకూబ్‌కు రాజకీయ పలుకుబడి లేదని వాపోతున్న ఒవైసీ యీ విషయాన్ని గుర్తించాలి) వీళ్ల తరఫున వాదించడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఏ సామాజిక సేవా సంస్థ సహకరించలేదు. సుప్రీం కోర్టు యీ విషయాన్ని గుర్తించింది. వీళ్లు వట్టి బాణాలు మాత్రమే, అసలైన ధనుర్ధారులు వేరే వున్నారు అనుకుని, టాడా కోర్టు వీళ్లకు ఉరిశిక్ష వేసినా, దాన్ని యావజ్జీవంగా మార్చింది. ఈ కేసులో మతపరమైన కోణాన్ని ప్రస్తావించేవాళ్లు యింకో విషయాన్ని కూడా గమనించాలి. శిక్ష పడినవారిలో హిందూ అధికారులు కూడా వున్నారు. సోమనాథ్ థాపా అనే కస్టమ్స్ అధికారికి, విజయ్ పాటిల్ అనే పోలీసు అధికారికి యావజ్జీవ శిక్ష పడింది. ఆయుధాలు, మందుగుండు సామగ్రి చేరవేతలో సహకరించిన అధికారులు ఆర్ కె సింగ్, జయవంత్ గౌరవ్, ఎస్ఎస్ తల్వాడేకర్‌లకు 6–8 ఏళ్ల జైలుశిక్ష పడింది.

నేనైతే విచారణ పూర్తిగా ఫాలో కాలేదు. కేసును క్షుణ్ణంగా అధ్యయనమూ చేయలేదు. పైకి కనబడినది తీసుకున్నా యాకూబ్ ఆ ధనుర్ధారుల్లో ఒకడనీ శిక్షార్హుడేననీ అనిపిస్తుంది నాకు. ఇంట్లో అంతంత కుట్ర జరుగుతూ వుంటే, ఇంటి సభ్యులందరూ కుట్రలో పాల్గొంటూ వుంటే నాకేమీ తెలియదు అంటే ఎలా నమ్మగలం? ఇతనేమీ శుంఠ కాదు. చార్టెర్డ్ ఎకౌంటెంట్. లాయర్లు, ఆడిటర్లు తాతకే దగ్గులు నేర్పగలిగిన ఘనులు. 'పేలుళ్లు కొన్ని గంటల్లో జరుగుతాయనగా మా అన్నయ్య పాకిస్తాన్ వచ్చేయమన్నాడు, దాంతో నేనూ, మా కుటుంబసభ్యులు వెళ్లిపోయాం' అన్నాడు. 'ఎందుకు దేశం విడిచి వెళ్లాలి? ఏం జరగబోతోంది? వెళ్లినా పాకిస్తాన్‌కు ఎందుకు? అమెరికాయో, ఆస్ట్రేలియానో వెళ్లవచ్చుగా' అని అన్నగార్ని అడగాలిగా. అతను సరైన సమాధానాలు చెప్పకపోతే అనుమానం తగిలి బాధ్యతాయుతమైన పౌరుడిగా వెంటనే పోలీసులకు చెప్పి వుండాలిగా! ఈ దేశం నీకెంతో యిచ్చిందే! ఇక్కడే పుట్టి, యిక్కడే పెరిగి చాలా పెద్దవాడి వయ్యావు కదా. ప్రాణం మీద తీపితో వూరుకున్నాడు అంటే ఏం చచ్చిపోయినవాళ్లకు మాత్రం ప్రాణాల మీద తీపి వుండదా? నీదొక్కడిదే ప్రాణమా?

'టైగర్ చేష్టలతో నాకు సంబంధం లేదు, అతను నాకేమీ చెప్పలేదు' అని యాకూబ్ బుకాయిస్తున్నాడు. కుటుంబగాథ గమనించండి – వీళ్ల తండ్రి సింగిల్ రూమ్ ఎపార్ట్‌మెంటులో వుండేవాడు. డబ్బు లేదు. అయినా పిల్లల్ని ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో చదివించాడు. ఆరుగురు అన్నదమ్ముల్లో మూడోవాడైన యాకూబ్ అందరి కంటె తెలివైనవాడు. గబగబా చదువుకుని చకచకా ఎదిగిపోయి చార్టెర్డ్ ఎకౌంటెంట్ అయిపోయి బోల్డు గడించేసి స్వార్థంతో విడిగా వెళ్లిపోకుండా జాయింటు ఫ్యామిలీలో వుంటూ కుటుంబసభ్యులందరికీ సర్వసౌఖ్యాలు సమకూర్చాడు. పెద్ద బిల్డింగులో ఓ మంచి ఎపార్ట్‌మెంటుకు మారడమే కాదు, దాన్ని కొనేసి, దానితో బాటు ఆ బిల్డింగులో యింకా కొన్ని ఫ్లాట్లు కూడా కొనేశాడు. ట్రావెల్ ఏజన్సీ వంటి వేరే వ్యాపారాలు కూడా మొదలుపెట్టించాడు. ఇతనిలా సంపాదిస్తూ వుంటే వాళ్ల అన్న దావూద్ ఇబ్రహీం అనుచరుడై అండర్‌వరల్డ్ డాన్ అయిపోయి స్మగ్లింగులో చెలరేగిపోతున్నాడు. యాకూబ్ ధనబలం, బుద్ధిబలానికి టైగర్ భుజబలం, నేరగుణం తోడై వాళ్లు అతి త్వరగా కుటుంబమంతా మోతుబరులై పోయారు. ఇలాటి పరిస్థితుల్లో యాకూబ్‌కు చెప్పకుండా టైగర్ యింత పెద్ద ఆపరేషన్స్ తలపెడతాడా? నాన్సెన్స్! 'అబ్బే నాకేం తెలియదు' అని అంటున్న యాకూబ్ బ్యాంకు ఖాతాల్లో యీ పేలుళ్లకు ముందు అనేక నిధులు వచ్చిపడ్డాయి. ఆ ట్రాన్సాక్షన్సన్నీ డూబియస్ అని విచారణలో తేలింది. వాటికి యాకూబ్ వద్ద సమాధానం లేదు. అందుకే యీ ఆపరేషన్స్ నిధుల వ్యవహారం యాకూబ్ చూశాడని కోర్టు నమ్మింది.

తాడిచెట్టు ఎందుకు ఎక్కావురా అంటే దూడగడ్డి కోసం అన్నాట్ట వెనకటి కెవడో. నీకు పేలుళ్లతో సంబంధం లేకపోతే పాకిస్తాన్‌కు ఎందుకు వెళ్లావ్ అని అడిగితే ఐయస్‌ఐ గుట్టుమట్లు తెలుసుకోవడానికి అక్కడకి వెళ్లానని చెప్తున్నాడు. తెలుసుకుని ఏం చేశాడు? వెంటనే భారతీయ అధికారులకో, మీడియాకో ఉప్పందించాడా? లేదే! ఆ తర్వాత దావూద్ ఇబ్రహీం, ఐయస్‌ఐలు కొత్త పెళ్లికొడుకులా చూస్తుంటే అప్పుడైనా గిల్ట్ ఫీలింగ్ కలిగిందా? తన కారణంగా చనిపోయినవారి కుటుంబాలకు – పోనీ వారిలో ముస్లిం కుటుంబాలకు – నష్టపరిహారం ఏర్పాటు చేశాడా? లేదే! అసలీ మేధావి, బాంబులు, మనుష్యులు, పేల్చాల్సిన చోట్లు అన్నీ ఏర్పాట్లు చేసేసి పేలుళ్ల ముహూర్తానికి కొన్ని గంటల ముందే కుటుంబంతో సహా పాకిస్తాన్ చెక్కేశాడు. తమకు నేరచరిత్ర ఏమీ లేదు కాబట్టి, పేలుళ్లలో తమ పాత్రను ఎవరూ వూహించలేరని లెక్కవేస్తూనే ఎందుకైనా మంచిదని వూళ్లో లేకుండా జాగ్రత్తపడ్డాడు. అయితే ఇక్కడ విధి చిన్న నాటకం ఆడింది.

లెక్క ప్రకారం వీళ్లు 1993 మార్చి నెల చివర్లో యీ కార్యక్రమం పెట్టుకున్నారు. అయితే యీ ఆపరేషన్స్‌లో రిక్రూట్ చేసుకున్న

గుల్ మొహమ్మద్ అనే చిన్న స్థాయి నేరస్తుడు (స్మాల్‌టైమ్ క్రూక్ అంటారు) ఏదో చిన్న కేసులో పట్టుబడ్డాడు. పోలీసులు గట్టిగా తంతే వాడెక్కడ దీని గురించి చెప్పేస్తాడేమోనని టైగర్ భయపడి పేలుళ్ల ముహూర్తాన్ని మార్చి 12కి జరిపేశాడు. మధ్యాహ్నం 1.30కు మొదలుపెట్టి వరుసగా రెండు గంటల పది నిమిషాల్లో 10 చోట్ల పేల్చారు. పది చోట్లే, 140 నిమిషాలే అని యిప్పుడనుకుంటున్నాం కానీ పేలుతున్న సమయంలో తెలియదు కదా, జనం భీతావహులై పరుగులు పెట్టారు. పైగా దేశంలో తొలిసారి ఆర్‌డిఎక్స్ వంటి శక్తిమంతమైనదాన్ని ప్రయోగించారు. ఒక చోట పేలగానే, మరో పది చోట్ల పేలాయట అనే పుకార్లు వ్యాపిస్తాయి సహజంగా. నగరమంతా గందరగోళం. భయం. ఆఖరి పేలుడు తర్వాత కూడా మనసు కుదుటపడదు కదా, ఇంకా ఎక్కడ పేలుతుందో అని బిక్కుబిక్కుమంటూనే వున్నారు. పైగా ఆ స్థలాల్లో కూడా ఒక పద్ధతి లేదు. సినిమా హాళ్లలో బాంబులు పెడుతున్నారట అంటే హాళ్లకు వెళ్లడం మానేస్తారు, అవేళ రకరకాలైన స్థలాల్లో పేల్చారు. 10 చోట్లే పేలాయి కానీ వాళ్లు ప్లాన్ చేసినవి యింకా అంతకంటె ఎక్కువ వున్నాయి. దాదర్‌లో బాంబులు కుక్కిన స్కూటర్ ఒకటి పేలలేదు. అది మర్నాటికి బయటపడింది. పేలుళ్ల తర్వాత కుట్రదారులు ఎందుకు, ఎలా కంగారుపడ్డారో తెలియదు కానీ వాళ్లు పారిపోవడానికి ఉపయోగించవలసిన వ్యాన్‌ను వోర్లి వద్ద విడిచి పెట్టేశారు. రాజీవ్ హత్యలో నాశనం కాకుండా మిగిలిపోయిన కెమెరా హంతకులను పట్టించినట్లే యీ వాహనాలు రెండూ హంతకుల వైపు వేలెత్తి చూపించాయి.

బొంబాయి కమీషనర్‌గా వున్న రాకేశ్ మారియా ఆ వ్యాన్ గురించి విచారించారు. దాని సొంతదారులో, ప్రయాణికులో అక్కడ పార్కు చేసి వెళ్లి పేలుళ్లలో చనిపోయారేమో, గాయపడ్డారేమో తెలియదు కదా. ముందు ఓనర్లు ఎవరో నుక్కున్నారు. సులేమాన్ మేమన్ భార్య రూబినా పేర వుంది. వాళ్ల యింటికి వెళ్లారు. చూస్తే మేమన్లు సకుటుంబసపరివార సమేతంగా ఎక్కడికో వెళ్లిపోయారని తెలిసింది. ఇంట్లో వుండేవాళ్లలో టైగర్ మేమన్ ఒకడని తెలియగానే, రాకేశ్‌కు దావూద్ కనక్షన్ గుర్తుకు వచ్చింది. వెంటనే యింటిపై దాడి చేసి సోదా చేయించాడు. అక్కడ స్కూటర్ల తాళంచెవుల గుత్తి ఒకటి కనబడింది. దాదర్‌లో దొరికిన స్కూటర్‌కు యీ తాళం చెవుల్లో ఏదైనా పడుతుందేమో చూడండి అంటే పట్టింది. మేమన్ల పాత్ర నిర్ధారణ అయిపోయింది. ఇక వాళ్ల అనుచరుల కోసం వేట సాగింది. ఇద్దరు కీలకమైన వ్యక్తులు దొరికారు. వాళ్లు కుట్ర మొత్తం చెప్పేశారు. వాళ్లెవరో, పేర్లు ఏమిటో ఎప్పటికీ వెల్లడించమని పోలీసులు మాట యిచ్చి నిలబెట్టుకున్నారు.

యాకూబ్ తిరిగి రావడానికి కారణం – భారత చట్టాలపై అతని అచంచల విశ్వాసం అని కొందరు ఉద్ఘాటిస్తున్నారు. చట్టం మీద గౌరవం, చట్టుబండలు ఏదీ కాదు. ఈ రకంగా ఆలోచించి చూడండి – బొంబాయి పేలుళ్ల తర్వాత దేశంలో తిరుగుబాటు వచ్చేసి, అల్లకల్లోలమై పోయి, దేశం విచ్ఛిన్నమవుతుందని, తమకు అనుకూల ప్రభుత్వం ఏర్పడుతుందని ఐయస్ఐ, దావూద్ ప్లాన్లు వేసి వుంటారు. కానీ యీ దేశంలో అలాటి పరిస్థితి ఏర్పడలేదు. అంతా మామూలుగా సాగిపోతోంది. బొంబాయి పేలుళ్లు తిరుగుబాటును తెచ్చిపెట్టలేదన్న నిరాశ ఐయస్ఐను కూడా ఆవహించి వుంటుంది. అనుకున్నది జరగలేదు కానీ, యీ మేమన్లను ఎంతకాలం మేపాలన్న చికాకు వాళ్లలో కనబడసాగింది. తమ ప్లాను విఫలమైందని గ్రహించాక చూసిచూసి ఇండియాకు వచ్చేసి, నేరం మొత్తం దావూద్, టైగర్లపై తోసేసి తక్కినవారిపై కేసు పడకుండా తప్పించుకుని మామూలు జీవితం గడిపితే ఎలా వుంటుందాన్న ఆలోచన వచ్చింది యాకూబ్‌కు. ఎందుకంటే పాకిస్తాన్‌లో అతని ప్రతిభకు తగ్గ గుర్తింపు దొరకటం లేదు. పైగా తమ ఆస్తిపాస్తులన్నీ యిండియాలోనే వున్నాయి. తమ అజమాయిషీ లేకపోతే అన్యాక్రాంతం కావచ్చు. టైగర్ తప్ప తామెవ్వరికీ సంబంధం లేదని చెపితే ఇండియాలో నమ్ముతారా లేదా అని కనుక్కోవడానికి నేపాల్‌కు పాకిస్తానీ పాస్‌పోర్టుతో, మారుపేరుతో వెళ్లాడు. తన కజిన్‌ను అక్కడకి రప్పించి అక్కడ మంతనాలు సాగించాడు. 'మీకు సంబంధం లేదని దేశంలో ఎవరూ అనుకోవటం లేదు, కుటుంబసభ్యులందరూ కుట్రదారులే' అనుకుంటున్నారని కజిన్ చెప్పాడు.

దాంతో దుబాయి మీదుగా కరాచీకి తిరిగి వెళ్లిపోదామనుకుని ఎయిర్‌పోర్టుకి వెళ్లాడు. మళ్లీ విధి తమాషా చేసింది. అతని బ్రీఫ్ కేసులో తాళాల గుత్తి అటూయిటూ చెదిరి, స్కానింగులో తుపాకీ ఆకారంలో కనబడింది. ఎయిర్‌పోర్టు అధికారులు పెట్టె తెరిపించారు. ఇండియన్ పాస్‌పోర్టు, తక్కిన మేమన్‌ల కాగితాలు బయటపడ్డాయి. మారుపేరుతో పాకిస్తానీ పాస్‌పోర్టుతో వచ్చినవాడి అసలు పేరు తెలియగానే పోలీసులకు అప్పగించారు. వాళ్లు సిబిఐకి అప్పగించారు. ఈ విషయం నేపాల్ పోలీసు అధికారి (యిప్పుడు రిటైరై పోయారు) కూడా యిటీవల కన్‌ఫమ్ చేశారు. యాకూబ్ తనంతట తాను లొంగి పోలేదని చెప్పారు. ఏదైనా ప్రొటోకాల్ యిబ్బందులున్నాయేమో, ఇండియన్ పోలీసులు ఢిల్లీలో పట్టుబడినట్టు రికార్డు తయారుచేసుకున్నారు. అది చిన్న సాంకేతిక విషయం మాత్రమే. అయితే యాకూబ్ సమర్థకులు 'అతను లొంగిపోదామని వస్తే భారతపోలీసులు పట్టేసుకున్నారు. కేసు విచారణలో సహకరిస్తే వదిలేస్తామని ఆశ చూపించి, మోసగించారు.' అంటున్నారు. అలా అనడానికి ఆధారం ఏమిటో వాళ్లు చెప్పటం లేదు. యాకూబ్ ఢిల్లీకి టిక్కెట్టు కొనుక్కోలేదు. మారుపేరు, పాకిస్తాన్ పాస్‌పోర్టు వినియోగిస్తున్నాడు. నేపాల్ పోలీసులకు తనంతట తను లొంగిపోలేదు. పట్టుబడ్డాడు. ఉరేస్తే టైగర్‌ను వేయాలి కానీ యాకూబ్‌కు ఉరేమిటి అనే విసుర్లు ఒకటి. ఇతన్ని ఉరితీసి టైగర్‌ను వదిలేస్తామని ఎవరైనా చెప్పారా? ఇతన్నిలా ఉరి తీస్తే అతను ఎప్పటికీ లొంగిపోడు అని శాపనార్థాలు ఒకటి. తీయకపోయినా అతనూ, దావూద్ లొంగరు. దశాబ్దాలుగా లొంగనివాళ్లు యితనికి క్షమాభిక్ష పెట్టగానే వచ్చి లొంగిపోతారా? వాళ్లు కలలు కంటున్న అరాచకం, కల్లోలరాజ్యం భారతదేశంలో నెలకొనేవరకూ వాళ్లు అక్కడే వుంటారు. దానికి యితని ఉరితో సంబంధం లేదు.

యాకూబ్ బండబారిన అండర్‌వరల్డ్ గూండా కాదు. టార్చర్‌లో తర్ఫీదు పొందలేదు. పోలీసు దెబ్బలకి తాళలేదు. వాళ్లు చెయ్యెత్తగానే నోరిప్పేశాడు. అదీ గొప్పేనా? గొప్పే అనుకున్న ఒక పోలీసు అధికారి 'అతను విచారణలో సహకరించాడు కాబట్టి, ఉరి శిక్ష వేయనక్కరలేదు' అన్నారట. వాళ్ల పని తేలిక చేశాడు కదాని పోలీసులకు జాలి వుండవచ్చు కానీ యిలాటి సందర్భాల్లో న్యాయస్థానం అనుసరించవలసిన నియమనిబంధావళి అంటూ ఒకటి వుంటుంది కదా. దాన్ని విస్మరించమంటూ మధ్యలో వీళ్ల సిఫార్సులు ఎందుకు? పోలీసులు తమ పని తాము సవ్యంగా చేస్తే చాలు, కోర్టు తీర్పులు ఎలా వుండాలో జడ్జిలకు సలహాలు యివ్వకుండా వుంటే మేలు. అసలే మహారాష్ట్ర పోలీసులు మతపరమైన వివక్షత చూపిస్తున్నారని ప్రతీతి. ఈ పేలుళ్లను ప్రేరేపించిన 1992 డిసెంబరు–1993 జనవరి మతకలహాల్లో పోలీసుల పాత్ర ఘోరంగా వుందని జస్టిస్ శ్రీకృష్ణ స్పష్టంగా చెప్పారు. ఆ నివేదికను ప్రభుత్వం పక్కన పడేసింది, లేకపోతే శివసేన నాయకులందరూ జైళ్లల్లో వుండవలసినవారు.

యాకూబ్‌కు స్కిజోఫ్రేనియా వ్యాధి వుందని, డిప్రెషన్‌కు లోనవుతూంటాడనీ (డిప్రెషన్‌కు గురి కాని మనిషున్నాడా?), రోగపీడితుణ్ని ఉరి తీయడానికి చట్టాలు ఒప్పుకోవలని లాయర్లు, పౌరహక్కుల నేతలు వాదించారు. వారిలో రాజీవ్ హంతకురాలు నళిని తరఫున వాదించిన యుగ్ చౌధురీ ఒకరు. 'అవును, నాకు మానసిక వ్యాధి వుంది' అని యాకూబ్ సుప్రీం కోర్టుకి ఉత్తరం రాసుకున్నాడు కూడా. ఆ వ్యాధి వుండగానే జైలువాసంలోనే రెండు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు సంపాదించాడు మరి! అందునా తక్కువ తెలివితేటలు ప్రదర్శించాడా? ఎప్పటికప్పుడు కొత్త వాదనలతో రావడమనేది పెద్ద లాయర్లను పెట్టుకోగల ఘరానా నేరస్తులందరూ చేస్తారు. యాకూబ్ వాళ్ల కంటె ఎక్కువ తెలివికి పోయాడు. అతనికి ఉరిశిక్ష పడ్డాక అతని తరఫున అతని సోదరుడు సులేమాన్ 2013 ఆగస్టులో రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకున్నాడు. దాన్ని రాష్ట్రపతి 2014 ఏప్రిల్‌లో తిరస్కరించారు. ఇక ఉరికి అంతా సిద్ధమయ్యాక 2015 జులై 28న అప్పుడు యాకూబ్ మళ్లీ మెర్సీ పిటిషన్ పెట్టుకున్నాడు – క్షమాభిక్ష అడగాలన్నా, మానాలన్నా నియమాల ప్రకారం నాకే అధికారం వుంది, నా తరఫున అడగడానికి మా సోదరుడు ఎవరు? అది లెక్కలోకి తీసుకోకూడదు. ఇప్పుడు నేను అడుగుతున్నాను, దాని మీద బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి' అని. అంటే రెడ్డొచ్చె మొదలాడె అన్నట్లు మొత్తం ప్రాసెస్‌ను మళ్లీ మొదలుపెట్టించి తన జీవితాన్ని సాధ్యమైనంత ఎక్కువ కాలం కొనసాగించుకుందామని చూశాడన్న మాట. అయితే ఇతని వాదనను కోర్టు కొట్టి పారేసింది. 'నీ తరఫున నీ సోదరుడు పిటిషన్ పెడితే అప్పుడే ఎందుకు అభ్యంతర పెట్టలేదు? అతను పెట్టిన దాదాపు మూడేళ్లకు ఆ విషయం గుర్తు వచ్చిందా? నువ్వప్పుడు మౌనంగా వున్నావు కాబట్టి దాన్ని ఆమోదించినట్లే లెక్క' అన్నారు వాళ్లు.

'నీ మీద కేసు పెట్టకుండా జస్ట్ విచారించి వదిలేస్తాం' అని మాట యిచ్చి యాకూబ్‌ను పోలీసులు ప్రలోభపెట్టి ఇండియాకు రప్పించారనీ, తర్వాత మాట తప్పారనీ, యిలా చేస్తే భారతదేశపు ప్రతిష్ఠ ఏమవుతుందని కొందరు వాపోతున్నారు. దీన్కిట ఒకాయన చక్కటి పోలిక తెచ్చాడు. 'నా కొంప గుల్ల చేస్తున్న ఎలకను పట్టుకోవడానికి బోనులో పకోడీ పెట్టి ఆకర్షించాను. ఎలక వచ్చి పట్టుబడింది. 'నువ్వు నన్ను చంపడానికి వీల్లేదు, పకోడీ యిచ్చి పంపించాలి' అని ఎలక వాదనకు దిగితే ఎలా వుంటుంది?' అని అడిగాడు. స్టింగ్ ఆపరేషన్‌లో కూడా లంచం యిస్తామని ఆశ పెట్టి పోలీసులకు అప్పగిస్తారు. ఇది అన్యాయం, నాకు డబ్బిచ్చి పంపించాలి తప్ప అరెస్టు చేయించకూడదు అని లంచగొండి వాదనకు దిగితే...? 'పోలీసుల మాట వినే కుటుంబం వెనక్కి వచ్చిందంటున్నారు...' అని టాడా జడ్జిని అడిగితే ఆయన 'పాకిస్తాన్‌లో వాళ్ల పరిస్థితి ఏమిటో ఎవరికి తెలుసు? పాకిస్తానీ పోలీసులు హౌస్ అరెస్టులో పెడితే తప్పించుకుని వచ్చారేమో, యిక్కడకు వచ్చి అజ్ఞాతంగా వుండవచ్చని అనుకున్నారేమో. లొంగిపోదామని వచ్చేవాళ్లు రాయబార కార్యాలయం ద్వారా వస్తారు తప్ప దొంగదారుల్లో రారు' అని సమాధానం యిచ్చారు.

ఈ యాకూబ్ వ్యవహారంలో ఎప్పటిలాగా మేధావులు చాలా హంగామా చేశారు. 1970లలో ఓపిడిఆర్, పియుడిఆర్ వంటి పౌరహక్కుల సంస్థలంటే నాకు చాలా గౌరవం వుండేది. నకిలీ ఎన్‌కౌంటర్‌ల గురించి జస్టిస్ తార్కుండే వంటి వారు ఆందోళన చేసి నిజాలు వెలికితీస్తే అబ్బో అని మురిసిపోయేవాణ్ని. పోనుపోను యివన్నీ ప్రచ్ఛన్న నక్సలైట్ సంస్థలుగా మారిపోయాయి. నక్సలైట్లకు ఏదైనా యిబ్బంది కలిగితే రంగంలోకి దిగిపోయే వీళ్లు నక్సలైట్ల వలన ప్రాణాలు, అవయవాలు పోగొట్టుకున్న సామాన్య పౌరుల విషయంలో నోరెత్తకపోవడం నాకు విస్మయం కలిగిస్తూ వచ్చింది. 'నక్సలైట్లు ప్రజల ప్రాణాలు తీస్తున్నారు, ప్రభుత్వం నక్సలైట్ల ప్రాణాలు తీస్తోంది' అని సింపుల్‌గా తేల్చేస్తే వాళ్లు వూరుకోరు. సంఘ వ్యతిరేక శక్తులు ఏమైనా చేయవచ్చుట కానీ ప్రభుత వారిని ఏమీ చేయకూడదట. చేస్తే ప్రతీకారేచ్ఛతో జరిగిన రాజ్యహింస అనాలిట. సామాన్య పౌరులకు శాంతిభద్రతలు సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వానికి వుంది కదా, దానికి విఘాతం కలిగించేవారిని ఏం చేయాలిట? పౌరహక్కులు యిచ్చినది యీ ప్రజాస్వామ్యపు సమాజమే. ఆ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసే మావోయిస్టులు ఆ సమాజం యిచ్చే పౌరహక్కులను వినియోగించుకుంటారు. నిజానికి వారు కోరుకునే సమాజమే ఏర్పడితే యీ పౌరహక్కులే లేకుండా పోతాయి. అంటే యీ సమాజం తనను నిర్మూలించాలని చూసేవారిని తనే రక్షిస్తూ వుండాలన్నమాట!

నక్సలైట్లు ఒక్కళ్లే కాదు, ఏ నేరస్తుడినైనా సరే అతని కులం పేరు చెప్పో, వర్గం పేరు చెప్పో మేధావులు, మీడియా వెనకేసుకుని వస్తారు. తమకున్న రచనాకౌశలంతో, పలుకుబడితో మీడియాలో వ్యాసాలు రాసి, ప్రసంగాలు యిచ్చి నిర్ణయాలు తీసుకునే వారిని ప్రభావితం చేయగలుగుతారు. ఇవన్నీ ఒక యెత్తు. అవసరమైతే వీళ్లు ఎంత కుటిలంగా వ్యవహరించగలరో యీ మధ్యే నాకు

తెలిసింది. 1993లో చిలకలూరిపేటలో కొందరు దళితులు ఆర్టీసీ బస్సుని తగలబెడితే 23 మంది చనిపోయారు. అగ్రవర్ణాలు తమని హింసిస్తే దళితులు తిరగబడడం సహజం. కానీ యిలా బస్సు ప్రయాణీకుల ప్రాణాలు తీయడమేమిటి అని కోర్టు కూడా ఫీలైంది. 1995 మార్చిలో సాతులూరి చలపతిరావు, గంటెల విజయవర్ధన్‌రావులకు ఉరిశిక్ష పడింది. సుప్రీం కోర్టు కూడా ఉరి ఖాయం చేసింది. ఇక దళిత, ప్రజాసంఘాలు, మానవహక్కుల సంఘాలు, ఆమ్నెస్టీ యింటర్నేషనల్ రంగంలోకి దిగి రాష్ట్రపతి క్షమాభిక్ష కోసం లాబీయింగ్ మొదలుపెట్టాయి. చచ్చిపోయిన 23 మంది గురించి ఏం ఆలోచించారో తెలియదు కానీ ఘాతుకం చేసినవారు దళితులు కాబట్టి ఉరి వేయకూడదని వీరి వాదన. రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ 1997 మార్చి 14 న రెండోసారి కూడా క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించారు. మార్చి 29 న తెల్లవారుఝామున 3 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉరిశిక్ష అమలు కావాలి.

కొన్ని గంటల్లో ఉరి అమలవుతుందనగా ప్రఖ్యాత రచయిత్రి మహాశ్వేతాదేవితో నలుగురు మానవహక్కుల నేతలు చివరి ప్రయత్నంగా రాష్ట్రపతి శర్మను కలిసేందుకు రాష్ట్రపతి భవన్‌కు వెళ్లారు. ఏదో పని మీద బయటకు వెళ్లిన ఆయన రాత్రి 9 గం.ఎలకు తిరిగి వచ్చారు. వీళ్ల రిక్వెస్టు విని "ఇప్పటికే దీని మీద ఆలోచించి రెండుసార్లు తిరస్కరించాను. నేను చేసేదేమీ లేదు, వెళ్లి రండి" అని ఆయన పంపేశారు. ఇక అందరూ నిరాశతో యిళ్లకు వెళ్లేందుకు కార్లు ఎక్కబోతూ వుండగా ఆ బృందంలోని ఒక మహిళా న్యాయవాదికి ఓ ఐడియా వచ్చింది – 'సుప్రీం కోర్టు జడ్జి యింటికి వెళ్లి రాష్ట్రపతి మన పిటిషన్‌ను సానుభూతితో పరిశీలిస్తామని చెప్పారని అబద్ధం ఆడదాం. విషయం పరిశీలనలో వుంది కాబట్టి ఉరిని ఒక్క వారం రోజులు వాయిదా వేయండి అని కోరదాం' అని. ఇలా అబద్ధం ఆడడం అనైతికం, అధర్మం అని ఆ మేధావుల్లో, ఆ హక్కుల నేతల్లో ఎవరికీ తోచలేదు. వెళ్లి రాత్రి 10 గంటలకు ఒక సుప్రీం కోర్టు జడ్జి యింటికి వెళ్లి అబద్ధం చెప్పేశారు. ఆయన 'నేను ఒక్కణ్నీ నిర్ణయం తీసుకోలేను, వేరే ఆయన కూడా వుంటే బాగుంటుంది' అన్నారు. అప్పుడు యీ బృందం మరో జడ్జి యింటికి వెళ్లి ఆయనకీ అబద్ధం చెప్పి బతిమాలి యాయన యింటికి తీసుకుని వచ్చారు. ఇద్దరూ కూర్చుని చర్చించుకుని రాష్ట్రపతి నిర్ణయం వెలువడేందుకు కాస్త సమయం పడుతుంది కాబట్టి ఏప్రిల్ 5 వరకు ఉరి తీయవద్దని ఆదేశాలు యిచ్చారు. అప్పుడు వీళ్లు కేంద్ర హెూం శాఖ కార్యదర్శి యింటికి వెళ్లి ఆదేశాలు చూపించి, ఆయన ద్వారా ఆంధ్రప్రదేశ్ హెూం సెక్రటరీ ద్వారా తూర్పు గోదావరి జిల్లా కలక్టరుకు చెప్పిస్తే ఆయన రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారులకు ఉరి ఆపమని అర్ధరాత్రి 12 గంటలకు చెప్పారు.

ఉరి తీసే రోజు దగ్గరపడే సమయానికి ప్రధాని దేవెగౌడ ప్రభుత్వం కూలిపోయింది. ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాట్లలో రాష్ట్రపతి బిజీగా వున్నారు. అదే అదనుగా యీ బృందం సుప్రీం కోర్టు జడ్జిలను కలిసి ప్రస్తుతం రాష్ట్రపతి బిజీగా వున్నారు కాబట్టి ఉరిపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారని యింకో అబద్ధం ఆడి, మరో మూడు నెలలు వ్యవధి యిమ్మని కోరి సాధించుకున్నారు. ఆ గడువు ముగిసే సమయానికి శంకర్ దయాళ్ శర్మ పదవీకాలం ముగిసిపోయింది. కే ఆర్ నారాయణన్ రాష్ట్రపతి అయ్యారు. 'మీరు దళితులై వుండి దళితులకు క్షమాభిక్ష పెట్టకపోతే ఎలా?' అని వాదించి ఆయన చేత దాన్ని యావజ్జీవశిక్షగా మార్పించుకున్నారు. మేధావులు ఆడిన యీ అబద్ధం గురించి ఎప్పటికీ బయటకు వచ్చేది కాదు కానీ దీనిలో కథానాయకుడు చలపతిరావు 'ఒక నేరస్థుడి ఆలోచనలు' పేరిట 900 పేజీల పుస్తకం రాసి దానిలో యిదంతా వివరించారు. ఆ పుస్తకంలోని యీ భాగాన్ని 2015 జనవరి 31 సంచికలో ఆంధ్రజ్యోతి ప్రచురించింది.

అది చదివిన నాకు యీ మేధావులపై రోత పుట్టింది. గిరిజనుల, ఆదివాసీల హక్కుల గురించి పోరాడిన మహిళగా మహాశ్వేతాదేవిపై నాకున్న గౌరవం తుడిచిపెట్టుకు పోయింది. రెండు ప్రాణాలు నిలబెట్టడానికి యింత తాపత్రయ పడిన వీరు ఆ యిద్దరి చేతిలో దహనమై పోయిన 23 మంది ప్రాణాల గురించి ఒక్క క్షణమైనా ఆలోచించారా అనిపించింది. వీళ్లవే ప్రాణాలా? వాళ్లవి కావా? దళితులు కాబట్టి వదిలేయాలి, మైనారిటీలు కాబట్టి వదిలేయాలి అని నువ్వు వందసార్లు కాదు, వెయ్యిసార్లు అడుగు, నీకా హక్కు వుంది. కానీ దానికోసం అబద్ధం ఆడతావా? నీ చదువు చూసి, నీ తెలివితేటలు చూసి సుప్రీం కోర్టు జడ్జిలు సైతం అర్ధరాత్రయినా, అపరాత్రయినా నిన్ను యింట్లోకి రానిస్తూ వుంటే, నీ మాటలకు విలువ యిస్తూ వుంటే నువ్వు అబద్ధం ఆడతావా? ఇంతకంటె ఘోరం వుందా? మెమన్ విషయంలో కూడా యిలాటి మేధావులు ఎన్ని మాయ ట్రిక్కులు వేశారో యిప్పటికైతే తెలియదు. ఎప్పటికైనా తెలుస్తుందో లేదో తెలియదు. (సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2015)

ఆగస్టు 06 ఎమ్బీయస్ : ప్రత్యేక హెూదాకై ఆత్మహత్య

తెలుగు రాష్ట్రాల యువతకు ఏం పిచ్చి పట్టిందో తెలియకుండా వుంది. ఇన్నాళ్లూ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆత్మహత్యలంటూ కొందరు చచ్చిపోయారు. ఇప్పుడు ప్రత్యేక హెూదా కోసం ఆత్మహత్య జరిగింది. ఇది ఆరంభం కాదని, ఆఖరేనని ఆశిద్దాం. తెలంగాణకై జరిగిన ఆత్మహత్యల విషయంలో కూడా ప్రతీసారి యిలాగే అనుకునేవాళ్లం. కానీ మళ్లీ ఎవరో చేసుకున్నారనే వార్త వచ్చేది. వాళ్లని తిట్టి మానిపించేవాళ్ల కంటె ఆకాశానికి ఎత్తేసేవారు ఎక్కువై పోయారు. నిజంగా జరిగినవి కొన్నయితే ఆ సంఖ్యను 'ఖలేజా' సినిమాలో మహేశ్‌బాబు పద్ధతిలో రౌండింగ్ చేసి యింత కింతని చెప్పేశారు. ఆటో నడవకపోయినా తిరిగిపోయే హైదరాబాదు ఆటో మీటరులా ప్రతీ కొన్ని నెలలకు అంకె దానంతట అదే పెరిగిపోయేది. తెలంగాణ కావాలని వాదించే ప్రతి నాయకుడు ఆత్మహత్యల గురించి

ప్రస్తావించడం, నోటి కొచ్చిన పెద్ద అంకె చెప్పడం జరుగుతూ వచ్చింది. రాష్ట్రావతరణ బిల్లు చర్చలో కూడా వీటిని ప్రస్తావించారు. చివరకు ఆత్మహత్యల ఆధారంగా వచ్చిన రాష్ట్రంగా తెలంగాణ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఆంధ్రకు కూడా ఆత్మహత్యల ప్రత్యేక హెూదా దక్కుతుందేమో చూడాలి.

హెూదా దక్కినా చచ్చిపోయినవారికి దక్కేది ఏమిటి అంటే గుండు సున్నే. తెలంగాణ అమరవీరులు 1200 అని కొందరంటే, అబ్బే 1500 అని మరి కొందరన్నారు. పరిహారం యివ్వడానికి లెక్కలు తీస్తే దానిలో నాల్గో వంతే తేలారు. సరే, అమరవీరులుగా గుర్తింపబడి పరిహారానికి ఎలిజబిలిటీ తెచ్చుకున్నవారికైనా గుర్తింపు వుందా? వారి పేర కడతానన్న స్తూపం ఎక్కడ? సెక్రటేరియట్ కూల్చి వేరే చోట కడతాం, ఉస్మానియా కూల్చి మరోటి కడతాం అంటున్నారు కానీ యీ స్తూపం మాట ఎత్తుతున్నారా? స్తూపం కడితే అమరవీరుల పేర్లు రాయాలి. తెలంగాణ సాధనలో వారికీ చోటుందని చరిత్రలో రికార్డయిపోతుంది. అది కెసియార్‌కు యిష్టం లేదు. తెలంగాణ వచ్చిందంటే ఆయన ఒక్కరి కారణంగానే అని భావితరాలు అనుకోవాలి. నిజానికి తెలంగాణకై క్రెడిట్ యివ్వాలంటే దానికై లేఖ యిచ్చిన టిడిపికి, అక్రమ మార్గాలకు సైతం తెగబడి బిల్లు ప్రవేశపెట్టిన కాంగ్రెసుకు, దానికి ఫుల్ స్కేలు మద్దతు యిచ్చి అక్రమంలో పాలు పంచుకున్న బిజెపికి, ఉద్యమం చల్లారి పోకుండా నిరంతరం సక్రమ, అక్రమ మార్గాలలో ఆందోళన చేస్తూనే వున్న వివిధ వర్గాల ఉద్యమకారులకు, అతిశయోక్తులు వండివార్చిన మీడియాకు – అందరికీ పంచాలి. అలా పంచితే కెసియార్ వాటాకు వచ్చేదెంత? అందువలన తెటలంగాణ ఉద్యమ చరిత్రలో అమరవీరుల పేజీమీద ఫోకస్ పడదు. పడినా 'అమరవీరులు' అనే కలక్టివ్ నౌన్ వుంటుంది కానీ వ్యక్తిగతంగా ఎవరూ లైమ్‌లైట్‌లోకి రారు. వారి కుటుంబాల వారికి ఎన్నికలలో టిక్కెట్టు యిచ్చి ఒక్కరు ఎమ్మెల్యే అయినా ఆ విషయం అప్పుడప్పుడు గుర్తుకు వచ్చే ప్రమాదం వుంది కాబట్టి టిక్కెట్టు కూడా యివ్వకుండా జాగ్రత్త పడ్డారు.

ఇప్పుడు ప్రత్యేక హెూదాకై ఆత్మహత్య చేసుకున్న మునికోటి విషయంలో కూడా యిలాగే జరుగుతుంది. ఈ రోజు రాష్ట్రమంతా చేసిన బంద్‌లో అమర్ రహే అంటారు. అతని త్యాగం వృథా పోదు అంటారు. రేపు నిజంగా ప్రత్యేక హెూదా వస్తే అప్పుడు యితన్ని ఎవరైనా తలుస్తారా? 'నా మొహం చూసి, నా మాట కాదనలేక యిచ్చార'ని చంద్రబాబు అంటారు, ఆయన అడక్కముందే ఆంధ్రుల మీద ప్రేమతో మోదీ యిచ్చారని బిజెపి వాళ్లంటారు, నా దీక్ష చూసి యిచ్చారని జగన్ అంటారు, అసలు మా సమావేశంలో కనబడిన ఆవేశం చూసి భయపడి యిచ్చారని కాంగ్రెసు వారంటారు. ఈ మునికోటి సోదిలోకి లేకుండా పోతాడు. ఈ పాటి దానికి నిండు ప్రాణం తీసుకోవడం దేనికి? తెలంగాణకై ఆత్మహత్యలు జరిగే రోజుల్లో 'భద్రం బీ కేర్‌ఫుల్ బ్రదరూ, సమిధగ మారకు' అని నేను వ్యాసాలు రాశాను. ఏం లాభం? ఆత్మహత్యలు ఆగలేదు. 'ఆత్మహత్య చేసుకోబోయి మీ వ్యాసం చదివి ఆగిపోయాను' అని నాకెవరూ మెయిలూ రాయలేదు. ఇప్పుడీ మునికోటి వారసులు కూడా ఆగుతారో లేదో తెలియదు. టిడిపి, బిజెపిని యిరుకున పెట్టడానికి ప్రతిపక్షాలు దీన్ని పూర్తిగా వుపయోగించుకుంటాయి – సహజంగా! ఇకపై జరిగే ఆత్మహత్యలన్నీ ప్రత్యేక హెూదా ఖాతాలో పడేస్తూ పోవచ్చు. ఆ విషయంలో గైడెన్సు కావాలంటే టి-ఉద్యమకారుల నడిగితే చెప్తారు. నటుడు శివాజీ నిరాహారదీక్ష చేశారు కానీ ప్రజలను యింతలా కదిలించ లేకపోయారు. ఇతను రాజకీయేతర వ్యక్తి కావడం, నిజంగా ప్రాణం తీసేసుకోవడం వలన అతని నిజాయితీని శంకించలేక, అతని మరణాన్ని తలచుకుని దుఃఖిస్తున్నాం.

'టిడిపికి ప్రత్యేక హెూదాపై చిత్తశుద్ధి వుంటే బిజెపితో పొత్తు తెంచుకుని కేంద్ర కాబినెట్‌లోంచి బయటకు వచ్చేయాలి' అని ప్రతిపక్షాలు సవాలు చేస్తున్నాయి. అదే జరిగితే అప్పుడు 'ప్రత్యేక హెూదాకై అత్మహత్య' ట్యాగ్ టిడిపికి అన్వయిస్తుంది. కానీ టిడిపి పార్టీ నాయకులు మునికోటి తరహాలో వారసులు లేనివారు కారు. వాళ్లకు చాలా దూరదృష్టి వుంది. రాబోయే పాతికేళ్లదాకా రాజధాని నిర్మాణం సాగుతుందని, అప్పటివరకు తాము, తమ పుత్రపౌత్రులు అధికారంలో వుండి ఆ కార్యనిర్వహణాభారం వహించాలని వారు ప్రణాళికలు వేస్తున్నారు. అంతటి ఆశాభావం వున్నవారిని ఆత్మహత్య చేసుకోమనడం సబబు కాదు. 'అయితే హత్య చేయాలంటావా? ప్రతిపక్షాలతో చేతులు కలిపి, లేదా బిజెపిలో చీలిక తెచ్చి కేంద్రంలోని అధికారపక్షాన్ని గద్దె దించి అనుకున్నది సాధించాలంటావా?' అని అడగకండి. అది కుదిరే పని కాదు. బిజెపికి పూర్తి మెజారిటీ వుంది. మోదీతో తలపడే నాయకుడూ బిజెపిలో లేడు. 'హత్యా లేదు, ఆత్మహత్యా లేదు, జీవించే వుంటాం, ప్రత్యేక హెూదా గురించి మాట్లాడుతూనే వుంటాం' అంటుంది టిడిపి. మొన్న కలాం గారు పోయినప్పుడు రాజకీయ నాయకులందరూ ఆయన్ను ఆకాశానికి ఎత్తేసింది ఎందుకనుకుంటున్నారు? ఆయన క్షిపణి పితామహుడు, గొప్ప శాస్త్రవేత్త వగైరా అనా? అబ్బే, వాస్తు కోసం భవంతులు కూల్చేస్తున్న వీళ్లకు ఆయన చెప్పే శాస్త్రీయ దృక్పథం ఏం నచ్చుతుంది? ఆయన చెప్పిన ఒక సూక్తి వీళ్లకు బాగా అనువుగా వుంది. 'కలాం గారు ఏం చెప్పారు, కలలు కనండి' అని మనకు చెప్తున్నారు. మనని నిద్ర పోనివ్వని కలల గురించి ఆయన మాట్లాడితే వీళ్లు మనల్ని జోకొట్టే కలలు కనమంటున్నారు.

మన తెలుగు రాష్ట్రాలు రెండింటిలో ముఖ్యమంత్రులకు బాగా నచ్చిన పదం – హబ్! ' .... రాష్ట్రం దేశం మొత్తం మీద ... హబ్‌గా మారే రోజులు దూరంలో లేవు' అనేది స్టాండర్డ్ ఫ్రేజ్. కెసియార్ అంటే తెలంగాణ అని, బాబు అంటే ఆంధ్ర అని మొదటి బ్లాంక్‌లో పూరిస్తారు. ఇక రెండో దానిలో ఏదైనా రావచ్చు, సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్, ఇన్నర్‌వేర్, కల్చర్, అగ్రికల్చర్, సెరికల్చర్, ఆక్వాకల్చర్, థర్మల్ పవర్, సోలార్ పవర్, హైడ్రోపవర్... యీ జాబితా అనంతం. నాకు యితర రాష్ట్రాల మీద జాలి వేస్తుంది. అన్ని హబ్బులూ మన దగ్గరే వుంటే, యిక వాళ్ల దగ్గరేం వుంటాయా అని. ప్రపంచంలోని అన్ని దేశాలు మనతో భాగస్వామ్యానికై ఉవ్విళ్లూరుతున్నాయని మనని ఊరిస్తారు. దానికి గాను మనం నోచుకున్న నోములేమిటో నాకు తెలియదు, మన దగ్గర వున్న క్వాలిటీ

ఏమిటో తెలియదు. మన యింజనీరింగు కాలేజీల క్వాలిటీ అతి పూర్ అని మన యూనివర్శిటీలే చెప్తున్నాయి, మన విశ్వవిద్యాలయాల్లో చాలావాటికి వైస్ ఛాన్సలర్లే లేరు, ఆసుపత్రుల నిర్వహణ బాగా లేవని, యిలా అయితే వేరే చోటికి మార్చేస్తామనీ ముఖ్యమంత్రులే హుంకరిస్తూ వుంటారు. ఉద్యోగులలో అలసత్వం పెరిగిపోతోందని, తను అక్కడ పక్కేయకపోతే బాగుపడేట్లు లేరని సిఎంలు వాపోతూ వుంటారు. చూడబోతే ఇరు ప్రాంతాల ఉద్యోగులలో అయోమయం, విద్యార్థుల పరిస్థితి 'అయ్యో'మయం. ఆంధ్ర రాష్ట్రం పరిపాలన వేరే చోట నుండి సరిగ్గా సాగడం లేదు కాబట్టి బెజవాడకు మార్చేస్తామని బాబే చెప్తున్నారు. జీతాలివ్వడానికి డబ్బు లేదని రెండు ప్రభుత్వాలూ అల్లాడుతున్నాయి. పరిస్థితి యిలా వుందని ఓ పక్క చెపుతూనే, 'విదేశాల భాగస్వామ్యంతో రేపు మీదే' అనే రంగుల సినిమా మనకి చూపిస్తున్నారు.

ఇద్దరు ముఖ్యమంత్రుల్లో కెసియార్ కంటె బాబుకి రెండు షోలు ఎక్కువ చూపించే అవకాశం వుంది. అవి – 'ప్రత్యేక హెూదా', 'కొత్త రాజధాని'. ప్రత్యేక హెూదా షో ఎన్నికల టైములో బాగా క్లిక్ అయింది. హెూదా వస్తే 90% గ్రాంట్, ఎక్సయిజ్‌లో రాయితీ వగైరా లాభాలెన్నో ఏకరువు పెట్టారు. అది వస్తే ఇక పట్టపగ్గాలు లేకుండా, పిచ్చిపిచ్చిగా, విచ్చలవిడిగా ఆంధ్ర డెవలప్ అయిపోతుందని, కాంగ్రెసు ఐదు సంవత్సరాలు హెూదా యిస్తానంది కానీ మేం పది సంవత్సరాలు, ఆట్టే మాట్లాడితే పదిహేను సంవత్సరాలు కొనసాగిస్తామని బిజెపి-టిడిపి ఉపన్యాసాలు దంచడమే కాదు, పుస్తకాలు వేసి పంచారు. హెూదా విషయంలో చేసిన కృషికై వెంకయ్యనాయుడిగారికి సన్మానం జరిగినట్లు కూడా గుర్తు. అప్పుడే సందేహజీవులు అనుమానాలు వెలిబుచ్చారు – 'చట్టప్రకారం ఆ హెూదాకు కావలసిన అర్హతలు ఆంధ్రకు లేనట్టున్నాయి' అని. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? మొండివాడు మోదీ తలచుకుంటే హెూదాకు కొఱవా?' అని వారి నోరు మూయించారు. అభ్యంతరాలు పెట్టడానికి ప్లానింగ్ కమిషన్ ఎవరు, బోడి, తీర్మానం చేస్తే చాలు, ఉత్తరాఖండ్‌కు అలాగే యిచ్చారు అని కొట్టి పారేశారు. ఆంధ్రులు నమ్మారు. ప్రత్యేక హెూదా కారణంగా పారిశ్రామికవేత్తలు యిబ్బడిముబ్బడిగా వచ్చి పెట్టుబడులు పెట్టేస్తారు అనుకున్నారు. తెలంగాణ నుంచి కూడా వచ్చేస్తారు, దెబ్బకు తెలంగాణకు తిక్క కుదురుతుంది, హైదరాబాదు వుంచేసుకున్నందుకు ఆ మాత్రం శాస్తి జరగాలిలే అని లోలోపల అనుకుని వుంటారు. అప్పుడు ఆశ ఎంత తీవ్రంగా వుందో యీ రోజు ఆశాభంగం కూడా అంతే తీవ్రంగా వుందని మనం గ్రహించాలి. కానీ టిడిపి మాత్రం గ్రహించటం లేదు. అధికారం చేజిక్కాక తాము స్వరం మార్చాం కాబట్టి ప్రజలు కూడా దానికి తగ్గట్టే తలలూపాలని అనుకుంటున్నారు.

గతంలో రెండు రూపాయలకు కిలో బియ్యం, మద్యనిషేధం వంటి విషయాల్లో బాబు ఎన్నికలలో ఒక రకమైన హామీలు యిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని నీరుకార్చారు. చెల్లిపోయింది. ఇప్పుడు మాత్రం ఎందుకు చెల్లదు అని బాబు ధీమా. 'ప్రత్యేక హెూదా వస్తే మంచిదే కానీ, అదేమీ గొప్ప విషయం కాదు' అనే పల్లవి ఆర్నెల్లగా అందుకున్నారు. 'హెూదా కావాలా? నిధులు కావాలా?' అని గద్దించడం మొదలుపెట్టారు. ఇదేం ప్రశ్న? విస్తరీ కావాలి, దానిలోకి అన్నమూ కావాలి. అన్నీ పోగొట్టుకున్న రాష్ట్రం ఆంధ్ర. పోయినవి ఎలాగూ పోయేయి. ఇస్తానన్నవి కూడా యివ్వకపోతే ఎలా? హెూదా వస్తే పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయి. నిధులు వస్తే ప్రభుత్వానికి వస్తాయి, జీతాలు యిచ్చుకోవచ్చు, పండగకు పప్పుబెల్లాలు పంచుకోవచ్చు. ప్రభుత్వమూ బతకాలి, పెట్టుబడిదారుడూ బతకాలి అంటే రెండూ కావాలి. హెూదా మాత్రమే కావాలి, నిధులు అక్కర్లేదు, ఉత్తరాంధ్రకు, రాయలసీమకు వాగ్దానం చేసిన ప్యాకేజీలు వద్దు అని ఎవరూ చెప్పలేదు. హెూదాలో పెద్ద ఏం లేదు అని చంద్రబాబు అంటూనే వుంటారు. ఇంకో పక్క ఆయన పార్టీ ఎంపీ రామ్మోహన నాయుడు పార్లమెంటులో హెూదా ఎంత అత్యావశ్యకమో లెక్చరు దంచారు. ఢిల్లీ కోటలో పాగా వేసిన కంభంపాటి రామ్మోహనరావు గారు 'దాని గురించి మా ప్రయత్నాలు ఆగలేదు, యిప్పటిదాకా ఏం జరగలేదు అని అనడమూ సరికాదు, ఎప్పటికైనా వస్తుందని నాకు ప్రగాఢ విశ్వాసం' అని సౌమ్యంగానే, చిరునవ్వు చెదరకుండానే చెప్తూనే వుంటారు. సుజనా చౌదరి మరింత ధైర్యంగా వచ్చేస్తోంది అంటూ వుంటారు. టిడిపిలో యిలాటి భిన్నస్వరాలుంటే దానికి అనుబంధ సభ్యుడిగా వున్న వెంకయ్యనాయుడుగారు ఏ పూటకి ఏం మాట్లాడతారో తెలియదు. ఓసారి హెూదా తథ్యం అంటారు, యింకోసారి రాదంటారు, మూడో రోజు పరిశీలనలో వుందంటారు. ఇలాటి గందరగోళం వలననే ఆ హెూదా ఏదో రాకపోతే చచ్చిపోతామనే భయం నిరుద్యోగులకు, యువతకు పట్టింది. అప్పుడు చచ్చేబదులు యిప్పుడే చస్తే మేలు కదా అనుకున్నాడు మునికోటి.

ఇప్పటిదాకా ప్రత్యేక హెూదా గురించి ఏమీ సాధించలేకపోయారని టిడిపి, బిజెపి నాయకులను ఎద్దేవా చేసినప్పుడల్లా వాళ్లు 'చట్టంలో లేకపోబట్టే యిన్ని చిక్కులు వస్తున్నాయి. లేకపోతే ఎప్పుడో వచ్చేసేది, ఇది కాంగ్రెసువారు చేసిన తప్పిదం. ఇప్పుడు మమ్మల్ని అడగడానికి వారికి నైతికాధికారం లేదు' అంటున్నారు. విభజన చట్టం సవ్యంగా వుండి వుంటే..., హైదరాబాదును యుటీ చేసి వుంటే.., ఆంధ్రకు అన్నీ కట్టబెట్టి వుంటే... అసలు కాంగ్రెసు ఎందుకు ఓడిపోయేది? మీకు ఓట్లెవరు వేసేవారు? 'ఆయనే వుంటే..' అనే సామెతలా వుంది మీరు చెప్పేది. వాళ్లు విభజన సరిగ్గా చేయలేదు కాబట్టే వాళ్లకు తిరుక్షవరం చేసి మీకు ఓట్లు కురిపించారు. వాళ్లు ఏ మాత్రం సజావుగా చేసి వున్నా ఓట్లు మూడు పార్టీల మధ్య చీలిపోయి వుండేవి. మీరు అధికారంలోకి వచ్చేవారో లేదో తెలియదు. అయినా అలాటి అసమగ్ర, అన్యాయపు బిల్లుకు బిజెపి ఎందుకు మద్దతు యిచ్చి గెలిపించింది? టిడిపి టి-విభాగం ఎందుకు మద్దతిచ్చింది? కాంగ్రెసు వాళ్లు చేసిన అనేక చట్టాలను మోదీ తిరగతోడుతున్నారు, అనేక వ్యవస్థలను కూలదోస్తున్నారు, అనేక వ్యవస్థల్లో వ్యక్తులను మారుస్తున్నారు. తలచుకుంటే ఈ చట్టంలో లొసుగును సవరించలేరా? ఎన్నో ఆర్డినెన్సులు యిస్తున్నారు. ఇదొకటి యివ్వలేరా? అంత అశక్తుడా? చేతకానివాడైతే చెప్పేస్తే పోయె కదా! ఇష్టం లేకపోతే ఆ ముక్కయినా చెప్పాలి.

తిరుపతి ఎన్నికల సభ తర్వాత 'తూర్పు తిరిగి దణ్ణం పెట్టమన్న మోదీ' అనే వ్యాసంలో 'కెసియార్ ఆరోపించినట్టు హైదరాబాదును యూటీ చేస్తామని మోదీ చెప్తారా లేదా అని చూశా. ఢిల్లీని తలదన్నే నగరం కట్టండి, నేను నిధులిస్తాను అనే హామీ తప్ప మోదీగారు చెప్పినదేమిటి? 'ప్రపంచమంతా తూర్పువైపు చూస్తోంది. మీరూ చూడండి. సముద్రం కనబడుతుంది. పశ్చిమాన సముద్రతీరం వున్న గుజరాత్ కంటె తూర్పున సముద్రతీరం వున్న మీకు అవకాశాలు అధికంగా వుంటాయి. ఏం దిగులు పడకండి. కష్టపడడం మీకు ఎలాగూ అలవాటే. పడండి. పడుతూనే వుండండి, మరింత అలవాటు పడతారు. పెట్రోలు, గ్యాస్ వంటి సహజవనరులు మీకున్నాయి అని చెప్పారు.... ఇక మోదీ సీమాంధ్రులకు యిచ్చిన వరాల మాట ఏమిటంటారా? ఆయనే చివర్లో అందరి చేతా అనిపించారు – గోవిందా గోవింద అని! అదే ఆయన మనకిచ్చిన సందేశం!' అని రాశాను. ఆ రోజు నా మీద విరుచుకు పడిన వారిలో సగం మందికైనా యీ పాటికి ఆవేశం చల్లారి వుంటుంది. 'బాబు, మోదీ, పవన్ ముగ్గురూ కలిస్తే పంగనామాలు' అని కెసియార్ అంటే అదే మీటింగులో పవన్ మంచి రిటార్టు యిచ్చారు – మూడు ఒకట్లు చూస్తే తనకు తిరుపతి వెంకన్న గుర్తుకు వస్తాడని. తిరుపతి గుర్తుకు రాగానే తిరుక్షవరం గుర్తుకు వస్తుంది. ఇప్పుడు ఆంధ్రకు అదే జరిగిందన్న వ్యథతో ఆ వెంకన్న సాక్షిగానే యిప్పుడు మునికోటి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇప్పుడీ ఆత్మహత్య జరగగానే టిడిపి బెంబేలెత్తింది. ప్రతిపక్షాలు దీన్ని వాడుకుంటాయని భయపడింది. మీడియా మేనేజ్‌మెంట్ మొదలుపెట్టింది. రెండు రకాల వార్తలు కాదు లీకులు రాసాగాయి. మొదటిరకం ప్రత్యేక హెూదాపై బాబు బిజెపి కేంద్ర నాయకత్వంపై మండిపడ్డారని, తన ఎంపీలను పిలిచి మొహమాటాలకు పోతే ఎలా, పార్లమెంటులో గట్టిగా అడగండి అన్నారని లీకు వచ్చింది. రెండో రకం ప్రత్యేక హెూదా ఎందుకు, దాన్ని తలదన్నే ప్యాకేజీ యిస్తాం కదా అని కేంద్రమంత్రులు అన్నారని లీకు వచ్చింది. మొదటి లీకు గురించి చర్చిస్తే – ప్రత్యేక హెూదా గురించి అడగడం అనవసరం, దాని వలన ఒరిగేది ఏమీ లేదు అని బాబు బహిరంగంగా అనసాగారు. ప్రత్యేక హెూదా గురించి గొడవ చేస్తున్న ప్రతిపక్షాలతో గొంతు కలపవద్దని, బిజెపితో వైరం తెచ్చిపెట్టుకోవద్దని తన ఎంపీలకు సలహా యిచ్చారని కూడా వార్తలు వచ్చాయి. ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ దానికి మద్దతుగా ప్రత్యేక హెూదా గురించి అడిగే మేధావుల ఫోరంతో సహా అందర్నీ దుమ్మెత్తి పోశారు.

ప్రత్యేక హెూదా వలన ప్రయోజనం లేదని బాబుకి తెలిస్తే ఆ ముక్క ప్రజలకు సోదాహరణంగా చెప్పి, వారిని కన్విన్స్ చేస్తే, నటుడు శివాజీ దీక్షలు, పవన్ కళ్యాణ్ ట్వీట్లు, మునికోటి ఆత్మహత్య యివేమీ వుండేవి కావు. బాబు యివాళ అలా చెపితే 'మరి ఎన్నికల ప్రచారంలో ప్రత్యేక హెూదా గురించి అంత గొప్పగా చెప్పావ్? అంత పనికిమాలినదైతే పదేళ్లు కొనసాగిస్తామని ఎందుకన్నావ్? ప్రత్యేక హెూదా గురించి కాంగ్రెసు చట్టంలో పెట్టకుండా ఆంధ్రకు ద్రోహం చేసింది' అని యిప్పుడు కూడా ఎందుకంటున్నావ్?' అని అడిగే ప్రమాదం వుంది. ఈ యిబ్బంది ఎప్పటికైనా తప్పదు, ఒప్పేసుకోవాలి. 'ప్రత్యేక హెూదా గురించి రాజ్యసభలో హామీ యివ్వడమే కాదు, కాబినెట్ మీటింగులో కూడా కాంగ్రెసు తీర్మానం చేసినా, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన బిజెపికి అది యివ్వడం సుతరామూ యిష్టం లేదు. ఈ విషయంలో నేనేం చేయలేను. వాళ్లతో సంబంధం వుంచుకున్నా, తెంచుకున్నా వాళ్లేమీ పట్టించుకోరు. అందువలన దాని గురించి ప్రస్తుతానికి మర్చిపోండి. 2019 పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెసు మళ్లీ అధికారంలోకి వస్తే గిస్తే అప్పుడు వాళ్లకు గుర్తు చేసి అడుగుదాం' అని స్టేటుమెంటు యిచ్చేసి చేతులు కడుక్కోవడం మంచిది.

మనం అధికారంలో లేము కాబట్టి యిలాటి ఉచిత సలహాలు ఎన్నయినా చెపుతాం. వాటిని అమలు చేయడం బుకాయింపు మీదే పబ్బం గడుపుకునే నాయకులకు అంత సులభమా! పార్లమెంటులో సాక్షాత్తూ మంత్రి రావ్ ఇందర్‌జిత్ సింగ్ ప్రకటన చేశారు. 'కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా 10% పెంచినందున యిక దేశంలో ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హెూదా యిచ్చే ప్రశ్నే లేదు. ఆ ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదు.' అని. ఆ ప్రకటన రాబట్టే ప్రశ్న వేసినది ఆంధ్ర టిడిపి ఎంపీలు కాదు, బిహార్, ఒడిశా ఎంపీలు, వాళ్ల రాష్ట్రాల హెూదా గురించి అడిగారు. మంత్రిగారు మీకు లేదు అని వూరుకోవచ్చా, అబ్బే దేశంలో ఏ రాష్ట్రానికీ లేదు అని అదనపు సమాచారం కూడా యిచ్చారు. ఇదేదో అప్పటికప్పుడు ఆవేశంగా యిచ్చిన సమాధానం కాదు. రాతపూర్వకంగా యిచ్చినది. ఆంధ్ర కూడా ఆ హెూదా గురించి అడుగుతోందని తెలిసే, మళ్లీ వాళ్లకేం చెబుదాం, వాళ్లకి చెప్పినా పక్కనే వున్న తెలంగాణ కూడా నా సంగతేమిటంటుంది, అందరికీ కలిపి ఒకేసారి ఢంకా బజాయించి చెప్పేస్తే వదిలిపోతుంది అనుకుంది బిజెపి కేంద్ర నాయకత్వం. ఇలా చెప్పడం వలన చంద్రబాబుకి యిబ్బందేమో అని తటపటాయించలేదు. ఇబ్బంది పడితే పడనీ అనుకున్నట్టుంది. పరికించి చూస్తే చంద్రబాబు ప్రతిష్ఠను ఆంధ్రలో నిలిపే ప్రయత్నమేమీ మోదీ చేయడం లేదు. ఇటీవల కాలంలో తెలంగాణకు ఎక్కువ లాభాలు చేకూరుస్తున్నట్లు తోస్తోంది. దీనికి రాజకీయ కారణాలున్నాయో లేక, కేవలం ఆర్థిక కారణాలో తెలియదు. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్ర రాష్ట్రం పూర్తిగా దెబ్బ తిని వుంది, ఇప్పట్లో కోలుకునే పరిస్థితి కనబడటం లేదు. హైదరాబాదు కారణంగా తెలంగాణ పరిస్థితి దాని కంటె మెరుగ్గా వుంది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యిప్పటికే వుంది కాబట్టి దానికి కాస్త చేయూత యిస్తే చాలు, కనీసం ఒక రాష్ట్రం బాగుపడుతుంది అనుకుంటున్నారేమో తెలియదు.

ఇంత కుండబద్దలు కొట్టి చెప్పినా, మొన్నటికి మొన్న సుజనా చౌదరి, కంభంపాటి 'అబ్బే, వాళ్లు మన గురించి చెప్పలేదండి' అంటున్నారు. 'దేశంలో ఏ రాష్ట్రానికీ లేదు, అన్నాక కూడా మన గురించి విడిగా చెప్పాలా? మనది కూడా దేశంలో ఒక రాష్ట్రమే కదా' అని నిలదీస్తే 'మీరు చూస్తూ వుండండి, బిహార్ ఎన్నికల కారణంగా మనకు యివ్వలేకపోతున్నారు. మన కిస్తే వాళ్లూ

అడుగుతారని భయం. బిహార్ ఎన్నికలు కాగానే మనకు యిచ్చేస్తారు' అని వాదించారు. 'బిహార్ తర్వాత తమిళనాడు ఎన్నికలంటారు. మన ప్రత్యేక హెూదాకు తమిళనాడు కూడా అడ్డుపడుతోంది కదా' అని అంటే 'ఇవన్నీ ఎందుకు, బిహార్ ఎన్నికల తర్వాత మాట్లాడండి' అన్నారు. ఇప్పుడీ ఆత్మహత్య కారణంగా బిహార్ ఎన్నికల గురించి మర్చిపోయి, బాబు ఢిల్లీ నాయకులను నిలదీశారని అనుకోవాలా? కాంగ్రెసు అధికారంలో వుండగా తెలంగాణపై నిర్ణయం వచ్చేది కాదు, యుపి ఎన్నికల కారణంగా ఆగిందని, మణిపూర్‌లో ఎన్నికలు కాగానే వచ్చేస్తుందని, సరైన సమయంలో సరైన నిర్ణయమని చెపుతూ వచ్చారు. చివరకు ఎన్నికల ముందు ఆదరాబాదరాగా చేసి మొత్తం కంపుకంపు చేశారు. తెల్లారి లేస్తే ఆంధ్ర, తెలంగాణ జుట్టుజుట్టు పట్టుకుంటున్నాయి. తగవు తీర్చాల్సిన గవర్నరుకాని, కేంద్రం కాని 'మీ ముఖ్యమంత్రులిద్దరూ కూర్చుని మాట్లాడుకోవాలి, మేం చేసేదేమీ లేదు' అనేస్తున్నాయి. ఇప్పుడు బిజెపి కూడా కాంగ్రెసు బాటలోనే బిహారని, బెంగాలని, పంజాబని నిర్ణయాలు వాయిదా వేస్తే అంతకంటె ఘోరం యింకోటి లేదు. ఫలానా కారణంగా వాయిదా వేశాం అని అప్పుడు కాంగ్రెసూ చెప్పలేదు, యిప్పుడు బిజెపి చెప్పలేదు. వస్తుందని వూరించేవాళ్లు, ఆలస్యానికి తమంతట తామే కారణాలు పుట్టిస్తున్నారేమో తెలియదు.

ఇక రెండో లీకు గురించి – ఆర్థికమంత్రి ఆంధ్రకు నిధులు కురిపిస్తుందని చెప్పారట. ఆ ముక్క చెప్పినది ఎవరంటే టిడిపి ఎంపీలే. ఆర్థికమంత్రి దగ్గరకు వెళ్లి మహజరు యిచ్చినపుడు తీయించుకున్న ఫోటోకు యీ న్యూస్ కలిపి పేపర్లో వేయించేసుకున్నారు. తెలంగాణ, సమైక్య ఉద్యమాలప్పుడు యిలాటి తమాషాలు చాలా చూశాం. వెళ్లొచ్చిన ప్రతీవాళ్లూ 'సోనియా తమ మాటలను శ్రద్ధగా ఆలకించి, అలాగే జరుగుతుందని హామీ యిచ్చార'ని యిరు పక్షాల వారూ చెప్పేసుకునేవారు. కేంద్రం ఆంధ్రకు యిప్పటిదాకా ఏమీ విదల్చలేదని అందరికీ తెలుసు. ఇవ్వవలసినది కూడా యివ్వలేదని, బజెట్ లోటు పూరించలేదనీ తెలుసు. అయినా బజెట్ లోటు పూరించడం అనేది అర్థం లేని మాట. ఎంత యివ్వాలో అంత యివ్వాలి కానీ, నీ లోటెంతో చెప్పు అంతే యిస్తాం అనడమేమిటి? ప్రజలకు యివ్వాల్సినవి యివ్వకుండా ఎండగట్టి, లోటు తగ్గిస్తే దానివలన కేంద్రానికి లాభమన్నమాట.

పధ్నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సులతో మోదీ సర్కారు రాష్ట్రాలకు నిధులు ప్రవహింప చేస్తోందన్నమాట వట్టి మాట అని మొన్ననే గణాంకాలతో సహా వార్త వచ్చింది. కేంద్ర పన్నుల్లో వాటా పెంచడం వలన రాష్ట్రాలకు రూ.1.78 లక్షల కోట్ల నిధులు పెరిగాయని చెప్తున్నారు కానీ కేంద్ర ప్రాయోజిక పథకాల్లో కోత, రాష్ట్ర ప్రణాళికలకు కేంద్ర మద్దతు రద్దు వంటి చర్యల ద్వారా కేంద్రం 2.68 లక్షల కోట్లు తగ్గించేసిందని చెప్పటం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి 34 పథకాల భారాన్ని కేంద్రం తనే పూర్తిగా తీసుకుంటున్నట్లు ప్రకటించింది. అయితే బజెట్‌లో వాటిపై ఆర్థిక భారాన్ని తగ్గించుకుంది. 66 కేంద్ర ప్రాయోజిత పథకాలకు 2014–15 బజెట్‌లో 2.52 లక్షల కోట్లు ఎలాట్ చేస్తే 2015–16 బజెట్‌లో 1.69 కోట్లే ఎలాట్ చేసింది. రాష్ట్ర పథకాలకు కేంద్ర మద్దతుకై పాత బజెట్‌లో 3.38 లక్షల కోట్లు ఎలాటయితే, ప్రస్తుత బజెట్‌లో 2.04 లక్షల కోట్లు ఎలాట్ చేసింది. ఇంకో 20 ముఖ్యమైన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా మార్చబోతున్నామని ప్రకటించి, ఆ నిష్పత్తిని నిర్ధారించే పని బిజెపి సిఎం చౌహాన్ నేతృత్వంలోని కమిటీకి అప్పగించింది. వాళ్ల రిపోర్టు ఎలా వుంటుందో వూహించడానికి చిన్న సంకేతం – వీటి కింద కేంద్ర వాటాను 1.38 లక్షల కోట్ల నుండి ప్రస్తుత బజెట్‌లో 0.78 లక్షల కోట్లకు తగ్గించేసింది. ఈ లెక్కన గతంలో కంటె కేంద్రం రాష్ట్రాలకు 90 వేల కోట్లు తక్కువగా యిస్తోంది. ఇలాటి కేంద్రం ఆంధ్రకు నిధులు కట్టబెడుతుందంటే ఎలా నమ్ముతాం? పైగా 14 నెలల్లో మన అనుభవం ఏం చెపుతోంది? హుదూద్‌కు మనం అడిగినదెంత? వాళ్లు యిచ్చినదెంత? ఇవన్నీ చూసిన ఆంధ్రులకు కేంద్రం ఒరగబెడుతుందంటే నమ్ముతారా?

నమ్మలేదని బాబుకు కూడా తోచినట్టుంది. అందువలన బుధవారం ఉదయం నుంచి రాత్రివరకు చర్చలు జరిపి మీడియా ముందుకు వచ్చి మాట్లాడారు – దానిలో కూడా స్పష్టత లేదు. బాబు మాటలను రిపోర్టు చేస్తూ ఆ వార్తను ''ఈనాడు'' 'ప్రత్యేక హెూదా యిచ్చి తీరాల్సిందే' అనే శీర్షిక కింద వేస్తే ''సాక్షి'' 'హెూదా తోనే అన్నీ రావు' అనే శీర్షికతో యిచ్చారు. ఆంధ్రభూమి 'ప్రజలకే చెబుతా' అనే శీర్షికతో యిచ్చారు. వివరంగా చూడబోతే – 'విభజన సందర్భంగా ప్రత్యేక హెూదా వంటి అనేక హామీలు తెరపైకి వచ్చాయి, ప్రస్తుతం ఏం జరుగుతోంది, హామీలు నెరవేరకపోతే ప్రత్యామ్నాయాలు ఏమిటి అనే విషయాలను ప్రజల ముందు ఐదు రోజుల్లో వుంచుతా, నీతి ఆయోగ్ ఏర్పాటు ద్వారా ప్రత్యేక హెూదా కలిగిన రాష్ట్రాలకు చాలా మేర నిధుల కేటాయింపులో కోత పడింది, మనకూ ఆ హెూదా వస్తే మనకూ కోత పడి హెూదా వలన నష్టపోతాం.' అని ఆంధ్రభూమి రాయగా, సాక్షి యివన్నీ రాస్తూ 'ప్రత్యేక హెూదా రాదని మనమే ఒక నిర్ణయానికి రావడం సరికాదు, దీనిపై ప్రధాని స్పష్టత యివ్వాల్సి వుంది' అని అన్నారని జోడించింది. ఈనాడు మాత్రం 'ప్రత్యేక హెూదా యిస్తే లాభాలను గుర్తుంచుకోవాలి, ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు యిచ్చిన హామీల మేరకు ప్రత్యేక హెూదా యివ్వాల్సిందే' అని అన్నట్టు రాసింది. ఆ సమావేశంలో బాబు యితర విషయాలు కూడా మాట్లాడారు. ఆంధ్రజ్యోతికి అదే ముఖ్యంగా తోచింది 'టి–సర్కారు కలిసి రావటం లేదు' అని శీర్షిక పెట్టి కింద వార్తలో ప్రత్యేక హెూదా గురించి ఏమీ రాయలేదు. అయితే బాబును ఉటంకించకుండా న్యూస్ ఎనాలిసిస్‌లో భాగంగా –ట కబుర్లు రాశారు. దాని ప్రకారం బిజెపి ప్రత్యేకహెూదాకు బదులు ప్యాకేజీ యిద్దామనుకుంటోందని, ఆ ప్యాకేజీ ఎలా వుంటుందో తమతో చర్చించి ఫైనలైజ్ చేయాలని బాబు అంటున్నారనీ రాశారు. ఈ ప్యాకేజీలో పారిశ్రామిక రాయితీలు వుండాలని బాబు ఆలోచనట. జిఎస్‌టి వచ్చిన తర్వాత దేశమంతా ఒకే రకమైన పన్నులు వుంటే ఏపికి ప్రత్యేకంగా పన్ను రాయితీలు ఎలా యిస్తామని బిజెపి అంటోందట. మొత్తం మీద చూస్తే బాబు

మాటలు ఒక్కోరికి ఒక్కోలా అర్థమయ్యాయని తెలుస్తోంది.

తను సమైక్యవాదో, ప్రత్యేకవాదో చెప్పకుండా కాలక్షేపం చేసేసిన చంద్రబాబు యిప్పుడు కూడా ప్రత్యేక హోదా అవసరమో కాదో తేల్చడం లేదు. కాస్సేపు కావాలంటారు, కాస్సేపు దాని వలన ఒనగూడేది లేదు, రాయితీలు, ప్రోత్సాహకాలు, నిధులు వుంటే బెటరు కదా అంటారు. మరి ఈ ఆలోచన ఈశాన్య రాష్ట్రాల వారికి ఎందుకు లేదో!? వాళ్లు కూడా మాకు హోదాలు వద్దు, నిధులివ్వండి అనవచ్చుగా. అనడం లేదెందుకు? వాళ్లేనా, బిహార్, ఒడిశా, తెలంగాణ అందరూ అడుగుతున్నారు. హోదా వలన లాభం ఏదీ లేకపోతే వాళ్లు అడుగుతారా? హోదా వుంటే పరిశ్రమలు వస్తాయి, పెట్టుబడులు వస్తాయి, ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వస్తాయి, ఆర్థికంగా రాష్ట్రం పుంజుకుంటుంది. ఇది తెలిసే అందరూ అడుగుతున్నారు. కొందరు సాధిస్తున్నారు. బాబుకు హోదా తెప్పించలేకపోతే చేతకాదని చెప్పి చేతులెత్తి దణ్ణం పెట్టేస్తే సరిపోతుంది. ఎవరూ కొరత వేయరు. ఇంకో నాలుగేళ్ల పాటు పాలించమని అధికారం ముందే యిచ్చారు. దిగిపొమ్మనరు. పరిశ్రమలంటారా, ఎన్ని వస్తే అన్ని వస్తాయి. సినిమా పరిశ్రమలో ఎక్కువమంది ఆంధ్రులున్నారు కాబట్టి ఆంధ్రకు తరలిపోతుందనుకున్నారు. ఇప్పుడా సూచనలేమీ కనబడటం లేదు. ఇక్కడ స్టూడియోలు కట్టుకున్న వారిని ఆకట్టుకోవడానికి కెసియార్ 'ఫిల్మ్ నగర్‌లో వున్న వాటి మార్కెట్ వేల్యూ పెరిగింది కాబట్టి స్టూడియోలను ఊరికి దూరంగా మరో చోటకు తరలించే మాటయితే ప్రస్తుతం అవి వున్న చోట షాపింగు కాంప్లెక్సులు కట్టుకోవడానికి అనుమతిస్తాం' అనేశారు. సినిమా షూటింగులకు అంతరాయాలు, రిలీజ్‌కు ముందు బెదిరింపులు అన్నీ ఆగిపోయినట్లున్నాయి. తక్కిన పరిశ్రమలు కూడా తరలిపోవడానికి తొందరగా ఏమీ లేవు. దానికి బాబు కాదు, మరొకరు ముఖ్యమంత్రిగా వున్నా చేయగలిగేది ఏమీ లేదు. వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించి, హోదా గురించి, రాయితీల గురించి ఆశలు పెట్టుకోకండి, ఉన్నదాంట్లో సర్దుకుందాం అని చెప్తే సరిపోతుంది. బుకాయింపులతో మోసం చేయడం ప్రమాదకరం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2015)**

## ఆగస్టు 08 ఎమ్బీయస్ : ర్యాగింగ్ అరికట్టేందుకు సినీయాక్టర్ల ప్రచారమా?

రుషితేశ్వరి ఆత్మహత్యపై నివేదిక వచ్చిన తర్వాత మాట్లాడుతూ గంటా శ్రీనివాస్ గారు ర్యాగింగ్ అరికట్టడానికి తీసుకునే చర్యలలో భాగంగా సినిమా యాక్టర్ల చేత ప్రచారం చేయిస్తామని సెలవిచ్చారు. ర్యాగింగ్ గురించి చాలాకాలంగా చర్చ జరుగుతోంది. చాలా సూచనలు వచ్చాయి. అవేమీ యిన్నాళ్లూ అమలు చేయలేదు. ఇన్నాళ్లకు దానిపై బాగా ఫోకస్ పడింది. వెంటనే మంత్రిగారికి తోచిన ఆలోచన ఏమిటంటే – ప్రచారం చేయించడం! కాదేదీ ప్రచారానికి అనర్హం అన్నట్టయిపోయింది. మామూలుగా మరో రాష్ట్రంలో అయితే రాష్ట్ర రాజధాని నిర్మాణం అంటే ఆఫీసులూ అవీ నెమ్మదిగా, చప్పుడు లేకుండా ట్టుకుపోతారు. ఆంధ్రలో అయితే దానికి పెద్ద ప్రచారం. అలా కట్టబోతున్నాం, యిలా కట్టబోతున్నాం అంటూ ఫోటోలు, బ్లూ ప్రింటులు, మంత్రుల విదేశీ పర్యటనలు, విదేశీయులు ప్లాను తయారు చేసి పట్టుకుని వస్తే అది కూడా పెద్ద ఆర్భాటమే. రాజధానికి నిధుల సేకరణా అంతే. పుష్కరాల సంగతి చెప్పనే అక్కరలేదు. ఆంధ్రకు వస్తున్న ఆదాయమంతా ప్రచారానికే పోతున్నట్టు అనిపిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ అని 23 జిల్లాల రాష్ట్రానికై ఒక మాసపత్రిక వెలువడేది. ప్రభుత్వాఫీసులకు, స్కూలు లైబ్రరీలకు వెళుతుంది. బయట కనడడం తక్కువే. దాని ధర రూ.5. సంసారపక్షంగానే కొన్ని పేజీలు మాత్రం కలర్‌లో వేసుకుంటూ వచ్చేవారు. ఇప్పుడు 13 జిల్లాల ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక దానికి మాత్రమే అది పరిమితమైంది. 13 జిల్లాలకే కాబట్టి బజెట్ తగ్గి వుంటుంది, గతంలో వేసినన్ని కలరు పేజీలు వేసి వుండరు అనుకుంటున్నారా? అబ్బే, 80 పేజీలు వేస్తే అన్నీ కలరు, ఆర్టు పేపరే. తెలుగు ఇండియా టుడేని తలదన్నేట్లా తయారు చేస్తున్నారు. అదే మూతపడింది. ఇది మన డబ్బుతో నడుస్తోంది కాబట్టి యాడ్ రెవెన్యూ ఏమీ లేకపోయినా మూతపడదు. కానీ ప్రచారానికై ఎంత అలవి మీరి ఖర్చుపెడుతున్నార్రా అనిపిస్తుంది చూడంగానే. ఇప్పుడు ర్యాగింగ్ అనగానే సినిమా యాక్టర్ల చేత ప్రచారమంటూ చెప్పి టీవీ యాడ్స్, హోర్డింగులు మొదలుపెడతారు కాబోలు. ఎన్ని యాడ్ కంపెనీలు బాగు పడతాయో చూడాలి.

దాని సంగతి తర్వాత చూడవచ్చు కానీ ముందు దీనికై ప్రచారం చేసే అర్హత వున్న నటుడు, నటీమణి ఎవరో చెప్పండి చూదాం. టీజింగ్ ముదిరితే ర్యాగింగ్ కదా. సినిమాల్లో టీజ్, ర్యాగ్ చేయని హీరో వున్నాడా? టీజింగ్ అర్థం కూడా మారుతూ వచ్చింది. ఇదివరకు ఓ మాదిరి టీజింగు వుంటే యిప్పట్లో తను వలచిన దాన్ని ఒసే, ఏమే అనడం, బహిరంగంగా ముద్దు పెట్టుకుంటానని ఛాలెంజ్ చేయడం, తాగి యింటిమీదో, హాస్టల్ మీదో పడి అల్లరి చేయడం, వద్దురా యీ అల్లరి పనులు అనే కన్నతండ్రిని, చదువు చెప్పే గురువును వెక్కిరించడం, సెటైర్లు వేయడం, వారితో కలిసి మందు కొట్టడం, హీరోయిన్లతో బూతులాడడం – యివీ యీ నాటి హీరో లక్షణాలు. ఇక హీరోయిన్లు కూడా గతంలోలా ఆత్మాభిమానంతో వుండే రోజులు పోయాయి. హీరో మీద పడిపోయి 'శోభనం ఎప్పుడురా, నన్ను తల్లిని ఎప్పుడు చేస్తావురా' అడిగేస్తున్నారు. మందు కొడుతున్నారు. డిసిప్లిన్ నేర్పే తండ్రిని ఎదిరిస్తున్నారు. తక్కిన అమ్మాయిలతో కలిసి హీరోని ర్యాగ్ చేద్దామని చూస్తున్నారు, ఫోన్ చేసి హాస్టళ్లకు అబ్బాయిలను రప్పించి వార్డెన్ గదిలోకి తోసేసి నెట్టేస్తున్నారు. ఇలాటి పాత్రలు ధరించి తెరపై ఒక యిమేజిని తెచ్చుకున్న తారలు టీవీల్లో కనబడి 'ర్యాగింగ్ తప్పమ్మా' అని చెప్తే ఎంత హాస్యాస్పదంగా వుంటుంది?

అసలు తారల చేత ప్రచారమెందుకు? యూనివర్శిటీలో ర్యాగింగ్ సంఘటన బయటపడిన తర్వాత ప్రభుత్వం తీరు ఎలా వుంది?

నివేదిక వచ్చేదాకా ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయలేదు. ఆయన స్టూడెంట్స్‌తో కలిసి డాన్సు చేస్తున్న వీడియో బయటకు రాగానే సస్పెండ్ చేసి వుంటే ప్రజాగ్రహం కొంతైనా చల్లారేది. న్యాయం జరుగుతుందనే ఆశ కలిగేది. అలా చేయకపోవడానికి కారణాలు తెలియక రకరకాల ఊహలు పుట్టుకుని వచ్చాయి. డైరీలో పేర్లు కొట్టివేయడం దగ్గర్నుంచి అన్నీ అనుమానాస్పదంగానే వున్నాయి. ఫైనల్‌గా ఆమె మానసిక స్థితి బాగాలేదని తోచేట్లా, ప్రచారం అందుకున్నారు. మామూలు సంఘటనలకే తీవ్రంగా స్పందించే సెన్సిటివిటీ కలిగివుండడం ఆమె తప్పుగా చూపిస్తున్నారు. ఏది మామూలో, ఏది కాదో వారినే అడగాలి. నాగార్జున యూనివర్శిటీలో కులసంఘాల గురించి, హాస్టల్లో వున్న విద్యార్థుల ప్రవర్తన గురించి, ఫిర్యాదు చేసే విద్యార్థినుల పట్ల టీచర్ల నిర్లక్ష్యం గురించి అనేక కథనాలు బయటకు వచ్చాయి. కాలేజీలోనే ఆడిటోరియం వుండగా ఫ్రెషర్స్ డే లాటి దాన్ని హాయ్‌లాండ్‌లో ఎందుకు చేయాలి, రాత్రి ఎందుకు చేయాలి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అలా చేయడం, యీనాటి కాలేజీలన్నిటికీ పరిపాటి అయిందని, ప్రిస్టేజి సింబల్ అయిందని కొందరు వివరిస్తున్నారు. నాగార్జున యూనివర్శిటీలో యీ సంఘటన జరిగింది కాబట్టి యివన్నీ చర్చకు వచ్చాయని, తక్కిన వాటిల్లో కూడా యిలాటి పరిస్థితే యించుమించుగా వుందని కొందరి వ్యాఖ్యలు. అక్కడున్న వారికే నిజానిజాలు తెలుస్తాయి.

తెలంగాణ ఉద్యమసందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీని మూసివేయాలని లగడపాటి రాజగోపాల్ ప్రకటన చేసినపుడు నేను దాన్ని వ్యతిరేకిస్తూ ఆయన్ను దుయ్యబట్టాను. చదువుకోవడానికి కాస్తయినా అవకాశమివ్వండి మహాప్రభో అన్నాను. ఉస్మానియా గురించి అలా మాట్లాడిన రాజగోపాల్ గారికి తన ముక్కు కింద వున్న నాగార్జునలో ఏం జరుగుతోందో తెలియదనుకోవాలా? ఉస్మానియా కూడా అలా తయారవాలనుకున్నారా? ఆంధ్ర రాజధాని అక్కడే రాబోతోంది. ఆంధ్రుల ఆర్థిక, సాంస్కృతిక, పారిశ్రామిక, న్యాయవ్యవహారాల, అంతెందుకు అన్ని రకాల కార్యకలాపాలకు రాజధాని అదే. అక్కడ వున్న యూనివర్శిటీలో వ్యవహారాలు యింత కంపు కొడుతున్నాయి. కంపు బయటకు వచ్చాక కూడా తక్షణ చర్యలు చేపట్టలేదు. ఇప్పుడీ నివేదికను అమలు చేస్తారో, నీరు కారుస్తారో రెండు, మూడేళ్ల తర్వాతే తెలుస్తుంది. అమ్మాయి సున్నితత్వమే ఆమె చావుకి కారణం అని ఎప్పుడైతే పల్లవి అందుకున్నారో, అప్పటి నుంచే సందేహాలు మొదలయ్యాయి. చిన్నపిల్లలు తెలియక చేశారు, ఇప్పుడు కఠినమైన శిక్ష వేసి వాళ్ల కెరియర్ నాశనం చేస్తే మాత్రం రిషితేశ్వరి మళ్లీ బతికి వస్తుందా అనే వాదనలు తప్పక వస్తాయి. రిషితేశ్వరి కుటుంబానికి 10 లక్షలిచ్చాం. కావాలంటే తన పేర ఒక ఎవార్డు పెడదాం అంటూ పరిష్కార మార్గాలు (?) చూపిస్తారు. ఈలోగా యింకో అమ్మాయి గొడవ వస్తుంది. మనం మర్చిపోతాం. ఇప్పటికైనా దీన్ని అరికట్టడం, పోనీ అది కుదరకపోతే హద్దుల్లో వుంచడం జరగాలంటే వ్యవస్థను క్షాళన చేయాలి. ఎలా అనే దాని గురించి ఇప్పటికే అనేకమంది నిపుణులు నివేదికలు యిచ్చి వుంటారు. చిత్తశుద్ధితో వాటిని అమలు చేస్తే చాలు. నిపుణులెవ్వరూ సినిమా యాక్టర్ల చేత టీవీల్లో ప్రచారం చేయించమని చెప్పి వుంటారనుకోను. జనాభాలో కాలేజీ విద్యార్థుల శాతం 1% కూడా వుండదు. ర్యాగింగ్ చేయవద్దని తక్కిన 99%కు సుత్తి దేనికి? వాళ్లని యిప్పటికే ప్రభుత్వమూ, పార్టీలు ర్యాగ్ చేస్తున్నాయి. హితవు చెప్పవలసిన వాళ్లకు చెప్తే చాలు. హితోక్తులు వినకపోతే కఠినంగా శిక్షించడం మొదలుపెడితే ర్యాగింగ్ దానంతట అదే ఆగుతుంది. ర్యాగ్ చేస్తున్నవారి ఫోటోలు, వివరాలు మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తే వారి బంధుమిత్రులు సంఘంలో తలెత్తుకోలేని పరిస్థితి వస్తుంది. ఆ భయం చేత ర్యాగ్ చేయడం మానేస్తారు. అందువలన ప్రచారానికి ఉపయోగిస్తే వారి ఫోటోలు వుపయోగించండి, తప్ప సినిమా యాక్టర్లవి అక్కరలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2015)**

**ఆగస్టు 11-12 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఇప్పుడిక ఇస్తాంబుల్**

చంద్రబాబుగారు ఏ వూరు కెళితే ఆంధ్ర రాజధానిని అలా రూపుదిద్దుతానంటారు. సింగపూరు, జపాన్ అయ్యాయి. మొన్న టర్కీ వెళ్లి వచ్చారు కాబట్టి అమరావతిని ఇస్తాంబుల్‌ను చేస్తామంటున్నారు. మరో వూరు వెళ్లేవరకు ఇస్తాంబుల్ స్తోత్రాలే వినాలి కాబోలు. పోలిక ఎందుకు తెచ్చారో తెలియదు కానీ టర్కీలో కాస్ట్ ఆఫ్ లివింగ్ చాలా ఎక్కువ. ఇస్తాంబుల్‌లో మరీనూ. ఇప్పుడు అమరావతి కూడా అలాగే తయారైందని వ్యాపారస్తులు మొత్తుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని కంపెనీల రీజనల్ ఆఫీసులు, మెయిన్ డీలర్లు, సిఅండ్ఎఫ్ ఏజంట్లు హైదరాబాదులోనే వుండేవారు. విభజన సమయంలో జరిగిన చర్చల కారణంగా పన్నుల గురించి ఆంధ్రుల్లో అవగాహన పెరిగిపోయింది. ఆంధ్రలో ఎక్కడ కాఫీ తాగినా ఆ గ్రూపు హెడాఫీసు హైదరాబాదులో వుందంటే పన్ను ఆదాయమంతా హైదరాబాదుకే పోతుందని తెలిసిపోయింది. మనకు దక్కకుండా పోయిన హైదరాబాదుకు యింకా ఎందుకు సంపదలు కట్టబెట్టాలన్న వ్యథ ఆంధ్ర వ్యాపారస్తులను బాధించింది. అందువలన సేల్స్ రిప్రెజంటేటివులకు స్పష్టంగా చెప్పసాగారు – 'మీ సరుకు కొనాలంటే ఆంధ్రలో డీలరుంటే వాళ్ల ద్వారా పంపించండి, హైదరాబాదు డీలరైతే వద్దు, అంతగా కావాలంటే మద్రాసు నుంచైనా తెప్పించుకుంటాం' అని. అందువలన అనేక కంపెనీలు ఆంధ్రలో డిస్ట్రిబ్యూషన్ ఆఫీసులు, కంపెనీ షోరూములు పెట్టడానికి ప్లాన్లు వేశారు. ఆంధ్ర అంటే సహజంగా రాజధానిలో పెడదామనే చూస్తారు. విజయవాడ సెంటర్లో వుంది, రవాణా సౌకర్యాలు బాగుంటాయి కాబట్టి విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లో తమ దుకాణాలు పెడదామని అనుకున్నారు.

అలాటివాళ్లంతా యిప్పుడు గగ్గోలు పెడుతున్నారు. ఆంధ్ర రాజధాని మామూలుగా వుండదు, అంతర్జాతీయ నగరమై పోతుంది,

దేశవిదేశాల వాళ్లంతా వ్యాపారం కోసం, విహారం కోసం యిక్కడకే వస్తారు అంటూ విపరీతంగా ప్రచారం చేసి, ఇంద్రుడి అమరావతిని తలదన్నేట్లా యీ అమరావతిని కంప్యూటరు గ్రాఫిక్స్‌లో చూపించేసరికి బయటవాళ్లు నమ్మారో లేదో కానీ స్థానికులు నమ్మేసి భూమి ధరలు విపరీతంగా పెంచేసి కూర్చున్నారు. ఇప్పటికే భవంతులు వున్నవాళ్లు అద్దెలు పెంచేశారు. హైదరాబాదులోని బంజారా హిల్స్‌లో కమ్మర్షియల్ స్థలం అద్దె చ.అ. రూ.150 వుంటే, విజయవాడ బందరు రోడ్డులో కూడా అంతకు మించి రేటు చెప్తున్నారు. విజయవాడ జనాభా హైదరాబాదులో ఆరో వంతు వుంటుందేమో. బంజారా హిల్స్‌లో వున్నంత మార్కెటింగ్ అవకాశాలు విజయవాడలో ఎందుకుంటాయి? ఒక కారు డీలరు తన షోరూము పెడదామని విజయవాడే కాక 15 కి.మీ.ల పరిధిలో గన్నవరం, పోరంకి, పెనమలూరు, ఉండవల్లి, నున్న వంటి ప్రదేశాలు తిరిగినా వాణిజ్య అవసరాలకని అనగానే ఎక్కడా ఎకరం రూ. 5 కోట్లకు తక్కువకు దొరకలేదట. పెట్టుబడిలో 35-40 శాతం భూమికే పోతే వ్యాపారమెలా నడుస్తుందని అతని బాధ. అది రాబట్టుకోవాలంటే టర్నోవరు విపరీతంగా వుండాలి. వీళ్లు చెపుతున్న మహా నగరం 2025 నాటికి తయారయ్యాక అప్పుడు ఆ టర్నోవరు వస్తుందేమో కానీ యిప్పుడైతే లేదు కదా. 11 వ ప్లాను సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో వృద్ధి రేటు 12% హైదరాబాదు (రంగారెడ్డి, మెదక్ కలిపి) వృద్ధి రేటు 20% కాగా, కృష్ణా జిల్లాది 4%. అంటే హైదరాబాదులో కృష్ణా 5వ వంతు అన్నమాట. విభజన తర్వాత యీ గ్యాప్ పూరించడానికి ఆంధ్ర ప్రభుత్వం తప్పకుండా ప్రయత్నిస్తోంది. కానీ అలా పూరించడానికి ఎన్నేళ్లు పడుతుందో వాస్తవిక అంచనా వుండాలి. బ్రోషర్లు వేసినంత సులభం కాదు, వృద్ధి సాధించడం!

ఆంధ్ర రాజధాని హైదరాబాదులా వాణిజ్యపరంగా కూడా ఎదగాలంటే హెల్త్‌కేర్, విద్య, వినోదం వగైరా అనేక ఎస్టాబ్లిష్‌మెంట్లు రావాలి. గతంలోనే భూములున్న వాళ్లు వాటిపై ప్రస్తుతం కట్టుకోగలరేమో కానీ, యిప్పుడు భూమి కొని వ్యాపారం చేయాలంటే మాత్రం కిట్టుబాటు అయ్యేట్లా లేదు. 6000 చ.అ.ల రెస్టారెంటు పెడదామనుకున్న ఓ పెద్దమనిషి, 'విజయవాడలో దాని కయ్యే ఖర్చుతో హైదరాబాదులో కాని, వైజాగ్‌లో కాని 10 వేల చ.అ.ల రెస్టారెంటు పెట్టగలను. రెస్టారెంటు ఎంత పెద్దదైతే అంత ఆదాయం. ఇక్కడ ఆ స్కోపు లేదు' అన్నాట్ట. విజయవాడ, గుంటూరులలో స్థలాలు కొని ఆసుపత్రులు కడతామని అనుకున్న అనేక పెద్ద గ్రూపులు వెనుకంజ వేశాయి. సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ పెట్టాలంటే బెడ్‌కు రూ.5 లక్షలు ఎక్కువ ఖర్చు పెట్టాలని వాళ్లు అంచనా వేశారు. అంతకంటె నయా రాయపూర్, భువనేశ్వర్‌లలో కడితే చౌకగా వుంటుందని లెక్కలు వేస్తున్నారు. విజయవాడలో గతంలో స్థలం కొన్న స్థానికులు మాత్రమే హాస్పటల్స్ కట్టగలుగుతున్నారు. కట్టినా తర్ఫీదు పొందిన సిబ్బంది కొరత విపరీతంగా వుంది. వారికి అధికజీతాలు యిచ్చి తెప్పించుకోవలసి వస్తోంది. అంత చేసినా ఆక్యుపెన్సీ రేటు తక్కువగానే వుంది. ఎందుకంటే విజయవాడ ప్రాంతానికి జనాభా తరలి రావడం యింకా ప్రారంభం కాలేదు. ఎప్పటికైనా తరలి వస్తారా లేదా అన్నదే సందేహంగా వుంది. ఎందుకంటే నగరం విస్తరించాలంటే చిన్నా, చితకా వ్యాపారస్తులు కూడా బతికే అవకాశం వుండాలి. అందరికీ ప్రభుత్వోద్యోగాలు రావు. కానీ ఒక బ్యూటీ పార్లర్ పెట్టాలన్నా, ఒక టైలరింగ్ షాపు పెట్టాలన్నా, సూపర్ మార్కెట్ పెట్టాలన్నా అద్దెలు హైదరాబాదు, బెంగుళూరులను మించి చెపుతున్నారు. ఏ కొత్త సౌకర్యమూ రాకుండానే, కేవలం ప్రభుత్వం వేస్తున్న బ్రోషర్లు చూపించి ఉత్తి పుణ్యానికి షాపుల అద్దెలు మూడేసి రెట్లు పెంచేశారు. ఇళ్ల అద్దె కూడా దాదాపు రెండు, రెండున్నర రెట్లు పెంచేశారు. సామాన్యుడు బతకడం దుర్భరమయ్యే పరిస్థితి ఏర్పడింది.

హైదరాబాదు యీనాడు యీ స్థాయికి వచ్చిందంటే దానికి కారణం - అది సామాన్యులకు, పేదలకు కూడా అందుబాటులో వుండడం. ఊళ్లో చదువు పూర్తవగానే బస్సు ఎక్కి వచ్చేసి ఓ వెయ్యి రూపాయల ఉద్యోగం తెచ్చుకుంటే యింటి నుంచి మరో వెయ్యి తెప్పించుకుంటే గెటాన్ అయిపోయేవారు. ఏడాది తిరిగేసరికి జీతం పెరిగేది, ఊరికి దూరంగా ఫ్రెండ్స్‌తో కలిసి రూములో వున్నా సరిపోతుంది. కష్టపడితే ఎక్కడో అక్కడ ఉద్యోగం దొరుకుతుంది. మెస్‌లో తినే స్తోమత లేనినాడు రోడ్డు సైడ్ ఇడ్లీ బండిలోనైనా కతికి బతికేయవచ్చు. ఈనాడు హైదరాబాదులోని హోటళ్లలో, షాపుల్లో చూస్తే ఎంతోమంది తూర్పు రాష్ట్రాల వారు (ఒడిశా నుండి ఆసాం వరకు) కనబడతారు. అందరికీ బతికే అవకాశం యీ నగరం కల్పిస్తోంది. హైదరాబాదు యీ స్థాయికి రావడానికి 50 ఏళ్లు పట్టింది. నగరంలో జూబిలీ హిల్స్, సైబరాబాదు చూసి నగరమంతా యిలాగే వుంటుందనుకోకూడదు. ఇప్పటికీ పెద్దగా ఎదగని, పేదప్రజలు వుండడానికి వీలైన ప్రాంతాలు ఎన్నో వున్నాయి. ఆంధ్ర రాజధానిలో అటువంటి ప్రాంతాలు వున్నపుడే యిళ్లల్లో, ఆఫీసుల్లో, షాపుల్లో, నిర్మాణాల్లో పనిచేసేందుకు పనివాళ్లు దొరుకుతారు. 2050 నాటికి ఆంధ్ర రాజధాని జనాభా కోటీ ముప్ఫయి లక్షలయిపోతుంది అని ప్రభుత్వం చెపుతోంది. అమరావతి చుట్టుపట్ల ప్రాంతాల్లో జనాభా పెరుగుదల 7.1% వుంది. అన్ని రంగాలవారూ, అన్ని వర్గాల వారూ వచ్చి స్థిరపడితేనే ప్రభుత్వ అంచనా కొంతవరకైనా నిజమౌతుంది. జనాభా పెరిగితే ద్రవ్యవినిమయం, ఆర్థిక చలనం, తద్వారా భవంతుల విలువ పెరగడం జరుగుతాయి. సామాన్యుడికి అందుబాటులో లేని నగరంగా ఎదిగితే మాత్రం ప్రభుత్వ సిబ్బంది వుండే ధనిక నగరంగానే మిగులుతుంది. వాళ్లు కూడా వస్తారో రారో అనుమానమే. ఇప్పటికే హైదరాబాదుతో సమానంగా హౌస్ రెంట్ ఎలవన్స్ యిమ్మనమని అడిగి సాధించుకున్నారు. రేపు అంతకంటె ఎక్కువ యిమ్మనమంటారేమో, యిచ్చినా తమ కుటుంబాలను హైదరాబాదు నుంచి తరలించకుండా తాము మాత్రమే వస్తారేమో.

షాపుల అద్దె పెరగడంతో విజయవాడలో దుకాణదారులు తమ సేవల ధర పెంచేశారు. నెలకో సారైనా ఫేషియల్ చేయించుకుందామంటే గతంలో కంటె మూడు రెట్లు ఎక్కువ పెంచేశారని వాపోయింది ఒకావిడ. హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ కంపెనీ

నడిపే ఒకాయన పదిమంది స్టాఫ్‌ను విజయవాడకు తరలించి అక్కడ బ్రాంచ్ పెడదామని పెడదామని ప్లాను చేసి, అక్కడి పరిస్థితి చూసి వెనుకంజ వేశాడు. 'హైదరాబాదులో పదివేలు జీతం యిస్తే బోల్డు మంది దొరుకుతారు, ఎందుకంటే వాళ్లకు మూడు, నాలుగు వేల అద్దెలో పూరవతలైనా వసతి దొరుకుతుంది. విజయవాడలో ఏడెనిమిది వేలు అద్దెకే పోయే పరిస్థితి. పదివేల జీతంలో ఎలా బతుకుతాడు? హైదరాబాదు వదిలివెళ్లనంటున్నారు' అంటున్నాడు. ఇన్నాళ్లూ తెలుగువాళ్లకు హైదరాబాదు ఏకైక నగరంగా వుంది కాబట్టి స్కిల్ వున్న వారూ, ప్రొఫెషనల్ ఏటిట్యూడ్ వున్నవారూ అవకాశాలకోసం హైదరాబాదుకే వచ్చారు. విభజన తర్వాత ఆంధ్ర–తెలంగాణ గొడవలు వస్తాయి కాబట్టి హైదరాబాదులో ఆస్తులు వున్నవాళ్లు తప్ప తక్కిన ఆంధ్ర మూలాలవాళ్లు విజయవాడకు తరలిపోతారని అంచనాలు వేశారు. కానీ హైదరాబాదులో సామాజిక పరిస్థితి ఎప్పటిలాగానే వుంది. నాయకులు అప్పుడప్పుడు ఏవో వ్యాఖ్యలు చేయడం, మళ్లీ వెనక్కి తీసుకోవడం జరుగుతోంది తప్ప జనసామాన్యంలో భేదాలు కనబడటం లేదు. సెక్షన్ 8 అమలు గురించి నాయకులు చింతించినంతగా సాధారణ జనులు చింతించటం లేదు. అర్జంటుగా మూటాముల్లె సర్దుకోవడానికి ఎవరూ తొందర పడటం లేదు. ఆంధ్రలో అంతర్జాతీయ నగరం నిర్మాణ కార్యక్రమం మొదలుపెట్టాక ఆ యా రంగాలకు చెందినవారు వెళ్లవచ్చేమో. అదెప్పుడు జరుగుతుందో, కేంద్రం ఎన్ని నిధులు యిస్తుందో, ఎంత వేగంగా పనులు సాగుతాయో వేచి చూడాలి. ఎక్కడికి తరలి వెళ్లాలన్నా అక్కడి కాస్ట్ ఆఫ్ లివింగ్ గురించి లెక్కలోకి తీసుకుంటారు. బొంబాయి, ఢిల్లీ వంటి మహానగరాల్లో పనిచేసే కార్మికులు కుటుంబాలను దగ్గరున్న వూళ్లల్లో పెట్టి తాము స్లమ్స్‌లో వుంటుంటారు. అది అనేక రకాలైన శాంతిభద్రతల సమస్యలు తెచ్చిపెడుతుంది. విజయవాడ, రాజధాని ప్రాంతం అలా కాకుండా వుండాలంటే రెంటు కంట్రోలు చట్టం వంటిది ఏదైనా తెచ్చి ప్రభుత్వం అద్దెలను అదుపులోకి తేవాలి. సామాన్యుడు సైతం బతకగలిగే పరిస్థితి నెలకొల్పాలి. అక్కడ జీవనవ్యయం అదుపులో పెట్టలేకపోతే బయట నుంచి జనాలు రాకపోగా ఎప్పణ్నుంచో వున్నవాళ్లు కూడా తమ యిళ్లను అద్దెలకు యిచ్చేసి పక్క జిల్లాలకు తరలిపోతారు. అదే జరిగితే యిళ్లు, షాపులకు డిమాండు లేక రేట్లు పడిపోయి, పెట్టుబడి పెట్టినవారందరూ తీవ్రంగా నష్టపోతారు.

ప్రభుత్వం గాలిమేడలు చూపించడం మానేసి వాస్తవానికి దగ్గరగా వస్తే, రాజధాని ప్రాంతాల ధరలు నేలమీద వుంటాయి. సామాన్యుడు బతకగలుగుతాడు. కాదు, రాజధానిని ఇస్తాంబుల్‌లా చేస్తానని బాబు పట్టుబడితే ఆయన యిష్టం. ఇదే సందర్భంలో యింకో విషయం కూడా ప్రస్తావించాలి. బాబు టర్కీ వెళ్లినపుడు అక్కడి రాజకీయ పరిస్థితి గురించి కూడా తెలుసుకుని వుంటారు. జూన్ 8 న జరిగిన ఎన్నికలలో దేశాధ్యక్ష పదవికి పోటీ చేసిన ఎర్గోదాన్ ఓటమి పాలయ్యాడు. సొంతంగా పార్టీ పెట్టి మూడు సార్లుగా నెగ్గుతూ వచ్చి, ప్రధానమంత్రిగా పని చేసి, సగం కంటె ఎక్కువ ఓట్లు తెచ్చుకుంటూ వచ్చిన అతను యీసారి యువ నాయకుడు దెమిర్తాస్ చేతిలో భంగపడ్డాడు. కారణం సింపుల్‌గా చెప్పాలంటే – దెటమిర్తాస్ అన్ని వర్గాలకూ తన పార్టీలో చోటిచ్చాడు. కుర్ద్ మైనారిటీలకు, మతపరమైన మైనారిటీలకు మహిళలకు, అనేక రకాల ఆలోచనావిధానాలున్న వారికీ అందరినీ కలుపుకు పోయాడు. ఎర్గోదాన్ తరహా అది కాదు, తను చెప్పినదే వేదం అనే రకం. రెండేళ్ల క్రితం అతని పరిపాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు జరిగితే వాళ్లను అతను రిఫ్‌రాఫ్ గాళ్లని, టెర్రరిస్టులని, విదేశీ ఏజంట్లని నిందించాడు తప్ప వారిని పిలిచి వాళ్ల కష్టాలేమిటని అడగలేదు. అతను మీడియాను చక్కగా మేనేజ్ చేశాడు కాబట్టి మీడియా కూడా ఆందోళన కారులను టెర్రరిస్టులుగానే చూపించింది. తనతో విభేదించినవారందరూ మతిమాలిన వాళ్లే అని అనుకోవడం వలననే ఎర్గోదాన్ వంటి సీనియర్ నేత మట్టి కరిచాడు. ఆంధ్ర రాజధాని స్థలనిర్ధారణ గురించి, రూపకల్పన గురించి, బడ్జెట్ గురించి శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులను కాని, ప్రతిపక్షాల సలహాలను కానీ పట్టించుకోకుండా ముందు కెళుతున్న, ఏ సమస్య పైన అఖిలపక్షం పిలవకుండా, విమర్శకులను శత్రువులుగా, అభివృద్ధినిరోధకులుగా చూస్తున్న చంద్రబాబు ఒక్కసారి ఎర్గోదాన్ సంగతి తెలుసుకుంటే మంచిది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2015)**

**ఆగస్టు 13** **ఎమ్బీయస్ : కళ్లు మూసుకుంటే ఎలా?**

ప్రత్యేక హెూదా వ్యాసంలో నేను రాసిన 'ప్రపంచంలోని అన్ని దేశాలు మనతో భాగస్వామ్యానికై ఉవ్విళ్లూరుతున్నాయని మనని ఊరిస్తారు. దానికి గాను మనం నోచుకున్న నోములేమిటో నాకు తెలియదు, మన దగ్గర వున్న క్వాలిటీ ఏమిటో తెలియదు.' అనే వాక్యాలకు స్పందిస్తూ ఒక పాఠకుడు నేను నెగటివిటీని వ్యాపింపచేస్తున్నానని ఆరోపించారు. తను అమెరికా వెళ్లానని, అమెరికన్లు చవటలని (ఆయన ఉపయోగించిన పదం – డమ్బ్) చెప్పారు. ఇలాటి విషయాల్లో ఎవరి అనుభవాలు వారివి. అమెరికన్లలో వారు ఎవరిని కలిశారో మనకు తెలియదు కదా. మనవాళ్ల ప్రతిభకు లోటేమీ లేదని, యిలాటి రాతల ద్వారా మన వాళ్లలో నిరాశ నింపుతున్నాననీ అభిప్రాయపడ్డారు. జన్మతః వచ్చిన స్వయంప్రతిభ వున్నా, దాన్ని వెలికి తీసే గురువులు వుండాలి. తీర్చి దిద్దే వాతావరణం స్కూళ్లల్లో, కాలేజీల్లో వుండాలి. ఉన్నాయా? అనే ప్రశ్నకు మనను మనం మభ్యపెట్టుకోకుండా సమాధానం చెప్పుకుంటే చాలు. ఆయన ఉటంకించిన వాక్యం వెనక్కాలే నేను రాశా – 'మన యింజనీరింగు కాలేజీల క్వాలిటీ అతి పూర్ అని మన యూనివర్శిటీలే చెప్తున్నాయి, మన విశ్వవిద్యాలయాల్లో చాలావాటికి వైస్ ఛాన్సలర్లే లేరు' అని. అబద్ధమా?

ముందుగా ఫ్యాకల్టీ సంగతి చూడండి – ఇంజనీరింగు కాలేజీలో ఫ్యాకల్టీ కొరత 30% వుందని అందరూ చెప్పే మాటే. అక్కడ స్టాఫ్‌గా పని చేసే కంటె సాఫ్ట్‌వేర్ యింజనియర్‌గా చేస్తే ఎక్కువ ఆదాయం వస్తుందని ఫస్ట్ గ్రేడ్ వాళ్లందరూ తమ బ్రాంచ్ మారైనా

సరే, ఆ ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారు. లెక్చరర్లుగా ఉన్నవాళ్లకు జీతాలు సవ్యంగా యిస్తేనే నిలుస్తారు. కాలేజీ ఫీజుల రీయంబర్స్‌మెంట్ స్కీము పుణ్యమాని ఉత్తుత్తి స్టూడెంట్లు, ఉత్తుత్తి కాలేజీలు పెరిగిపోయాయి. వీళ్లందరికీ ఫీజు రీయంబర్స్ చేయలేక ప్రభుత్వాలు చేతులెత్తేసి, బకాయిలు పెట్టేస్తున్నాయి. బకాయిలొస్తేనే మీ జీతాలు యిస్తామని కాలేజీలు అంటూండడంతో టీచింగ్ స్టాఫ్‌కు పాఠాలు చెప్పాలన్న ఉత్సాహం చచ్చింది. వారిపై ప్రిన్సిపాల్‌కు అదుపు తప్పింది. అందుకే నాణ్యతా ప్రమాణాలు లేవని అనేక కాలేజీల గుర్తింపు రద్దు చేయడం జరిగింది. కాలేజీలు ఆ మాటను ఖండించలేకపోతున్నాయి. సవరించడానికి కొంత సమయం కావాలంటూ, ప్రభుత్వ కాలేజీల్లోనే లేని సౌకర్యాలు తామెక్కడ తెస్తామని వాదిస్తూ కోర్టు తలుపు తడుతున్నాయి. ప్రమాణాలు లేని కాలేజీల్లో విద్యార్థులు చేరడం మానేశారు కాబట్టి మూతపడుతున్నాయి కూడా. ఇక మెడికల్ కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరత 40% దరిదాపుల్లో వుంది. ప్రైవేటు ప్రాక్టీసు ద్వారా అపారంగా ఆర్జించే అవకాశం వున్న వైద్యులు టీచింగులో రావడానికి ఉత్సుకత ప్రదర్శించటం లేదు.

ఇదంతా సిబ్బంది గురించి, యిక సౌకర్యాల గురించి, కరికులమ్ గురించి క్లుప్తంగా ముగిస్తాను. నేను చదువుకున్న హైస్కూలు, డిగ్రీ కాలేజీ గవర్నమెంటువే. రెండింటిలో విశాలమైన ఆటస్థలం వుండేది. 9వ తరగతి నుండి మాకు ల్యాబ్ సౌకర్యాలు వుండేవి. వారం వారం ప్రాక్టికల్స్ వుండేవి. నా తర్వాతి తరానికి ఇంటర్‌లోకి వచ్చినా ల్యాబ్ లేదు. ఒక 15 రోజులు వేరే కాలేజీకి తీసుకెళ్లి అన్ని ఎక్స్‌పెరిమెంట్స్ వరసపెట్టి ఒకసారి చేసి చూపించేశారు. అలా అయితే సైన్సు తలకెక్కుతుందా? పెద్ద పెద్ద భవంతులున్న జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో కూడా విద్యార్థులకు సైన్సు ప్రయోగాలు స్వయంగా చేసే అవకాశం వుండటం లేదు. ఈ మాట నిజమో కాదో పాఠకులకే తెలుసు. హైస్కూలులో మాకు ఆఖరి పీరియడ్ డ్రిల్ వుండేది. మోరల్ సెషన్ అని వారానికి ఒక పీరియడ్. వారానికి రెండు పీరియడ్లు క్రాఫ్ట్ (ఉడ్‌వర్క్/మెటల్ వర్క్/వీవింగ్), రెండు పీరియడ్లు డ్రాయింగ్. రెండు పీరియడ్లు లైబ్రరీ. స్కూలు పీరియడ్ అయిపోయాక వారానికి రెండు రోజులు ఎన్‌సిసి లేదా సోషల్ సర్వీసు. వారానికి రెండు రోజులు కో–కరికులర్ యాక్టివిటీ పేర మెటిరియాలజీతో సహా అరడజను హాబీల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాలి. అంతటి సమగ్రమైన విద్యావ్యవస్థ వున్నా మాలో కొంతమందే పైకి వెళ్లగలిగారు. ఇప్పుడు వీటిలో ఎన్ని మిగిల్చారో పాఠకులకే తెలుసు. ఈనాటి విద్యార్థుల్లో చాలామందికి బట్టీ వేయించి పాస్ చేయిస్తున్నారు. సబ్జక్ట్ వంటబట్టటం లేదు. అనేక విషయాలపై అవగాహన కొరవడుతోంది. పుస్తకపఠనం వంటి హాబీలు లేవు. ఆటలు లేవు. క్రికెట్ మ్యాచ్ టీవీలో చూసి క్రీడాభిమానం అంటే యిదే అనుకుంటున్నారు. స్వయంగా ఆడితేనే క్రీడాస్ఫూర్తి వస్తుంది, ఆరోగ్యం ఒనగూడుతుంది.

ఈ రోజుల్లో 400 గజాల స్థలం వుంటే చాలు కాలేజీ పెట్టేస్తున్నారు, ఎకరం వుంటే యూనివర్శిటీయే పెట్టేయవచ్చు. సౌకర్యాలు తర్వాత సమకూరుస్తామని ఒప్పందం చేసుకుని అనుమతి తెచ్చేసుకుని, డొనేషన్లు, ఫీజులు వసూలు చేసేస్తున్నారు. తర్వాత యుజిసి నుంచి టీము వచ్చి గుర్తింపు రద్దు చేస్తామంటే విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందనే సాకు చూపించి కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకుంటున్నారు. ఈ లోగా కొత్త విద్యార్థులను చేర్చుకుంటున్నారు. ఇలాటి పరిస్థితుల్లో మనకు చదువులు అబ్బుతున్నాయని, మనం చాలా తెలివితేటలు సంతరించుకుంటున్నామనీ ఎలా నమ్మగలం? పాసయిన వాళ్లలో 30% మందికి కూడా ఉద్యోగార్హత లేదని మన వ్యాపార, పారిశ్రామిక ఫెడరేషన్ ప్రకటిస్తూనే వున్నాయి. అందుకే ఓ పక్క ఖాళీగా వున్న ఉద్యోగాలు, మరో పక్క నిరుద్యోగులు. ఇంజనీరింగు చదివి రిసెప్షనిస్టుగా పనిచేసే వాళ్లు నాకు తెలుసు. నాకు తెలిసున్నవి సాధారణ కాలేజీలు, యూనివర్శిటీలే. ఐఐటిలు, ఐఐఎమ్‌లు చాలా గొప్పవనే అభిప్రాయంలో వుంటూ వచ్చాను. "ద వీక్" ఆగస్టు 9 సంచిక చూడండి. ఐఐటిలను యిష్టం వచ్చినట్లు విస్తరించడం వలన దాని బ్రాండ్ వేల్యూ చెడిపోయిందని పెద్ద వ్యాసం రాశారు. అక్కడా ఫ్యాకల్టీ కొరతే. హైదరాబాదు ఐఐటిలో 19% కొరత అంటే అది అతి తక్కువన్నమాట. మండీ, గువాహటీ, మద్రాస్‌లలో 27–29% వుంది. బొంబాయిలో 31%, కాన్పూరులో 38%, భువనేశ్వర్‌లో 42%, రూర్కీ, ఢిల్లీలలో 44%, జోధ్‌పూర్, ఖడ్గపూర్‌లలో 46%. ఈ ఏడాది ఐఐటిలో ఎడ్మిషన్ వచ్చిన 591 మంది చేరమన్నారట. జెఇఇకి అప్లయి చేసిన వారి సంఖ్య 50 వేలు తగ్గిందట. పరిస్థితి బాగు చేయాలంటే నిధులు కావాలి. కానీ ఈ ఏడాది మన మోదీ సర్కారు బజెట్‌లో ఉన్నత విద్యకు రూ. 800 కోట్ల కోత పెట్టింది. ఐఐటి, ఐఐఎంలు ఎందుకలా వున్నాయో "ద హిందూ"లో ఆగస్టు 4 న ఒక వ్యాసం వివరించింది.

ఐఐటిలను, బెంగుళూరులో వున్న ఇండియన్ యిన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌ను ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి ఉతికి ఆరేశారు – స్వాతంత్ర్యం వచ్చిన యిన్నాళ్లలో యీ సంస్థలు రిసెర్చి ఏమీ చేయలేదని అన్నారు. టెక్నోక్రాట్ అయి వుండి, యితర టెక్నోక్రాట్‌లతో కలిసి స్థాపించిన ఇన్ఫోసిస్‌కు ఎన్ని పేటెంట్లు వున్నాయి స్వామీ అని ఆయన్ను ఎవరూ అడగలేదు. అడిగివుంటే ఆయనేం చెప్పేవారో! వాస్తవం ఏమిటంటే వివిధ రంగాల్లో వున్న మన కార్పోరేట్లు టర్నోవర్‌పై పెట్టిన శ్రద్ధ బేసిక్ ఆర్ అండ్ డిపై పెట్టలేదు. భారతదేశంలో శాస్త్ర సాంకేతిక పరిశోధనల స్థితిగతుల గురించి గణాంకాలతో సహా ఈనాడులో ఆగస్టు 8 న ఆర్టికల్ వచ్చింది. చూడండి. 2013లో దాఖలైన పేటెంట్ దరఖాస్తుల సంఖ్య చూడబోతే – మన పాఠకుడు చవటలని తీసిపారేసిన అమెరికానుండి 2.88 లక్షలు, మన మహాన్ భారత్ నుండి 11 వేలు! అమెరికా సబ్మిట్ చేసినవాటిలో మంజూరైనవి 47%, 1.60 లక్షల దరఖాస్తులు పంపిన దక్షిణ కొరియాకు యీ శాతం 60%, 2.72 లక్షల దరఖాస్తులు పంపిన జపాన్‌కైతే 83%, 7.05 లక్షలు పంపిన చైనాకు 20%, జర్మనీకి 31%, మరి మన ఇండియాకు 6%. అంటే 594 పేటెంట్లు మంజూరయ్యాయి. ఇదీ మన మేధోపటిమ! మనవాళ్లలో కొంతమంది

యితరదేశాలకు వెళ్లి రాణించవచ్చు కానీ మనలో అత్యధికులు ప్రతిభాశూన్యులుగా మిగులుతున్నాం. దానికి మన దేశంలో నెలకొన్న పరిస్థితులే కారణం. ఒకలా చెప్పాలంటే అమెరికాలో సరస్వతిని ఆరాధిస్తారు. ఏ దేశస్తుడైనా సరే విద్య వుంటే చాలు, ఆదరిస్తారు. అందుకే అక్కడ లక్ష్మి వుంటుంది. మన దగ్గర లక్ష్మిని ఆరాధిస్తున్నాం. మనవాళ్లలో లక్ష్మి పేర్లు ఎక్కువ, సరస్వతి పేర్లు తక్కువ. చదువుకున్న వాడి ంటె డబ్బున్నవాడికే ఎక్కువ గౌరవం యిస్తున్నాం. చదువును (సరస్వతిని) డబ్బుతో (లక్ష్మితో) కొంటున్నాం. అందుకే సరస్వతి మనను విడిచిపెడుతోంది. పరిశోధనలు, పేటెంట్లు మనకు అందరాని ఫలంగా మారాయి.

విదేశాల్లో మనవాళ్లకు అనేకమందికి ఉద్యోగాలు దొరుకుతున్నాయి కదా అంటే అవి సేవారంగంలోనే. కష్టపడే తత్వం, నిజాయితీ, ఇంగ్లీషు తెలిసి వుండడం మనకు తిండి పెడుతున్నాయి. మన సాఫ్ట్‌వేర్ కంపెనీలు సేవలు అందించి (కొందరు 'బాడీ షాపింగ్' అనేస్తారు) గడిస్తున్నాయి తప్ప పరిశోధనల ద్వారా కాదు. చైనావాళ్లు ఇంగ్లీషులో మనతో పోటీ పడిన రోజున మనకు అవస్థలు తప్పవు. ఆ రోజు వచ్చేలోగా మన విద్యావ్యవస్థను మెరుగుపరుచుకోవాలి. ఆ వ్యవస్థలో వున్న లోపాలేమిటో విద్యావేత్తలు అనేకమంది చెప్తూ వచ్చారు. అనేక కమిటీ నివేదిక లున్నాయి. వాటిని అమలు చేసే నాథుడే లేడు. అమలు చేయకపోగా 'మనం గొప్పవాళ్లం, మనల్ని చూసి అందరూ మురిసిపోతున్నారు, మనతో జట్టుకట్టడానికి క్యూ కడుతున్నారు' అని చెప్పడం ప్రజల్ని జోకొట్టడమే. బయటివాళ్లు వచ్చేది మన సహజవనరులను దోచుకోవడానికే. దాన్ని నివారించాలంటే మన స్కిల్స్ మనం పెంచుకోవాలి. వ్యక్తిగతంగా, సంస్థాగతంగా నైపుణ్యం సంపాదించినప్పుడు, నూతన ఆవిష్కరణలను సాధించినప్పుడు మాత్రమే మనం కాలరెగరేసుకోవాలి. ఈ విషయం చెప్పడం నెగటివిటీ కాదు. కరకు వాస్తవాలు చెప్పి కళ్లు తెరిపించడం. ఆ పని నాయకులు ఎలాగూ చేయడం లేదు. మనలో మనం అనుకోవడానికి కూడా జంకితే, కళ్లు మూసుకుంటే ఎలా? **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2015)**

ఆగస్టు 21 – 22 ఎమ్బీయస్ : మెగా స్టార్ – మెగా యాక్టర్

చిరంజీవి మంచి నటుడు. తెలుగు సినిమా పరిధిని అవధులు మించి తీసుకెళ్లారు. డాన్సులు, ఫైట్లు కేవలం ఉపాంగాలుగా వుండే రోజుల్లో సినిమాల్లో ప్రవేశించి, వాటికి ఎక్కడ లేని ప్రాధాన్యతా తెచ్చిపెట్టారు. మగవాళ్లు ఫైట్లు చేస్తే చూడవచ్చు, డాన్సులు చేస్తే చూడగలమా? అనుకునే రోజుల్లో నాగేశ్వరరావుగారు స్టెప్పులేసి చూపించారు. దానితో తప్పనిసరి పరిస్థితుల్లో యితర నటులు కూడా 'స్టెప్పులు' వేశారు. కానీ చిరంజీవి ఫుల్ స్కేల్ డాన్సే చేసేశారు. ఆయన డాన్సుల కోసం, ఫైట్ల కోసం ఆడిన సినిమాలున్నాయి. ఇప్పుడు డాన్సు చేయని హీరోలను వూహించే పరిస్థితి లేదు. ఒక తరం యువతను చిరంజీవి విపరీతంగా ప్రేరేపించారు. ఆయన ముందు తరం హీరోలు స్వయంకృషితో పైకి వచ్చినట్లు చూపగా కసితో, పట్టుదలతో అనుకున్నది సాధించడం అనేది యీయన తెరపై చాలా బాగా ఆవిష్కరించి చూపారు. అలాటి పాత్రలు యితరులు కూడా వేసినా చిరంజీవి నటనలో వున్న 'ఇంటెన్సిటీ' ఆయనను అగ్రశ్రేణిలో నిలబెట్టింది. పోనుపోను ఆయన నటనలో చాలా యీజ్ వచ్చింది. కామెడీని కూడా అవలీలగా చేయగలనని చేసి చూపించారు. తెర మీద వెలిగిపోతున్న రోజుల్లో కూడా ఆయన వ్యక్తిగతంగా చాలా క్లీన్ రికార్డు మేన్‌టేన్ చేశారు. ఏ గాడ్‌ఫాదర్ లేకుండా కేవలం తన ప్రతిభతో పైకి వచ్చారన్న విషయాన్ని అందరూ గుర్తించారు. వచ్చిన తర్వాత కూడా ఎదిగేకొద్దీ ఒదగాలన్న సూక్తిని అమలు చేసి చూపారు. సభావేదికపై ఆయన వినయం, నవ్వు మొహం, మర్యాద కొట్టవచ్చినట్టు కనబడతాయి. ఆయన ఎవరితో విరోధం పెట్టుకున్నట్టు కనబడదు. నచ్చకపోతే దూరమై పోతాడు తప్ప, పబ్లిగ్గా ఛాలెంజ్‌లు విసరడాల్లాటివి లేవు. పెద్దపెద్ద దర్శకుల వద్ద పనిచేసినపుడు కూడా అదే ఒద్దిక చూపారు. కలహించి సినిమా మధ్యలో మానుకోవడాలు వార్తల వరకు రాలేదు.

ఇన్ని సుగుణాలు, యింత టాలెంటు వున్న ఆయన గత కొన్నేళ్లగా సినిమాలు వేయడం లేదంటే అంతకంటె విషాదం యింకేం వుంటుంది? ఆయనకు 60 యేళ్లు పూర్తయిన యీ వేళ సింహావలోకనం చేసుకుని చూసుకుంటే అనిపిస్తుంది – చిరంజీవి తన కెరియర్‌ను యింతకంటె బాగా ప్లాన్ చేసుకుని వుంటే బాగుండేదేమో అని! (ముందుగా ఒక సాంకేతికపరమైన సందేహం. 60 ఏళు ్లు పూర్తయితే షష్టిపూర్తి అంటాం. ఈయన విషయంలో ఆ వేడుకకు ఆ పేరు పెట్టలేదెందుకో! పైగా 60వ పుట్టినరోజు అన్నారు. ఆగస్టు నెలలోనే 69వ స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక 8 ఏళ్లకు పుట్టిన చిరంజీవిగారికి ఆగస్టులో వచ్చినది 61వ పుట్టినరోజు అవుతుంది) కెరియర్ గురించి నిష్పక్షపాతంగా మాట్లాడుకోవాలంటే ఆయన స్టార్ ఇమేజే ఆయన కాళ్లకు సంకెలగా మారింది. 'చిరంజీవి సినిమా అంటే బ్లాక్ బస్టర్ అయి వుండాలి. తారాగణం, సాంకేతికగణం అన్నీ మెగా స్థాయిలో వుండాలి. ఆయన సినిమా ముందు తక్కినవన్నీ వెలవెలబోవాలి' అనే అంచనా ఆయన ప్రగతికి గుదిబండగా మారింది. ఆయన సినిమాలు ఒకదాన్ని మించి, మరొకటి హిట్ అయిపోతూ వుండడం, దాన్ని బట్టి ఆయనపై అభిమానుల ఆశలు పెరిగిపోవడం ఆయన తప్పు కాదు కదా అనవచ్చు. కానీ ముందుచూపు వున్న నటుడు ఆ స్టేజిలోనే జాగ్రత్తపడతాడు. అమితాబ్ బచ్చన్‌ను చూస్తే ఆ విషయం బాగా అర్థమౌతుంది. స్టార్‌డమ్ కలకాలం వుండదని ఆయన గ్రహించాడు కాబట్టి, తారగా తళుకుబెళుకు తగ్గిపోయిన తర్వాత కూడా నటుడిగా కొనసాగేందుకు వీలుగా ముందు నుండీ ప్లాన్ చేసుకున్నాడు. ఒక పక్క మాస్ స్టార్‌గా వేస్తూనే అనేక హృషీకేశ్ ముఖర్జీ తరహా సినిమాల్లో నటిస్తూ వచ్చాడు. కమ్మర్షియల్ సినిమాల స్థాయిలో ఆ సినిమాలు హిట్ కాలేదు. కానీ ఆ విధంగా డీ గ్లామరైజ్డ్ అమితాబ్‌ను చూడడానికి ప్రేక్షకులు అలవాటు పడ్డారు. అలాటి పాత్రలు అంగీకరించడానికి ఆయనా అలవాటు పడ్డాడు. అందువలన

స్టార్‌గా కెరియర్ ముగిసిపోగానే, యాక్టర్‌గా పుంజుకోవడానికి సులభమైంది. ఇప్పుడు పూర్తి నెగటివ్ పాత్రలు కూడా సునాయాసంగా వేసేస్తున్నాడు.

ఆయన కంటె చిరంజీవి 13 ఏళ్లు చిన్నవాడు. చిరంజీవి నటనా జీవితానికి సెమికోలన్ పడి ఎనిమిదేళ్లయింది. (అతిథి పాత్రలు వదిలేయండి) అప్పుడాయనకు 52 ఏళ్లు. అమితాబ్ విషయంలో ఆయన తన 52 వ యేటి నుంచి యిప్పటివరకు గత 21 ఏళ్లగా దాదాపు నూరు సినిమాలు వేశారు. వాటిలో కభీ ఖుషీ కభీ గమ్.., మొహబ్బతే, ఏకలవ్య, ఆంఖే, సర్కార్, వీర్ ఝూరా, బాగ్‌బాన్, పా, ఆంఖే, బుడ్ఢా హెూగా తేరా బాప్, బడేమియా–ఛోటేమియా.. యిలాటి ఎన్నో సినిమాల్లో ప్రాధాన్యత గల పాత్రలు వేశారు. చిరంజీవి విషయంలో అలాటిది ఊహించగలమా? ఆయన కెరియర్ యింకెన్నాళ్లు వుండబోతోంది? వాటిలో ఎన్ని సినిమాలు వేయబోతున్నారు? ఎంతో నటనాపటిమ వుండి, మందీమార్బలం, హంగూ ఆర్భాటం వుండి కూడా చిరంజీవి వ ృత్తిజీవితంలో యింత గ్యాప్ రావడమేమిటి? రాజకీయాల్లోకి వెళ్లడం చేత అనేది సులభంగా తట్టే సమాధానం. కానీ ప్రజారాజ్యం పార్టీ స్థాపించిన కొత్తలో, తర్వాత మంత్రి అయిన తర్వాత తప్ప తక్కిన రోజుల్లో ఆయనకు రాజకీయాలు పార్ట్–టైమ్ వ్యవహారంగానే వున్నాయి. మహా అయితే 12–18 నెలలు దాని కింద తీసేసినా కనీసం ఆరేళ్లు వ ృథాగా పోయింది. ఎందువలన? తన యిమేజికి తగిన కథలు రావటం లేదని ఆయన ఫీల్ కావడం చేత! ఈ 150 వ సినిమా గురించి న్యూస్ యివాళ్టిదా చెప్పండి. ఆరేళ్లగా వింటున్నాం. ఇప్పటిదాకా ఏదీ తేల్చుకోలేక పోతున్నారు. ఎందుకంటే చిరంజీవి సినిమా అనగానే యిద్దరు హీరోయిన్లుండాలి, ఫైట్లుండాలి, డాన్సులుండాలి, మసాలా వుండాలి, కామెడీ వుండాలి, దేశానికి సందేశం వుండాలి, రాజకీయపరమైన యిమేజికి యిబ్బంది వుండకూడదు, నేటి యువహీరోలకు ఏ మాత్రం తీసిపోనని ఆయన నిరూపించుకోవడానికి స్కోపు వుండాలి, అన్నిటినీ మించి అది రికార్డులు బద్దలు కొట్టాలి.

ఇన్ని గుణకార, భాగహారాల మధ్య కథ కుదరటం లేదు. ఈ లెక్కల్లో ఆయనకు వయసు పెరుగుతోంది, మరిందరు కుర్రహీరోలు తయారవుతున్నారు, బాహుబలి సినిమా వచ్చి ఎవరికీ ఓ పట్టాన అందనంత కొత్త రికార్డు నెలకొల్పింది, మధ్యలో ప్రేక్షకులకు ఆయన నటన చూసే అవకాశం మిస్సవుతోంది. చిరంజీవి సినిమా అనగానే యీ దినుసులన్నీ వుండి తీరాలి, కమ్మర్షియల్‌గా సక్సెసయి తీరాలి అని పట్టుబట్టి కూర్చోవడం వలననే విలువైన సమయం వ ృథా అవుతోంది. అలాటి శషభిషలు పెట్టుకోకపోవడం చేతనే అమితాబ్ యాక్టర్‌గా అందరినీ అలరించగలుగుతున్నారు. అమితాబ్ లాగానే కమ్మర్షియల్ సినిమాలతో బాటు పారలల్ సినిమాల్లో వేయడానికి చిరంజీవి కూడా ప్రయత్నించకపోలేదు. కానీ అలాటివి ఎన్ని సినిమాలున్నాయి చెప్పండి. 32 ఏళ్ల వయసులో "రుద్రవీణ", 33 ఏళ్ల వయసులో "స్వయంక ృషి", 37 ఏళ్ల వయసులో "ఆపద్బాంధవుడు". వయసు వస్తున్న కొద్దీ అలాటివి ఎక్కువగా వేసి వుండాల్సింది కానీ అవి సరిగ్గా ఆడలేదని ఆ మార్గం వదిలేశారు. తను వేసిన ఆ తరహా సినిమాలు కొన్ని ఫెయిలవుతున్నా అమితాబ్ ఆ ఛానెల్ తెరిచే వుంచుకున్నారు కాబట్టి స్టార్ నుంచి యాక్టర్‌గా సులభంగా మారిపోగలిగారు. మధ్యవయసు వచ్చిన కొద్దీ చిరంజీవి కథను తన చుట్టూ తిప్పుకుంటూ వచ్చారు – గ్లామర్ తగ్గలేదని చూపుకోవడానికి కాబోలు! కెరియర్ మొదట్లో వేసిన "47 రోజులు", "రాణువ వీరన్" వంటి నెగటివ్ పాత్రల జోలికి మళ్లీ వెళ్లలేదు.

ఆయన కంటె అయిదేళ్లు పెద్దవాడైన రజనీకాంత్‌కి కూడా యిలాటి అవస్థ వుంది కానీ ఆయన తన సినిమాల్లో కథ బలంగా వుండేట్లు చూసుకున్నారు. దానికి తన స్టయిల్‌తో మెరుగులు దిద్దారు. కానీ చిరంజీవి కథ ప్రాధాన్యత కంటె సినిమా మొత్తాన్ని తన భుజాల మీద వేసుకోవడానికి ప్రయత్నించి భారం పెంచుకున్నారు. "నరసింహ" సినిమాలో రజనీకాంత్ తనతో సమానమైన పాత్రను రమ్యక ృష్ణకు యిచ్చి భారం పంచుకున్నారు. "బాషా", "అరుణాచలం", "అన్నామలై" "ముత్తు", "రోబో" వంటి అనేక రజనీకాంత్ సినిమాల్లో కథ, స్క్రీన్‌ప్లే బలంగా వున్నాయి. "చంద్రముఖి"లో రజనీ పాత్ర నిడివి పరంగా పెద్దది కాదు. అలాటి పాత్రను చిరంజీవి తెలుగులో వేసి వుండవచ్చు. రజనీ సినిమాల్లో ఫెయిల్యూర్స్ కూడా వున్నాయి. కానీ అనారోగ్యంగా వున్నా నటుడిగా ఆయన ప్రస్తుతం బిజీగా వున్నాడు. ఆరోగ్యంగా వున్నా చిరంజీవి నటుడిగా యాక్టివ్‌గా లేరు. అదీ బాధ. కమలహాసన్‌ను యాక్టర్‌గా, రజనీకాంత్‌ను స్టార్‌గా చూస్తాం కాబట్టి చిరంజీవిని రజనీకాంత్‌తోనే పోల్చి చూడాలి. "నరసింహ"లో రజనీకాంత్ ద్వితీయార్థంలో పెళ్లీడుకు వచ్చిన పిల్ల తండ్రిగా వేశారు. చిరంజీవి యీ దశలో అలాటి పాత్రను అంగీకరిస్తారా? అంగీకరించి వుంటే రీమేక్ చేసి వుండేవారేమో! అంతెందుకు, "ద ృశ్యం" సినిమా చిరంజీవి వేసి వుండవచ్చు. కానీ ఆయన చూపు "గబ్బర్‌సింగ్" వంటి సినిమా మీదే వుంది. ఇటీవలే వేదికపై ఆ సంగతి చెప్పారు.

అసలు యీ 150 అంకెపై అంత అబ్సెషన్ దేనికి? ఆ అంకె చేరడానికి "స్టయిల్", "మగధీర"లో వేసిన అతిథి పాత్రలను కూడా 148, 149గా చెప్పేసి ఈ 150 మీద భారం పెట్టేశారు. దాంతో ఆయనకూ, అభిమానులకూ నెర్వస్‌నెస్. మామూలు సినిమా ప్రేక్షకుడికి యీ అంకెల గోల లేదు. రజనీకాంత్ 150 వ సినిమా ఏదో ఎవరైనా పట్టించుకున్నామా? సినిమా బాగుంటే చూశాం, లేకపోతే తిరక్కొట్టాం. ఇప్పుడైతే హీరోలు ఏడాదికి, రెండేళ్లకో సినిమా వేస్తున్నారు కాబట్టి దేని తర్వాత ఏది వస్తుందో చెప్పగలుగుతున్నారు. గతంలో వరసగా వేసుకుంటూ వెళ్లిపోయే రోజుల్లో ఏ సినిమా ముందు వస్తుందో, వెనక వస్తుందో చెప్పలేకపోయేవారు. ఇప్పుడు కూడా చిరంజీవి 150, 151, 152 సినిమాలు ఒక్కసారి ఎనౌన్సు చేసి దిగితే ఏది ముందు వస్తుందో ఎవరూ చెప్పలేరు. షూటింగు అయిపోయినా కంప్యూటర్ గ్రాఫిక్స్ దగ్గర ఆలస్యమై పోతోంది. ప్రతీ కళాకారుడికీ, మీదు మిక్కిలి నటుడికి మామూలుగానే టెన్షన్

వుంటుంది – గతంలో కంటె మెరుగ్గా చేయాలనే ప్రెషర్ వుంటుంది. అది సాధ్యం కాదని అభిమానులకు చెప్పినా వారు వినిపించుకోరు. అందువలన వారిని దబాయించి మనకు నచ్చినవి మనం చేసుకుంటూ పోవాలి. ఇలా 150వ సినిమా ప్రతిష్ఠాత్మకమైనది అని మనమే టెన్షన్ తెచ్చి పెట్టుకుంటే ఎప్పటికీ కాలు ముందుకు పడదు. పడ్డాక కూడా లక్ష సందేహాలు వస్తాయి.

రాజ్ కపూర్ కెరియర్ ఒకసారి పరికించండి. ఆయనకు దర్శకత్వంలో ఆసక్తి. ఆ విభాగంలోనే చేరి, నటుడయ్యాడు. హీరోగా ఎస్టాబ్లిష్ అవుతూండగానే నిర్మాత-దర్శకుడిగా మారి "ఆగ్" అనే సినిమా కొత్తరకంగా తీశాడు. ఆడలేదు. అప్పుడు "బర్సాత్" అని మ్యూజికల్, రొమాంటిక్ సినిమా తీశాడు. బాగా డబ్బు వచ్చింది. ఇక వరుసగా కమ్మర్షియల్ సినిమాలు తీశాడు. వాటి మీద వచ్చిన డబ్బుతో ఆర్కె స్టూడియో కట్టాడు. కమ్మర్షియల్స్ తీస్తూనే తనలో వున్న కళాతృష్ణను చల్లార్చుకోవడానికి "జాగ్‌తే రహో" వంటి నవ్యధోరణి సినిమా తీశాడు. తనే హీరో. చింపిరి దుస్తులతో, మాసిన గడ్డంతోనే సినిమా అంతా కనబడతాడు. పాటే కాదు, మాటా లేదు. చివర్లో అయిదు నిమిషాలు తప్ప! "బూట్ పాలిష్" అని పిల్లలపై సినిమా తీశాడు. దానిలో లోకల్ ట్రెయిన్ ప్రయాణీకుడిలా తను ఒక్కసారి కనబడి మాయమై పోతాడు. "అబ్ దిల్లీ దూర్ నహీ" సినిమాను ఒక బాలనటుడు ప్రధాన పాత్రధారిగా తీశాడు. వీటిలో కొన్ని ఆడాయి. కొన్ని ఆడలేదు. నష్టాలను తట్టుకోవడానికి ఆయనకు వేరే చోట నుండి డబ్బు వచ్చింది. రంగుల సినిమాలు వచ్చిన చాలా రోజులకు "సంగమ్" అని కలర్‌లో, విదేశాల్లో షూట్ చేసి తీశాడు. సూపర్‌గా ఆడింది. తర్వాతి సినిమా వచ్చేందుకు ఆరేళ్లు పట్టింది. "సంగమ్" కంటె బాగా తీయాలన్న పట్టుదలే దానికి కారణం. చివరకు "మేరా నామ్ జోకర్" వచ్చి ఘోరంగా ఫ్లాపయింది. హీరోగా తన రోజులు చెల్లిపోయాయని గుర్తించి, డైరక్టర్‌గా స్థిరపడి "బాబీ"తో మొదలుపెట్టి మళ్లీ అనేక సూపర్ హిట్ సినిమాలు తీశాడు.

చిరంజీవికి కూడా ఆర్థికంగా మంచి దన్ను వుంది. ప్రొడక్షన్ హౌస్ వుంది. ఇతరులను పెట్టి "బూట్ పాలిష్" వంటి ప్రయోగమో, తనతో "జాగ్‌తే రహో" వంటి ప్రయోగమో చేసి వుండవచ్చు. అలాటిది ఏదీ చేయలేదు. రాజ్ కపూర్, దేవ్ ఆనంద్ వేషాలు తగ్గినపుడు డైరక్షన్‌వైపు వెళ్లిపోయారు. చిరంజీవి ఆ దిశగా ఆలోచించలేదు. అలాటప్పుడు తనలో వున్న నటరాజ అంశను పూర్తిగా ఆవిష్కరించే అవకాశం కూడా లేకుండా తనే అవరోధాలు కల్పించుకుంటున్నారు. స్టార్ ఇమేజి చట్రం చాలా పటిష్టమైనది. దాన్ని బద్దలు కొట్టడం మాటలు కాదు. అంతరాళంలోకి దూసుకుపోయే రాకెట్ ఒక్కో కక్ష్యను దాటుకుంటూ వెళుతున్నపుడు బరువు వదుల్చుకుంటూ వెళుతుంది. తనను పైకి తీసుకు రావడానికి ఉపయోగపడిన ప్లాట్‌ఫాంనే పై ఆర్బిట్‌లోకి వెళ్లాక వదిలిపెట్టేస్తుంది. అప్పుడే ముందుకు దూసుకుని వెళ్లగలుగుతుంది. అలాగే తారామండలంలోకి ఉవ్వెత్తున ఎగసి వెళ్లడానికి చిరంజీవికి స్టార్ యిమేజి ఉపయోగపడింది. ఆయన దానిని ఏ 45 వ ఏటో వదిలిపెట్టేసి వుంటే భారరహితంగా ముందుకు సాగి యింకా ఎన్నో సినిమాలు, మంచి సినిమాలు, భిన్నతరహా సినిమాలు చేసి వుండేవారు. 60 ఏళ్లు పూర్తయినా యింకా ఆ భారాన్ని మోస్తూ వుండడంతోనే ఆయన గమనం చాలా మందంగా సాగుతోంది. తను లెజెండ్ అనీ, తన పాటికి తను వెళుతూ వుంటే కొత్త పుంతలు ఏర్పడతాయనీ ఆయన మర్చిపోతున్నాడు. పాత పుంతల్లోనే తచ్చాడుతూ కొత్తగా వచ్చినవారితో పరుగుపందెంలో పాల్గొనడానికి చూడడం ఆయనకు అనవసరమైన మానసిక శ్రమ. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2015)**

**సెప్టెంబరు 01-03 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఇంద్రాణీ ముఖర్జీ ఇంద్రజాలం**

ఇటీవలి కాలంలో యింత సంచలనం కలిగిస్తున్న క్రైమ్ స్టోరీ లేదనే చెప్పాలి. ఒక టీవీ ఛానెల్ గ్రూపు అధిపతిగా, మరో పెద్ద టీవీ గ్రూపు సిఇఓ భార్యగా హై సర్కిల్స్‌లో ఓ వెలుగు వెలిగి, అత్యంత ప్రతిభావంతురాలైన మహిళగా ఎవార్డులు పొందిన ఇంద్రాణీ ముఖర్జీ యీ రోజు సొంతకూతుర్ని పీక నులిమి హత్య చేసిన తల్లిగా తోచి సభ్యసమాజం ముక్కున వేలేసుకుంటోంది. నిజంగా చంపిందా, ఎందుకు చంపింది, వావివరసలపై యీమెకు అంత పట్టింపు వుందా అని విస్తుపోతూ వుండగా, డబ్బు కోసమే జరిగిందని ఆమె సొంత కొడుకే ఆరోపణలకు దిగాడు. 'స్కూప్'ల పేరుతో, 'స్టింగ్ ఆపరేషన్' పేరుతో పొరుగింట్లో మూలమూలలకు కూడా వెళ్లి విషయాలను తెలుసుకుని లోకానికి చాటే టీవీ ఛానెల్ సిఇఓకు సొంత యింట్లో తన కళ్ల ముందు మసలుతున్న అమ్మాయి సవతి కూతురో, మరదలో తెలుసుకోలేడా? తన కొడుకు పెళ్లి చేసుకుందామని అనుకున్నామె హఠాత్తుగా మాయమై మూడేళ్లయినా ఆమె అజాపజా తెలుసుకోలేడా? వింతగా లేదూ!? అసలు వచ్చిన చిక్కేమిటంటే విషయం అర్థం చేసుకుందామంటే పాత్రధారుల్లో ఎవరు ఎవరికి ఏమవుతారో ఏమీ అర్థం కావటం లేదు. రోజుకో కొత్త న్యూస్ వచ్చి గందరగోళం పెరుగుతోంది. దీనిలో ఏది నిజమో, ఏది కాదో తెలియటం లేదు. ఇప్పటిదాకా చేరిన సమాచారాన్ని గుదిగుచ్చి, ఒక క్రమంలో పెట్టి చూస్తే యికపై జరిగే సంఘటనలను అర్థం చేసుకోవడం సులభమవుతుంది.

కలర్1 ఇంద్రాణీ ముఖర్జీ అసలు పేరు పరీ బోరా. బొంబాయికి వచ్చాక పేరు మార్చుకుంది కానీ సౌలభ్యం కోసం ఇంద్రాణి అనే వ్యవహరిద్దాం. ఆసామీ వనిత. 1972లో పుట్టిందంటున్నారు కానీ అంతకు ముందే పుట్టి వుండాలి. ఎందుకంటే ఆమె మొదటి పెళ్లి 1984లో జరిగింది. ఆమె తల్లి  దుర్గారాణి. ఇంద్రాణి చిన్నతనంలోనే ఆమె తండ్రి భార్యాబిడ్డల్ని వదిలి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పుడామె భర్త సోదరుడైన ఉపేంద్ర కుమార్ బోరాను పెళ్లి చేసుకుంది. వాళ్లిద్దరి మధ్య ఎప్పుడూ గొడవలే. ఉపేంద్ర ఇంద్రాణిని

కొడుతూ వుండేవాడు. చిన్నప్పటినుంచీ ఇంద్రాణి చురుకుగా వుండేది. స్కూలులో తక్కిన ఆడపిల్లలు మగాళ్లతో మాట్లాడడానికే జంకే రోజుల్లో చాలామంది బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరిగేది. గువాహటీలో కాటన్ కాలేజీలో చదివే రోజుల్లో 1984 డిసెంబరులో కామాఖ్య ఆలయంలో బిష్ణు చౌధురీ అనే అతనితో ఆమెకు పెళ్లి జరిగిందని, తను దానికి సాక్షిననీ ఆమె క్లాస్‌మేట్ ఒకామె చెప్పింది. నాలుగు నెలల తర్వాత అతన్ని విడిచి పెట్టేసి షిల్లాంగ్ వెళ్లింది. అందువలన కాబోలు మీడియా అతన్ని భర్తగా లెక్కపెట్టటం లేదు.

కలర్2 షిల్లాంగ్‌లో 1986లో ఆమెకు త్రిపురకు చెందిన సిద్ధార్థ దాస్ కలిశాడు. మీడియా యితన్ని ఇంద్రాణి మొదటిభర్తగా లెక్క వేస్తోంది కానీ అతను అలా అనుకోవటం లేదు. 1989 వరకు లివ్-యిన్ రిలేషన్‌షిప్ (సహజీవనం)లో వున్నామంటున్నాడు. అతనొక చిన్న ఉద్యోగి. అతని వలన తను ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే అవకాశం లేదని గ్రహించిన ఇంద్రాణి మూడేళ్లు పోయాక అతనికి గుడ్‌బై చెప్పేసింది. అతను 1998 నుంచి కలకత్తాలో చిన్న ఉద్యోగం చేసుకుంటూ భార్య, కొడుకుతో గుట్టుగా కాపురం చేసుకుంటున్నాడు. తను ఫలానా అని తెలిస్తే యిల్లు గలాయన ఖాళీ చేయిస్తాడనీ, ఉద్యోగం వూడుతుందనీ భయంతో హెల్మెట్ వేసుకుని ముసుగేసుకుని ప్రెస్‌తో మాట్లాడుతున్నాడు. హతురాలు షీనా అతనికి, ఇంద్రాణికి పుట్టినదే. తన కూతుర్ని చంపేసిన మాజీ భార్యకు ఉరి పడాలని ఆవేశపడుతున్నాడు. వీళ్లిద్దరూ కలిసి వుండగా 1987 ఫిబ్రవరిలో షీనా, 1988 సెప్టెంబరులో మిఖాయేల్ పుట్టారు. విడిపోయినప్పుడు తను పిల్లల సంరక్షణ తీసుకుంటానని చెప్పినా వినకుండా పిల్లల్ని తన పుట్టింటికి తీసుకుపోయిందంటాడు దాస్. షీనాను పదో క్లాసులో ఓ సారి చూశానని, మిఖాయేల్‌తో అస్సలు టచ్‌లో లేననీ చెప్పాడు.

కలర్2 పుట్టింటికి తీసుకెళ్లి పిల్లల్ని స్కూలులో చేర్చేటప్పుడు ఇంద్రాణి ఖతర్‌నాక్ తెలివితేటలు బయటపడ్డాయి. ఆమె అప్పటికి ట్వంటీస్‌లోనే వుండి వుంటుంది. కానీ భవిష్యత్తులో యీ పిల్లలు తనకు గుదిబండలుగా మారతారనే ముందుచూపుతో స్కూలు రికార్డులలో పిల్లల తలిదండ్రులుగా అమ్మమ్మ, తాతయ్యల పేరు రాయించింది. బర్త్ సర్టిఫికెట్టులోనే రాయించిందన్న వార్త నిజమైతే ఆ తెలివితేటలు యింకో ఐదేళ్లకు ముందే వికసించాయన్నమాట! ఇదెక్కడి ఘోరమని ఓ జర్నలిస్టు అడిగితే 'నా సవతి తండ్రి తాగి నాపై అత్యాచారం చేయడం వలన షీనా పుట్టింది' అని ఇంద్రాణి చెప్పినట్టు ఒక వార్త వచ్చింది. మరి మిఖాయేల్ ఎలా పుట్టాడో జర్నలిస్టు అడిగాడో లేదో తెలియదు. 'షీనా నా మనుమరాలే కానీ కూతురు కాదు బాబోయ్' అని ఉపేంద్ర మీడియా ముందుకు వచ్చి చెపుతున్నాడు.

కలర్3 పిల్లల్ని స్కూల్లో చేర్చాక ఇంద్రాణి భర్తల వేటలో పడింది. కలకత్తా, జంషెడ్‌పూర్‌లలో వ్యాపారం చేసే సంజీవ్ ఖన్నా అనే వ్యాపారి తగిలాడు. తనకు అప్పటికే పిల్లలున్నారని చెప్పిందో లేదో మనకు తెలియదు. 1993లో పెళ్లి చేసుకుని అతని ద్వారా విధి అనే కూతుర్ని కంది. ఇతని నుంచి విడిపోయి, విడాకులకు అప్లయి చేసి, 2001లో ఇంద్రాణి బొంబాయి ప్రయాణం కట్టింది. ఈ సంసారం ద్వారా పుట్టిన కూతుర్ని కూడా తన వద్ద వుంచుకుంది. సంజయ్ ఖన్నా కలకత్తాలోనే వుండిపోయాడు. ఇప్పుడీ షీనా హత్య కేసులో అతను తన మాజీ భార్యకు ఎందుకు సహకరించాడన్నది పెద్ద మిస్టరీ అయిపోయింది. షీనాను తొలగించివేస్తే – మిఖాయిల్‌ను కూడా తుదముట్టించాలనుకున్నారనీ, సాగలేదనీ సమాచారం – ఆమెకు రావలసిన ఆస్తి కూడా విధికి వచ్చేస్తుందనే ఆశతో సంజీవ్ హత్యలో పాలు పంచుకున్నాడంటున్నారు. దీనితో బాటు అతనికి హత్య కాగానే డబ్బు ముట్టచెప్పారని, యిప్పుడు అతను హఠాత్తుగా సంపన్నుడై పోయాడనీ చెప్తున్నారు. హత్య బయల్పడ్డాక విచారణలో అతను రకరకాల అబద్ధాలు చెప్తున్నాడు. షీనా, ఇంద్రాణి, తనూ కారు ఎక్కారనీ, కారు ఎక్కగానే సాయంత్రం 6 గంటలకు సంజెవేళ తనకు నిద్ర పట్టేసిందని, మెలకువ వచ్చి చూసేసరికి పక్కన షీనా శవం వుందని అన్నాడు. ఎంత మత్తులో వున్నా పీక నులిమేస్తూంటే కదలదా, అప్పుడైనా మెలకువ రాలేదా? డ్రైవర్ యితని హస్తం కూడా వుందనడంతో యిప్పుడు మెలకువగానే వున్నానంటున్నాడు. పీక నులిమింది ఇంద్రాణా, సంజీవా అన్నది యింకా తేలలేదు. 'నేను పీక నులిమే ప్రశ్నే లేదు, అసలు షీనా చచ్చిపోతే కదా, ఇప్పుడు కూడా అమెరికాలో హాయిగా మొగుడితో కాపురం చేస్తోందిగా' అని దబాయిస్తోంది ఇంద్రాణి.

సంజీవ్ ద్వారా కన్న విధి ఖన్నాను తోడు పెట్టుకుని అప్పటి పరీ ఖన్నా బొంబాయి చేరింది. ఓ శుభముహూర్తాన తన పేరు ఇంద్రాణిగా మార్చుకుని, ఒక ఎచ్ఆర్ కన్సల్టెన్సీ కంపెనీ పెట్టింది. వాళ్ల క్లయింట్లలో రిలయన్సు గ్రూపు ఒకటి. యాడ్ కంపెనీలతో స్నేహం పెంచుకుంది. సుప్రసిద్ధ యాడ్‌మేన్, లింటాస్ ఫేమ్ అలేక్ పాదమ్‌సీ యీామెను పీటర్ ముఖర్జీకి పరిచయం చేశాడు. పీటర్ షబ్నమ్ అనే ఆమెను పెళ్లాడి, 1994లో విడిపోయాడు. వాళ్లకి 1980లో రాహుల్ అనే కొడుకు, 1984లో మరో కొడుకు పుట్టారు. రాహుల్ తల్లితో డెహ్రాడూన్‌లో వుండేవాడు. తండ్రి బొంబాయి వచ్చాక వచ్చి అతనితో వుండసాగాడు. పీటర్ ఇంద్రాణిని చూసి మురిసిపోయి తనకంటె 16 ఏళ్లు చిన్నదైనా ఫర్వాలేదని పెళ్లి చేసుకుంటానన్నాడు. 2002లో అతని యింట్లోకి యీామె ఐదేళ్ల విధి ఖన్నాతో సహా మారిపోయింది. కోర్టు నుంచి విడాకులు వచ్చాక 2002 నవంబరులో యిద్దరూ ఢిల్లీలో పెళ్లి చేసుకున్నారు. విధిని పీటర్ దత్తత తీసుకుని ఆమెకు ముఖర్జీ అనే తన యింటి పేరును ప్రసాదించాడు. లోకమంతా ఇంద్రాణీని తిడుతున్నా యిప్పుడీ విధీ ముఖర్జీ మాత్రం తల్లిని అంటిపెట్టుకుని ఓదారుస్తోంది.

బాక్స్ 1 పీటర్ ముఖర్జీ అసలు పేరు ప్రతీమ్ ముఖర్జీ. ఇంగ్లండులో పుట్టి అక్కడే పెరిగాడు, 1971లో డూన్ స్కూల్లో చదువుకున్నాడు, ఉద్యోగాలు చేశాడు. యుకెలో హెంజ్ అనే అమెరికన్ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ యుకె మార్కెటింగ్ విభాగంలో పనిలో చేరాడు. ఓగ్లివీ అండ్ మేథర్ అనే ప్రముఖ యాడ్ కంపెనీలో ఎక్కవుంట్ డైరక్టర్‌గా న్యూ ఢిల్లీ, లండన్‌లలో పని చేశాడు. ఆ తర్వాత హాంగ్‌కాంగ్‌లో

డిడిబి నీధామ్ గ్రూపులో అదే పొజిషన్‌లో పనిచేసి, హాంగ్‌కాంగ్‌లోనే స్టార్ టివి (ఇండియా)కు సేల్స్ డైరక్టరుగా చేరాడు. స్టార్ అధిపతి రూపర్ట్ మర్డోక్‌కు యితను బాగా నచ్చడం చేత బొంబాయి పంపించి స్టార్ టీవీ యాడ్ సేల్స్ డివిజన్ తెరిపించాడు. 1996 నుంచి మిడిల్ ఈస్ట్ వ్యాపారం కూడా చూడసాగాడు. 1997లో అతన్ని ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంటు చేశారు. 1999 వచ్చేసరికి అతను స్టార్ ఇండియాకు సిఇఓ అయిపోయాడు. ఆ పదవిలో 8 ఏళ్లు పనిచేసి అమిత ఖ్యాతిని గడించాడు. ఇఎస్‌పిఎన్ స్టార్ స్పోర్ట్స్ ఛానెల్‌కు, హాత్‌వే కేబుల్ టీవీకి, స్టార్ న్యూస్‌కు డైరక్టరుగా కూడా వున్నాడు. పీటర్ పదవీకాలంలోనే స్టార్ గ్రూపు "కౌన్ బనేగా కరోడ్‌పతి", "క్యూంకీ సాస్ భీ.." వంటి పాప్యులర్ టీవీ ప్రోగ్రాంలు ప్రవేశపెట్టి భారతీయ టీవీ పరిశ్రమకు దిశానిర్దేశం చేసింది. ఒకలా చెప్పాలంటే ఇంద్రాణి పీటర్ ముఖర్జీ భార్య కాకుండా వుంటే యీ హత్యకు యింత పబ్లిసిటీ వచ్చేదే కాదు.

పీటర్, ఇంద్రాణి బొంబాయి సోషల్ సర్కిల్స్‌లో తళతళలాడిపోయారు. బొంబాయిలో తను దృఢంగా పాతుకున్నాక ఇంద్రాణి తన కూతురు షీనాను 2006లో తన వద్దకు రప్పించుకుని సెయింట్ జేవియర్స్ కాలేజీలో గ్రాజువేషన్‌లో చేర్పించింది. మిఖాయిల్‌ను మాత్రం గువాహటిలోనే వుంచి, డబ్బు పంపిస్తూ తన తలితండ్రుల ఆలనాపాలనా చూడమంది. షీనాను పీటర్‌కు, లోకానికి తన చెల్లెలుగా పరిచయం చేసింది. అసలు ఇంద్రాణి షీనాను ఎందుకు రప్పించుకోవాలి? తల్లిప్రేమ చేతనా? మరి ఆరేళ్లు తిరిగేటప్పటికి ఆ ప్రేమంతా ఏమైంది? – వీటికి సమాధానాలు యిప్పుడే కచ్చితంగా తెలియవు. ఆమె స్వభావం చూస్తూ వుంటే తనలాగే తన కూతుర్ని సోషల్ సర్కిల్స్‌లో తిప్పి ఎవడైనా పెద్దవాడికి (అన్ని విధాలా) యిచ్చి పెళ్లి చేద్దామనుకుందేమో అనిపిస్తుంది. ఇంకో థియరీ ఏమిటంటే – తనూ, పీటర్ కలిసి స్టార్ టీవీలో కొట్టేసిన డబ్బుకి బినామీలు కావాలి. అతనివైపు, తనవైపు కనబడిన బంధువుల పేర యింతో అంతో పెట్టినా, ఎక్కువ డబ్బు తనవాళ్ల పేరే పెట్టుకుని అవసరం వచ్చినపుడు వెనక్కి తీసుకుంటే మంచిది కదా అనుకుని వుండవచ్చు. పుట్టినప్పటినుంచి తనను దూరంగా పెట్టిందని కూతురికి వున్న కోపాన్ని పోగొట్టి, బినామీగా ఒప్పించడానికి బొంబాయి పిలిపించి, యీ జీవితాన్ని రుచి చూపించి ఆకట్టుకుందామని అనుకుని వుండవచ్చు. అయితే తర్వాత అనూహ్యంగా ప్రేమ కోణం మొలుచుకుని వచ్చి కథ అడ్డం తిరిగింది. అది చెప్పుకోబోయే ముందు వీళ్లు చేసిన ఆర్థిక అక్రమాల గురించి తెలుసుకోవాలి.

బాక్స్ 2 ఆర్థిక అక్రమాలు ఇంద్రాణితో పెళ్లి అయ్యాక పీటర్ బుద్ధి వక్రించినట్లు తోస్తుంది. స్టార్ ఇండియా సిఇఓగా వుండగానే పోటీ టీవీ ఛానెల్ గ్రూప్ పెట్టాలన్న ఐడియా వచ్చింది. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలైన న్యూ సిల్క్ రూట్, సింగపూరుకి చెందిన తెమాసెక్ హోల్డింగ్స్, న్యూ వెర్నాన్ ప్రైవేట్ యీక్విటీలకు నచ్చచెప్పి ఆ ఛానెల్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఒప్పించాడు. ఆ గ్రూపు ద్వారా న్యూస్ ఛానెల్, ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెల్ వగైరాలు పెడదామనుకున్నారు. అన్నీ సిద్ధమయ్యే సమయానికి హఠాత్తుగా ఆ కంపెనీలకు తెలిసి వచ్చింది – విదేశీ సంస్థలు ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెల్లో 100% పెట్టుబడి పెట్టవచ్చు కానీ న్యూస్ ఛానెల్‌లో 26%కు మించి పెట్టడానికి భారత ప్రభుత్వ నియమాలు ఒప్పుకోవని! అప్పుడు పీటర్ మీరు ఆ డబ్బు మా పేర పెట్టండి అన్నాడు. అయితే పీటర్ బ్రిటిష్ పౌరుడు. అందువలన ఇంద్రాణి పేర ఇంద్రాణి ఇన్‌కాన్ ప్రై.లి. అనే కంపెనీ పెట్టి వీళ్ల దగ్గర్నుంచి పెట్టుబడులు సేకరించి, ఆ గ్రూపుకి పెట్టుబడిదారుగా అవతరించింది. ఆ గ్రూపుకు ఇంద్రాణి పేరులో మొదటి అక్షరాలు ఐయన్ చేర్చి ఐయన్‌ఎక్స్ నెట్‌వర్క్ అన్నారు. దాని ఛాయలో 9ఎక్స్, న్యూస్ ఎక్స్... యిలా ఛానెళ్లు పుట్టుకుని వచ్చాయి. మొత్తం 17 పెడదామనుకున్నారు. పీటర్ స్టార్‌టీవీకి సిఇఓ కాబట్టి యీ ఐయన్‌ఎక్స్ గ్రూపుకు ఇంద్రాణిని సిఇఓ చేసేశాడు – ఆమెకు టీవీ రంగంతో, పత్రికారంగంతో, కళలతో ముఖపరిచయం కూడా లేకపోయినా! స్టార్ టీవీని పట్టించుకోవడం మానేయడంతో బిజినెస్ తగ్గి మర్డోక్‌కు కోపం వచ్చింది.

బాక్స్ 2 2007లో పీటర్ స్టార్ వదిలి రావలసి వచ్చింది. ఐయన్‌ఎక్స్‌లో అతను ఛైర్మన్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసరుగా చేరాడు. భార్యాభర్తలిద్దరికీ కలిపి కంపెనీలో 50% వాటా వుంది. ఇక కంపెనీ నుంచి డబ్బులు మళ్లించడం మొదలుపెట్టారు. మళ్లించినది తమ బంధువుల పేర పెట్టనారంభించారు. వారిలో పీటర్ సోదరుడు గౌతమ్ ముఖర్జీ ఒకడు. అతను "ప్లానెట్ గోవా" అనే మ్యాగజైన్‌కు పబ్లిషరు. ఇవతల పెట్టుబడిదారులను ఏమార్చడానికి పూనుకున్నారు. ఛానెళ్లు అద్భుతంగా నడిచేస్తున్నాయని మభ్యపెట్టడానికి ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెలైన 9ఎక్స్ టిఆర్‌పి రేటింగ్స్‌ను న్యూస్ ఎక్స్‌కు కలిపేసి తప్పుడు రేటింగ్స్ చూపించారు. ఇంద్రాణి అధిపతిగా వున్న ప్రోగ్రామింగ్ డిపార్ట్‌మెంట్‌కు ఏడాదికి రూ.350 కోట్లు కేటాయించారు. అంటే రోజుకి దాదాపు రూ. కోటి అన్నమాట! దాని ద్వారా యిష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టినట్లు చూపించారు. కేబుల్ టీవీ ఆపరేటర్ల డీలింగుల్లో కూడా కమీషన్లు తీసుకున్నారని అంటారు.

బాక్స్ 2 ఇంద్రాణి తరఫున పెట్టుబడి పెట్టిన న్యూ సిల్క్ రూట్ కంపెనీ పెద్దలు కూడా వాహినీ వారి పెద్దమనుషులే. ఆ కంపెనీ పెట్టిన ఆరుగురిలో నలుగురు అమెరికాలో యిన్‌సైడ్ ట్రేడింగ్ చేశారన్న అభియోగాలు ఎదుర్కొంటున్నారు. వారిలో మెకిన్సే రజత్ గుప్తా కూడా ఒకరు. వాళ్లు యీ వ్యవహారాలను ప్రశ్నించసాగారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమాంద్యం ఏర్పడ్డాక తెమాసెక్ హోల్డింగ్స్ వారు కూడా ఐయన్‌ఎక్స్ ఆర్థిక లావాదేవీలను ప్రశ్నించసాగారు. ఆడిట్ చేయించి వీళ్ల డబ్బు తరలించినట్లు కనుగొన్నారు. న్యూస్ ఎక్స్ ఛానెల్ సిబ్బంది అందించిన సమాచారంతో బెంగాల్ కాంగ్రెస్ నాయకుడు ప్రియరంజన్ దాస్‌మున్షీ ఫిర్యాదు చేయగా, ఛానెల్‌కు డబ్బు ఎక్కణ్నుంచి వచ్చిందన్నదానిపై, వీళ్ల వ్యవహారాలపై 2008లోనే ఆర్థికమంత్రి చిదంబరం విచారణకు ఆదేశించారు. ఐయన్‌ఎక్స్ నెట్‌వర్క్‌లోంచి నిధులు తరలిపోతూండగా ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్, యితర ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్స్ కలిసి ముఖర్జీలను గట్టున పడేశారు. వీరంతా కలిసి షేర్‌హోల్డర్స్‌ను మోసం చేశారన్న విషయంపై యిప్పుడు సీరియస్ ఫ్రాడ్ యిన్వెస్టిగేషన్ ఆఫీసు విచారణ జరుపుతోంది. దీనితో బాటు టేపుల ఫేం నీరా రాడియాకు చెందిన న్యూకమ్ కన్సల్టింగ్‌కు

న్యూస్ ఎక్స్‌కు మధ్య నడిచిన లావాదేవీల గురించి కూడా విచారణ సాగుతోంది. రిలయన్సుకు చెందిన ప్రమోటర్ కంపెనీల నుండి ఋణాలు తీసుకోవడానికి ఇంద్రాణి సంతకాలు చేసిందని యిన్వెస్టిగేషన్ ఆఫీసు అంటోంది. షేర్ల అమ్మకంలోనే గోల్‌మాల్ జరిగింది. షేరు ధర రూ.10 కాగా, ప్రీమియం రూ. 208. 2009 వరకు అదే రేటు. 2009 జనవరిలో రూ.10 రేటుకే అమ్మేశారు. ఇవన్నీ ఎకామడేషన్ ఎంట్రీలని విచారణాధికారుల అనుమానం. గ్రూపుకి సంబంధించిన ఛానెల్స్ యింత అధ్వాన్నంగా నడిచినా పీటర్, ఇంద్రాణి తమ షేర్లను లాభదాయకంగా అమ్ముకుని బయటపడిపోయారు. ఇంగ్లండ్ వెళ్లిపోయారు. మధ్యమధ్యలో ఇండియాకు వచ్చి వెళుతున్నారు. లండన్‌లో అయిదారు యిళ్లుంచుకుని దర్జాగా బతుకుతున్నాడట.

రన్నింగ్ మేటర్ – దీపం వుండగా యిల్లు చక్కబెట్టుకోవడమే కాదు, ఆ దీపం వెలుగులో ఇంద్రాణి ఇంద్రవైభోగం అనుభవించింది. ప్రపంచవ్యాప్తంగా మీడియా సంస్థల్లో అందరి కంటె వయసులో చిన్నదైన మహిళా సిఇఓ కావడంతో ఆమెను మెచ్చుకోనివారు లేరు. ఛానెళ్లు నిలదొక్కుకోవడానికి ముందే ఎవార్డులు కురిశాయి. వాల్‌స్ట్రీట్ జర్నల్ "గమనించవలసిన 50 మంది మహిళలు" (50 విమెన్ టు వాచ్‌ఔట్ ఫర్) జాబితాలో ఇంద్రా నూయీ, పద్మా వారియర్‌ల సరసన యీమెకు స్థానం యిచ్చింది. అంతా పీటర్ కారణంగానే అని వేరే చెప్పనక్కరలేదు. బొంబాయి, ఢిల్లీ సోషల్ సర్కిల్స్‌లో ఆమె పేరు మారుమ్రోగిపోయింది. ఇదంతా ఆమె అహంకారాన్ని పెంచింది. తన ఛానెళ్లలో పనిచేసే సీనియర్ జర్నలిస్టులను అవమానించి గొడవలు తెచ్చుకుంది. వారిలో వీర్ సంఘ్వీ ఒకరు. టెలివిజన్ మీడియాలో వున్న పాత్రికేయులెవరూ ఆమె గురించి మంచిగా మాట్లాడటం లేదు. సమాజంలో పలుకుబడి రావడంతో తను ఏం చేసినా చెల్లుతుందనే భావం ఇంద్రాణిలో బలపడింది. అందుకే కూతురు హత్యకు పాల్పడింది. దాన్ని మాపు చేయగలిగింది. అనుకోకుండా యిది బయటపడింది కానీ లేకపోతే ఆమె గురించి యింత మాట్లాడుకునే వారమే కాదు.

కలర్ 4 2009లో కాలేజీ చదువు పూర్తయ్యాక షీనా రిలయన్సు ముంబయి మెట్రో ప్రాజెక్టులో ఇంటెర్న్‌గా పనిచేయసాగింది. 2010-11 నాటికి ఉద్యోగంలో కన్‌ఫమ్ అయింది. 2006 నుంచి అంటే 19 ఏళ్ల వయసు నుంచి తన కంటె ఏడేళ్లు పెద్దవాడైన రాహుల్‌తో ప్రేమలో పడింది. రాహుల్ ఏం వుద్యోగం చేసేవాడో తెలియటం లేదు. తల్లి ఇంగ్లండు వెళ్లిపోయిన తర్వాత కాబోలు, రాహుల్, యీమె కలిసి కాపురం పెట్టేశారు. ఖార్‌లో, బాంద్రాలో ఎపార్టుమెంట్లలో వుండేవారు. తర్వాత తన ఆఫీసుకి దగ్గర్లో అంధేరీ దగ్గర తీసుకున్నారు. చనిపోయేనాటికి ఆమె గర్భవతి అని కూడా అంటున్నారు. నిజానిజాలు తేలవలసి వుంది. రాహుల్ యీమెను వెంటపెట్టుకుని డెహ్రాడూన్‌లోని తన తల్లి వద్దకు తీసుకెళ్లి చూపించాడు. అక్కడున్న సమీప బంధువులకు, తాతఅమ్మమ్మలకు 'బెస్ట్ ఫ్రెండ్' అంటూ పరిచయం చేశాడు. రాహుల్ తల్లికి షీనా నచ్చింది. కోడలైతే బాగుండుననుకుంది. 2012 ఏడాది చివర్లో పెళ్లి చేసుకోమంది. అయితే యీ వ్యవహారం పీటర్‌కు, ఇంద్రాణికి నచ్చలేదు. పీటర్‌కు షీనా అంటే యిష్టం లేదని కాదు. ఆమెను అనేకసార్లు పార్టీల్లో కలిసేవాడు. ఇంద్రాణి తన తల్లి అని ఆమె పీటర్‌కు చెప్పిందట కూడా. 'అవునా అని అడిగితే ఇంద్రాణి కాదంది. దాంతో చెల్లెలే అయి వుంటుందని అనుకుని వూరుకున్నాను' అంటున్నాడు పీటర్ యిప్పుడు. ఇంద్రాణి తల్లిని కూడా పీటర్ కలిశాడు. ఆవిడా చెప్పిందట – షీనా మనుమరాలే అని.

షీనా ఎలాటిదైనా రాహుల్ ఆమెను చేసుకోవడం మాత్రం పీటర్ యిష్టపడలేదు. ఈ విషయంగా తండ్రీకొడుకులిద్దరూ ఘర్షణ పడి మాట్లాడుకోవడం మానేశారు. ఇంద్రాణికి ఎందుకిష్టం లేదు అనేది స్పష్టంగా తెలియటం లేదు. వరస కుదరలేదనా? లోకం దృష్టిలో షీనా రాహుల్‌కు పిన్ని వరసైనా నిజానికి చెల్లెలి వరస అని ఇంద్రాణికి సంకోచమా? ఏది ఏమైనా తల్లి కానీ, తండ్రి కానీ కామన్ కాదు. రక్తబంధం లేదు. రాహుల్‌ను షీనా పెళ్లి చేసుకుంటే పీటర్ వాటాలో తనకు రావలసిన డబ్బు తగ్గిపోతుంది కాబట్టి.. అని కొందరంటున్నారు కానీ అది అర్థం లేనిమాట. షీనా కాకపోతే మరో రీనా, రాహుల్ ఎవరిని చేసుకుంటే వాళ్లకి పీటర్ ఆస్తిలో వాటా వచ్చి తీరుతుంది. అదేదో తన కూతురే అయితే మంచిదేగా? పెళ్లి యిష్టం లేకపోవడం అంశం మాట ఎలా వున్నా, పగతోనే షీనాను చంపేసిందనే నమ్మాలి. పగ ఎందుకు అంటే తన పేర పెట్టిన ఆస్తులను తిరిగి యివ్వడానికి షీనా తిరస్కరించి వుండవచ్చు అనే సమాధానం వస్తుంది.

ఏది ఏమైతేనేం, ఇంద్రాణి షీనాను చంపడానికే నిశ్చయించుకుంది. పనిలో పనిగా నన్ను కూడా చంపుదామనుకుంది అంటాడు ఆమె కొడుకు మిఖాయేల్. అతన్నీ బొంబాయి రప్పించింది. మాజీ మొగుడు సంజీవ్ ఖన్నాతో కలిసి కుట్ర పన్నింది. మిఖాయేల్, సంజీవ్ ఒకే హోటల్లో వున్నారట. ఏప్రిల్ 23 న ఇంద్రాణి షీనాను ఓర్లీకి రమ్మనమని పిలిచింది. కానీ షీనా వెళ్లలేదు. ఏప్రిల్ 24 న సంజీవ్‌ను, డ్రైవర్ శ్యామ్‌వర్ రాయ్‌ను వెంటపెట్టుకుని నేషనల్ కాలేజీకి వెళ్లి తనను పికప్ చేసుకుంది. హోటల్‌కు తీసుకెళ్లి తాగించింది. కార్లోనే పీక నులిమి చంపేశారు. ఎవరన్నది యింకా తేలలేదు. తర్వాత ఆ కారును తీసుకుని వచ్చి పీటర్ గరాజ్‌లో దాచిపెట్టారు. మర్నాడు బొంబాయికి 84 కి.మీ.ల దూరంలోని పెన్ తహసీల్‌లో గాగోడ్ గ్రామంలో కాల్చి తగలబెట్టి పూడ్చేశారు. అంతకుముందే రెక్కీ నిర్వహించి పెట్టుకున్నారు కాబట్టి ఎవరూ చూడకుండా పని అయిపోయింది. ఆ శవం మే 23 న ఒక ఆదివాసీ గ్రామీణుడి కంటపడితే అతను పోలీసులకు తెలియపరిచాడు. వాళ్లు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించారు. డిఎన్ఏ నమూనాలు కూడా సేకరించకుండా ఆసుపత్రికి పంపించివేశారు. ఇప్పుడు అస్థిపంజరం మాత్రమే వుంది. అది షీనాదో కాదో ఫోరెన్సిక్ నిపుణులే చెప్పాలి. షీనా చచ్చిపోతే కదా అంటోంది ఇంద్రాణి. షీనా శుభ్భరంగా అమెరికా వెళ్లిపోయి పెళ్లి చేసుకుని హాయిగా వుంటోంది అని యిప్పటికీ చెప్తోంది.

బాక్స్ 3 – కవరప్ స్టోరీ కూడా చాలా ఆసక్తికరంగా వుంది. షీనా చనిపోయిన వారం రోజులకు మే 3 న ఆమె ఆఫీసుకి ఆమె రాజీనామా లేఖ అందింది. వాళ్లు దాన్ని ఆమోదించి కూర్చున్నారు. ఆమెకు రావలసిన జీతభత్యాలు ఎవరికి పంపారో తెలియదు. ఎవరూ అడక్కపోతే ఆశ్చర్యపడనైనా పడాలి. షీనా కనబడకపోవడంతో రాహుల్ వెళ్లి ఇంద్రాణిని అడిగాడు. తను పై చదువులకు అమెరికా వెళ్లిపోయిందని చెప్పింది. 'అదేమిటి? పాస్‌పోర్టు నా దగ్గరే వుంది కదా' అన్నాడితను. 'తన దగ్గర యింకో పాస్‌పోర్టు వుందిలే' అని ఇంద్రాణి సమాధానం చెప్పింది. ఒక మనిషికి రెండు పాస్‌పోర్టులెలా వుంటాయన్న ఆలోచనే రాలేదు పీటర్ ముఖర్జీ వంటి మేధావి పుత్రరత్నానికి. కనబడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటే ఇంద్రాణి వద్దని చెపితే యితను వినేశాడు. ఇతని న్యూసెన్సు ఆపడానికి షీనా సెల్ నుంచి ఎస్సెమ్మెస్‌లు పంపింది ఇంద్రాణి. 'మన వ్యవహారం యింతటితో బంద్. వేరే వాళ్లని పెళ్లి చేసుకుని సుఖంగా వుండు' అంటూ కొన్ని నెలల వ్యవధిలో అయిదారు మెస్సేజ్‌లు వెళ్లాయి. దానితో మనవాడు మూణ్నెళ్లు వెయిట్ చేసి, చివరకు యిల్లు ఖాళీ చేసి, నిట్టూర్చి వూరుకున్నాడు. కనబడకుండా పోయిన వ్యక్తి పీటర్, ఇంద్రాణి వంటి ప్రముఖుల కుటుంబసభ్యురాలైనా పోలీసులు ఏమీ చేయకుండా వుండడం అత్యాశ్చర్యకరంగా వుంది. ఏమీ చేయవద్దని హంతకులు చెప్పి వుంటారు.

రాహులే కాదు, మిఖాయేల్ ప్రవర్తన కూడా వింతగా వుంది. 'నాకూ మత్తుపదార్థం యిచ్చి జోకొట్టారు. షీనాను చంపేశాక వెనక్కి వచ్చి నన్ను చంపుదామనుకున్నారు. కానీ నాకు మెలకువ వచ్చి పారిపోయాను' అంటున్నాడు యిప్పుడు. 'తర్వాతైనా మీ అక్క ఏమైందో అడగలేదా?' అంటే 'అడిగాను. అమెరికా వెళ్లిందని అమ్మ చెప్పింది. ఎవ్వరితోనూ సంబంధం పెట్టుకోనని చెప్పిందంది. అలా ఎందుంటుందో నాకు అర్థం కాలేదు. 2012లో బంధువుల యింట్లో పెళ్లికి వచ్చినపుడు బాగా మాట్లాడింది. తన ఫేస్‌బుక్ ఎక్కవుంట్ కూడా మూసేసింది. మా అమ్మ చాలా పలుకుబడి గల వ్యక్తి కాబట్టి భయపడి వూరుకున్నాను. ఇప్పటికైనా తనే నిజాలు బయటపెట్టాలి. సెప్టెంబరు నెలాఖరు దాకా చూసి, లేకపోతే నేనే మాట్లాడతాను. హత్యకు కారణం డబ్బు కాదు, మరొకటి..' అంటున్నాడు. నిజానికి యితను నెలనెలా ఇంద్రాణి పంపించే రూ. 40 వేల మీద ఆధారపడుతున్నాడు. తాతా అమ్మమ్మల పోషణభారం కూడా అతనిపై వుంది. షీనా రాజీనామా లేఖను మెట్రోలోని స్టాఫ్ ఎవరో అమ్మాయి చేత ఇంద్రాణి రాయించింది అంటున్నారు. అబ్బే మిఖాయేలే రాశాడు అంటున్నారు కూడా. డబ్బుతో యితని నోరు మూయించిందని కూడా అనుకోవాలి. నేను గట్టిగా అడిగితే నాకు మతిస్థిమితం లేదని పూనాలో మెంటల్ హాస్పటల్‌లో పెట్టించింది' అన్నాడని ఒక వార్త వస్తే, అబ్బే అలా ప్లాన్ చేసింది తప్ప చేయలేదని, వీణ్ని చంపడానికి ఎవరికో సుపారి యిచ్చి భయపెట్టిందని యింకో వార్త వచ్చింది.

రాహుల్‌కు, మిఖాయేల్‌కు బుఱ్ఱ లేదని అనుకుని వూరుకోవచ్చు. కానీ పీటర్ ముఖర్జీ మాటేమిటి? తన యింట్లో వ్యక్తి మూడేళ్లగా కనబడకపోతే అడగనైనా అడగడా? 'తను అమెరికాలో దీపావళి జరుపుకుంటున్న ఫోటోలను ఇంద్రాణి చూపించింది. నమ్మాను. పెళ్లి చేసుకుందంటే నమ్మాను' అంటున్నాడు. ఆ మీడియా బేరన్ తలచుకుంటే నిమిషాల్లో నిజాలు తెలుసుకోగలడు. అతను హత్యలో పాలు పంచుకోకపోయినా, హత్య జరిగిందని గ్రహించాడని మాత్రం అర్థమవుతోంది. కానీ మీడియాలో వున్న అతని మిత్రులు అతనిది తప్పేమీ లేదన్నట్లు చిత్రీకరిస్తున్నారు. డ్రైవర్ శ్యామ్ రాయ్ అక్రమాయుధాలు కలిగివున్న కేసులో చిక్కుకుని, పోలీసు విచారణలో మూడేళ్ల క్రితం జరిగిన యీ నేరాన్ని వెళ్లకక్కివుండకపోతే వీళ్లంతా ఘరానావ్యక్తులుగానే చలామణీ అయిపోయేవారు. తన పేర పెట్టిన అక్రమాస్తులను తిరిగి యివ్వడానికి నిరాకరించడం చేతనే షీనా హత్యకు గురైందని, ఇంద్రాణి దాన్ని కప్పిపెట్టడానికి ప్రయత్నించిందనీ యిప్పటికి నమ్మవచ్చు. వాస్తవాలు పోనుపోను తెలియవచ్చు. పలుకుబడి, ధనం మళ్లీ వుపయోగిస్తే తెలియకపోనూ వచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2015)**

**సెప్టెంబరు 04** **ఎమ్బీయస్ : ఇంద్రాణీ గురించి మరికొంత..**

ఇంద్రాణీ ముఖర్జీ ఆర్టికల్‌పై వ్యాఖ్యలు చూశాను. నేను "ఇండియా టుడే"లోని వ్యాసాన్ని ప్లెజారైజ్ చేశానని ఒకాయన రాయగా, మరో ఆయన ఔనౌనన్నాడు. ఇంకొకరి ఆలోచనలను, రచనలను తన పేర వేసుకుంటే ప్లెజారైజ్ చేయడమంటారు. నేను అందిస్తున్నది సమాచారం. అది పలు పత్రికల నుండి, వార్తాపత్రికల నుండి సేకరిస్తానని ఎన్నోమార్లు చెప్పుకున్నాను. ఇదేమీ కాల్పనిక రచన కాదు, పరిశోధనా పత్రం కాదు. నేను నాలుగు తెలుగు పత్రికలు, "హిందూ", "వీక్", "ఔట్‌లుక్", "ఇండియా టుడే", "ఫ్రంట్‌లైన్"లతో బాటు నచ్చే అంశమైతే ఆన్‌లైన్ సమాచారాన్ని కూడా చదువుతాను. అన్నీ చదివి, ఒకదానితో మరొకటి సరిచూసుకుని వాటన్నిటినీ ఒక క్రమంలో పెట్టి పాఠకులకు అందిస్తాను. ఈ విషయాన్ని నేను దాచను. ఇలా చేసే ఓపిక లేనివారికోసమే నేను వారిలో ఆసక్తి కలిగించి, తెలియపరిచేందుకు కృషి చేస్తాను. నేను ఔట్‌లుక్‌లో వ్యాసాలను మాత్రమే అనువదిస్తానని ఒకరోసారి రాశారు. అది తప్పు. ఇంద్రాణీ ఆర్టికల్ ఇండియా టుడేలో వ్యాసానికి అనువాదం అని రాసినదీ తప్పే. అనువదించాలంటే వారి అనుమతి వుండి తీరాలి. కొన్ని పత్రికలతోనే వారికి ఒప్పందాలుంటాయి. నేను అనువాదం చేసే సందర్భాల్లో మూలరచయిత పేరు స్పష్టంగా పేర్కొంటాను. నా పేర వేసుకోను. దీన్ని ఇండియా టుడే కథనానికి అనువాదం అనుకునేవారు దాన్నీ దీన్నీ చదివిచూస్తే పోలికలు, తేడాలు తెలుస్తాయి.

నిజానికి గురువారం సాయంత్రం నాటికి టాబ్లాయిడ్‌కోసం యీ వ్యాసం పంపేనాటికి నేను ఇండియా టుడే ఆర్టికల్ చదవలేదు. నాకు యివన్నీ పోస్టులో వస్తాయి. ఆ సంచిక (సెప్టెంబరు 7) అప్పటికి రాలేదు. గత పదిరోజులుగా పది సోర్సెస్ నుంచి తీసుకున్న 18 పేజీల సమాచారంతో ఆ వ్యాసం తయారుచేశాను. కథ అర్థం కావటానికే నాకు చాలా సమయం పట్టింది. దాన్ని ఎక్కణ్నుంచి ఎలా చెప్పాలో తెలియక రెండు రోజులు సతమతమయ్యాను. ప్రచురణ అయిన రెండు రోజులకు యివాళ ఇండియా టుడే కథనం చదివాను. మరికొన్ని విషయాలు తెలిశాయి. మొదటగా చెప్పవలసినది '1984 డిసెంబరులో కామాఖ్య ఆలయంలో బిష్ణు చౌధురీ అనే అతనితో ఆమెకు పెళ్లి జరిగిందని, తను దానికి సాక్షిననీ ఆమె క్లాస్‌మేట్ ఒకామె చెప్పింది. నాలుగు నెలల తర్వాత అతన్ని విడిచి పెట్టేసి షిల్లాంగ్ వెళ్లింది.' అని నేను రాశాను. ఇది "ఔట్‌లుక్"లోంచి తీసుకున్నది. '..తర్వాత సిద్ధార్థ దాస్‌ను పెళ్లాడి షీనా, మిఖాయేల్‌లను కంది.' అని తక్కిన పత్రికలలో చదివి రాశాను. ఇండియా టుడే వాళ్లు రాసినది – '19 ఏళ్ల వయసులో ఆమె చిరాగ్ అనే అతనితో పారిపోయింది. వాళ్లకు పెళ్లి కాలేదు. షీనా, మిఖాయేల్ అతని వలన కలిగినవారే. ఇంద్రాణి తండ్రి ఉపేంద్ర అతని చేత రెస్టారెంట్ పెట్టించాడు.  వ్యాపారం దెబ్బతింది, జంట విడిపోయారు. చిరాగ్ షిల్లాంగ్‌లో టీచరుగా పనిచేస్తున్నాడు. విడిపోయాక ఇంద్రాణి కలకత్తా వెళ్లి సిద్దార్థ దాస్‌ను పెళ్లాడింది.' అని. చూశారా, ఎంత తేడా వుందో? నాది ఇండియా టుడేకు అనువాదం ఎలా అవుతుంది?

షీనా, మిఖాయేల్ తన పిల్లలే అనీ సిద్ధార్థ దాస్ పోలీసులకు చెప్పడం తాజా వార్త. షీనా పదో తరగతి చదివే రోజుల్లో తన తండ్రి సిద్ధార్థకు దీనంగా లేఖలు రాసేదని కూడా పేపర్లలో యిటీవల వచ్చింది. వాళ్లు చిరాగ్ పిల్లలని ఇండియా టుడే రాయడం తప్పని తేల్తోంది. నిజంగా ప్లెజారైజ్ చేస్తే నగుబాటు అయిపోదును. దాస్ త్రిపుర వాడని, ఇంద్రాణి అతనూ షిల్లాంగ్‌లో కలిశారని నా కథనం. కాదు కలకత్తాలో కలిశారని ఇండియా టుడే కథనం. సంజీవ్   ఖన్నాతో విడాకులు ఓ పట్టాన రాలేదని, పీటర్ ముఖర్జీ చొరవతో మ ృణాళిని దేశ్‌ముఖ్ అనే ప్రముఖ లాయరు ఇంద్రాణి తరఫున వాదించి విడాకులు యిప్పించిందని ఇండియా టుడే రాసింది. 2003లో షీనా, మిఖాయేల్ డబ్బిచ్చి తమను ఆదుకోమని తల్లిని ఈమెయిల్ ద్వారా వేడుకోగా, వాళ్లను తోడబుట్టినవాళ్లగా పరిచయం చేస్తానన్న షరతుపై ఇంద్రాణి ఒప్పుకుందిట. మిఖాయేల్ ఏం ఉద్యోగం చేస్తాడో నాకు ఎక్కడా దొరకలేదు. ఓ చోట ఎయిర్‌లైన్సులో పనిచేస్తాడని రాశారు కానీ కన్‌ఫమ్ కాలేదు. ఇండియా టుడేవాళ్లు అతను ఢిల్లీలో రెండేళ్లు పనిచేసి మానేశాడని అన్నారు. రాహుల్ ఏ ఉద్యోగం చేస్తాడో నాకు తెలియలేదు, వాళ్లకీ తెలిసినట్లు లేదు. 'పీటర్ ముఖర్జీకి 1980లో రాహుల్ అనే కొడుకు, 1984లో మరో కొడుకు పుట్టారు.' అని నేను రాశాను. నా లెక్క ప్రకారం రాహుల్‌కు 35 ఏళ్ల వయసుండాలి. కానీ ఇండియా టుడేవాళ్లు రాహుల్‌కి 32 అనీ, అతని అన్న రాబిన్‌కు 34 అనీ రాశారు. ఇదో తేడా! ఇంద్రాణి 1972లో పుట్టిందని వికీపీడియా అంటోంది. కానీ ఇండియా టుడే వాళ్లు ఇప్పుడు 47 ఏళ్ల వయసంటున్నారు. అంటే 1968లో పుట్టి వుండాలి. 19 ఏళ్ల వయసులో చిరాగ్‌తో పెళ్లయిందంటున్నారు. అంటే మొదటి పెళ్లి 1987 అన్నమాట. నేను మొదటి పెళ్లి 1984 అని రాసి, 1972 కంటె ముందే పుట్టి వుండాలని లెక్క వేశాను. ఇన్ని వైరుధ్యాలుంటే అనువాదమెలా అవుతుంది?

ఇక పీటర్ ముఖర్జీ ఆర్థిక నేరాల గురించి, ఐఎన్ఎక్స్ టీవీ ఛానెల్ ఆవిర్భావం గురించి, హత్య జరిగిన విధానం గురించి నా దాంట్లో యిచ్చిన వివరాలు ఆ వ్యాసంలో లేవు. ఏది ఏమైనా నేను రాసినది ఫైనల్ కాదు, వాళ్లు రాసినదీ ఫైనల్ కాదు. సమాచారం వస్తూనే వుంటే మబ్బులు విడిపోతూ వుంటాయి. నేను రాసిన వ్యాసం బేస్ మెటీరియల్‌గా పనికి వస్తుంది. చివరగా – ఓ పాఠకుడు ముఖర్జీ కాదు, ముఖర్జియా అని రాశారు. అలాటి యింటిపేరు బెంగాలీలలో లేదు. రావు అనే పేరును రకరకాల స్పెల్లింగులతో రాస్తారు. దాన్ని బట్టి అసలు పేరు మారిపోదు. పేర్ల స్పెల్లింగ్ మార్చుకుంటే అద ృష్టం కలిసి వస్తుందని కొందరు చేస్తున్న ప్రచారం నమ్మి ఒకటికి రెండు అక్షరాలు చేర్చేసుకుంటున్నారు. ఖర్మకాలి రేపు నేను మరో పి చేర్చుకున్నా నా పేరు ప్రసాదే అవుతుంది తప్ప ప్ప్రసాద్ అవదు. ఎందుకంటే ఆ పదానికి అర్థం, పర్థం లేదు కాబట్టి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2015)**